www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

పేజీలు: 14

ANDHRAJYOTHI

సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 93

గురువారం | 18-7-2024 | వెల (Price) : Rs. 6.50

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి రా. 8.44 తదుపరి త్రయోదశి; నక్షత్రం: జ్యేష్ఠ తె. 3.25 తదుపరి మూల; వర్జ్యం: ఉ. 8.51-10.28; దుర్ముహూర్తం: ఉ. 10.12-11.03, మ. 3.22-4.13; అమృతఘడియలు: సా. 6.32-8.09; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 5.53; సూర్యాస్తమయం: 6.48 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్ 12 మంది మావోయిస్టుల మృతి

- మృతుల్లో తిప్పగడ్డ దళం ఇన్‌చార్జి ఆత్రం లక్ష్మణ్
- ఏకే-47, ఎల్ఎంజీ తుపాకుల సీజ్
- ఒక ఎస్సై, మరో జవానుకు తూటా గాయాలు
- వారోత్సవాల ముందు నక్సల్స్‌కు భారీ ఎదురుదెబ్బ
- ఈ ఏడాది ఇది పదో ఎన్‌కౌంటర్
- ఏడు నెలల్లో 148 మంది నక్సల్స్ మృతి



కాల్పుల్లో గాయపడ్డ జవానును తరలిస్తున్న దృశ్యం

2



కుమ్మేయ్.. అమ్మేయ్!

జగన్ మార్కు కొత్త దందా

అధికారంలో ఉన్నప్పుడు అస్మదీయ కంపెనీలకు జనం సొమ్మును కుమ్మేయడం! అధికారం పోగానే... ఆ కంపెనీలను మరొకరికి అమ్మేయడం! దీనివల్ల రెండు లాభాలు! అవినీతి ద్వారా సంపాదించిన బ్లాక్ మనీని 'వైట్' చేసుకోవడం! కంపెనీని విదేశీ సంస్థలకు విక్రయించినందున పాపాలు 'మాఫీ' చేసుకోవడం! ఇది 'జగన్ మార్కు' దందా!



- ఇండోసోల్ కంపెనీ విక్రయానికి సన్నాహాలు
- కెనడాకు చెందిన బ్రూక్‌ఫీల్డ్‌కు అమ్మకం!?
- ఎన్నికల ముందు ఇండోసోల్‌కు భూసంతర్పణ
- ఎకరా 5 లక్షలు చొప్పున 25 వేల ఎకరాలు
- యజమానులు జగన్ అస్మదీయులే
- సర్కారు మారడంతో పాపాలు కప్పిపెట్టే యత్నం
- ప్రస్తుతం బ్రూక్‌ఫీల్డ్‌కు 5 వేల ఎకరాలు అమ్మేసి వేల కోట్లు క్యాష్ చేసుకోవాలని ప్రయత్నాలు
- అడ్డుకోకుంటే భారీ నష్టమంటున్న నిపుణులు

12

ఎకరానో, పదెకరాలో కాదు దాదాపు 25 వేల ఎకరాలు! గత ప్రభుత్వం ఇండోసోల్‌కు కారుచౌకగా.. ఎకరం 5 లక్షలు చొప్పున ధారాదత్తం చేసింది. సంప్రదాయేతర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు పేరిట కట్టబెట్టింది. అసలు విషయం ఏంటంటే.. ఈ కంపెనీ యజమానులు విశ్వేశ్వరరెడ్డి, శరత్‌చంద్రారెడ్డి, రవికుమార్‌రెడ్డి.. నాటి సీఎం జగన్‌కు అస్మదీయులు. అంతే.. ఎన్నికల ముందు ఆగమేఘాలపై అనుమతులు, ఉత్తర్వులు, భూకేటాయింపులు జరిగిపోయాయి. ప్రభుత్వం మారడంతో ఇప్పుడు భూములతో సహా కంపెనీని గంపగుత్తగా భారీ ధరకు అమ్మేసి వేలకోట్లు క్యాష్ చేసుకోవాలని పావులు కదుపుతున్నట్టు తెలుస్తోంది. అంటే.. నాటి పాపాలను సమాధి చేసి, అక్రమ సొమ్మును వైట్‌గా మార్చుకోవడమన్న మాట! ప్రస్తుతం 5 వేల ఎకరాలను కెనడాకు చెందిన బ్రూక్‌ఫీల్డ్ కంపెనీకి బేరం పెట్టినట్టు సమాచారం. కూటమి సర్కారు వెంటనే ఈ ప్రయత్నాలను ఆపకపోతే రాష్ట్రానికి భారీ నష్టం జరుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



ఢిల్లీలో ఏపీ పెండింగ్ అంశాలపై ఎంపీలతో కలిసి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చూస్తున్న చంద్రబాబు

మన కష్టం ప్రజలకు తెలియాలి

- కొత్త ప్రభుత్వంపై ఆశలు ఉంటాయి
- సమస్యలన్నీ పోవాలనే ఆత్రుత ఉంటుంది
- కానీ, రాష్ట్రంలో ఏ శాఖలోనూ పైసా లేదు
- పిల్లల పరీక్షలకు విద్యా శాఖ వద్ద ఉండే నిధులు సైతం ఊడ్చేసిన గత సర్కారు
- కొత్త అప్పులకు ఏ దారినీ వదిలిపెట్టలేదు
- కేంద్ర పథకాలన్నీ నాడు దుర్వినియోగం
- దీంతో ఆ పథకాలను వాడుకోలేని పరిస్థితి
- అయినా ఏదీ ఆగకుండా చూస్తున్నాం
- ఇవన్నీ ప్రజల దగ్గరకు తీసుకువెళ్లండి
- టీడీపీ ఎంపీలకు చంద్రబాబు నిర్దేశం

అమిత్ షా పిలుపుతోనే ఢిల్లీ పర్యటన

అమరావతి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా తీవ్రమైన క్లిష్ట పరిస్థితులు ఉన్నా వాటిని ఎదుర్కొంటూ ఎంత కష్టపడుతున్నామో ప్రజలకు తెలియాలని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా బుధవారం ఆయన కొందరు టీడీపీ ఎంపీలతో వివిధ అంశాలపై మాట్లాడినట్లు సమాచారం. "రాష్ట్రంలో ఏ శాఖలోనూ

మిగతా 11వ పేజీలో...

వీరు మారరా?

క్షేత్రస్థాయిలో ఇంకా 'వైసీపీ' పోలీసులే

సొంత మనుషులను తెచ్చుకున్న నాటి ఎమ్మెల్యేలు, మంత్రులు

- బాధితులపైనే ఎదురు కేసులతో హల్‌చల్
- ఐదేళ్లు టీడీపీ శ్రేణులకు ఉక్కపోత
- చాలా చోట్ల నేటికీ అదే ఎస్ఐలు, సీఐలు
- ఐపీఎస్‌ల బదిలీలకే దాదాపు నెలన్నర
- మరి కిందిస్థాయి అధికారుల మాటేమిటో?
- పెరుగుతున్న పైరవీలు, బేరసారాలు
- ప్రభుత్వం త్వరగా స్పందించాలనే అభిప్రాయం

నేడు శాంతిభద్రతలపై శ్వేతపత్రం

జగన్ హయాంలో ఐపీఎస్‌ల నుంచి సీఐలు, ఎస్ఐల దాకా అత్యధికులు అమలు చేసింది వైసీపీ చట్టమే! స్థానిక ఎమ్మెల్యే, జిల్లా మంత్రి చెప్పిందే వాళ్లకు వేదం! ఇప్పుడు... సర్కారు మారింది. జిల్లా స్థాయిలో ఐపీఎస్‌ల బదిలీలు దాదాపుగా ముగిశాయి! కానీ... క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏమిటి? 'వైసీపీ' పోలీసు అధికారుల నుంచి విముక్తి ఎప్పుడు? ఇవి సర్వత్రా వినిపిస్తున్న ప్రశ్నలు!



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

జగన్ పాలనలో కబ్జాలు, దౌర్జన్యాలపై నోరెత్తిన ప్రజా సంఘాలు, ప్రతిపక్షాలపై అక్రమ కేసులు పెట్టి వేధించిన పోలీసు అధికారులు ఇప్పటికీ ఎక్కడికక్కడ చక్రం తిప్పుతూనే ఉన్నారు. జిల్లా ఎస్పీలను బదిలీ చేయడానికే కొత్త సర్కారుకు దాదాపు 40 రోజులు పట్టింది. మరి... క్షేత్రస్థాయిలో పాతుకుపోయిన 'వైసీపీ' అధికారుల్ని బదిలీ చేయడానికి ఇంకెన్ని నెలలు పడుతుందో తెలియడంలేదని పోలీసు శాఖలోనే చర్చ జరుగుతోంది. దీనివల్ల మూడు నష్టాలు జరుగుతున్నాయని వారు అంటున్నారు. ఒకటి.. కులముద్ర, పార్టీ ముద్ర వేసి ఇన్నేళ్లు సరైన ప్రాధాన్యం దక్కని అధికారులకు ఇప్పటికీ న్యాయం జరగడంలేదు. రెండు.. సరైన పోస్టింగ్‌ల కోసం అధికారులు ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. మూడు.. ఇప్పుడు కాకపోతే మరో నెలకో, రెండు నెలలకో బదిలీ చేయకమానరనే ఉద్దేశంతో 'వైసీపీ' పోలీసు అధికారులు శాంతిభద్రతలను గాలికి వదిలేస్తున్నారు. ఈ పరిస్థితిని కొత్త ప్రభుత్వం తక్షణం చక్కదిద్దాలని

మిగతా 11వ పేజీలో...

సర్వం భూకబ్జాలు.. దందాలే

- ఎక్కడచూసినా భూతగాదాలు, గంజాయి గొడవలే
- అందిన ఫిర్యాదులన్నీ అవే.. పార్టీ కార్యాలయానికి వచ్చిన మంత్రి సవిత
- కార్యకర్తలు, ప్రజల నుంచి వినతులు.. మంత్రులూ కార్యాలయానికి రావాలన్న బాబు.. మంత్రి సవితతో మొదలైన కొత్త ఒరవడి
- సమస్యలు వింటూ 4 గంటలు అక్కడే.. ఫిర్యాదులపై తక్షణ స్పందన
- అధికారులకు సూచనలు.. గంజాయి సమస్యపై హోంమంత్రికి ఫోన్

2

స్థానిక కోటాపై వెనక్కి

ప్రైవేటులో రిజర్వేషన్లపై రగడ.. పారిశ్రామిక వర్గాల్లో కలకలం.. కన్నడ సర్కారు వెనకడుగు

- బిల్లును పునఃపరిశీలించాలన్న నిపుణులు
- ఐటీ కంపెనీలకు భారీ నష్టమని ఆందోళన
- రాజ్యాంగ వ్యతిరేక బిల్లు: మోహన్‌దాస్ పాయ్
- ఐటీ కంపెనీలను బెదిరించేలా ఉంది: అసోచామ్
- సాఫ్ట్‌వేర్ కంపెనీలు తరలిపోయే ప్రమాదం: నాస్కామ్
- నిపుణులతో చర్చిస్తాం: మంత్రి ఎంబీ పాటిల్
- బిల్లుపై నిర్ణయం తాత్కాలికంగా వాయిదా: సీఎం ట్వీట్



బెంగళూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని ప్రైవేట్ సంస్థల్లో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న నిర్ణయంపై కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కు తగ్గింది. పారిశ్రామిక వర్గాలు, దిగ్గజ టెక్ కంపెనీల నుంచి పెద్దఎత్తున వ్యతిరేకత రావడంతో బిల్లును తాత్కాలికంగా నిలిపివేసింది. ప్రైవేట్ సంస్థల్లో స్థానికులకు రిజర్వేషన్లు కల్పిస్తూ కేబినెట్‌లో చేసిన తీర్మానాన్ని తాత్కాలికంగా పక్కన పెడుతున్నామని సీఎం సిద్దరామయ్య

మిగతా 2వ పేజీలో...

మా రాష్ట్రానికి రండి: నాస్కామ్‌కు మంత్రి లోకేశ్ ఆహ్వానం



నేడు, రేపు కోస్తాలో భారీ వర్షాలు

12

- బంగాళాఖాతంలో రేపు అల్పపీడనం
- మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరిక

జూరాలకు బిరబిరా కృష్ణమ్మ!

- నేటి సాయంత్రానికి ప్రాజెక్టుకు వరద
- నారాయణపూర్ నుంచి 62,955 క్యూసెక్కులు
- శ్రీశైలానికి 3,585, సాగర్‌కు 21,481 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

2

భారీగా పెరిగిన ఇంజనీరింగ్ అడ్మిషన్లు

3

- తొలి విడతలోనే 1,17,136 సీట్లు భర్తీ
- ప్రైవేటు వర్సిటీల్లో 98%.. యూనివర్సిటీల్లో 90%
- గత తుది దశ కంటే ఇప్పుడు తొలి దశలోనే ఎక్కువ
- కన్వీనర్ కోటాలో ఇంకా మిగిలిన సీట్లు 19,524
- క్రీడలు, ఎన్‌సీసీ కోటా సీట్లు తర్వాతి విడతలో భర్తీ

ఎర్రమట్టి దిబ్బల్లో తవ్వకాలకు బ్రేక్

11

'ఆంధ్రజ్యోతి' కథనంతో కదలిక.. దిబ్బల తవ్వకంపై సీఎంవో సీరియస్

- ఆ ప్రాంతాన్ని పరిశీలించిన జేసీ.. పనులు ఆపేయాలని ఆదేశాలు
- పొక్లెయినర్లు వస్తే సీజ్ చేయండి.. అనుమతులపై గట్టిగా నిలదీత
- నీళ్లు నమిలిన అధికారులు.. ఇద్దరికి నోటీసులు.. ఒకరి సస్పెన్షన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అవే కుట్రలు!

కీలక శాఖల్లో తిష్ఠవేసిన జగన్ వీరభక్తులు

- కొత్త సర్కారుకు తొలిరోజునుంచీ సమస్యలు
- ఉద్యోగుల జీపీఎస్ జీవో కుట్ర వారి పనే...
- బాబుకు అప్రతిష్ఠ తేవాలనేదే వారి లక్ష్యం
- అందుకే 13వతేదీన ఆ జీవో ఫైల్ అయితే...
- బాబు ప్రమాణంచేసిన జూన్ 12 తేదీతో జీవో
- న్యాయ,ఆర్థిక శాఖల్లోని ఇద్దరి నిర్వాకం
- వీరిద్దరూ ఉద్యోగ నేత వెంకట్రామిరెడ్డి అనుచరులు
- బాబుకు ఉద్యోగులను దూరంచేసే కుతంత్రం
- గతంలోనూ ఇవే ఎత్తులు.. అదే టెక్నిక్ వాడిన వైనం
- వివాదాస్పద జీవోను రద్దుచేసిన ముఖ్యమంత్రి

అమరావతి, జూలై 17(ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు దాటిపోయినా, కీలక శాఖల్లో తిష్ఠవేసిన వైసీపీ అధికారుల అరాచకాలు కొనసాగుతూనే ఉన్నాయి. జగన్‌కు వీరవిధేయుడైన సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డికి వీరభక్తులు ఇప్పటికీ సచివాలయంలో కీలకస్థానాల్లో కొనసాగుతున్నారు. గత ప్రభుత్వ ప్రతిపాదనలతో కొత్తగా ఇచ్చిన ఉద్యోగుల జీపీఎస్ జీవో వెనుక కుట్ర వీరి పనేనని చంద్రబాబు ప్రభుత్వం గుర్తించింది. వీళ్లు ఎంత పకడ్బందీగా ప్లాన్ చేశారంటే..ఆ ఫైలుకి జూన్ 13వ తేదీన అన్ని స్థాయిల్లోనూ ఆమోదం లభించింది. కానీ, జీవోపై

మిగతా 12వ పేజీలో...

వైకల్య సర్టిఫికెట్ కోసం నకిలీ రేషన్ కార్డు

» వెలుగులోకి పూజా ఖేద్కర్ మరిన్ని మోసాలు

పుణె, న్యూఢిల్లీ, జూలై 17: వివాదాస్పద ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే ఆమె శిక్షణను ప్రభుత్వం నిలిపివేయడంతోపాటు తగిన చర్యలు తీసుకునేందుకు ఆమెను లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్(ఎల్‌బీఎస్ఎన్ఏఏ)కు రావాలని ఆదేశించింది. ఐఏఎస్‌కు ఎంపికవడానికి దివ్యాంగుల రిజర్వేషన్‌ను ఆమె దుర్వినియోగం చేయడంపై దర్యాప్తు చేపట్టిన అధికారులు.. ఆమె దివ్యాంగ సర్టిఫికెట్ పొందడానికి నకిలీ రేషన్‌కార్డును చూపించారని, అందులో పేర్కొన్న అడ్రస్ కూడా తప్పుడు అడ్రస్ అని తాజాగా గుర్తించారు. పుణెలోని యశ్వంత్‌రావ్ చవాన్ మెమోరియల్(వైసీఎం) ఆస్పత్రి నుంచి వైకల్య సర్టిఫికెట్ పొందడానికి ఆమె పింప్రి చించ్వాడ్ ప్రాంతంలోని ప్లాట్ నంబరు-53, దెహు-అలాండి, తల్వాడే అనే అడ్రస్‌లో నివాసం ఉన్నట్టు దరఖాస్తులో పేర్కొన్నారు. అయితే, ఆ అడ్రస్‌లో థర్మోవెరిట ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే మూతపడిన కంపెనీ ఉందని అధికారులు తాజాగా గుర్తించారు. పింప్రి చించ్వాడ్ మున్సిపాలిటీ పన్నుల విభాగం సమాచారం మేరకు ఆ కంపెనీ పేరిట రూ.2.7 లక్షల బకాయిలు ఉన్నాయి. నకిలీ రేషన్‌కార్డు పొందడానికి కూడా పూజా అదే అడ్రస్‌ను ఉపయోగించుకున్నట్టు తేలింది. మరోవైపు ఒక ఆడి కారు కొనుగోలుకు కూడా అదే అడ్రస్‌ను ఇచ్చినట్టు వెలుగులోకి వచ్చింది. తాను లోకోమోటర్ అనే వైకల్యంతో బాధపడుతున్నానంటూ ఆమె 2022 ఆగస్టు 24న వైఎంసీ ఆస్పత్రి నుంచి వైకల్య సర్టిఫికెట్ పొందారు. ఆమెకు



మోకాలిలో 7% వైకల్యం ఉన్నట్టు ఆ సర్టిఫికెట్‌లో వైద్యులు పేర్కొన్నారు. మరోవైపు 2020 వరకు మహారాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు డైరెక్టర్‌గా పనిచేసిన పూజా తండ్రి దిలీప్ ఖేద్కర్ ఆదాయానికి మించి ఆస్తులను కూడగట్టారంటూ ఏసీబీ మంగళవారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. పూజా ఖేద్కర్ కుటుంబం నివసిస్తున్న భవనం వద్ద అక్రమ నిర్మాణానికి సంబంధించి పుణె మున్సిపల్ కార్పొరేషన్(పీఎంసీ) నోటీసు జారీ చేయడంతో ఆ నిర్మాణాన్ని తొలగించినట్టు ఒక అధికారి బుధవారం వెల్లడించారు. కాగా, భూవివాదం, రైతును గన్‌తో బెదిరించినట్లు కేసు నమోదైనప్పటి నుంచి పూజ తల్లిదండ్రులు అదృశ్యంలో ఉన్నారు.

నకిలీ సర్టిఫికెట్లతో మరో యువ ఐఏఎస్..

2016 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అసిఫ్ కె.యూసుఫ్(కేరళ) ఓబీసీ కేటగిరిలో రిజర్వేషన్ లబ్ధి పొందేందుకు ఆదాయ సర్టిఫికెట్‌ను ఫోర్జరీ చేసినట్టు తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశం మేరకు రాష్ట్ర యంత్రాంగం విచారణ చేపట్టింది. క్రీమీలేయర్ స్థాయి కంటే తక్కువ ఆదాయం ఉందంటూ తప్పుడు సమాచారంతో ఆయన ఓబీసీ సర్టిఫికెట్ పొందినట్టు దర్యాప్తులో తేలింది. యూసుఫ్ 2015 సివిల్ సర్వీసెస్ పరీక్షలో 215వ ర్యాంక్ సాధించారు. పూజా ఖేద్కర్, యూసుఫ్ వ్యవహారాలు వెలుగులోకి రావడంతో దేశవ్యాప్తంగా ఇలాంటి వేలాది కేసులపై లోతైన దర్యాప్తు చేపట్టాలని డిమాండ్లు వస్తున్నాయి.

లోకం తీరు



ఒకసారి మార్చి, మరోసారి జూన్‌లో... !

» ఏడాదికి రెండుసార్లు సీబీఎస్ఈ పన్నెండో తరగతి పరీక్షలు

న్యూఢిల్లీ, జూలై 17: సీబీఎస్ఈ పాఠశాలల్లో 12వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఏడాదికి రెండుసార్లు ప్రధాన పరీక్షలు(బోర్డు ఎగ్జామ్స్) నిర్వహించేందుకు కేంద్రం కసరత్తు చేస్తోంది. జాతీయ విద్యావిధానం 2020లోని జాతీయ పాఠశాల విద్యా ప్రణాళిక సిఫారసులను అమలు చేయాలని భావిస్తోంది. ఈ మేరకు 2026 జూన్ నుంచి ఏడాదికి రెండుసార్లు పరీక్షల నిర్వహణ చేపట్టేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని కేంద్ర విద్యాశాఖ సీబీఎస్ఈని ఆదేశించింది.

జూరాలకు బిరబిరా కృష్ణమ్మ..!

» నేటి సాయంత్రానికి ప్రాజెక్టుకు వరద..

» నారాయణపూర్ నుంచి 62,955 క్యూసెక్కుల విడుదల

» శ్రీశైలం 3,585, సాగర్‌కు 21,481 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): కృష్ణా బేసిన్‌లో ఎగువన కురుస్తున్న వర్షాలతో కర్ణాటకలోని కీలక ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాలు నిండు కుండలా మారాయి. ఆల్మట్టి గేట్లను మంగళవారమే తెరవగా.. బుధవారం నారాయణపూర్ గేట్లను తెరిచారు. ఆ ప్రాజెక్టు నుంచి సాయంత్రం 62,955 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. దీంతో తెలంగాణలోని జూరాల వైపు కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. జూరాలకు గురువారం సాయంత్రం వరకు వరద చేరే అవకాశముందని ఆ ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జూరాలకు 2,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 7,500 క్యూసెక్కులు దిగువకు విడిచి జల విద్యుదుత్పత్తిని ప్రారంభించారు. ప్రధాన ప్రాజెక్టు ఆల్మట్టికి 92,736 క్యూసెక్కుల వరద కొనసాగుతోంది. పూర్తి సామర్థ్యం 129 టీఎంసీలకు ఇప్పటికే నిల్వ 100 టీఎంసీలు దాటింది. దీంతో దిగువకు 65 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. నారాయణపూర్ జలాశయం పూర్తి సామర్థ్యం 37 టీఎంసీలకు.. నిల్వ ఇప్పటికే 30 టీఎంసీలకు చేరింది. కృష్ణానదికి ఉపనది తుంగభద్రకు వరద కొనసాగుతోంది. 49,522 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శ్రీశైలం ప్రాజెక్టుకు 3,585 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. జల విద్యుదుత్పత్తిని ప్రారంభించి 22,166 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. జలాశయం పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలకు ప్రస్తుతం 33.62 టీఎంసీలున్నాయి. నాగార్జునసాగర్‌లో 312 టీఎంసీలకు.. ప్రస్తుతం 122 టీఎంసీలున్నాయి. 21,481 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది.

శ్రీశైలం జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి

శ్రీశైలం, జూలై 17: శ్రీశైలం కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాల్లో బుధవారం ముమ్మరంగా విద్యుత్ ఉత్పత్తి చేపట్టారు. కుడిగట్టు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేసి 15,809 క్యూసెక్కుల నీరు, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రంలో 6,357 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జునసాగర్ జలాశయానికి విడుదల చేశారు. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా జలాశయం ప్రస్తు నీటి మట్టం 807.80 అడుగులు. ప్రస్తుత నీటి నిల్వ 33.0630 టీఎంసీలుగా నమోదయింది.

గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్.. 12 మంది మావోయిస్టుల మృతి

» మృతుల్లో తిప్పగడ్డ దళం ఇన్‌చార్జి ఆత్రం లక్ష్మణ్

» ఏడు నెలల్లో 148 మంది నక్సల్స్ మృతి

చర్ల/మహదేవపూర్, జులై 17: దండకారణ్యంలో మరోసారి నెత్తురోడింది. మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని గడ్చిరోలి అడవుల్లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు మృతిచెందారు. ఈ ఘటనలో సీ-60 బలగాలకు చెందిన ఒక ఎస్సై, మరో జవాన్ గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలం నుంచి అత్యంత అధునాతన తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఉదయం గడ్చిరోలి ఎస్పీ నీలోత్పల్ కథనం ప్రకారం.. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని గడ్చిరోలి, కాంకేర్ జిల్లాల అడవుల్లో 12 నుంచి 15మంది మావోయిస్టులు సమావేశమైనట్టు పోలీసులు సమాచారం అందుకున్నారు. దీంతో సీ-60 బలగాలు ఉదయం 7గంటల సమయంలో కూంబింగ్ ప్రారంభించారు. 10గంటల సమయంలో వారికి నక్సలైట్లు తారసపడ్డారు. ఈ క్రమంలో ఆరు గంటల పాటు ఇరువైపులా కాల్పులు జరిగాయి. సాయంత్రం 4 గంటల సమయంలో నక్సల్స్ వైపు నుంచి కాల్పులు నిలిచిపోవడంతో.. బలగాలు ముందుకు దూసుకెళ్లాయి. అక్కడ 12 మంది మావోయిస్టుల మృతదేహాలను, మూడు ఏకే-47, రెండు ఇన్సాస్, ఒక కార్బైన్, ఒక ఎస్ఎల్ఆర్, మరో ఏడు ఆటోమేటిక్ తుపాకుల(ఎల్ఎంజీ)లను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మృతుల్లో గడ్చిరోలి డివిజన్ కమిటీ సభ్యుడు, తిప్పగడ్డ దళ ఇన్‌చార్జి ఆత్రం లక్ష్మణ్ అలియాస్ ఆత్రం విశాల్ మృతిచెందినట్లు ఎస్పీ వివరించారు. అతను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందినవాడని అనుమానిస్తున్నారు. కాగా.. ఈ ఏడాది మావోయిస్టులకు వరుస నష్టాలు జరుగుతున్నాయి. గడిచిన ఏడు నెలల్లో 10 భారీ ఎన్‌కౌంటర్లు జరగ్గా.. 148 మంది మావోయిస్టులు మృతిచెందారు. 140 దాకా అధునాతన ఆయుధాలు పట్టుబడ్డాయి.

వారోత్సవాల ముందు ఎదురుదెబ్బ

మావోయిస్టు పార్టీ ఏటా జూలై 28 నుంచి వారం పాటు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తుంది. ఈ ఏడాది వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో 20 రోజుల ముందుగానే వారోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ వారోత్సవాలను మావోయిస్టులు తమకు అనుకూలంగా మార్చుకోవాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీకి జరుగుతున్న నష్టం, ఎన్‌కౌంటర్లను ప్రజలకు వివరించేందుకు వారోత్సవాలను వేదికగా ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే భారీ ఎన్‌కౌంటర్ జరగడంతో వారికి గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లయింది.

యూపీ బీజేపీలో ముసలం

సీఎం యోగి, డిప్యూటీ సీఎం కేపీ మౌర్య మధ్య విభేదాలు

» ప్రభుత్వం కంటే పార్టీ పెద్దదని వ్యాఖ్యానించిన మౌర్య

» యోగి తీరుకు నిరసనగా క్యాబినెట్ భేటీలకూ డుమ్మా

» ప్రధాని మోదీని కలిసిన యూపీ బీజేపీ చీఫ్ భూపేంద్ర



న్యూఢిల్లీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలు ఎన్నికల్లో విజయాలు సాధించినంతవరకూ అంతా బాగున్నట్టే అనిపిస్తుంది! కానీ.. ఒక్కసారి ఓటమి ఎదురైతే.. పార్టీల్లో లోపాలు, అంతర్గత విభేదాలు ఒక్కసారిగా బయటపడతాయి. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో అనుకున్న స్థాయిలో సీట్లు రాకపోవడం.. 33 సీట్లకే పరిమితం కావడంతో యూపీ బీజేపీలో ఇప్పుడు అదే జరుగుతోంది. సీఎం యోగి ఆదిత్యనాథ్, ఉప ముఖ్యమంత్రి కేశవ్‌ప్రసాద్ మౌర్య మధ్య చాలాకాలంగా ఉన్న విభేదాలు ఎన్నికల ఫలితాల నేపథ్యంలో మరింత పెరిగాయి. యూపీలో లోక్‌సభ ఎన్నికల్లో సీట్లు తగ్గడానికి యోగి పనితీరే కారణమనే విమర్శలు జోరందుకున్నాయి. ఈ క్రమంలోనే.. "ప్రభుత్వం కంటే పార్టీ పెద్దది. పార్టీ కంటే ఎవరూ పెద్ద కాదు" అని కేపీ మౌర్య చేసిన వ్యాఖ్య సంచలనం సృష్టించింది. ఆయన ఆ వ్యాఖ్యలు యోగి ఆదిత్యనాథ్‌ను ఉద్దేశించే చేశారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అలాగే. యోగి ఆదిత్యనాథ్ వైఖరికి నిరసనగా ఇటీవలికాలంలో ఆయన క్యాబినెట్ సమావేశాలకు కూడా హాజరు కావట్లేదు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయన ఢిల్లీకి చేరుకుని పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను కలిశారు. ఆయనొక్కరే కాదు.. యూపీ బీజేపీకి చెందిన పలువురు నేతలు కొద్దిరోజులుగా ఢిల్లీలో తిష్ఠవేసి జాతీయ నాయకత్వాన్ని కలిసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు.. యూపీ బీజేపీ చీఫ్ భూపేంద్ర చౌదరి కూడా ఢిల్లీలో నడ్డాను, ప్రధాని మోదీని కలిశారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అనుకున్నస్థాయిలో సీట్లు సాధించలేకపోవడానికి బాధ్యత వహిస్తూ సారథ్య బాధ్యతల నుంచి తాను తప్పుకొంటానని ఆయన మోదీకి చెప్పినట్టు సమాచారం. ఈ విషయం తెలియగానే కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రధాని నివాసానికి చేరుకున్నారు. ఈ అంశంతోపాటు.. యూపీలో పార్టీ ప్రక్షాళన, ఇతర కీలక అంశాల గురించి, తదుపరి కార్యాచరణ ప్రణాళిక గురించి వారు చర్చించినట్టు తెలిసింది. జాట్ సామాజికవర్గానికి చెందిన భూపేంద్రచౌదరి స్థానంలో.. ఒక ఓబీసీ నేతను పార్టీ సారథిగా నియమించి 2027 ఎన్నికలకు వెళ్లేందుకు బీజేపీ సిద్ధమైనట్టు విశ్వసనీయవర్గాల ద్వారా తెలుస్తోంది. అలాగే.. 2017లో పార్టీ రాష్ట్ర సారథిగా అద్భుత విజయాన్ని కట్టబెట్టిన కేపీ మౌర్య ఓబీసీ కావడం, ఆయనకు ఆరెస్సెస్ మద్దతు కూడా బలంగా ఉండడంతో.. రాష్ట్రంలో నెలకొన్న సంక్షోభాన్ని సరిదిద్దేందుకు ఆయనకు పార్టీలో మంచి పదవి కట్టబెట్టే అవకాశం ఉందని సమాచారం.

అజిత్ పవార్‌కు 'మహా' షాక్

» నలుగురు ఎన్సీపీ నేతల రాజీనామా

» శరద్ పార్టీలో చేరతారని ప్రచారం

ముంబై, జూలై 17: మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలవేళ అజిత్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీకి (ఎన్సీపీ) ఎదురుదెబ్బ తగిలింది. నలుగురు ముఖ్యమైన నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేశారు. త్వరలో వారంతా శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ (ఎస్పీ)లో చేరే అవకాశం ఉంది. ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో ఎన్సీపీ మహారాష్ట్రలో చతికిలబడింది. ఆ పార్టీ ఒక్క ఎంపీ సీటును మాత్రమే దక్కించుకుంది. ఎన్సీపీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలు తమ సంప్రదింపుల్లో ఉన్నారని ఎన్సీపీ(ఎస్పీ) అధ్యక్షుడు శరద్ పవార్ ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే ఆ పార్టీ నుంచి రాజకీయ వలసలు మొదలయ్యాయి. పింప్రీ-చించ్వాడ్ యూనిట్ చీఫ్ అజిత్ గవహానే, యశ్ శనే, రాహుల్ భోస్లే, పంకజ్ భలేకర్‌లు ఎన్సీపీకి రాజీనామా చేశారు. తిరిగి శరద్ పవార్ శిబిరంలోకి వెళ్లే ఆలోచనలో అజిత్ పవార్ క్యాంపునకు చెందిన మరికొందరు నేతలు కూడా ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇదిలాఉండగా, లోక్‌సభ ఎన్నికల్లో ఎన్సీపీతో పొత్తే బీజేపీని మహారాష్ట్రలో ముంచిందని ఆర్ఎస్ఎస్ సంచలన వ్యాఖ్యలు చేసింది. ఆర్ఎస్ఎస్‌కు చెందిన మరాఠా వారపత్రిక 'వివేక్'లో దీనిపై ఒక విశ్లేషణాత్మక వ్యాసం ప్రచురించారు. అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీతో చేతులు కలిపినప్పటినుంచి మహారాష్ట్ర ప్రజల దృష్టిలో బీజేపీ ప్రతిష్ఠ తగ్గిపోవడం మొదలైందని ఆ వ్యాసంలో స్పష్టం చేశారు.

ఏపీకి అంటార్కిటికాతో భౌగోళిక సంబంధాలు!

» దక్షిణ అమెరికా, ఆఫ్రికా, ఆస్ట్రేలియాతోనూ లింకు

» 150 కోట్ల సంవత్సరాల క్రితం ఒకే భూభాగంగా..

» హైదరాబాద్ ఎన్‌జీఆర్ఐ శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 17: ఆంధ్రప్రదేశ్‌కు దక్షిణ అమెరికా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, అంటార్కిటికాతో భౌగోళిక సంబంధాలున్నాయని హైదరాబాద్‌లోని నేషనల్ జియోఫిజికల్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ) పరిశోధకుల బృందం తెలిపింది. అంటార్కిటికా, భారత్ ఒకప్పుడు ఒకే భూభాగంగా ఉండేవని, 150 కోట్ల సంవత్సరాల క్రితం అది విచ్ఛిన్నమై ఉంటుందని పేర్కొంది. వందల కోట్ల సంవత్సరాల క్రితం భారత్, తూర్పు అంటార్కిటికా ప్రాంతాలకు మధ్య భారీ ఘర్షణ జరిగినట్టు తమ పరిశోధనల్లో బలమైన ఆధారాలను గుర్తించామని వెల్లడించింది. డాక్టర్ కె చంద్రావతి, ఓపీ పాండే, బిశ్వజిత్ మండల్, కె రేణుక, ఎన్ ప్రేమ్ కుమార్‌తో కూడిన ఎన్‌జీఆర్ఐ బృందం ఏపీలోని దర్శి అద్దంకి ప్రాంతాల కింద దాగిఉన్న శిఖరాన్ని గుర్తించింది. అలంపూర్ నుంచి గణపేశ్వరం వరకూ 325 కిలోమీటర్ల పొడవునా భూకంప సమాచారాన్ని రీ ప్రాసెస్ చేయడం ద్వారా ఉత్తర కడప బేసిన్ ఉపరితల భూకంప నిర్మాణాన్ని అధ్యయనం చేసింది. 'జర్నల్ ఆఫ్ ప్యూర్ అండ్ అప్లయిడ్ జియోఫిజిక్స్'లో ప్రచురితమైన ఈ అధ్యయనం.. భారత అంటార్కిటికా సంబంధాలను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

పని పూర్తయ్యాక ఐటీ సిస్టమ్స్ లాగౌట్ చేయండి

» అధికారులకు ప్రధాని మోదీ సూచన



న్యూఢిల్లీ, జూలై 17: గత కొన్నేళ్లుగా ప్రభుత్వ వ్యవస్థలపై సైబర్ దాడులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ సీనియర్ అధికారులకు ఓ సూచన చేశారు. రోజూ పని పూర్తయిన తర్వాత ఐటీ సిస్టమ్స్‌ను లాగౌట్ చేయాలన్నారు. "రోజూ పని పూర్తయిన తర్వాత మీరు మీ ఐటీ సిస్టమ్స్‌ను లాగౌట్ చేస్తారా? సైబర్ సెక్యూరిటీకి ఇది చాలా ముఖ్యం" అని మోదీ ఇటీవల జరిగిన సమావేశంలో నొక్కి చెప్పినట్టు ఓ చానల్ పేర్కొంది. అలాగే రోజు చివర్లో అన్ని సిస్టమ్స్ లాగౌట్ అయినదీ లేనిదీ చూసే బాధ్యతను ప్రతి ఆఫీసులో ఒక వ్యక్తికి అప్పగించాలని సూచించినట్టు తెలిపింది. ఇంటికి వెళ్లే ముందు తన సిస్టమ్‌ను తానే లాగౌట్ చేస్తానని మోదీ చెప్పినట్లు పేర్కొంది.

ప్రైవేటు రంగంలోనూ ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి: అథవాలే

న్యూఢిల్లీ, జూలై 17: ప్రైవేటు రంగంలోని ఉద్యోగాల్లో కూడా ఓబీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత శాఖ సహాయ మంత్రి రామ్‌దాస్ అథవాలే కోరారు. "ఎస్సీ, ఎస్టీకి చెందిన ఎంతో మంది ప్రైవేటు రంగంలోని ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు. కాని వారికి ఎలాంటి రిజర్వేషన్లు లేవు. త్వరలోనే ప్రభుత్వ రంగంలోని సంస్థలు ప్రైవేటుగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రైవేటు రంగంలోని ఉద్యోగాల్లో ఓబీసీలకు కోటా కల్పించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను మా రిపబ్లికన్ పార్టీ డిమాండ్ చేస్తోంది" అని అన్నారు.

సర్వం భూకబ్జాలు.. దందాలే

ఎక్కడచూసినా భూతగాదాలు, గంజాయి గొడవలే...

» నాకు అందిన ఫిర్యాదులన్నీ అవే...

» పార్టీ కార్యాలయానికి వచ్చిన మంత్రి సవిత

» గంజాయి సమస్యపై హోంమంత్రికి ఫోన్



ప్రజాదర్బార్‌లో వినతి పత్రాలు స్వీకరిస్తున్న మంత్రి సంజీవరెడ్డిగారి సవిత

అమరావతి, జూలై 17(ఆంధ్రజ్యోతి): "ఐదేళ్ల పాలనలో వైసీపీ నేతలు లాండ్, శాండ్, మైన్స్, వైన్, గంజాయిలతో దోచుకోవడం, దాచుకోవడం తప్ప చేసిందేమీ లేదు. ఎక్కడ చూసినా నాడు వారు సాగించిన భూదందాలు, గంజాయి గొడవలే కనిపిస్తున్నాయి. నాకు అందిన ఫిర్యాదులన్నీ అవే." అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత అన్నారు. ఆమె బుధవారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయనికి వచ్చారు. ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. వాటిపై తక్షణ స్పందన చూపించారు. వినతుల స్వీకరణ కోసం ఆమె పార్టీ కార్యాలయంలో 4గంటలపాటు కూర్చున్నారు. అప్పటికప్పుడు అధికారులతో మాట్లాడారు. అనంతపురం జిల్లా పెనుగొండ నియోజకవర్గం నుంచి మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన సవిత వెంటనే మంత్రి పదవి కూడా పొందారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా తొలిసారే అయినా ఆమె వినతుల స్వీకరణలో పరిణితిని, వేగాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆమెకు మొత్తం నూటా ఏభై రెండు వినతులు అందాయి. కొందరు లిఖితపూర్వకంగా తమ ఫిర్యాదులు సమర్పించగా కొందరు మౌఖికంగా మంత్రికి తమ గోడు విన్నవించుకొన్నారు. భూ సమస్యలు, పోలీస్ శాఖకు సంబంధించిన సమస్యలు వీటిలో ఎక్కువగా ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం హయాంలో తమ గోడును పోలీస్ అధికారులు పట్టించుకోలేదని, అక్రమ కేసులు పెట్టారని, తమపై దాడులు జరిగినా పోలీసుల నుంచి న్యాయం జరగలేదని ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయి. తమ భూమి ఆక్రమణలకు గురైందని, తమ భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదని, రెవెన్యూ అధికారులు తమ సమస్య పట్టించుకోవడం లేదని కొందరు చెప్పారు. వారు ఏ ప్రాంతం నుంచి వచ్చారో మంత్రి అడిగి తెలుసుకొని అక్కడి పోలీస్, రెవెన్యూ అధికారులకు ఫోన్లు చేసి ఆ సమస్యను వివరించారు. ఆ సమస్యను పరిశీలించి పరిష్కరించి మళ్లీ తనకు తెలపాలని వారికి చెప్పారు. అధిక శాతం అధికారులు ఆ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఒక జిల్లా ఎస్పీతోపాటు కొందరు డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, ఎమ్మార్వోలు సహా సుమారు ఇరవై మంది అధికారులతో ఆమె మాట్లాడారు. కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి తమ ప్రాంతానికి చెందిన ఒక మహిళ సమస్యను తీసుకొని వచ్చారు. గంజాయికి అలవాటు పడిన వ్యక్తులు ఆ మహిళను వేధిస్తున్నారని, ఆ కుటుంబం ఈ సమస్యతో చాలా బాధపడుతోందని మాజీ ఎమ్మెల్యే చెప్పారు. మంత్రి సవిత వెంటనే హోం మంత్రి వంగలపూడి అనితకు ఫోన్ చేసి ఈ సమస్య గురించి చెప్పి అక్కడి పోలీస్ అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అనిత ఆ మేరకు హామీ ఇచ్చారు. తాడికొండ నియోజకవర్గం నుంచి వచ్చిన ఒక కార్యకర్త తనపై వైసీపీ ప్రభుత్వం హయాంలో అన్యాయంగా ఎస్సీ, ఎస్టీ చట్టం కింద అక్రమ కేసు మోపారని, దానిని తొలగించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ లీగల్ సెల్‌కు చెందిన న్యాయవాది రేవతిని మంత్రి పిలిపించి ఈ సమస్య పరిశీలించాలని కోరారు. ఆమె ఆ పత్రాలు పరిశీలించి దీనిపై తాము పనిచేస్తామని, అనేక మంది కార్యకర్తలు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారని.. వీటికి పరిష్కారంపై చర్చిస్తున్నామని మంత్రికి చెప్పారు. మధ్యాహ్న భోజన విరామం తర్వాత కూడా మంత్రి కొంతసేపు ఉండి విజ్ఞప్తులు ఇచ్చేవారు ఎవరూ లేరని నిర్ధారించుకొన్న తర్వాత వెళ్లిపోయారు. తనకు వినతి పత్రాలు ఇచ్చిన వారందరి ఫోన్ నెంబర్లు తీసుకోవాలని తన సహాయకులను ఆమె ఆదేశించారు. ఎవరి సమస్య అయినా అపరిష్కృతంగా ఉంటే తాను మళ్లీ అధికారులతో మాట్లాడతానని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి ఆమెకు సహాయంగా పాల్గొన్నారు. పార్టీ కార్యాలయం నుంచి వెళ్ళిపోయే ముందు మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడారు. "రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టిన వైసీపీ నేతలు మాట్లాడటానికి అనర్హులు. ప్రభుత్వం మారినా ఇప్పటికీ మా కార్యకర్తలపైనే దాడులు జరుగుతున్నాయి. కక్ష సాధింపు వద్దని మా నాయకుడు చెప్పడం వల్ల మేం సంయమనం పాటిస్తున్నాం. ప్రజల మన్ననలు పొందేలా మేం పనిచేస్తున్నాం" అని పేర్కొన్నారు.

టీడీపీ సాధికారిత కేంద్రంలో శిక్షణ

ముగ్గురు విద్యార్థులకు గల్ఫ్‌లో ఉద్యోగాలు

అమరావతి, జూలై 17(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సాధికారిత కేంద్రంలో శిక్షణ పొందిన ముగ్గురు విద్యార్థులు గల్ఫ్‌లో ఉద్యోగాలు పొందారు. ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ పొందడంతో పాటు టీడీపీ ఎంపవర్‌మెంట్ సహకారంతో ఉద్యోగాలు సాధించిన వీరికి మంత్రి సవిత టీడీపీ ప్రధాన కార్యాలయంలో బుధవారం జాబ్ ఆఫర్ లెటర్లు అందజేసి అభినందించారు. చంద్రబాబు పేరును నిలబెట్టాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ బ్రాహ్మణ సాధికారిత విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ బుచ్చిరాంప్రసాద్, బీసీ సంక్షేమ విభాగం కోఆర్డినేటర్ గురుమూర్తి, టీడీపీ ఎంపవర్‌మెంట్ సెంటర్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ యామిని పాల్గొన్నారు.

'స్థానిక' కోటాపై వెనక్కి!

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం రాత్రి ప్రకటించారు. ప్రైవేట్ ఉద్యోగాల్లో 75శాతం స్థానికులకే ఇవ్వాలని, మేనేజ్‌మెంట్ ఉద్యోగాల్లోనూ 50శాతం ఇవ్వాలని రాష్ట్ర కేబినెట్ సోమవారం తీర్మానించింది. గురువారం నుంచి జరిగే శాసనసభ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టి, ఆమోదించాలని భావించింది. అయితే ఈ నిర్ణయంపై పారిశ్రామిక నిపుణుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో ప్రభుత్వం ఆచితూచి వ్యవహరించింది. రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పరిశ్రమల్లో సీ, డీ గ్రూప్ ఉద్యోగాలు వందశాతం కన్నడిగులకే తప్పనిసరి చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుందంటూ 'ఎక్స్'లో పోస్టు చేసిన సీఎం సిద్ధరామయ్య, కాసేపటికే దాన్ని తొలగించారు.

ప్రభుత్వ అధికారులు కూర్చుంటారా?: పాయ్

ప్రైవేట్ సంస్థల్లో కన్నడిగులకు ఉద్యోగ రిజర్వేషన్ కల్పించేలా కేబినెట్‌లో తీర్మానించిన బిల్లును మార్చాలని ప్రముఖ పారిశ్రామికవేత్త, ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో మోహన్‌దాస్ పాయ్ అన్నారు. ఇదో నియంతృత్వమైన బిల్లు అని, రాజ్యాంగ వ్యతిరేకమైదని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ఇలాంటి ఒక బిల్లును తీసుకువస్తుందంటే నమ్మలేకపోతున్నామని, వివక్షాపూరితంగా ఉన్న ఈ బిల్లును వెనక్కు తీసుకోవాలని కోరారు. 'ప్రైవేట్ కంపెనీల్లో నియామకాల బోర్డులో ప్రభుత్వ అధికారులు కూర్చుంటారా..? ఇంటర్వ్యూ వేళ అభ్యర్థుల భాషను పరీక్షించి నియమించుకోవాలా? ఇటువంటి బిల్లు ముందుకు రావడం అసాధ్యం' అని ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు.

టెక్ సంస్థలకు నష్టం: కిరణ్ మజుందార్‌షా

స్థానికులకు ఉద్యోగాలు అనే ప్రభుత్వ నిర్ణయాన్ని బయోకాన్ ఛైర్మన్ కిరణ్ మజుందార్‌షా తప్పుబట్టారు. స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలనడం టెక్ సంస్థలకు నష్టం కలిగిస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. సాంకేతిక రంగంలో కర్ణాటక ముందంజలో ఉందని, దాన్ని ప్రభావితం చేసే బిల్లును అనుమతించకూడదని సూచించారు.

ముందుచూపు లేకుండా నిర్ణయం: మిశ్రా

ప్రభుత్వ నిర్ణయం బెంగళూరులోని ఐటీ, గ్లోబల్ కంపెనీలకు నష్టం కలిగిస్తుందని ప్రముఖ పారిశ్రామికవేత్త, అసోచామ్ కర్ణాటక కో-ఛైర్మన్ ఆర్‌కే మిశ్రా అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం మేధావితనం చూపుతోందని, ఏ మాత్రం ముందు చూపు లేకుండా తీసుకున్న ఈ నిర్ణయం ఐటీ, జీసీసీ కంపెనీలను బెదిరించేలా ఉందని ఆరోపించారు.

పునరాలోచన చేయాలి: నాస్కామ్

రాష్ట్రంలో పారిశ్రామిక రంగం పురోగతికి ఇటువంటి బిల్లులు అడ్డంకిగా మారతాయని నాస్కామ్ అభిప్రాయపడింది. అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తిచూపుతున్న సమయంలో ఇలాంటి నిబంధనలతో అవి వెనక్కి పోయే ప్రమాదం ఉందని, ఈ నిర్ణయంపై పునరాలోచన చేయాలని కోరింది. ఇటువంటి ఆంక్షలతో నిపుణులైన అభ్యర్థులకు కొరత ఏర్పడి, సాఫ్ట్‌వేర్ కంపెనీలు తరలిపోతాయని ఆందోళన వ్యక్తం చేసింది.

కన్నడిగులకు శిక్షణ: మంత్రి పాటిల్

పరిశ్రమల్లో కన్నడిగులకు కొన్ని కేటగిరీల ఉద్యోగాలు కల్పించినా, పారిశ్రామికవేత్తల ఆశయాలకు భంగం కలగకుండా చర్యలు ఉంటాయని భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ చెప్పారు. దీనిపై సీఎంతోపాటు పలువురు నిపుణులతో చర్చిస్తామని పేర్కొన్నారు. నైపుణ్యం లేని కన్నడిగులకు శిక్షణలు ఇచ్చి.. ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. కాగా, ఐటీ ఉద్యోగాల విషయంలో తాము జోక్యం చేసుకునేది లేదని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పష్టం చేశారు. కాగా, బిల్లుపై సమగ్ర చర్చలు జరుపుతామని, అందరి అభిప్రాయాలు తీసుకుంటామని ఐటీబీటీ శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే వెల్లడించారు. ఇదిలాఉండగా, ప్రభుత్వ నిర్ణయంపై కర్ణాటక రక్షణ వేదిక (కరవే) వ్యవస్థాపక అధ్యక్షుడు నారాయణ గౌడ హర్షం వ్యక్తం చేశారు. సీఎం సిద్దరామయ్యను కలసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఎన్నో ఏళ్ల కన్నడిగుల ఆకాంక్ష నెరవేరిందని అన్నారు.

రిజర్వేషన్ల నిర్ణయానికి తాత్కాలిక బ్రేక్: సీఎం

ప్రైవేట్ రంగ సంస్థలు, పరిశ్రమల్లో కన్నడిగులకు రిజర్వేషన్లు కల్పిస్తూ కేబినెట్‌లో చేసిన తీర్మానాన్ని తాత్కాలికంగా పక్కన పెడుతున్నామని సీఎం సిద్దరామయ్య ప్రకటించారు. ప్రైవేట్ సంస్థల్లో మేనేజ్‌మెంట్ విభాగంలో 50శాతం, నాన్ మేనేజ్‌మెంట్ విభాగంలో 75శాతం కన్నడిగులకు రిజర్వేషన్లు కల్పిస్తూ కేబినెట్ తీర్మానించింది. ఈ అంశంపై తీవ్ర వివాదాలు తలెత్తడంతో బిల్లును వాయిదా వేస్తున్నామని సీఎం బుధవారం రాత్రి 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమల్లో రిజర్వేషన్లకు సంబంధించి కేబినెట్ తీర్మాన నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. రానున్న మంత్రివర్గ సమావేశంలో సుదీర్ఘ చర్చల అనంతరం తదుపరి నిర్ణయాన్ని ప్రకటిస్తామని పేర్కొన్నారు.

మా రాష్ట్రానికి రండి: మంత్రి లోకేశ్ ఆహ్వానం



అమరావతి, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ సంస్థల్లో 75శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని కర్ణాటక కేబినెట్‌లో తీర్మానించిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌కు రావాలని నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్ (నాస్కామ్)కు ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఆహ్వానం పలికారు. కేబినెట్ నిర్ణయంపై నాస్కామ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కొత్త ఆంక్షల వల్ల ఐటీ కంపెనీలు వేరే ప్రాంతాలకు మార్చుకోవాల్సిన పరిస్థితి తలెత్తుతుందని, ఇది స్థానిక ప్రతిభావంతులను ఇబ్బంది పెడుతుందని ఓ ట్వీట్‌లో ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై స్పందించిన మంత్రి లోకేశ్... 'మీ అసంతృప్తిని అర్థం చేసుకుంటున్నాం. మీ కంపెనీలను విస్తరించాలన్నా, మార్చుకోవాలనుకున్నా (రీలొకేట్) మా విశాఖపట్నంలోని ఐటీ, ఏఐ, డేటా సెంటర్ క్లస్టర్‌కు ఆహ్వానం పలుకుతున్నాం. మీకు అత్యుత్తమ సౌకర్యాలు, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా, మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. అలాగే మీ అవసరాలకు తగిన నిపుణులైన మానవ వనరులు ఇక్కడ ఉన్నాయి. ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి ఆంక్షలు ఉండవు. ఆంధ్రప్రదేశ్ మిమ్మల్ని ఆహ్వానించేందుకు సిద్ధంగా ఉంది' అని రీట్వీట్ చేశారు.

ఘనంగా రొట్టెల పండుగ ప్రారంభం



స్వర్ణాల చెరువులో భక్తుల కోలాహలం

నెల్లూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మత విశ్వాసానికి ప్రతీక అయిన రొట్టెల పండుగ బుధవారం నెల్లూరులో ఘనంగా ప్రారంభమైంది. ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలతో పండుగను ప్రారంభించగా, తొలిరోజే భక్తులు బారాషహీద్ దర్గాను దర్శించుకునేందుకు పోటెత్తారు. తెలుగురాష్ట్రాల నుంచే గాక కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి కూడా భక్తులు విచ్చేశారు. ముందుగా స్వర్ణాల చెరువులో స్నానాలు ఆచరించి, అనంతరం కోర్కెల రొట్టెలను పట్టుకున్నారు. విద్య, ఆరోగ్యం, సంతానం, సౌభాగ్యం వంటి పదకొండు రకాల రొట్టెలు స్వర్ణాల చెరువు వద్ద అందుబాటులో ఉన్నాయి. ఆరోగ్య, విద్యా రొట్టెలు లభించే ఘాట్లు కిటకిటలాడాయి. క్యూలైన్లు నిండిపోవడంతో బారాషాహీద్ దర్గా దర్శనానికి రెండు నుంచి మూడు గంటల సమయం పట్టింది. జిల్లా జడ్జి సీ. యామినితోపాటు పలువురు న్యాయమూర్తులు దర్గాను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తొలి రోజు లక్ష మంది వరకూ దర్గాను దర్శించుకుని ఉంటారని అధికారుల అంచనా. ఈ పండుగలో కీలకమైన గంధ మహోత్సవం గురువారం రాత్రి జరగనుంది. ఈ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం ఊరేగింపు



నంద్యాల జిల్లా బనగానపల్లెలో మాతం నిర్వహిస్తున్న షియా ముస్లింలు

బనగానపల్లె, జూలై 17: షియా ముస్లింలు భక్తిశ్రద్ధలతో నంద్యాల జిల్లా బనగానపల్లె పట్టణంలో మొహర్రం ఊరేగింపు నిర్వహించారు. యుద్ధంలో వీరమరణం పొందిన మహమ్మద్ ప్రవక్త మనవడు ఇమాం హుస్సేన్, ఆయన కుటుంబ సభ్యుల మృతికి సంతాప సూచకంగా బుధవారం విషాద గీతాలతో పట్టణంలో మాతం చేశారు. పట్టణంలోని దొరకోటలోని పీర్ల వద్ద నవాబు వంశీయులు మీర్ ఫజుల్ అలీఖాన్, ఆయన కుటుంబ సభ్యులు, షియా ముస్లింలు శోకతప్త హృదయాలతో ప్రార్థనలు చేశారు. దొరకోటలోని గంధం పీరు వద్ద తెలుత వారంతా ఫాతెహా నిర్వహించాక మొహర్రం ఊరేగింపు ప్రారంభమైంది. షియా ముస్లింలు నల్లదుస్తులు ధరించి పాల్గొన్నారు. బ్లేడులు, కత్తులతో తమ శరీరాలపై గాయాలు చేసుకుంటూ ఇమాం హుస్సేన్‌ను స్మరించుకుంటూ విషాద గీతాలు ఆలపిస్తూ పీర్ల వెంట నడిచివెళ్లారు. దీంతో పట్టణ వీధులు రక్తసిక్తంగా మారాయి.

నకిలీ విత్తనాలు తయారుచేస్తే చర్యలు

- వ్యవసాయశాఖ నూతన డైరెక్టర్ ఢిల్లీరావు



బాధ్యతలు చేపడుతున్న ఢిల్లీరావు

అమరావతి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్. ఢిల్లీరావు హెచ్చరించారు. మంగళగిరిలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో డైరెక్టర్‌గా బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రైతుల ఆదాయం పెంచే లక్ష్యంతో వ్యవసాయశాఖ పని చేస్తుందని, పంటల సాగులో పెట్టుబడి వ్యయం తగ్గించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేలా కార్యాచరణ చేపడతామని అన్నారు. రసాయనాల వల్ల జరుగుతున్న నష్టంపై రైతులకు అవగాహన కల్పిస్తామని, ప్రకృతి వ్యవసాయానికి మరింత ప్రోత్సాహం కల్పిస్తామని అన్నారు.

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడిగా మధుసూదన్‌రావు

నెల్లూరు, జూలై 17 : ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడిగా నెల్లూరుకు చెందిన దూర్జటి మధుసూదన్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు ఈ నెల 13వ తేదీన ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యవర్గం ఉత్తర్వులు జారీ చేసింది.

భారీగా పెరిగిన ఇంజనీరింగ్ అడ్మిషన్లు

తొలి విడతలోనే 1,17,136 సీట్లు భర్తీ

- ప్రైవేటు వర్సిటీల్లో 98%... యూనివర్సిటీల్లో 90%
- కన్వీనర్ కోటాలో ఇంకా మిగిలిన సీట్లు 19,524
- గతేడాది తుదిదశ నాటికంటే ఇప్పుడు తొలిదశలోనే ఎక్కువ
- క్రీడలు, ఎన్‌సీసీ కోటా సీట్లు తర్వాత విడతలో భర్తీ
- ప్రకటించిన సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్

అమరావతి, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలు భారీగా పెరిగాయి. గతేడాది ఈఏపీసెట్ తుది దశ నాటికి నిండిన సీట్ల కంటే ఈ ఏడాది తొలిదశలోనే ఎక్కువ సీట్లు భర్తీ అయ్యాయి. ఈఏపీసెట్-2024 తొలి విడత సీట్ల కేటాయింపు బుధవారం పూర్తయింది. సాంకేతిక విద్యాశాఖ ఈ వివరాలను వెల్లడించింది. యూనివర్సిటీ కాలేజీలు, ప్రైవేటు కాలేజీలు, ప్రైవేటు వర్సిటీల్లో కన్వీనర్ కోటా కింద 1,36,660 సీట్లు ఉంటే 1,17,136 సీట్లు భర్తీ అయ్యాయి. 19,524 సీట్లు మిగిలిపోయాయి. యూనివర్సిటీ కాలేజీల్లో 89.99 శాతం, ప్రైవేటు కాలేజీల్లో 84.66 శాతం, ప్రైవేటు వర్సిటీల్లో 98.31 శాతం నిండాయి. ఈ ఏడాది ఈఏపీసెట్‌లో 1,86,031మంది అర్హత సాధించారు. వారిలో 1,28,619మంది కౌన్సెలింగ్‌కు రిజిస్టర్ చేసుకోగా, 1,26,608 మంది ఆప్షన్లు ఎంపిక చేసుకున్నారు. ఒక్కో విద్యార్థి సగటున 35 చొప్పున మొత్తం 44,69,203 ఆప్షన్లు పెట్టుకున్నారు. గతేడాది కంటే 14 లక్షల ఆప్షన్లు పెరగడంతో సీట్ల కేటాయింపునకు చాలా ఎక్కువ సమయం తీసుకుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. కాగా, గతేడాది తుదిదశ కౌన్సెలింగ్ ముగిసే సమయానికి కూడా కన్వీనర్ కోటాలో 94,407 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. అప్పటితో పోలిస్తే ఈ ఏడాది తొలి దశలోనే 22,729 సీట్లు అదనంగా నిండాయి. ఇంకా రెండో విడత, తుది విడత కౌన్సెలింగ్ నాటికి అడ్మిషన్ల సంఖ్య ఇంకా పెరుగుతుంది. ఈ ఏడాది కంప్యూటర్ సైన్స్ సీట్లు ఎక్కువ మంజూరు కావడం అడ్మిషన్లు పెరగడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. గతేడాది వరకూ ఏ బ్రాంచ్‌కు ఎన్ని సీట్లు ఉండాలనే దానిపై పరిమితులు ఉండేవి. ఈ ఏడాది ఏఐసీటీఈ ఆ పరిమితులను తొలగించింది. కోర్ గ్రూపులు మూడింటినీ కొనసాగిస్తూ మిగిలిన బ్రాంచ్‌ల్లో సీట్ల సంఖ్య పెంచుకొనేందుకు వెసులుబాటు కల్పించింది. దీంతో కాలేజీలన్నీ సీఎస్ఈ సీట్లు భారీగా పెంచుకున్నాయి. కొన్ని కాలేజీలకు ఏకంగా వెయ్యికి పైగా సీఎస్ఈ సీట్లు వచ్చాయి.

కాలేజీల వారీగా సీట్ల భర్తీ వివరాలు...

కేటగిరీ	కాలేజీలు	కన్వీనర్ సీట్లు	భర్తీ	మిగులు
యూనివర్సిటీ కాలేజీలు	24	6,877	6,189	688
ప్రైవేటు కాలేజీలు	212	1,21,951	1,03,247	18,704
ప్రైవేటు యూనివర్సిటీలు	9	7,832	7,700	132
మొత్తం	**245**	**1,36,660**	**1,17,136**	**19,524**

19 నుంచి తరగతులు

ఇంజనీరింగ్ తరగతులు ఈ నెల 19 నుంచి ప్రారంభమవుతాయని సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ బి.నవ్య ఓ ప్రకటనలో తెలిపారు. 22నాటికి విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేయాలని, మిగిలిపోయిన సీట్లకు మలివిడత కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. ఎన్‌సీసీ డైరెక్టర్, శాప్ ఎండీ నుంచి తుది మెరిట్ జాబితా రానందున క్రీడా కోటా, ఎన్‌సీసీ కోటా సీట్లను భర్తీ చేయలేదని, తర్వాత విడతలో వీటిని భర్తీ చేస్తామని వివరించారు.

అక్టోబరు ఆర్జితసేవ టికెట్ల కోటా విడుదల నేడు

తిరుమల, జూలై 17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆర్జితసేవా టికెట్లకు సంబంధించి అక్టోబరు నెల కోటాను గురువారం ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం భక్తులు జూలై 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. టికెట్లు పొందిన భక్తులు జూలై20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు సొమ్ము చెల్లిస్తే లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను 22వ తేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. 23వ తేది ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్లను, అదే రోజు ఉదయం 11 గంటలకు శ్రీవాణి టికెట్లను, మధ్యాహ్నం 3 గంటలకు వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక ఆరోగ్యసమస్యలు ఉన్న భక్తులకు ఇచ్చే టోకెన్లను విడుదల చేస్తారు. 24వ తేదీ ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిల్లోని గదుల కోటాను అందుబాటులో ఉంచుతారు.27వ తేదీన ఉదయం 11 గంటలకు శ్రీవారిసేవ, 12 గంటలకు నవనీతసేవ, మధ్యాహ్నం ఒంటిగంటకు పరకామణి సేవ కోటాను విడుదల చేస్తారు. అక్టోబరు 4 నుంచి 10వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో సుప్రభాత సేవ మినహా ఆర్జితసేవలను రద్దు చేశారు. 11, 12 తేదీల్లో సుప్రభాతసేవతో మిగిలిన సేవలను కూడా రద్దు చేశారు. అలాగే అక్టోబరు 3 నుంచి 13వ తేదీ వరకు అంగప్రదక్షిణ, వర్చువల్ సేవా దర్శనం టికెట్లు కూడా రద్దు చేశామని, భక్తులు ఈ విషయాలను గమనించి టికెట్లను బుక్ చేసుకోవాలని టీటీడీ కోరింది. భక్తులు ఈ టికెట్లు, టోకెన్లను 'టీటీడేవస్థానమ్స్.ఏపీ.జీవోవీ.ఇన్' వెబ్‌సైట్ నుంచి బుక్ చేసుకోవచ్చు.

24న పల్లవోత్సవం

తిరుమల శ్రీవారి భక్తుడైన మైసూరు మహారాజ జ్ఞాపకార్థం ఆయన జన్మించిన ఉత్తరభాద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని టీటీడీ ఈనెల 24వ తేదీన పల్లవోత్సవాన్ని నిర్వహించనుంది. మైసూరు మహారాజ జ్ఞాపకార్థం దాదాపు 300 సంవత్సరాల నుంచి తిరుమలలో ఈ ఉత్సవం జరుగుతోంది.

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థను ప్రారంభించిన జస్టిస్ దుర్గాప్రసాద్



రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థను ప్రారంభిస్తున్న హైకోర్టు ఇన్‌చార్జి సీజే జస్టిస్ దుర్గాప్రసాద్

తుళ్లూరు, జూలై 17: పేదలకు సత్వర న్యాయం అందించేందుకు అమరావతి రాజధాని పరిధిలోని వెలగపూడి సచివాలయం ఎదురుగా మల్కాపురం రెవెన్యూలో ఉన్న భవనంలో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థను ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ న్యాయసేవాధికార సంస్థ పాట్రన్- ఇన్- చీఫ్ జస్టిస్ దీరజ్ సంగ్‌రాకూర్ ఆదేశాల మేరకు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హైకోర్టు ఇన్‌చార్జి సీజే జస్టిస్ దుర్గాప్రసాదరావు నూతన కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. అందరికీ అందుబాటులో న్యాయసేవలు లభించడానికి రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కృషి చేయాలని జస్టిస్ దుర్గాప్రసాదరావు కోరారు.

గంజాయి మత్తులో బాలికపై అత్యాచారం, హత్య

దొరవారిసత్రం, జూలై 17: ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం చేసి, ఆపై హత్య చేసిన దారుణ ఘటన తిరుపతి జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... దొరవారిసత్రం మండలం నెలబల్లి వద్ద ఉన్న రైస్ మిల్లు సమీపంలోని అటవీ ప్రాంతంలో బుధవారం సాయంత్రం ఓ బాలిక శవమై కనిపించింది. స్థానికులు సమాచారం అందించడంతో పరిశీలించిన పోలీసులు అత్యాచారంతో పాటు హత్యకు గురైనట్లు గుర్తించారు. రైస్‌మిల్లులో పనిచేసే బిహార్‌కు చెందిన దిలీప్(22) బాలికకు మాయమాటలు చెప్పి అడవిలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు సీసీ కెమెరాల ఫుటేజీ ద్వారా గుర్తించారు. గొంతు నులమడంతో బాలిక ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు భావిస్తున్నారు. రైస్‌మిల్లులో గంజాయి మత్తులో పడివున్న దిలీప్‌ను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. బుధవారం రాత్రి ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు దొరవారిసత్రం చేరుకుని వివరాలను తెలుసుకున్నారు.

వసంత్ కెమికల్స్‌లో అగ్నిప్రమాదం.. కార్మికుడు మృతి

రాంబిల్లి, జూలై 17: అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం లాలంకోడూరు సమీపాన గల ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఈజడ్)లోని వసంత్ కెమికల్స్ కంపెనీలో బుధవారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఒడిసాకు చెందిన కాంట్రాక్టు కార్మికుడు ప్రదీప్ రౌత్ (44) మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఉదయం సుమారు 8.30 గంటల సమయంలో కంపెనీలోని రియక్టర్ సేఫ్టీ రిలీవ్ వాల్వ్ (ఎస్ఆర్‌వీ) వద్ద వాయువు లీకై మంటలు చెలరేగాయి. ఆ సమయంలో అక్కడ క్లీనింగ్ పనిలో ఉన్న ప్రదీప్‌ను మంటలు చుట్టుముట్టడంతో చనిపోయినట్టు తోటి కార్మికులు తెలిపారు. కంపెనీ ప్రతినిధులు మాత్రం ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కార్మికుడిని చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆసుపత్రికి తరలించామని, వైద్యులు పరిశీలించి మృతిచెందినట్టు తెలియజేశారని చెబుతున్నారు. వాయువు లీకై మంటలు చెలరేగడంతో ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని పరుగులు తీశామని పలువురు కార్మికులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరుకొని మంటలు అదుపు చేయడంతో ప్రమాదం పెద్దది కాలేదంటున్నారు. రాంబిల్లి సర్కిల్ సీఐ నరసింగరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను పరిశీలించి, కంపెనీ ప్రతినిధులు, కార్మికులతో మాట్లాడారు. క్లూస్ టీమ్ కూడా వివరాలు సేకరించింది. మృతుడి కుటుంబానికి రూ.35 లక్షలు పరిహారంతోపాటు, కంపెనీ ద్వారా అందే ప్రయోజనాలను అందిస్తామని ఆర్డీఓ చిన్నికృష్ణ తెలిపారు.

ఎంపీడీవో ఎక్కడ?

48 గంటలు దాటినా లభించని ఆచూకీ

- మచిలీపట్నం రైల్వేస్టేషన్‌లో టికెట్ కొనుగోలు
- అక్కడ బైక్ పార్క్ చేసి రైలులో బెజవాడకు పయనం
- మధురానగర్‌లో ఏలూరు కాలువ వద్ద చెప్పులు గుర్తింపు
- కాలువలో ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో గాలింపు
- సమగ్ర విచారణకు ఆదేశించిన ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

విజయవాడ, అమరావతి(ఆంధ్రజ్యోతి), నరసాపురం రూరల్, జూలై 17: పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీవో ఎం.వెంకటరమణరావు అదృశ్యం రాష్ట్రంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. 48 గంటలు దాటినా ఆయన ఆచూకీ లభ్యం కాలేదు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆయన రాసిన మరణ వాంగ్మూలం సంచలనం కలిగిస్తోంది. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం కానూరులోని మహదేవపురంలో నివసిస్తున్న వెంకటరమణారావు అదృశ్యంపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వెంకటరమణరావు ఎన్టీఆర్ జిల్లాలో ఎంపీడీవోగా పనిచేసి నాలుగు నెలల క్రితం నరసాపురానికి బదిలీ అయ్యారు. ఈ ఏడాది మార్చి 31వ తేదీనే ఆయన ఉద్యోగ విరమణ చేయాల్సి ఉండగా, అధికారులు ఉద్యోగ విరమణ చేయనివ్వలేదు. నరసాపురంలోని మాధవాయిపాలెం రేవు కాంట్రాక్ట్ దక్కించుకున్న చినరెడ్డప్ప దవేజీ నుంచి దానికి సంబంధించి రూ.55 లక్షల బకాయి వసూలు చేసే వరకు ఉద్యోగ విరమణ చేయనిచ్చేది లేదని అధికారులు ఆయనకు తేల్చిచెప్పేశారు. దీంతో మానసిక ఒత్తిడికి లోనైన వెంకటరమణారావు ఈ నెల మూడో తేదీ నుంచి మెడికల్ లీవ్‌లో ఉన్నారు. పని మీద మచిలీపట్నంవెళ్తున్నానని చెప్పి ఈనెల 15న ఇంటి నుంచి బైక్‌పై వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆయన సతీమణి పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పెనమలూరు సీఐ రామారావు మూడు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు. మచిలీపట్నంలో ఉన్నట్టు సెల్‌ఫోన్ సిగ్నల్ చూపించడంతో పోలీసులు అక్కడికి వెళ్లారు. అక్కడి రైల్వేస్టేషన్‌లో సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. వెంకటరమణారావు రైల్వే స్టేషన్‌కు వెళ్లి బైక్‌ను పార్కింగ్ ప్రదేశంలో పెట్టారు. కౌంటర్ వద్దకు వెళ్లి విజయవాడకు టికెట్ తీసుకున్నారు. రైలు ఎక్కి విజయవాడలోని మధురానగర్ వరకు ప్రయాణించినట్లు పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత నుంచి సెల్‌ఫోన్ సిగ్నల్స్ ట్రాక్ కాలేదు. అక్కడ సిగ్నల్ కోసం రైలు ఆగినప్పుడు ఆయన కిందికి దిగి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. అక్కడి నుంచే 15వ తేదీ అర్ధరాత్రి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు రాసిన మరణ వాంగ్మూలం లేఖను ఆయన భార్యకు వాట్సాప్‌లో పంపారు. ఇది చూసిన వెంటనే ఆమె పోలీసులను ఆశ్రయించారు. మధురానగర్‌లో రైల్వే ట్రాక్‌కు కొంతదూరంలో ఏలూరు కాలువ ప్రవహిస్తోంది. ఏలూరు కాల్వ వద్ద ఆయన చెప్పులు కనిపించడంతో కాలువలోకి ఆయన దూకి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. రైల్వేట్రాక్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం ఉదయం నుంచి రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో కాలువలో గాలిస్తున్నారు. సాయంత్రం వరకు గాలింపు చేపట్టినా ఆచూకీ లభించలేదు.



విజయవాడ మధురానగర్ వద్ద ఏలూరు కాల్వలో గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

సమగ్ర విచారణ: పవన్ కల్యాణ్

వెంకటరమణారావు అదృశ్యం, అందుకు దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ చేపట్టాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. గాలింపు చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. ఆయన రాసిన లేఖ, అందులోని వివరాల గురించి ఆరా తీశారు. ఫెర్రీ కాంట్రాక్టర్ బకాయిల సమగ్ర వివరాలను తక్షణమే అందించాలని, ఒక అధికారి అదృశ్యమయ్యే పరిస్థితికి కారకులైన వారిపై చట్ట ప్రకారం చర్యలకు ఉపక్రమించాలని ఆదేశించారు.

నిజాయితీ అధికారులను బతకనివ్వడం లేదు: కుమారుడు

నిజాయితీగా ఉద్యోగం చేస్తున్న అధికారులను అవినీతిపరులు బతకనివ్వడం లేదని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని వెంకటరమణారావు కుమారుడు సాయిరామకృష్ణ డిమాండ్ చేశారు. తన తండ్రి రాసిన లేఖపై పవన్ కల్యాణ్ స్పందించాలని, బకాయిలు ఉన్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. పవన్‌ను కలిసి పరిస్థితిని చెప్పుకొనే అవకాశం తమకు కల్పించాలన్నారు.

ఇది నా మరణ వాంగ్మూలం..

'నేను నరసాపురం ఎంపీడీవోగా పనిచేస్తున్నాను. ఫెర్రీ లీజుకు సంబంధించి రూ.55 లక్షలను దవేజీ బకాయి ఉన్నాడు. వైసీపీ ప్రభుత్వంలో చీఫ్‌విప్‌గా పనిచేసిన ప్రసాదరాజు అండదండలతో డబ్బులు చెల్లించకుండా మూడున్నర నెలల నుంచి ఇబ్బంది పెడుతున్నాడు. నేను ఏ తప్పూ చేయకపోయినా మానసికక్షోభ అనుభవిస్తున్నాను. దీనికి నన్ను బాధ్యుడ్ని చేసే అవకాశం ఉంది. నాకు ఉద్యోగమే జీవనాధారం. తీవ్ర మనస్తాపంతో ఉన్నాను. దవేజి డబ్బులు చెల్లించేలా చేసి నాకు న్యాయం చేయాల్సిందిగా కోరుతున్నాను. పించన్ ప్రతిపాదనలు వచ్చేలా చేసి నా భార్యకు న్యాయం చేయగలరని ప్రార్థించుచున్నాను. 33 సంవత్సరాలు నీతి నిజాయితీగా పనిచేశాను. ఆఖరిలో నా కర్మ ఇలా అయింది. మా చిన్నబ్బాయి అప్పు చేసి కోత విప్షన్ల వ్యాపారం చేసుకుంటున్నాడు. మా అబ్బాయికి ఉద్యోగం ఇప్పించవలసిందిగా ప్రార్థించుచున్నాను. పెద్దబ్బాయికి నేనేమీ చేయలేకపోయాను. అతడే జీవనోపాధిని చూసుకున్నాడు. రాజకీయంగా నేను మీ అభిమానిని. ఎన్టీఆర్ తర్వాత నాకు నచ్చిన రాజకీయ నాయకుడు మీరే. త్వరలో ముఖ్యమంత్రి అవుతారు. ఇది నా మరణ వాంగ్మూలం' అని పవన్‌కల్యాణ్‌కు రాసిన లేఖలో వెంకటరమణరావు పేర్కొన్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు కాగా, పెద్దకుమారుడు సాయిరామకృష్ణ సింగపూర్‌లో ఉంటున్నారు. 15 రోజుల క్రితమే తల్లిదండ్రులను చూడడానికి కానూరుకు వచ్చారు.

విద్యారంగ పరిరక్షణకు యూటీఎఫ్ కార్యాచరణ

అమరావతి/విజయవాడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగం పరిరక్షణకు యూటీఎఫ్ దశలవారీ కార్యాచరణ ప్రకటించింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతున్న క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. బుధవారం విజయవాడలో జరిగిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్ణయాలను అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. జూలై 22 నుంచి 30 వరకు జిల్లా, రాష్ట్రస్థాయి విద్యాశాఖ అధికారులకు, ఆగస్టు 5 నుంచి 15 వరకు ఎమ్మెల్యేలకు, ఆగస్టు 20 నుంచి 30 వరకు 3వేల సంతకాలతో మంత్రులకు వినతిపత్రాలు అందజేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. సెప్టెంబరు 1 నుంచి 10 వరకు సీఎంకు 50వేల పోస్టుకార్డులు పంపుతామన్నారు.

డిగ్రీ గురుకులాల్లో ఫీజుల వసూలు ఆపాలి: ఎస్ఎఫ్ఐ

అమరావతి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థినులు ఫీజులు చెల్లించాలని ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.ప్రసన్నకుమార్, ఎ.అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రెండు మహిళా డిగ్రీ గురుకుల కాలేజీలున్నాయని, వాటిలో గత ఐదేళ్ల ఎలాంటి ఫీజులు వసూలుచేయలేదని, 400 మంది విద్యార్థినులపై ఆర్థిక భారం పడుతుందన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

జమ్మూలో ఉగ్రబీభత్సం

జమ్మూలోని దోడాజిల్లాలో సోమవారం రాత్రి ఉగ్రవాదులకు, భద్రతాబలగాలకు మధ్య భీకరమైన ఎదురుకాల్పుల్లో అధికారి సహా నలుగురు జవాన్లు మరణించారు, స్థానికపోలీసులు సైతం పెద్ద సంఖ్యలో గాయపడ్డారు. దెస్సా ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నట్టుగా తెలిసి, గాలింపు జరుపుతున్నప్పుడు ఒక్కసారిగా భద్రతాబలగాలపై ఈ దాడి జరిగింది. గతవారం పదిమంది జవాన్లు ట్రక్కులో వెడుతూండగా ఉగ్రవాదులు గ్రెనేడ్లతో దాడిచేసి, కొందరిని పొట్టనబెట్టుకున్న విషయం తెలిసిందే. జమ్మూలో అతివేగంగా ఉగ్రవాదం అనేకజిల్లాలకు విస్తరించడం ఆందోళన కలిగిస్తున్న పరిణామం. కొన్నేళ్ళుగా ఉగ్రవాద కార్యకలాపాలు లేని జిల్లాలు సైతం ఇప్పుడు భయంతో వొణికిపోతున్నాయి.

దోడా, రియాసీ, కఠువా, పూంచ్, రజౌరీ.. ఇలా జమ్మూలోని పలు జిల్లాల్లో నిత్యం ఎక్కడో అక్కడ ఏదో ఒక స్థాయిలో ఉగ్రదాడులు జరుగుతున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకూ ఉగ్రవాదులకంటే భద్రతా సిబ్బందే నాలుగురెట్లు అధికంగా కన్నుమూశారు. ఉగ్రవాదం జమ్మూ మూలల్లోకి విస్తరించడం, విదేశీ ఉగ్రవాదులను భద్రతాసిబ్బంది నిలువరించలేకపోవడం ఆందోళన కలిగిస్తున్న పరిణామాలు. ఇంటలిజెన్స్ వైఫల్యం వల్లనో, తప్పుడు సమాచారం వల్లనో భద్రతాసిబ్బంది ఉగ్రవాదుల ఉచ్చులోపడి, ప్రాణాలు కోల్పోతున్నారు. గతనెల రియాసీ జిల్లాలో వైష్ణోదేవి బస్సు యాత్రికులను విదేశీ ఉగ్రవాదులు లక్ష్యంగా చేసుకున్నాక, ఇది ఆరంభం మాత్రమేనని, గతకాలపు వాతావరణాన్ని మళ్ళీ పునరుద్ధరిస్తున్నామని లష్కరే తోయిబా ఒక ప్రకటన చేసింది. అనంతరం ప్రధాని అత్యున్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించి ఎట్టిపరిస్థితుల్లోనూ ఉగ్రవాదులను ఉపేక్షించవద్దంటూ భద్రతాదళాలకు ప్రత్యేక ఆదేశాలు ఇచ్చారు. ఆర్టికల్ 370 రద్దు తరువాత జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదం తగ్గిపోయిందని బీజేపీ అధినాయకులు చెబుతూంటారు. టెర్రరిజం తగ్గి టూరిజం పెరిగిందని ప్రధానమంత్రి తన ఎన్నికల సభలో సంతోషం వ్యక్తంచేశారు. కశ్మీర్‌లో దశాబ్దాల తరబడి కాంగ్రెస్ చేసిన పాపాలను దాని ప్రత్యేకప్రతిపత్తి రద్దుద్వారా ప్రక్షాళించామని బీజేపీ నాయకులు అంటారు. కానీ, వారంటున్నట్టుగా ఉగ్రవాదం సమసిపోలేదని, పైగా ఎంతో ప్రశాంతంగా ఉండే జమ్మూకు అది ఒక నిర్దిష్టమైన లక్ష్యంతో విస్తరిస్తున్నదని ఈ వరుస ఘటనలు తెలియచెబుతున్నాయి. కొద్దిరోజుల క్రితమే జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ)కు వివిధ అంశాల్లో అపరిమితమైన అధికారాలు కట్టబెడుతూ కేంద్రం ఆదేశాలు జారీచేసింది. తదనుగుణంగా కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం నిబంధనలను సవరించింది. జమ్మూకశ్మీర్‌ను కేంద్రపాలిత ప్రాంతాలుగా నిరవధికంగా కొనసాగించే ఉద్దేశంతోనే మోదీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని స్థానిక పార్టీలు విమర్శిస్తున్నాయి. ఎల్జీకి మరిన్ని అధికారాలు ఇవ్వడమంటే రాష్ట్రహోదాను మరింత జాప్యం చేయడమేనని వాటి విమర్శ. ఆ రాష్ట్రాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడమన్న తిరోగామిచర్య వెనుక ఉన్న ప్రకటిత ప్రధాన లక్ష్యం ఉగ్రవాదాన్ని నిర్మూలించడం. ఈ విషయంలో వైఫల్యం స్పష్టంగా ఉన్నందున, అసెంబ్లీ ఎన్నికలలోపుగానే రాష్ట్రహోదాను తిరిగి పునరుద్ధరించి, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వంతో కేంద్రం కలసినడవాలని స్థానికపార్టీలు డిమాండ్ చేస్తున్నాయి.

గతంలో పాకిస్థాన్‌లోకి చొరబడి మరీ ఉగ్రవాద స్థావరాలను నాశనం చేశామని గొప్పగా చెప్పుకున్నవారు ఇప్పుడు ఏం చేస్తున్నారంటూ రాజకీయ ప్రత్యర్థులు ప్రశ్నిస్తున్నారు. కొన్ని ఘట్టాలను అధికారపక్షం తన రాజకీయప్రయోజనాలకు వాడుకోవడం ఎంత సహజమో, విపక్షం వాటిని ఇటువంటి కష్టకాలంలో గుర్తుచేసి దెప్పిపొడవడమూ అంతే సహజం. రాజకీయాన్ని పక్కనబెడితే, భారతప్రభుత్వం అటు అంతర్జాతీయ వేదికలమీదా, ఇటు క్షేత్రస్థాయిలోనూ పాక్‌ప్రేరేపిత ఉగ్రవాదంమీద యుద్ధంచేయాల్సిన తరుణమిది. సంఘటితంగా పోరాడాల్సిన ఈ సందర్భంలో, కశ్మీర్‌లోని రాజకీయపార్టీలు తమ స్వార్థప్రయోజనాలకోసం ఉగ్రవాదాన్నీ, ఉగ్రవాదులను పెంచిపోషించాయన్న అర్థంలో అక్కడి డీజీపీ చేసిన వ్యాఖ్యలు ప్రమాదకరమైనవి. ఢిల్లీపాలకుల మెప్పుకోసం ఆయన ఆ మాటలన్నారని స్థానిక పార్టీలు మండిపడ్డాయి. ఈ ఆపత్సమయంలో నాయకులు, ప్రజలు సహా ఎవరినీ నొప్పించకుండా, దూరం చేసుకోకుండా అతిజాగ్రత్తగా వ్యవహరించాల్సిన బాధ్యత అక్కడి ఉన్నతాధికారులమీద ఉంది. పాకిస్థాన్ కుట్రలను సాగనివ్వకపోవడమే మన సమష్టికర్తవ్యం కావాలి.

అనైతిక ఫిరాయింపు, అందమైన దబాయింపు!

అరవయ్యేళ్ల కిందట, మూడో సాధారణ ఎన్నికల తరువాత, కాంగ్రెస్ పార్టీ కేంద్ర పార్లమెంటరీ బోర్డు ఒక తీర్మానం ఆమోదించింది. అప్పటికింకా నెహ్రూ బతికే ఉన్నారు. ఆ తీర్మానం ప్రకారం, ఇతర పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలోకి చేరదలిస్తే, అతను లేదా ఆమె ముందుగా చట్టసభల సభ్యత్వాలకు రాజీనామా చేసి, తిరిగి కాంగ్రెస్ టికెట్ మీద పోటీచేయడానికి సిద్ధపడాలి. ఆ నిర్ణయం అయితే చేశారు కానీ, రాష్ట్రాల కాంగ్రెస్ పెద్దలు ఎవరూ అందుకు ఒప్పుకోలేదు. ఈ తీర్మానం ప్రకారం ఫిరాయింపుదారులు ఒక్కరు కూడా చట్టసభలకు రాజీనామా చేసి తిరిగి పోటీచేయలేదు. ఏదో ఒక మినహాయింపు ఇస్తూ, నిరంతరంగా ఇతర సభ్యులను కాంగ్రెస్ చేర్చుకుంటూనే ఉండింది. దాని మార్గంలోనే ఇతర పార్టీలూ నడుస్తూ వచ్చాయి. కాలక్రమంలో దేశంలో స్థిరపడిన, బలపడిన రాజకీయ సంస్కృతికి శాసనాలతో, విలువలతో నిమిత్తం లేకుండా పోయింది. మన పదజాలంలో ఆపరేషన్ ఆకర్ష్‌లు, జంప్ జిలానీలూ భాగమైపోయాయి.



నిజానికి తొలిరోజుల్లో కాంగ్రెస్‌కు తిరుగులేని ఆధిక్యం ఉండేది. మొదటి సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 364 స్థానాలు (మొత్తం సీట్లు 489) వస్తే, రెండో స్థానంలో 41 సంఖ్యతో ఇండిపెండెంట్లు ఉన్నారు. కమ్యూనిస్టు పార్టీ 26 సీట్లతో మూడోస్థానంలో ఉంది. ఇక, ఫిరాయింపుల అవసరం ఇతరులకు ఉంటుంది కానీ, కాంగ్రెస్‌కు ఎందుకు? అయినా, చేరుతూనే ఉండేవారు, చేర్చుకుంటూనే పోయారు. 1967లో జరిగిన నాలుగో ఎన్నికలు కాంగ్రెస్‌కు పెద్దకుదుపు. ప్రతిపక్షాలకు పెద్ద ఊపు. అనేక రాష్ట్రాలలో మిశ్రమ ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయి. ఫిరాయింపులు ఇక ఉద్యమంగా మారిపోయాయి. ఇప్పుడు ట్రాఫిక్ రెండువైపులా మొదలయింది. 1967 ఎన్నికలలో రాష్ట్రశాసనసభలకు 3,550 మంది సభ్యులు ఎన్నిక కాగా, వీరిలో 550 మంది తామున్న పార్టీల నుంచి ఫిరాయించారు. కొందరు అనేకమార్లు ఫిరాయించారు కూడా. ఈ కాలంలో కాంగ్రెస్ పార్టీ అనేక రాష్ట్రాలలో ఫిరాయింపుల వల్ల ఇబ్బంది పడినమాట నిజమే కానీ, తిరిగి అదే మార్గం ద్వారా తేరుకున్నది కూడా. ఆ కాలంలోనే ఫిరాయింపులను నియంత్రించడానికి ఏమిచేయాలన్న ఆలోచనలు కూడా మొదలయ్యాయి. మొత్తం మీద ఫిరాయింపుల ద్వారా అత్యధిక లబ్ధిపొందిన సంస్థ కాంగ్రెస్ పార్టీయే అని చెప్పాలి. కానీ, కాంగ్రెస్ పార్టీ తాను అత్యధిక స్థానాలు గెలిచి బలశాలిగా ఉన్న కాలంలోనే, 1985లో ఫిరాయింపుల నిరోధక చట్టం తెచ్చింది. పార్టీ మార్పునకు అనర్హత వేటును, చీలికలకు విలీనాలకు నిర్ణీత శాతాల నియమాన్ని ఆ చట్టమే అమలులోకి తెచ్చింది.

1963లో పార్టీ స్థాయిలో చేసిన నిర్ణయం, ఆ పార్టీలో అమలు కానట్టే, 1985లో రాజ్యాంగస్థాయిలో చేసిన శాసనం కూడా దేశంలో అమలు కావడంలేదనే చెప్పాలి. చట్టానికి దొరకకుండా పనిజరుపుకోవడం ప్రస్తుత వ్యవస్థలో ఒక ఆమోదనీయమైన నైపుణ్యం. బాహాటంగా ఒక పార్టీ సభ్యుడు మరో పార్టీ వేదిక మీద సంచరిస్తాడు. నాయకుడి దగ్గర కండువా కప్పుకుంటాడు. అధికారికంగా రాజీనామా చేయరు. విప్‌లు ఉల్లంఘించరు. పార్టీని తిడుతూనే ఉంటారు. లేదా, రాజీనామా చేస్తారు కానీ, స్పీకర్ ఎంతకూ ఆమోదించరు. నిర్ణయానికి నిరవధిక సమయం తీసుకోగలగడం చట్టసభాపతికి ఉండే విశేషాధికారాలలో ఒకటి. ప్రజాస్వామ్యాన్ని పరిహసించదలచుకుంటే, ఫిరాయింపు ఎమ్మెల్యే మంత్రి అయి, పూర్తికాలం కొనసాగగలడు. ఫిరాయింపులకు వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ మాట్లాడడం, ఫిరాయింపు నిరోధక చట్టం తెచ్చిన తన తండ్రి అడుగుజాడలో నడవడం వల్ల కావచ్చు. ఇప్పుడు జాతీయస్థాయిలో కాంగ్రెస్‌లోకి ఇతర పార్టీల వారు వచ్చే పరిస్థితి లేదు. రాష్ట్రాలలో ఆ నైతికతను అమలుజరపే నిబద్ధతా లేదు.

akbar

ఉద్యమకాలంలో
కేసీఆర్ పక్కన నిలిచిన
వృత్తి రాజకీయ నేతలలో
చాలా మందికి పెద్ద నీతినియామాలేమీ
లేవు. తరువాతా లేవు. ఆ లక్షణం వల్లనే,
ఇతర పార్టీలలోని అనైతికులకు రహదారి
ఏర్పడింది. అదే దారి ఇప్పుడు కాంగ్రెస్
దిశగా నడుస్తోంది. వ్యక్తులు ప్రైవేటు
జీవితాల్లో గీత దాటితేనో, చట్రాలలోపల
ఒదగకపోతేనో, తప్పో ఒప్పో స్వేచ్ఛను
సాధనచేస్తేనో విరుచుకుపడి, వేధించి,
సకలమాధ్యమాల్లో ఆత్మగౌరవాలను
లించింగ్ చేసే మన సమాజం, ప్రజలు
తమకు ఇచ్చిన సమ్మతిపై ఈ గోడదాటు
నేతలు వ్యాపారమూ అత్యాచారమూ
చేస్తుంటే ఎందుకు సహిస్తున్నది?

పార్టీ నుంచి వెళ్లిపోవడం, చీలిపోవడం వంటివి ప్రజాస్వామ్యప్రక్రియలు. తీవ్రమైన విభేదాలతో పార్టీని వదలడం వేరు, ఫిరాయింపు వేరు. ఎమర్జెన్సీ సడలింపు సమయంలో జగ్జీవన్‌రామ్ కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చారు. రాజీవ్ ప్రధానిగా ఉన్నప్పుడు వి.పి.సింగ్ కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. ప్రజలు అటువంటి వాటిని గమనిస్తూ ఉంటారు. ఒక రాజకీయ సంవాదం ఎట్లా రూపుదిద్దుకుంటున్నది, వైఖరుల్లో అభిప్రాయాల్లో తేడాలు ఎట్లా సమీకృతమవుతున్నాయి, తెలిసిపోతూ ఉంటుంది. తగినంత విధాన ఘర్షణ లేకుండా చీలికలను ప్రజలు ఆమోదించరు. 1984లో ఎన్‌టి రామారావు మీద నాదెండ్ల భాస్కరరావు చేసిన రాజకీయ ప్రయత్నానికి జనం ఆమోదం లేకపోవడం అందువల్లనే. కాంగ్రెస్ ప్రోద్బలంతో కేవలం అధికారం కోసం మాత్రమే భాస్కరరావు అట్లా వ్యవహరించారని ప్రజలు నమ్మారు. విధేయత మార్చిన ఎమ్మెల్యేల ఇళ్ల ముందు, వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేశారు. ఏకనాథ్ షిండే విషయంలో కూడా మహారాష్ట్ర ప్రజల నుంచి సమ్మతి లేదని ఇటీవలి పరిణామాలు సూచిస్తున్నాయి. చీలికలను, కూడికలను సాంకేతికంగా పకడ్బందీగా జరిపించినా, నైతికంగా అవి ఎటువంటివో సమాజం అంతా కాకపోయినా, కనీసం పౌరసమాజమైనా ఒక కంట కనిపెడుతూ ఉంటుంది.



■ కె. శ్రీనివాస్

సందర్భం

ఒకసారి ప్రజాప్రతినిధిని ఎన్నిక చేసుకున్న తరువాత, పదవీకాలం మధ్యలో అతను లేదా ఆమె తీసుకునే వైఖరులను క్రియాశీలంగా వ్యతిరేకించడం రానురాను తగ్గిపోతోంది. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజాప్రతినిధుల మీద ఒత్తిడి తేవడానికి ప్రజలు గట్టిగా ప్రయత్నించారు. పార్టీ మారిన సందర్భాలలో అటువంటి నిరసనలను అరుదుగా చూస్తుంటాము. ఒక లెజిస్లేటర్‌ను ఎన్నుకోవడం అంటే, సర్వ హక్కులతో ప్రజాభిప్రాయాన్ని కట్టబెట్టినట్టేనా? ఆ ప్రతినిధి, ఆ సమ్మతిని బదలాయింపు చేయవచ్చునా? బస్సు టిక్కెట్టు, రైలు టిక్కెట్టు, సినిమా టిక్కెట్టు వంటివే 'నాన్ ట్రాన్స్‌ఫరబుల్' అయితే, ఓటు ద్వారా సంక్రమించిన ప్రాతినిధ్యం బదలాయించదగ్గదా? తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ అనుకూల వాతావరణాన్ని అధిగమించి ప్రజల ఆమోదాన్ని పొందినవారు. అంటే ఓటర్లు, కాంగ్రెస్‌ను కాదని, బీఆర్‌ఎస్‌ను ఎంచుకున్నారు. మరి, ఇప్పుడు ఆ శాసనసభ్యులు, తమ ప్రజల ఆకాంక్షకు భిన్నంగా ఎట్లా వెళుతున్నారు? ఈ ప్రశ్న వీరికి మాత్రమే పరిమితం కాదు, వైఎస్ హయాంలో అవలీలగా అటువైపు వెళ్లిన టీఆర్‌ఎస్ శాసనసభ్యులకు, కేసీఆర్ ఒకటో హయాంలో, రెండో హయాంలో వెళ్లిన టీడీపీ, కాంగ్రెస్ శాసనసభ్యులకు కూడా వర్తిస్తుంది.

రాజీనామా చేసి రావచ్చుననే సూత్రం, అరవయ్యేళ్ల కిందట అద్భుతమైన ప్రతిపాదన అయిఉండవచ్చును కానీ, ఎన్నికలు, అధికారం లక్షలకోట్ల పరిశ్రమలుగా మారిన సందర్భంలో అదేమంత నైతికతను సూచించదు. ఆ ఒక్క నియమాన్ని చాటుతూ, బీజేపీ తాను గొప్పనీతిగా ఉన్నట్టు చెప్పుకుంటోంది. కర్ణాటకలో 2019 సంక్షోభంలో బీజేపీ అటువంటి ప్రయోగం చేసింది. ప్రజలను ఆకట్టుకునే ఉద్వేగ రాజకీయాలు నిర్వహిస్తూ, తగినంత ఆర్థిక బలం కలిగిన పార్టీ, కొందరు ఫిరాయింపుదార్లను గెలిపించుకోగలగడం పెద్ద విశేషం కాదు, అది గొప్ప నైతికమైపోదు. అలాగే, రాజీనామాలు లేని ఫిరాయింపులకు కూడా ఆ పార్టీలో కొంత చరిత్ర లేకపోలేదు.

గోడదాటే ఎమ్మెల్యేలను కాపాడుకోవడం చేతకాక, చేర్చుకునే పార్టీ మీద విమర్శలు ఎక్కుపెడితే ఉపయోగం లేదు. బీఆర్‌ఎస్ నాయకులను చూస్తే జాలి వేస్తుంది. మొదటి పదవీకాలంలో సరే, రెండో విజయం తరువాత, 88 మంది శాసనసభ్యుల బలం ఉన్న తరువాత, ఎందుకు ఫిరాయింపులను ప్రోత్సహించినట్టు? 2014 ఎన్నికల్లో మాత్రం, గెలుచుకున్న 63 మంది బలగం చాలు కదా? తెలంగాణ తొలి ప్రభుత్వాన్ని రక్షించుకోవడం, పడిపోకుండా కాపాడుకోవడం వంటి ఉదాత్త ఆశయాలతో అప్పుడు బలాన్ని అరువు తెచ్చుకున్నారు. మరి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం సంఖ్య కూడా దాదాపు అదే కదా? వారికి మాత్రం తమ ఘనమైన ప్రభుత్వాన్ని కాపాడుకునే కర్తవ్యం ఉండదా? ఒకరిద్దరయితే తప్పట, గుంపు విలీనం ఒప్పట. ఫిరాయింపుల చుట్టూ ఇన్ని సమర్థనలను నిర్మించుకోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఈ సంవాదం మధ్యలో ప్రజాస్వామ్య విలువలు, కట్టుబాటు అన్న మాటలు పీలగానూ, బేలగాను ధ్వనించే పరిస్థితి ఏర్పడింది. అవినీతికర ప్రక్రియ కొనసాగుతుంటే, ఇదేదో ప్రపంచకప్పు క్రీడ అయినట్టు, మీడియా అంతా గోడకు ఇవతల, అవతల కెమెరాలు బిగించుకుని కాచుక్కూచోవడం, ఫిరాయింపు వీరుడు ఏ క్షణం వస్తాడో అన్నట్టు, అర్ధరాత్రుళ్లు ముఖ్యనాయకుల ఇళ్ల ముందు పడిగాపులు పడవలసిరావడం ఆశ్చర్యం కలిగిస్తుంది. మూడింట రెండు వంతుల లెక్క ఎంతకాలంలో పూర్తవుతుందో విశ్లేషణలు చేయడం మరో పవిత్రబాధ్యత!

ఒక లెజిస్లేటర్‌ను ఎన్నుకోవడం అంటే,
సర్వ హక్కులతో ప్రజాభిప్రాయాన్ని
కట్టబెట్టినట్టేనా? ఆ ప్రతినిధి, ఆ సమ్మతిని
బదలాయింపు చేయవచ్చునా?
బస్సు టిక్కెట్టు, రైలు టిక్కెట్టు, సినిమా
టిక్కెట్టు వంటివే 'నాన్ ట్రాన్స్‌ఫరబుల్'
అయితే, ఓటు ద్వారా సంక్రమించిన
ప్రాతినిధ్యం బదలాయించదగ్గదా?

జాతీయోద్యమం నాటి కాంగ్రెస్‌కు స్వాతంత్ర్య సాధన తప్ప మరో సిద్ధాంతం లేదు. ఆ నాటి కాంగ్రెస్ శ్రేణులలో సిద్ధాంత రాద్ధాంతాలది ద్వితీయస్థానమే. ఉద్యమ 'త్యాగాలకు' వెంటనే ప్రతిఫలాలు పొందాలనే ఆత్రుతే ఎక్కువ. అందుకే, మొదటి తరం రాజకీయసంస్థల ఫిరాయింపులలో పెద్దగా సైద్ధాంతిక ఫిరాయింపులు లేవు. తరువాత తరువాత కాలంలో కాంగ్రెస్‌లోని శ్రేణుల మధ్య విధాన సమీకరణలు సమకూరుతూ, స్పష్టపడుతూ వచ్చాయి. ప్రయోజనాల రీత్యా, ఆ శిబిరాలు కొనసాగినప్పటికీ, అటూ ఇటూ దూకడానికి వ్యక్తులుగా పట్టింపులు లేనివారే ఎక్కువ. తెలంగాణ రాజకీయ ఉద్యమం కూడా సిద్ధాంతాలను నిరాకరించి, భౌగోళికరాష్ట్ర సాధన ఏకైక లక్ష్యంగా ముందుకు వెళ్లింది. రాష్ట్ర అవతరణ తరువాత, పార్టీని నిలిపి ఉంచే సూత్రంగా కేసీఆర్ నాయకత్వాన్నే భావించారు. ఇటువంటి సరళమైన ప్రాతిపదికలకు పెద్ద కట్టుబాట్లు అవసరం లేదు. ఉద్యమకాలంలో కూడా కేసీఆర్ పక్కన నిలిచిన వృత్తి రాజకీయ నేతలలో చాలా మందికి పెద్ద నీతినియామాలేమీ లేవు. తరువాతా లేవు. ఆ లక్షణం వల్లనే, ఇతర పార్టీలలోని అనైతికులకు రహదారి ఏర్పడింది. అదే దారి ఇప్పుడు కాంగ్రెస్ దిశగా నడుస్తోంది. వ్యక్తులు ప్రైవేటు జీవితాల్లో గీత దాటితేనో, చట్రాలలోపల ఒదగకపోతేనో, తప్పో ఒప్పో స్వేచ్ఛను సాధనచేస్తేనో విరుచుకుపడి, వేధించి, సకలమాధ్యమాల్లో ఆత్మగౌరవాలను లించింగ్ చేసే మన సమాజం, ప్రజలు తమకు ఇచ్చిన సమ్మతిపై ఈ గోడదాటు నేతలు వ్యాపారమూ అత్యాచారమూ చేస్తుంటే ఎందుకు సహిస్తున్నది?

ప్రత్యేక హోదా... చేదు నిజాలు!

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బీజేపీతో కూడిన కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చాలా మంది ప్రత్యేక హోదా ప్రతిపాదన తెర మీదకు తెస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ నుంచి సాధించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందులో వైసీపీ పార్లమెంటరీ పక్ష నేత వైవి సుబ్బారెడ్డి కూడా ఉండటం విశేషం. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం టీడీపీపై ఆధారపడే పరిస్థితులు ఉన్నందున ప్రధానమంత్రి మోదీని ఒప్పించి ముఖ్యమంత్రి రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధిస్తారనే విశ్వాసంతో డిమాండ్ చేస్తున్నారు. వాస్తవం చెప్పాలంటే ఎవరు ఎంత గింజుకున్నా, ముఖ్యమంత్రి తీవ్ర యత్నం చేసినా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా వచ్చే అవకాశం లేదు. ఆంధ్రప్రదేశ్‌కే కాదు. దేశంలో ఏ రాష్ట్రానికి ప్రధానమంత్రి ప్రత్యేక హోదా ఇవ్వలేరు. కాకుంటే ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వగలరు. ఇది జీర్ణించుకోలేని చేదు నిజం. 1969లో 5వ ఆర్థిక సంఘం ప్రత్యేక హోదాకు రూపకల్పన చేస్తే, మోదీ పాలనలో 14వ ఆర్థిక సంఘం దాన్ని భూస్థాపితం చేసింది. ఇదేమీ రహస్యం కాదు.



ఎవరు ఎంత గింజుకున్నా,
ముఖ్యమంత్రి తీవ్ర యత్నం
చేసినా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక
హోదా వచ్చే అవకాశం లేదు.
ఆంధ్రప్రదేశ్‌కే కాదు, దేశంలో ఏ
రాష్ట్రానికి ప్రధానమంత్రి ప్రత్యేక
హోదా ఇవ్వలేరు. కాకుంటే
ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వగలరు.

ప్రత్యేక హోదా పూర్వాపరాల్లోనికి వెళ్లితే... 1969లో 5వ ఆర్థిక సంఘం ప్రత్యేక హోదాకు రూపకల్పన చేసింది. ఏ రాష్ట్రానికైనా ప్రత్యేక హోదా లభించాలంటే కొన్ని ప్రామాణికాలను రూపొందించింది. 1) కొండ ప్రాంతాలు, సంక్లిష్టమైన భౌగోళిక పరిస్థితులు ఉండాలి. 2) తక్కువ జన సాంద్రత ఉండి, గిరిజన జనాభా ఎక్కువ వుండే ప్రాంతాలు ఉండాలి. 3) ఇరుగు పొరుగు దేశాల సరిహద్దులు కలిగి, వ్యూహాత్మకమైన రాష్ట్రమై ఉండాలి. 4) ఆర్థిక మౌలిక వసతుల్లో వెనుకబాటుతనం ఉండాలి. 5) రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మనుగడ సాగించలేని విధంగా ఉండాలి.. ఇవీ గైడ్‌లైన్స్, ఈ ప్రతిపాదనల ఆధారంగా ప్లానింగ్ కమిషన్ పరిశీలన చేసి జాతీయాభివృద్ధి మండలి ఆమోదంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పిస్తే కేంద్ర మంత్రివర్గం ఆమోదం పొందగానే ప్రత్యేక హోదా అమలులోకి వచ్చేది. తొలుత అస్సాం, నాగాలాండ్, జమ్మూకాశ్మీర్ రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇచ్చారు. తదుపరి మరో ఎనిమిది రాష్ట్రాలకు కూడా ఇచ్చారు. అయితే ఏ రాష్ట్రానికీ చట్టం ద్వారా ప్రత్యేక హోదా ఇవ్వలేదు. కాని దుర్మార్గమేమంటే ఆంధ్రప్రదేశ్ వచ్చేసరికి రాష్ట్ర విభజన చట్టంలో లేదని తోక కోశారు. పైగా ఇతర రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్నాయనే వాదన తెచ్చారు.

2014 ఫిబ్రవరి 20న రాజ్యసభలో విభజన చట్టం చర్చల సందర్భంగా ప్రత్యేక హోదా హామీ లభించింది. 5వ ఆర్థిక సంఘం ప్రకటించిన ఐదు ప్రామాణికాల్లో నాల్గవ అంశం– ఆర్థిక మౌలిక వసతుల్లో వెనుకబాటుతనం. ఐదవ అంశం– రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మనుగడ సాగించలేని విధంగా (నాన్ వయబుల్ నేచర్) గీటురాయిగా తీసుకొని అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అవశేష ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ప్రతిపాదించారు. తామూ తక్కువ లేమని బీజేపీ సభ్యులు స్వర్గీయ అరుణ్ జైట్లీ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు బల్ల గుద్ది ఐదేళ్లు కాదు పదేళ్ల పాటు ఇవ్వాలని వాదించారు.

అంతేకాదు, ప్రధానమంత్రి అభ్యర్థిగా నరేంద్ర మోదీ పవిత్ర పుణ్యక్షేత్రం తిరుపతి బహిరంగ సభలో అవశేష ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా హామీ ఇచ్చారు. అయితే ఇవన్నీ గాలికి పోయాయి. ఎన్నికలు ముగిసి కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత 'ప్రత్యేక హోదా బంతి' నరేంద్ర మోదీ కోర్టుకు చేరింది. రాజ్యసభలో హామీ ఇచ్చిన అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదించి, ఆనవాయితీ మేరకు ప్లానింగ్ కమిషన్‌కు పంపారు. అయితే ప్రధానమంత్రి మోదీ 2014 డిసెంబర్ వరకు సాకులు చెబుతూ హోదా విషయాన్ని నానబెట్టి అంతిమంగా ప్లానింగ్ కమిషన్‌ను రద్దు చేసి, నీతి ఆయోగ్ ఏర్పాటు చేశారు. అప్పటికి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చే అంశం 'ఐసీయూ'కు చేరింది. అంతిమంగా 2015–16 కేంద్ర బడ్జెట్ సమయంలో సమర్పించబడిన 14వ ఆర్థిక సంఘం సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం యథాతథంగా ఆమోదించడంతో ప్రత్యేక హోదాకు మంగళం పాడినట్టయింది.

రాష్ట్రాలకు కేంద్రం సాధారణ మద్దతు, అదనపు మద్దతు, ప్రత్యేక మద్దతు పేరుతో సాయం చేస్తుండేది. సాధారణ కేంద్ర మద్దతు రూపంలో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం నిధులు ఇస్తుంది. ప్రత్యేక హోదా గల రాష్ట్రాలకు మొత్తంలో 30 శాతం కేటాయిస్తుంది. ఈ 30 శాతంలోనూ ప్రత్యేక హోదా గల రాష్ట్రాలకు 90 శాతం ఉచితంగానూ, పది శాతం రుణ రూపంలో ఉంటుంది. మిగిలిన రాష్ట్రాలన్నిటికీ కలిపి 70శాతం కేంద్ర నిధులు అందిస్తుంది. అందులో 30శాతం ఉచిత సాయం, 70శాతం రుణ రూపంలో ఈ మద్దతు ఉంటుంది. ప్రత్యేక హోదా గల రాష్ట్రాలకు ఉన్న ఇబ్బందుల రీత్యా ప్రత్యేక నిధి ఇస్తారు. కేంద్రం ఇచ్చే ఆర్థిక మద్దతుకు తోడు ప్రత్యేక హోదా గల రాష్ట్రాలకు ఎక్సైజ్, కస్టమ్స్ సుంకాలు, ఆదాయపు పన్ను నూరు శాతం మినహాయింపు ఉంటుంది. ఇది గతం. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత 14వ ఆర్థిక సంఘం సిఫార్సులతో ఈ రాయితీలన్నీ హుష్‌కాకి అయ్యాయి.

14వ ఆర్థిక సంఘం సాధారణ రాష్ట్రాలకు, ప్రత్యేక హోదా అనుభవిస్తున్న రాష్ట్రాలకు మధ్య తేడా లేకుండా చేసింది. అన్నింటినీ ఒకే గాటన కట్టివేసింది. అంత వరకైతే పర్వాలేదు. కేంద్ర ప్రభుత్వం అప్పటివరకు అమలు చేస్తున్న 1) సాధారణ కేంద్ర మద్దతు 2) ఇతర అదనపు కేంద్ర మద్దతు 3) ప్రత్యేక కేంద్ర మద్దతు 4) ప్రత్యేక ప్రణాళిక మద్దతులను రద్దు చేసింది. ఫలితంగా ఏ రాష్ట్రానికైనా ప్రత్యేక హోదా ఇవ్వాలంటే పన్ను రాయితీలకు నిధుల ఇచ్చే అవకాశం మూసుకుపోయింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పథకం ప్రకారం ప్రత్యేక హోదాకు మంగళం పాడింది. ప్రత్యేక హోదా పొందిన రాష్ట్రాలకు రెండు రకాల సదుపాయం ఉండేవి. ఒకటి– విదేశీ కేంద్ర ప్రభుత్వ రుణాలు. ఇప్పుడు ఆ సదుపాయం లేదని ఎగనామం పెట్టారు. రెండు– పన్నుల రాయితీలు. ఎప్పుడైతే నాలుగు రకాల పద్దులు రద్దు చేశారో నిధుల సదుపాయం లేకుండా పోయింది. అందువల్లనే అప్పటి వరకు ప్రత్యేక హోదా అనుభవిస్తున్న రాష్ట్రాలకు 2017లోనే పదేళ్ల కాలానికి అంటే 2027 వరకు పన్ను రాయితీలకు 27,144 కోట్ల రూపాయల కేంద్ర మంత్రివర్గం ఆమోదంతో ప్రకటించారు. క్షేత్రస్థాయి పరిస్థితి ఇలావుంటే... వాస్తవాలు గమనంలోకి తీసుకోకుండా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఎలా లభిస్తుంది? ప్రత్యేక హోదా లభించినా ఫలితమేమిటి? అయితే ప్రత్యేక హోదా కాకపోయినా ప్రత్యేక ప్యాకేజీ కేంద్రం నుంచి పొందేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేయవలసి ఉంది.

• వి. శంకరయ్య
విశ్రాంత పాత్రికేయులు

అమరావతి అభ్యుదయం ఆరంభం!

రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిన జగన్ విధ్వంస పాలనలో ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిన తరుణంలో... కష్టాల సుడిగుండంలో చిక్కుకున్న తమను ఒడ్డుకు చేర్చే బాధ్యతను సమర్థనాయకుడు చంద్రబాబు నాయుడికి అప్పగించారు ఆంధ్రులు. జగన్‌రెడ్డి పడగొట్టిన ప్రాంతం నుండే భావి పౌరుల బంగారు భవిష్యత్తుకు బాటలు వెయ్యాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. ఉపాధి కల్పన, సంపద సృష్టి, పేదరిక నిర్మూలన రాజధాని అమరావతి వల్లే సాధ్యమవుతుంది. రాజధాని పునర్నిర్మాణంపై కేంద్ర సహాయంతో ప్రతి తెలుగుబిడ్డ గర్వించే ప్రపంచస్థాయి నగరంగా గత మాస్టర్ ప్లాన్ ప్రకారం నిర్మాణాలు కొనసాగించేందుకు చంద్రబాబు సర్వశక్తులూ ఒడ్డుతున్నారు.

ప్రణాళిక ప్రకారం రాజధాని నిర్మించుకొనే అవకాశం అందరికీ రాదు. అటువంటి అవకాశం మనకు వచ్చింది. అంతర్జాతీయ స్థాయిలో అత్యంత ఆధునికంగా నిర్మించిన నగరాల సరసన నిలిచే విధంగా అమరావతిని నిర్మించబోతున్నారు. వివిధ అంశాలకు సంబంధించి నవ నగరాల నిర్మాణం పూర్తి అయితే మహాద్భుత నగరంగా రూపుదిద్దుకోనున్నది అమరావతి. రాజధాని అంటే కేవలం పరిపాలనకే పరిమితం కాకుండా ఆర్థిక, సామాజిక, విద్య, వైద్యం, పరిశోధన, పర్యాటకం, ఆతిథ్యం, కళలు, సాంస్కృతిక, వాణిజ్య, సాంకేతిక కార్యకలాపాలకు ముఖ్య కేంద్రంగా నిలవాలన్నది చంద్రబాబు ఆకాంక్ష.


అమరావతిలో ఆగిన రహదారులు, భవనాల నిర్మాణపనులు పరిశీలించిన చంద్రబాబు, పనుల వేగవంతానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. దాంతో మాస్టర్ ప్లాన్‌కి అనుగుణంగా అమరావతిలో ప్రభుత్వ కాంప్లెక్స్ భవనాలకు 1575 ఎకరాల ప్రాంతాన్ని సీఆర్‌డీఏ నోటిఫై చేసింది. జోనింగ్ నిబంధనల ప్రకారం ఈ భూమిని నోటిఫై చేస్తున్నట్లు సీఆర్‌డీఏ చట్టం సెక్షన్ 39 ప్రకారం ఈ బహిరంగ ప్రకటన జారీ చేసారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కేంద్ర సంస్థలు అమరావతికి క్యూ కడుతున్నాయి. రాజధానిలో స్థలాలు కేటాయిస్తే కార్యాలయాల ఏర్పాటుకు దాదాపు 45 సంస్థలు సంసిద్ధత వ్యక్తం చేశాయి. ఇప్పటికే సీఆర్‌డీఏ అధికారులను ఆయా సంస్థల ప్రతినిధులు కలిసి చర్చించినట్లు సమాచారం. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే రాజధాని అమరావతిలో మొత్తం 132 సంస్థలకు భూ కేటాయింపులు జరిగాయి. తెలుగు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అమరావతి నిర్మాణానికి కృషి జరుగుతోంది.

– నీరుకొండ ప్రసాద్

కేంద్రం సహకారంతోనే రాష్ట్ర భవిష్యత్తు బంగారం!

కకావికలైన పరిపాలనను సరిదిద్దటంతో పాటు గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను గూడా చంద్రబాబు నాయుడు సమర్థవంతంగా దారిలోకి తేగలరన్న ప్రజల ప్రగాఢ విశ్వాసం ముఖ్యమంత్రికి పెనుసవాళ్ళు విసురుతున్నది! ఎంత సమర్థుడైన నాయకుడైనా, ఎంత అనుభవం ఉన్న ముఖ్యమంత్రి అయినా ప్రస్తుత పరిస్థితులలో ఏ విధంగా నెగ్గుకొని రాగలరు అన్నది వారి హితైషులతో పాటు విమర్శకులు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

రాజధానిగా అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయటం, అప్పులను కొంత మేర తీర్చి ఆర్థిక పరిపుష్టిని చేకూర్చటం, పెట్టుబడులను ప్రోత్సహించటంతో పాటు, బహుళ సంఖ్యలో పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్ దారి పట్టేట్లు ప్రయత్నించటం, నిరుద్యోగ సమస్యను ఒక కొలిక్కి తేవటం, విద్య ఆరోగ్యాల సమస్యల పరిష్కారం, తెలంగాణా రాష్ట్రంతో చర్చించి ఇరు రాష్ట్రాల మధ్య ఉన్న అపరిష్కృత సమస్యలను సాధ్యమైనంత మేర పరిష్కరించటం... ఇలా ఎన్నో చిక్కుముడులతో కూడిన సమస్యలను ఓపికగా ధైర్యంగా ఎదుర్కోవటమే కాకుండా, అధికార యంత్రాంగంతో పాటు కూటమి నాయకులు, ప్రజలు కలిసికట్టుగా పరిష్కార దిశగా నడిచే విధంగా అనుభవజ్ఞుడైన నాయకుడిగా చంద్రబాబు కఠోర శ్రమ పడక తప్పదు. శ్రమ ఆయనకు కొత్త కాదు. బరువులు మోయటం అలవాటే.



కానీ ప్రజల సంతోషం పూర్తి ఫలితాలు వచ్చేంత వరకూ వుండదు. క్షణకాలంలో ఆవిరయిపోతుంది. సత్వర ఫలితాలు, ఇన్‌స్టంట్ కాఫీలా అందుబాటులో వుంటేనే పాలన బాగుందను కొనేవారు చాలామంది ఉంటారు. అందుకనే, క్రమం తప్పకుండా ప్రోగ్రెస్ కార్డు లాంటిది కొన్ని ముఖ్య అంశాలలో ప్రజలకు ప్రభుత్వం అందజేస్తే నిజాలు గ్రహిస్తారు! పారదర్శకతను మెచ్చుకుంటారు. శ్వేత పత్రాల ద్వారా కూటమి ప్రభుత్వం అదేపని చేస్తున్నది. ఏపీలో కూటమి ప్రభుత్వం తమ కూటమిలోని పార్టీల మధ్య ఉన్న అనుబంధాలను ప్రజలకు అనేక తీరుల్లో స్పష్టపరిచింది. చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీ నాయకుల సాన్నిహిత్యాన్ని ప్రజలు గ్రహించగలిగారు. శాఖల విభజన గూడా చంద్రబాబు మూడు పార్టీల మధ్య సమతూకంతో చేయటం ప్రభుత్వ ఇమేజీని పెంచింది. అమరావతిలో పనులు వేగవంతం చేయటం, పోలవరం పనుల సమీక్ష, అన్నిటికంటే ముఖ్యం హామీలలో ఒకటైన పెన్షన్లను జూలై ఒకటో తారీకునే చెల్లించటం, ఉద్యోగస్తుల పెన్షనర్ల జీతాల బట్వాడా అదే రోజున జరగటం లాంటి ప్రభుత్వ చర్యలు ఈ ప్రభుత్వమంటే గౌరవంతో పాటు నమ్మకాన్ని పెంచాయి. పోలవరం పనులలో గత ప్రభుత్వపు అవకతవకలు, ప్రస్తుత పరిస్థితులలో ఏ రకమైన చర్యలు చేపట్టాలనే విషయంలో ప్రజలతో మీడియా ద్వారా వాస్తవాలు పంచుకోవటం హర్షించదగ్గ పరిణామం.

కేంద్రం సహకారం బాహాటంగా కనపడే విధంగా ఉండాల్సిన అవసరం ప్రస్తుత కూటమికి ఆంధ్రప్రదేశ్‌లో తప్పదు. బీజేపీ కూడా కూటమిలో ఒక పార్టీగా, 2014–19 మాదిరి అంటీముట్టనట్లుగా ఉండటానికి వీలులేదు. తెలుగుదేశం పార్టీ మీద కేంద్ర ప్రభుత్వం ఆధారపడి ఉన్నమాట వాస్తవం! అయితే దాన్ని అందరిలా బెదిరింపుల ద్వారా వాడుకొనే నాయకుడు చంద్రబాబు కాదు! 2024 వరకు ఉన్న వైసీపీ ప్రభుత్వం బీజేపీ (ఎన్డీఏ)లో చేరకపోయినా అవసరార్థం దాదాపు ఎన్డీఏలో భాగస్వామిగానే వ్యవహరించిన మాటను ఎవ్వరూ కాదనలేరు. ఆ సంబంధ బాంధవ్యాలు ఉభయ తారకంగా ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం – తమకు లోక్‌సభ సభ్యులు ఎక్కువ సంఖ్యలో వున్నా, ఎన్డీఏకు మెజార్టీ ఉండటం చేత, కేంద్రం మెడలు వంచలేని నిస్సహాయ స్థితిని నాటకీయంగా ఒప్పుకొని, అడగాల్సిన స్పెషల్ స్టేటస్ లాంటి అవసరాలను దాటేసి పబ్బం గడుపుకుంది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ మనుగడకు చంద్రబాబు సహకారం అవసరం కాబట్టి, వైసీపీ నాయకులు కేంద్రం మెడలు వంచి అన్ని రకాల హామీల పరిష్కారాన్ని సాధించక తప్పదనే ఒత్తిడిని రాజకీయంగా చంద్రబాబుపై తెస్తారు. ఆ డిమాండ్ ఊపందుకోక ముందే చంద్రబాబు కావల్సిన అన్ని అవసరాలను కేంద్రం నుంచి అనునయ ధోరణిలో తెచ్చుకొనే ప్రయత్నం చేయక తప్పదు.

కేంద్ర ప్రభుత్వంతో స్పష్టమైన అవగాహనను పొందాల్సిన విషయాలు: 1) అమరావతి అభివృద్ధికి కేంద్రం ఏ విధంగా సహాయపడుతుంది? 2) పోలవరం ప్రాజెక్ట్ విషయంలో ముందుకు వెళ్ళటానికి అన్నిరకాల తోడ్పాటును ఏవిధంగా ఇవ్వగలదు? 3) ఆర్థిక పతనావస్థ నుంచి రాష్ట్రాన్ని కేంద్రం ఏ విధంగా ఆదుకోగలదు? – ఈ మూడు ముఖ్యమైన విషయాలలో కేంద్రం సంపూర్ణ సహకారం అందించగలిగితేనే చంద్రబాబు ప్రజల అభీష్టాలకు అనుగుణంగా సుపరిపాలనను అందించగలరు.

ఏపీలోని కూటమి ప్రభుత్వం అవినీతి మరక అంటకుండా పాలన సాగించక తప్పదు. దొందూ దొందే అన్న భావన ఏనాటికీ ప్రజలకు కలిగించగూడదు. అధికార యంత్రాంగాన్ని ప్రక్షాళనం చేయటంతో పాటు ప్రజలకు దగ్గరయ్యే మార్గాలను సుగమం చేసుకోవాలి. సంక్షేమ కార్యక్రమాలు సూపర్ సిక్స్ ద్వారా ప్రకటించారు. ఈ కార్యక్రమాలను చెప్పిన రీతిలో చేయటానికి ఆర్థిక సౌలభ్యం కావాలి. సంపద సృష్టి ద్వారా అభివృద్ధిని చంద్రబాబు సాధించగలరు. కానీ కేవలం సంక్షేమంలోనే తలమునకలైతే చరిత్ర పునరావృతం అయ్యే ప్రమాదం వుంది!

1995 నాటి చంద్రబాబు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌కు ఎంతగానో అవసరం. తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు స్నేహబంధాన్ని నికార్సయిన రీతిలో కొనసాగిస్తే, అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లోని అభివృద్ధి ఫలాలు రెండు తెలుగు రాష్ట్రాలూ అందుకోగలవు. అయితే అనేక అడ్డుగోడలను అధిగమించాలి. ప్రజలతో మమేకమై చేసే ప్రతి పనీ వారికోసమే అన్న వాస్తవాన్ని ఆవిష్కరించగలిగితే, కేంద్రం అరమరికలు లేకుండా సహకరిస్తే ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు బంగారం కాక తప్పదు.

■ రావులపాటి సీతారాంరావు

చిగురించిన ఆశలు

పురుడు పోసుకున్న తల్లి బిడ్డను
పొత్తిళ్లలో మురిపెంగా చూచుకున్నట్లు
గూడు దాగిన కోడి ఆనందంతో భయాన్నొదిలి
రెక్కల కింద దాచిన పిల్లల్ని
స్వేచ్ఛగా బయటకు తెచ్చినట్లు
ఆమని ఆనందంతో గంతులు వేస్తూ
హరివిల్లులా పూలు పూచినట్లు
అమరావతి రాజధాని ఊపిరి పీల్చుకున్నట్లు
అమావాస్య చీకట్లు తొలగి
'చంద్ర'కాంతులు వెదజల్లినట్లు
సమస్యల తోరణాలు
'తెలుగుదేశం' రాకతో తెగిపోయినట్లు
పరిష్కార మార్గాలు చంద్రబాబు రాకతో
స్వాగతం పలికినట్లు
దసరా, దీపావళి, సంక్రాంతి,
క్రిస్మస్, రంజాన్ పండుగలు
అన్నీ కూడగట్టుకుని ఒకేసారి వచ్చినట్లు
ప్రగతి పరుగు అందుకున్నట్లు
గుండె నిండా ధైర్యం ఆవహించినట్లు
ఒంటి నిండా కొత్త సత్తువ వచ్చి చేరినట్లు
పెరిగిన పింఛను అందుకున్న ప్రతి హృదయం
'కలకాలం చల్లగా ఉండమ'ని దీవించినట్లు
కనబడుతోంది ప్రతి చోటా
వినబడుతోంది ప్రతి నోటా

– నన్నపనేని రాజకుమారి
మాజీ మంత్రి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com



బందరులో..



భక్తితో..



ఆషాఢ సారె సమర్పించేందుకు వచ్చే వారితో ఇంద్రకీలాద్రి కిటకిటలాడుతోంది. దుర్గమ్మకు పసుపు కుంకుమ, పూలు, చీర, పండ్లతో పాటు వినూత్న ఆకారంలో తయారుచేసి తీసుకొస్తున్న మిఠాయిలు నోరూరించడంతో పాటు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

పొంచి ఉన్న ముప్పు

కేసరపల్లి పంచాయతీ వీఎన్‌పురం కాలనీ కుళాయిలో డ్రెయినేజీ నీరు

- డ్రెయినేజీ గుంటల్లో మంచినీటి పైపులు
- పైపు పగిలిపోవటంతో కలుషితం
- దుర్వాసన, నురుగుతో నీరు సరఫరా
- స్థానికుల భయాందోళన.. పట్టించుకోని అధికారులు

6లో..

తహసీల్దార్ల తహతహ..!

బదిలీల కోసం ఎక్కడిపనులు అక్కడే..

- ధ్రువీకరణ పత్రాలు, భూ సంబంధ సమస్యలపై నిర్లక్ష్యం

6లో..



త్యాగానికి ప్రతీకగా..

మొహర్రం సందర్భంగా వన్‌టౌన్‌లోని పంజా సెంటర్‌లో బుధవారం ముస్లింలు అగ్ని గుండం తొక్కారు. పీర్లను తలపై ధరించి మొహర్రం సంతాప దినాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొనడంతో బుధవారం వేకువజామున పంజా సెంటర్ కిటకిటలాడింది.



బీఆర్పీ రోడ్డులోని గాంధీజీ స్కూల్ ఎదురుగా ఉన్న కార్ల పార్కింగ్

మేయరు పేరు చెప్పి మేసేశారు..!

విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పార్కింగ్ స్థలాలపై నిన్నటి వరకు కాసులు పిండుకున్న వైసీపీ నాయకులు రాష్ట్రంలో అధికారం పోవడంతో తమ ఆటలు చెల్లవని నెమ్మదిగా జారుకుంటున్నారు. సందట్లో సడేమియాలా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఖజానాకు పెద్ద ఎత్తున గండికొడుతున్నారు. ఇందులో మేయర్ బినామీల పాత్ర ఎక్కువగా కనిపిస్తోంది.

వీఎంసీ పార్కింగ్ కాంట్రాక్టుల్లో మేయర్ బినామీల మాయ

- అధికారం పోగానే, కాంట్రాక్టులు వదిలేసి జంప్
- వీఎంసీ ఖజానాకు రూ.50 లక్షల వరకూ గండి
- కాళేశ్వరరావు మార్కెట్ సెల్లార్ రూ.30లక్షలు
- బీఆర్పీ రోడ్డు పార్కింగ్‌లో రూ.20 లక్షలు ఎగవేత

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధికారంలోకి రాగానే భవానీపురానికి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు కేఆర్ మార్కెట్ సెల్లార్ పార్కింగ్‌ను లీజుకు తీసుకుని సుమారు రూ.అరకోటి మేర వీఎంసీకి సున్నం వేశారు. ఆ తర్వాత మేయర్ బినామీలు కాళేశ్వరరావు మార్కెట్ సెల్లార్ పార్కింగ్, బీఆర్పీ రోడ్డులో పార్కింగ్‌లను దక్కించుకున్నారు. నిబంధనల ప్రకారం వీఎంసీకి చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లించకుండా రెండు నెలలు కాలక్షేపం చేశారు. 'ఆంధ్రజ్యోతి' ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకురావడంతో కాంట్రాక్టు పాడుకున్న రెండు నెలలకు అధికారికంగా తీసుకున్నట్లు రికార్డుల్లో చూపారు. అప్పట్లోనే సుమారు రూ.అరకోటి మేర వీఎంసీ ఖజానాకు చిల్లు పెట్టిన వీరు తాజాగా మరో రూ.అరకోటి వరకు ఎగ్గొట్టి జారుకున్నారు.

రూ.50 లక్షలు గండి

● వన్‌టౌన్‌లోని కాళేశ్వరరావు మార్కెట్ సెల్లార్ పార్కింగ్, బీఆర్పీ రోడ్డులో పార్కింగ్.. ఈ రెంటినీ మేయర్ బినామీలే దక్కించుకున్నారు. వీరిలో ఒకరు వైసీపీ కార్పొరేటర్‌కు స్వయానా సోదరుడు. 2023, జూన్ 30న వేలంపాట నిర్వహిస్తున్నట్లు తొలుత ప్రకటించిన వీఎంసీ అధికారులు ఎట్టకేలకు జూలై 15న నిర్వహించారు. వేలంపాటలో ఆరుగురు కాంట్రాక్టర్లు పాల్గొనగా, కాళేశ్వరరావు మార్కెట్ సెల్లార్‌ను చిట్టినగర్‌కు చెందిన షేక్ బాజీ మీరావలి పాడుకున్నారు. ఈయన మేయర్ దగ్గర పనిచేసే వ్యక్తి. ఏడాదికి రూ.55.80 లక్షలకు పాడుకున్న బాజీ ఈఎండీగా రూ.9.81 లక్షలు చెల్లించారు. జూన్, జూలై, ఆగస్టు నెలల్లో ఇక్కడ పార్కింగ్ రుసుమును వీరే అనధికారికంగా వసూలు చేసుకున్నారు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకురావడంతో 2023, సెప్టెంబరు 4న అధికారికంగా అప్పగించినట్లు రికార్డుల్లో రాసుకున్నారు. ఈ ఏడాది సెప్టెంబరు 3 వరకు వీరికి పార్కింగ్ టెండరు ఉంది. పాడుకున్న మొత్తంలో కేవలం రూ.25 లక్షలు మాత్రమే వీరు చెల్లించినట్లు సమాచారం. నెలకు సుమారు రూ.6 లక్షల చొప్పున పది నెలల కాలానికి రూ.60 లక్షల వరకు వసూలు చేసిన కాంట్రాక్టర్ వీఎంసీకి తాను చెల్లించాల్సిన రూ.30 లక్షలు ఎగ్గొట్టి వెళ్లిపోవడం గమనార్హం.



కాంట్రాక్టర్ షేక్ బాజీ మీరావలి



మరుపిళ్ల దేవీప్రసాద్

● బీఆర్పీ రోడ్డు పార్కింగ్‌ను కొత్తపేటకు చెందిన 51వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేశ్ సోదరుడు మరుపిళ్ల దేవీప్రసాద్ రూ.45.60 లక్షలకు పాడుకున్నారు. ఈయన కూడా పాడుకుని 50 రోజులైనా కార్పొరేషన్‌కు రుసుం చెల్లించలేదు. ఈఎండీగా రూ.9 లక్షల వరకు చెల్లించారు. నెలకు రూ.3.80 లక్షలు చెల్లించాల్సి ఉండగా, 5 నెలల బకాయిలు ఎగ్గొట్టి పార్కింగ్ కాంట్రాక్టును వదిలేయడం గమనార్హం. ఈయన ద్వారా సుమారు రూ.20 లక్షల వరకు వీఎంసీ ఖజానాకు గండిపడినట్లు సమాచారం. మొత్తం మీద రూ.50 లక్షల ఆదాయాన్ని వీఎంసీ కోల్పోయినట్లయింది.



కేఆర్ మార్కెట్ వద్ద పార్కింగ్

అధికారంలోకి వచ్చిన నాటి నుంచే దోపిడీ

వీఎంసీలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచే పార్కింగ్ స్థలాల పేరుతో వైసీపీ నాయకులు దోపిడీ మొదలుపెట్టారు. వైసీపీ నేతలకు తప్ప మరొకరికి పార్కింగ్ టెండర్లు దక్కకుండా చూడటం, పాడుకున్న తర్వాత కూడా అనధికారికంగా నెలల తరబడి నిర్వహించడం, ఆ తర్వాత అందినకాడికి పిండుకుని కాంట్రాక్టు వదిలి వెళ్లిపోవడం వంటివి చేసేవారు. ఈ దందా కారణంగా వీఎంసీ ఖజానాకు సుమారు రూ.2 కోట్ల వరకు గండి పడింది. వీఎంసీ నిబంధనల ప్రకారం.. టెండరు పాడుకున్న వెంటనే పాట మొత్తంలో సగం 24 గంటల్లో, మిగిలిన సగం వారం వ్యవధిలో చెల్లించాలన్న నిబంధన ఉంది. ఈ షరతులు అంగీకరిస్తేనే కాంట్రాక్టర్లకు వేలంలో పాల్గొనే అవకాశం ఉంటుంది. కానీ, అధికార పార్టీ నాయకులు ఈ నిబంధనలు పట్టించుకోలేదు. వీఎంసీ అధికారులు ఎక్కడ తమ ఉద్యోగాలకు ఎసరు వస్తుందోనన్న ఆందోళనతో పార్కింగ్ పాడుకున్న కాంట్రాక్టర్లను డబ్బులు చెల్లించాలని వేడుకున్నా ఫలితం లేకుండాపోయింది.



తీవ్రంగా గాయపడిన చందన రంగారావు

గొడ్డలితో వెంటాడి..

టీడీపీ నాయకుడిపై వైసీపీ నేతల హత్యాయత్నం

- రంగారావుపై తండ్రీకొడుకుల దాడి
- ప్రాణాపాయ స్థితిలో బాధితుడు రంగారావు
- చికిత్స కోసం మచిలీపట్నం తరలింపు

అధికారం కోల్పోయినా వైసీపీ శ్రేణుల అరాచకత్వం ఆగలేదు. తెలుగుదేశం పార్టీ నేతలు కనిపిస్తే చాలు వైసీపీ నేతల ఆక్రోశం బయటకొస్తోంది. టీడీపీ సీనియర్ నాయకుడు, మోపిదేవి మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు చందన రంగారావుపై రాజకీయ కక్షతో వైసీపీ శ్రేణులు గొడ్డలితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాయి. ఈ ఘటన మోపిదేవి మండలం బండికోళ్లలంక వద్ద కృష్ణానది కరకట్టపై బుధవారం జరిగింది.

మోపిదేవి/అవనిగడ్డ, జూలై 17 : చల్లపల్లి సీఐ నాగప్రసాద్, ఎస్ఐ వై.సత్యనారాయణ, బాధితుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు... మోపిదేవి మండలం కె.కొత్తపాలేనికి చెందిన చందన రంగారావు అనుచరుడు యోగేష్, అదే గ్రామానికి చెందిన మత్తి రాంప్రసాద్ వైసీపీ నాయకుడు. బుధవారం ఉదయం కె.కొత్తపాలెంలోని చెట్టు సెంటర్‌లో యోగేష్, రాంప్రసాద్ గొడవపడ్డారు. యోగేష్‌ను రంగారావు ఉసిగొల్పాడని రాంప్రసాద్ కొడుకు మత్తి శ్రీనివాసరావు భావించాడు. తండ్రీకొడుకులు రంగారావుపై కక్ష పెంచుకున్నారు. బుధవారం కృష్ణానది కరకట్టపై ద్విచక్ర వాహనంపై రంగారావు తన గ్రామానికి వెళుతున్నారు. అదే సమయంలో రాంప్రసాద్, శ్రీనివాసరావు బండికోళ్లలంక వద్ద కృష్ణానది కరకట్టపై దారికాచి బండికి అడ్డం పడ్డారు. గొడ్డలితో దాడికి పాల్పడ్డారు. తలపై గొడ్డలి వేటు వేశారు. రంగారావు చెయ్యి అడ్డం పెడితే చేతికి గొడ్డలి గాట్లు పడ్డాయి. అంతటితో ఆగకుండా మోకాలిపైగా దాడి చేశారు. తీవ్ర గాయాలతో రంగారావు తప్పించుకునేందుకు కేకలు పెడుతూ పరుగు తీసినా వదలకుండా వెంటపడ్డారు. చుట్టుపక్కల పొలాల్లో ఉండే జనం రావడంతో రాంప్రసాద్, అతని కుమారుడు పరారయ్యారు. తీవ్ర గాయాలై రక్తపు మడుగులో పడి ఉన్న రంగారావును చుట్టుపక్కల వాళ్లు, బంధువులు అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడిని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, మోపిదేవి మండల పార్టీ అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రావి రత్నగిరి, పలువురు పార్టీ శ్రేణులు పరామర్శించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రంగారావుకు ఆసుపత్రి వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం నిమిత్తం మచిలీపట్నం తరలించారు. రంగారావు ఇచ్చిన ఫిర్యాదు నమోదు చేసి కేసు దర్యాప్తు చేసినట్టు సీఐ, ఎస్ఐలు తెలిపారు.



వినగడప కష్టాలు వినపడవా..!

ఖమ్మం-ఎన్టీఆర్ జిల్లాల మధ్య రాకపోకలకు ఇబ్బందులు

- కట్టలేరు పొంగితే రాకపోకలు బంద్
- 2018లో కొట్టుకుపోయిన లోబ్రిడ్జి
- హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి వైసీపీ హామీ
- ముందుకు అడుగు వేయని గత ప్రభుత్వం
- ఇంకా కష్టాల్లోనే రెండు జిల్లాల ప్రజలు

6లో..

అటు ఖమ్మం జిల్లాలో 10 నుంచి 15 గ్రామాలు.. ఇటు ఎన్టీఆర్ జిల్లాలో 15 గ్రామాలు.. ఇటు జనం అటు వెళ్లాలన్నా, అటు జనం ఇటు రావాలన్నా కట్టలేరు కష్టాలను దాటాల్సిందే. ప్రభుత్వాలు మారుతున్నా ఇక్కడి వంతెన నిర్మాణం ప్రతిపాదన కలగానే మిగిలిపోతుండటంతో రెండు జిల్లాలు ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని, ఆయన అనుచరుల అక్రమాలు రోజుకొకటి వెలుగులోకి వస్తున్నాయి. గత ఐదేళ్లలో వారి అరాచకాలకు నలిగిపోయిన బాధితులు ఒక్కొక్కరుగా బయటకొస్తున్నారు. స్థలాల కబ్జాలు ఎన్నో తెరపైకి వస్తున్నాయి.. తాజాగా కొడాలి నాని అనుచరుడు రూ.8 కోట్ల విలువైన అక్షర పాఠశాల స్థలాన్ని ఆక్రమించుకుని, అడ్డొచ్చిన యాజమన్యాన్ని బెదిరించిన వ్యవహారం బయటపడింది. యాజమాన్యం కోర్టును ఆశ్రయించింది.

మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని అనుచరులు ఆక్రమించుకున్న స్థలం



గడ్డం గ్యాంగ్ మరో అరాచకం

పాఠశాల యాజమాన్యాన్ని బెదిరించి స్థలం కబ్జా

- విలువ రూ.8 కోట్లపైనే..
- తక్కువ ధరకు కొట్టేసిన గ్యాంగ్
- కోర్టును ఆశ్రయించిన యాజమాన్యం
- పోలీసు విచారణకు కోర్టు ఉత్తర్వులు
- గుడివాడలో ఒక్కొక్కటిగా బయటపడుతున్న అరాచకాలు

గుడివాడ : గుడివాడ టీచర్స్ కాలనీలోని రూ. 8 కోట్ల విలువైన అక్షర పాఠశాల స్థలంపై గడ్డం గ్యాంగ్ కన్నుపడింది. మాజీ మంత్రి కొడాలి నాని మద్దతుతో గడ్డం గ్యాంగ్ సభ్యుడు కొల్లి విజయ్ పాఠశాల యాజమన్యాన్ని బెదిరించి తృణమో ఫలమో చేతిలో పెట్టి సదరు స్థలాన్ని చేజిక్కించుకున్నాడు. ప్రభుత్వం మారడంతో బాధితుల్లో ధైర్యం వచ్చింది. కోర్టును ఆశ్రయించి విచారణకు ఆదేశాలు తెచ్చుకున్నారు. గడ్డం గ్యాంగ్ బాధితులకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అండగా నిలుస్తున్నారు. మొన్న బైపాస్ రోడ్డులోని 7.66 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చైతన్య హౌసింగ్ కాలనీ స్థలాన్ని నాని గడ్డం గ్యాంగ్ ఆక్రమించుకోగా, కూటమి అధికారంలోకి వచ్చిన 24 గంటల్లో - మిగతా 6లో



వీడని మిస్టరీ

కనిపించని ఎంపీడీవో ఆచూకీ.. | ఏలూరు కాల్వలో గాలింపు

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీవో ఎం.వెంకటరమణారావు అదృశ్యం ఘటనలో మిస్టరీ వీడలేదు. పెనమలూరు మండలం కానూరులోని మహదేవపురంలో ఉంటున్న వెంకటరమణారావు సెల్‌ఫోన్ సిగ్నల్స్ చివరిసారిగా మధురానగర్‌లో చూపించడంతో ఆయన అక్కడే ఉన్న ఏలూరు కాల్వలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఉంటారని బుధవారమంతా గాలింపు చర్యలు చేపట్టారు. ఓ రేవు కాంట్రాక్టుకు సంబంధించి బకాయిలు చెల్లించాలని ఆయనపై ఒత్తిడి పెరగడం, రిటైర్ కాకుండా అడ్డుకోవడం వల్లే ఆయన ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఉంటారని భావిస్తున్నారు.



కోనేరుసెంటర్‌లో మాతంలో ముస్లింలు

భక్తి శ్రద్ధలతో మొహర్రం

- వేలాదిగా ముస్లింల రక్త తర్పణం
- కోనేరుసెంటర్‌కు భారీగా తరలి వచ్చిన ప్రజానీకం

మచిలీపట్నం టౌన్, జూలై 17 : కర్బలా మైదానంలో అసువులు బాసిన అమర వీరులను తలచుకుంటూ కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో వేలాది ముస్లింలు రక్తతర్పణం చేశారు. మొహర్రం సందర్భంగా బుధవారం కోనేరుసెంటర్‌లో ముందుగా గిరోహి హుస్సేని పార్టీ ఆధ్వర్యంలో వందలాదిగా చెస్ట్ బీటింగ్ చేశారు. సంప్రదాయ సిద్ధంగా ముస్లిం మహిళలు పల్లకీ మోసుకొచ్చారు. చింతచెట్టు సెంటర్ నుంచి ర్యాలీగా కోనేరుసెంటర్‌కు చేరుకున్నారు. 'యా హుస్సేన్, యా అబ్బాస్' అంటూ చెస్ట్ బీటింగ్ నిర్వహించారు. కర్బలా మైదానంలో మహమ్మద్ ప్రవక్త బోధనలు రక్షించేందుకు పోరాడిన అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమాన్ని గిరోహి హుస్సేన్ అధ్యక్షుడు ఎం.గులాంహైదర్, ప్రధాన కార్యదర్శి అలందర్ హుస్సేన్, కోశాధికారి ఎం.అబ్బాస్, ఇబ్రహీం బేగ్, అన్వర్, అల్తాఫ్ హుస్సేన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు చెస్ట్ బీటింగ్ చేయడం విశేషం. మహిళలు పాల్గొని



అశ్రునివాళులు అర్పించారు. ఇనాయత్ హుస్సేన్, అల్ హుస్సేని, మీర్ హసన్ అబ్బాస్ అల్ హుస్సేన్ తదితరులు నాయకత్వం వహించారు. చెస్ట్ బీటింగ్‌కు తరలివచ్చిన వేలాది ముస్లింలకు టీడీపీ నేతలు ఎండీ ఇలియాస్ పాషా, గోకుల్ శివ, ఖాజా, గొర్రెపాటి గోపీచంద్, జనసేన నేతలు బండి రామకృష్ణ, గడ్డం రాజు, మాదివాడ రాము తదితరులు సేవలందించారు. చెస్ట్ బీటింగ్‌లో పాల్గొన్న వారికి వైద్యసేవలందించారు. మజ్జిగ, లస్సీ, పళ్ల రసాలు అందజేశారు.

అలీనఖీపాలెంలో..

అలీనఖీపాలెం(పమిడిముక్కల) : అలీనఖీపాలెంలో బుధవారం ముస్లింలు పీర్ల ఊరేగింపు నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హజరత్ ఇమామ్ హుస్సేన్ అషుర్ ఖానా ఆవరణలో యువకులు, పెద్దలు చెస్ట్ బీటింగ్, రక్తతర్పణతో శ్రద్ధాంజలి ఘటించారు. మౌలానా సయ్యద్ షికోహ్ హైదర్ (బిజ్నూర్), కర్బలా అమరవీరుల త్యాగాలను వివరించారు. ఉయ్యూరు సీఐ హబీబ్ బాషా, సిబ్బంది బందోబస్తు ఏర్పాటుచేశారు.



అలీనఖీపాలెం హుస్సేన్ అషుర్ ఖానా ఆవరణలో..



చల్లగా చూడు తల్లీ..

- దుర్గమ్మకు ఆషాఢం సారె సమర్పించిన 1300 మంది



వన్‌టౌన్, జూలై 17 : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు సారె సమర్పణలు అత్యంత భక్తిప్రపత్తులతో కొనసాగాయి. బుధవారం తొలిఏకాదశి, ఆషాఢమాసం ప్రత్యేక రోజు కావడంతో వివిధ ప్రాంతాలనుంచి దుర్గమ్మను దర్శించుకునేందుకు పెద్దఎత్తున భక్తజనం తరలివచ్చారు. ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. 1300 మంది అమ్మవారికి సారె సమర్పణల్లో పాల్గొన్నారు. విజయవాడ సీతారాంపురానికి చెందిన బి.సుభాషిత ఆధ్వర్యంలో 200మంది, వైఎస్ఆర్ కాలనీకి చెందిన దాసరి శివనాగమణి ఆధ్వర్యంలో 200 మంది వాగు సెంటర్‌కు చెందిన కోయన్న మాధవరావు ఆధ్వర్యంలో వంద మంది భక్తులు సారె సమర్పించారు. ఆలయంలో రద్దీని పురస్కరించుకుని ఈవో రామారావు ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

ఈనెల 19 నుంచి ప్రారంభం కానున్న శాకంబరీ ఉత్సవాలలో అలంకరణ నిమిత్తం భక్తులు కూరగాయలు తదితరాలను అందజేస్తున్నారు. ప్రత్యేక బుంగ మిర్చిని ఓ భక్తుడు అందచేయగా బుధవారం సాయంత్రం వరకు ఆరున్నర టన్నుల కూరగాయలను భక్తులు సమర్పించారు.



దుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

దుర్గమ్మను హైకోర్టు జడ్జి శ్రీనివాసరెడ్డి కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈవో రామారావు వారికి సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం, ఆశీస్సులు అందజేశారు.

వద్దిపర్తి పద్మాకర్ ప్రవచనాలు

19, 20తేదీలలో దేవస్థానం ఆధ్వర్యంలో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో వద్దిపర్తి పద్మాకర్ ప్రవచనాలు జరగనున్నాయి. కనకదుర్గమ్మ మహిమలపై ప్రవచనాలు కొనసాగుతాయి.

దుర్గగుడిలో అన్నవితరణకు చెన్నై అడయార్ ప్రాంతం శాస్త్రినగర్‌కు చెందిన ఎం.ఎం.వైద్యనాథన్ దంపతులు బుధవారం రూ.1,08,000 విరాళాన్ని అందించారు.



కీసర స్టాక్ యార్డును పరిశీలిస్తున్న జేసీ సంపత్‌కుమార్

ఇసుక పంపిణీలో అక్రమాలకు తావులేదు

- ఎన్టీఆర్ జిల్లా జేసీ సంపత్‌కుమార్

కంచికచర్ల, జూలై 17: ఉచిత ఇసుక పంపిణీలో అక్రమాలు, అవకతవకలకు తావులేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కంచికచర్ల మండలం కీసర స్టాక్ యార్డును బుధవారం ఆయన సందర్శించి ఇసుక పంపిణీ, యార్డులో ఇసుక నిల్వ పరిమాణం గురించి వివరాలు అడిగారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవటమే కాకుండా, ఇసుక పంపిణీ పారదర్శకంగా ఉండాలని చెప్పారు. అవకతవకలు జరగకుండ అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. పంపిణీలో నాయకుల జోక్యం లేకుండా చూడాలన్నారు. సెబ్ సీఐ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ నాగుల్ మీరా, ఎస్ఐ సుబ్రహ్మణ్యంతో పాటుగా మైనింగ్, పంచాయతీరాజ్ అధికారులు ఉన్నారు.

కౌలురైతుల సమస్యలు పరిష్కరించండి

- మంత్రి సారథికి సంఘం వినతి



అజిత్‌సింగ్‌నగర్, జూలై 17 : కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం సభ్యులు మంత్రి కొలుసు పార్థసారథి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కౌలు రైతుల చట్టాన్ని రద్దు చేసి 2011 భూ అధీకృత రైతుల చట్టాన్ని అమలు చేయాలని కోరారు. గ్రామసభలు నిర్వహించి భూయజమానులతో సంబంధం లేకుండా వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు మంజూరుచేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. మంత్రికి వినతి పత్రం అందజేసిన వారిలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు, కృష్ణా జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

'గులకరాయి'లో అన్యాయంగా ఇరికించారు

- హోంమంత్రిని కలిసిన నిందితుడు


విజయవాడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం జగన్‌పై జరిగిన గులకరాయి కేసులో పోలీసులు అన్యాయంగా తనను ఇరికించారని నిందితుడు వేముల సతీష్‌కుమార్ హోంమంత్రి అనితకు విన్నవించుకున్నాడు. తనకు న్యాయం చేయాలని కోరారు. వెలగపూడిలోని సచివాలయంలో బుధవారం ఆమెను సతీష్ కుటుంబసభ్యులు కలిశారు. ఘటనకు, తమ కుమారుడికి ఎటువంటి సంబంధం లేదని తల్లిదండ్రులు విన్నవించారు. పోలీసులు బెదిరించి నేరాన్ని మోపారన్నారు. న్యాయం చేస్తామని హోంమంత్రి వారికి హామీ ఇచ్చారు.

పొంచి ఉన్న ముప్పు!



- వీఎన్‌పురం కాలనీలో కుళాయిలో డ్రెయినేజీ నీరు!
- డ్రెయిన్ల గుంతల్లో మంచినీటి పైపులు
- పైపు పగిలిపోవటంతో నీరు కలుషితం
- దుర్వాసన, నురుగుతో వస్తున్న నీరు
- డయేరియా ప్రబలుతుందేమోనని స్థానికుల భయాందోళన
- పట్టించుకోని పంచాయతీ అధికారులు





గన్నవరం, జూలై 17 : జిల్లాలో పలుచోట్ల డయేరియా కేసులు పెరుగుతున్నా.. అధికార యంత్రాంగంలో మార్పు రావటం లేదు. కేసరపల్లి పంచాయతీ పరిధిలోని వెంకటనరసింహాపురం కాలనీలో గత కొద్ది రోజులుగా కుళాయి నుంచి మురుగనీరు వస్తోంది. బుధవారం దుర్గంధభరితంగా, నురుగుతో కూడిన మురుగు నీరు వచ్చింది. రక్షిత మంచినీటిలో డ్రెయినేజీ నీరు కలుస్తోంది. డ్రెయిన్ కాల్వలో మంచినీటి పైపు పగిలి కాలనీ అంతా మురుగు నీరు వస్తోంది. ఈ నీరు తీవ్ర దుర్వాసనతో, నురుగు నల్లటి రంగుతో వుంటోంది. విజయవాడలో డయేరియా కలకలం భయం కలిగిస్తుండగా.. జగ్గయ్యపేటలో ఇటీవల కోరలు చాచింది. వరుస పరిణామాలతో వెంకట నరసింహాపురం ప్రజలు తీవ్ర భయాందోళనలు చెందుతున్నారు. కాలనీవాసులు పలుమార్లు పంచాయతీ సిబ్బందికి ఫిర్యాదు చేసినా చర్యలు లేవు. మంచినీరు మురికి వాసనతో వస్తోందని చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాణనష్టం జరిగే వరకు అధికారులు చర్యలు తీసుకోరా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. బుధవారం సాయంత్రం హడావిడిగా డ్రెయినేజీ కాలువలో మంచినీటి పైపుకు మూత వేసి వెళ్లారే తప్ప శాశ్వత పరిష్కారం చూపలేదు. మంచినీటి పైపు ఉన్నచెట మురుగునీరు లేకుండా మట్టితో పూడ్చించాల్సిన అవసరం ఉంది. లేకుంటే ఇళ్లల్లోకి మురుగునీరు కుళాయిల్లో వచ్చే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో సైడు కాలువలు లేకపోవడంతో చాలా మంది మురుగునీటిని రోడ్డుపక్కన గుంటలు తవ్వి.. అందులోకి మళ్లిస్తున్నారు. ఈ గుంటల కింద మంచినీటి పైపులు ఉంటున్నాయి. పైపులకు లీకులు ఏర్పడటంతో మురుగునీరు తరచూ కుళాయిలలోకి వచ్చేస్తోంది. ఎక్కడ డయేరియా వస్తుందోనని స్థానిక ప్రజలు భయపడుతున్నారు. ఇప్పటికైనా కేసరపల్లి పంచాయతీ అధికారులు రెండో రోడ్డు వెంబడి మంచినీటి పైపుల పక్కన డ్రెయినేజీ గుంటలను పూడ్చివేయాలని, కలుషిత నీరు రాకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

వినగడప కష్టాలు వినపడవా..!

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఖమ్మం జిల్లాలోని లంకాసాగర్‌లో పుట్టిన కట్టలేరు వాగు అనేక మలుపులు, వంపులతో సరిహద్దులను చెరిపేసుకుని కృష్ణమ్మ ఒడిలోకి చేరుతుంది. లంకాసాగర్ నుంచి కిలోమీటరుకు పైగా ప్రవహించి ఎన్టీఆర్ జిల్లాలోకి ప్రవేశిస్తుంది. అక్కడి నుంచి తిరిగి ఖమ్మం జిల్లా మీదుగా ప్రవహించి నందిగామ సమీపంలో పెండ్యాల చేరుతుంది. అక్కడ మునేరులో కలుస్తుంది. ఇంత దూరం ప్రవహించే వాగుపై గంపలగూడెం మండలం వినగడప వద్ద ఖమ్మం జిల్లాను కలుపుతూ ఒక లోబ్రిడ్జి ఉండేది. జగ్గయ్యపేట, నూజివీడు, నందిగామ, విజయవాడ ప్రాంతాల నుంచి ఖమ్మం జిల్లాకు వెళ్లే వాహనాలన్నీ ఈ వంతెన పైనుంచే అక్కడికి చేరుకోవాల్సి ఉంటుంది. కానీ, ప్రస్తుతం ఇక్కడ పరిస్థితి భయానకంగా మారింది. అటు ఇటు రాకపోకలు సాగించే వారికి కట్టలేరు కష్టంగా మారింది. వర్షాకాలంలో ఈ వంతెన పై నుంచి రాకపోకలు సాగించాలంటే జనం బిక్కుబిక్కుమంటూ అడుగులు వేయాల్సి వస్తోంది.

కష్టం ఎప్పటికి తీరేను..?

కట్టలేరు వాగుపై 1977వ సంవత్సరంలో లోబ్రిడ్జిని నిర్మించారు. అప్పటి మంత్రి చనమోలు వెంకట్రావు హయాంలో ఈ నిర్మాణం చేపట్టారు. తెలంగాణలో ఉన్న ఖమ్మం జిల్లా, ఎన్టీఆర్ జిల్లాలో ఉన్న గ్రామాల మధ్య రాకపోకలకు ఉపయోగపడేలా ఈ లోబ్రిడ్జి నిర్మించారు. ఆ తర్వాత వచ్చిన పాలకులు, ప్రజాప్రతినిధులు పెరుగుతున్న రాకపోకలను గుర్తించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంపై దృష్టి పెట్టలేదు. 2018, ఆగస్టులో కృష్ణానదికి వరదలు ఉధృతంగా వచ్చాయి. ఆ సమయంలో వాగులు, వంకలు ఉగ్రరూపంలో ప్రవహించాయి. ఎగువ నుంచి వస్తున్న వరద ఉధృతికి కట్టలేరు వాగుపై నిర్మించిన లోబ్రిడ్జి కొట్టుకుపోయింది. దీంతో రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు ఆగిపోయాయి. ఈ బ్రిడ్జి స్థానంలో వాగుపై పెద్దపెద్ద సిమెంట్ బిల్లలు ఏర్పాటు చేశారు. దానిపై రహదారి వేశారు. కట్టలేరుకు వరద వస్తున్న ప్రతిసారీ నీరు ఈ తాత్కాలిక వంతెన పైనుంచి ప్రవహిస్తోంది. దీంతో రెండువైపుల నుంచి రాకపోకలు ఆగిపోతున్నాయి. వరద ఉధృతి తగ్గే వరకు ఖమ్మం, ఎన్టీఆర్ జిల్లాల మధ్య సంబంధాలు తెగిపోతున్నాయి. కట్టలేరుపై తాత్కాలికంగా నిర్మించిన వంతెన ఎంతకాలం మన్నుతుందో తెలియని పరిస్థితి. వాగు పొంగినప్పుడల్లా నీరు ఈ వంతెన పైనుంచి ప్రవహిస్తోంది.

వైసీపీ ఉత్తుత్తి హామీ

ఖమ్మం-ఎన్టీఆర్ జిల్లాను అనుసంధానం చేసే బ్రిడ్జి పొడవు 200 మీటర్లు ఉంటుంది. వైసీపీ అధికారం చేపట్టడానికి ముందు 2019లో లోబ్రిడ్జి కొట్టుకుపోయింది. అధికారంలో ఉన్నన్ని రోజులు దీని నిర్మాణం గురించి పట్టించుకోలేదు. ఎన్నికలకు ముందు తిరువూరులో నిర్వహించిన సభలో అప్పటి సీఎం జగన్ వినగడప వద్ద కట్టలేరు వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. దీనికి రూ.26 కోట్లను మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. కేవలం ఉత్తుత్తి హామీ ఇచ్చి ప్రజలను మభ్యపెట్టారు. జగన్ ప్రకటన తర్వాత ఎలాంటి పురోగతి లేదు. కూటమి ప్రభుత్వమైనా తమ కష్టాలు తీర్చుతుందా అని రెండు జిల్లాల ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

తహసీల్దార్ల తహతహ!

- బదిలీల కోసం ఎక్కడి పనులు అక్కడే..
- ధ్రువీకరణ పత్రాలు, భూ సంబంధ సమస్యలపై నిర్లక్ష్యం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రెవెన్యూ శాఖలో బదిలీల గందరగోళం మొదలైంది. ఎన్నికల ముందు ఇతర జిల్లాలకు బదిలీ అయిన రెవెన్యూ ఉద్యోగులు తిరిగి సొంత జిల్లాలకు రాకపోవటంతో సమస్యలు తలెత్తుతున్నాయి. బదిలీలపై స్పష్టత లేకపోవటం వల్ల పాలన అస్తవ్యస్తంగా మారింది. త్వరలో వెళ్లిపోతామన్న ఉద్దేశంతో పనిపై దృష్టి తగ్గింది. ఇతర జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్లు ఇక్కడి నుంచి ఎప్పుడు వెళ్లిపోతామా అని ఎదురుచూస్తున్నారు. వీరిలో ఒకరిద్దరు తహసీల్దార్లు మాత్రం ఇక్కడి నుంచి కదలటానికి ఇష్టపడట్లేదు. మెజారిటీ తహసీల్దార్లు మాత్రం వెళ్లిపోయేందుకే తహతహలాడుతున్నారు. దీంతో రెవెన్యూ సంబంధ పనులు ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది.

అన్నీ సమస్యలే..

ప్రస్తుతం విద్యాసంవత్సరం ప్రారంభమైంది. విద్యార్థులకు కుల, ఆదాయ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ తదితర సర్టిఫికెట్లు అవసరమవుతున్నాయి. ఇతర జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్లు వీటిపై సంతకాలు చేయట్లేదు. ఇక భూ సంబంధిత సమస్యలపై వచ్చేవారికి కూడా నిరాశే ఎదురవుతోంది. చాలామంది తహసీల్దార్లు ప్రజలకు అందుబాటులో ఉండట్లేదు. దీంతో చాలా లావాదేవీలు పెండింగ్‌లో పడ్డాయి. రెండు జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది.

బదిలీలు జరిగేనా..?

కాగా, బదిలీలు ఇప్పట్లో ఉండవన్న ప్రచారం నడుస్తోంది. వైసీపీ ప్రభుత్వంతో అంటకాగి పనిచేశారన్న కారణంగా తహసీల్దార్లు, కొందరు జిల్లా అధికారులను కొంత కాలం బదిలీ చేయకూడదని ప్రభుత్వం భావిస్తున్నట్టుగా ప్రచారం నడుస్తోంది. ఇందులో వాస్తవం లేదనే చర్చ కూడా జరుగుతోంది.

గడ్డం గ్యాంగ్ మరో అరాచకం..

(5వ పేజీ తరువాయి)

ప్లాట్ల యజమానులు తమ స్థలాలను స్వాధీనం చేసుకున్నారు. నిన్న పట్టణ నడిబొడ్డులోని శరత్ థియేటర్‌ను కేవలం ఒక్క వాటా ఉన్న కొడాలి నాని పదేళ్లుగా ఆక్రమణలో ఉంచుకుని, ఎవరినీ రానీయకుండా బెదిరింపులకు దిగిన విషయం విదితమే. వీరందరూ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయడంతో అధికారులు చర్యలకు దిగారు. ఇదే పంథాలో అక్షర పాఠశాల పాత యాజమన్యం కొట్లాది రూపాయలు విలువ గల తమ స్థలాన్ని చాలా తక్కువ ధరకు బెదిరించి తీసుకున్నారని, తమకు న్యాయం చేయాలని వారు తాజాగా కోర్టును ఆశ్రయించారు. పాఠశాల ఆస్తుల కబ్జాపై విచారణ చేపట్టాలని కోర్టు గుడివాడ వన్‌టౌన్ పోలీసులను ఆదేశించినట్టు బాధితులు తెలిపారు.

కొండ చరియలకు త్వరలోనే పరిష్కారం

- దుర్గగుడి ఈవో రామారావు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

విజయవాడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కొండచరియలు విరిగిపడుతున్న సమస్యను త్వరలో పరిష్కరిస్తామని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ ఈవో కేఎస్ రామారావు తెలిపారు. ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఘాట్ రోడ్డులో భక్తుల రక్షణార్థం ఇంద్రకీలాద్రి 230 మీటర్ల నుంచి 470 మీటర్ల వరకు రక్షణ కోసం ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలిచామన్నారు. ఈ టెండర్లలో హైదరాబాద్‌కు చెందిన ఎస్ఆర్ కనస్ట్రక్షన్స్ కంపెనీ ఒక్కటే బిడ్ దాఖలు చేసిందన్నారు. ఇందులో జెన్యునెస్ డిక్లరేషన్ సర్టిఫికెట్, కీ పర్సనల్ సర్టిఫికెట్లు పొందుపరచకపోవడంతో టెండర్‌ను తిరస్కరించామన్నారు. రెండోసారి నిర్వహించిన టెండర్లలోను ఇదే కంపెనీ బిడ్ దాఖలు చేసి సర్టిఫికెట్లను ఇవ్వలేదన్నారు. ఈ టెండర్‌ను రద్దు చేసి మళ్లీ మూడోసారి టెండర్లను ఆహ్వానించగా ఎస్ఆర్ కనస్ట్రక్షన్ కంపెనీ టెండరు దాఖలు చేసిందని తెలిపారు. పనులు ఆలస్యమవుతున్నందున ఈవిషయాన్ని దేవదాయశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. టెండర్ ఇవాల్యూషన్ కమిటీ సభ్యుడు, ఆర్ అండ్ బీ సీఈలను సంప్రదించి తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. వారి సూచనల ప్రకారం ప్రైస్ బిడ్‌ను తెరిచామన్నారు. టెండరుదారుడు త్వరలోనే పనులను ప్రారంభిస్తారని వివరించారు.

రైతు సమస్యలు పరిష్కరించండి

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి

గుడివాడ, జూలై 17 : రైతాంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 18, 19తేదీల్లో సచివాయాలు, ఆర్‌బీకేల్లో వినతిపత్రాలను అందజేయనున్నట్టు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక సుందరయ్యభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ఏడాది వచ్చిన తుఫాన్ నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీలను కొంతమంది రైతులకు మాత్రమే యిచ్చారన్నారు. వ్యవసాయ విద్యుత్ మీటర్లు బిగించడానికి గత ప్రభుత్వం జీవో నెం.22ను తీసుకువచ్చిందని, మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. పెట్టుబడి సహాయంగా యిస్తానన్న రూ.20వేలను వెంటనే అందించాలన్నారు. వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈ నెల 18, 19 తేదీల్లో చేపట్టిన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గౌరిశెట్టి కోరారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు నీలం మురళీకృష్ణారెడ్డి, ఎస్.వి కృష్ణారావు, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మైలవరంలో 'డాక్టర్ విశ్వామిత్ర' షూటింగ్

మైలవరంరూరల్, జూలై 17 : మండలంలోని బొర్రగూడెం తిరుపతమ్మ గోపయ్య స్వామివార్ల దేవస్థానంలో 'డాక్టర్ విశ్వామిత్ర' సినిమా షూటింగ్‌ను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అక్కల రామ్మోహనరావు(గాంధీ) క్లాప్ కొట్టి బుధవారం ప్రారంభించారు. శివసాయి బాలాజీ మూవీ మేకర్స్ పతాకంపై సాయి వెంకట్ దర్శకత్వం వహిస్తుండగా, శివరామ్ హీరోగా, సౌమ్య, వీరంకి వెంకట నరసింహారావు, రామకృష్ణ, రంగనాయకులు, బాలచందర్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ, 'డాక్టర్ విశ్వామిత్ర షూటింగ్ విజయవంతం పూర్తిచేసుకొని, సినిమా సైతం హిట్ కావాలని ఆకాంక్షించారు. మైలవరం ప్రాంతంలో సినిమా షూటింగ్‌లతో స్థానికులకు కూడా అవకాశాలు కలుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు బొలియాశెట్టి శ్రీకాంత్, మైలవరం, రెడ్డిగూడెం మండలాల అధ్యక్షులు శీలం బ్రహ్మయ్య, చాపలమడుగు కాంతారావు, పాములపాటి సుందరరామిరెడ్డి, రవితేజ, తదితరులు పాల్గొన్నారు.




లెక్క తేల్చే పనుల్లో.. రెవెన్యూ అధికారులు

- 'ఎన్నికల విధుల్లో పనిచేసిన సిబ్బందికి పారితోషికాలెప్పుడు' కథనంతో కదలిక
- సెలవు రోజు వచ్చి తలమునకలు
- బీఎల్‌ఓలలో సంతోషం.. డీటీలకు అందని పారితోషికం

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

జగ్గయ్యపేట, జూలై 17 : ఎన్నికల విధుల్లో పనిచేసిన సిబ్బందికి పారితోషికాలెప్పుడు? కథనం రెవెన్యూ వర్గాలతో పాటు, బీఎల్‌ఓలుగా పనిచేసిన వివిధ శాఖల సిబ్బందిలో చర్చనీయాంశమైంది. ఉన్నతాధికారులును గట్టిగా అడగలేని నిస్సహాయతను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవటంతో వారంతా సంతోషం వ్యక్తం చేశారు. ఇక రెవెన్యూ ఉన్నతాధికారుల్లో కదలిక తెచ్చింది. బుధవారం మొహర్రం సందర్భంగా కార్యాలయానికి సెలవు ఉన్నా అధికారులు వచ్చి లెక్కలు తేల్చే పనిలో నిమగ్నమయ్యారు. ఉదయం నుంచి ఎన్నికల వ్యయం లెక్కల్లో పడి పోయారు. బీఎల్‌ఓలతో పాటు నియోజకవర్గంలో, వివిధ మండలాల నుంచి ఎన్నికల విధులకు హాజరైన డిప్యూటీ తహసీల్దార్‌లకు పారితోషికం అందలేదని ఇప్పుడు బయటపడ్డారు. వివిధ హోదాల్లో పనిచేసిన అధికారులకు కూడా ప్రభుత్వం మంజూరు చేసిన మొత్తం అందలేదని వాళ్లు అసంతృప్తి వెలిబుచ్చుతున్నారు. ఎన్నికల కోసం వచ్చిన బడ్జెట్ ఎంత.. వ్యయం ఎంత.. బిల్లులు ఇచ్చింది ఎంత.. ఎవరెవరికి ఎంత ఇచ్చారనేది తేల్చాల్సి ఉంది. ఎన్నికల సందర్భంగా సేవలు అందించిన ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వాల్సిన బిల్లులపై కూడా లెక్కలు తేలాల్సి ఉంది. ఇవన్నీ తేలితేనే ఎన్నికల వ్యయంలో అవకతవకలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

డయేరియా లక్షణాలతో వృద్ధుడు మృతి!



వత్సవాయి, జూలై 17 : డయేరియా లక్షణాలతో వృద్ధుడు మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. మృతుడి బంధువుల సమాచారం మేరకు.. పాత వేమవరం గ్రామానికి చెందిన బిల్లా వెంకటేశ్వర్లు (70) మంగళవారం ఉదయం నుంచి వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నాడు. మెరుగైన వైద్యం కోసం వత్సవాయి పీహెచ్‌సీలో చేర్పించారు. చికిత్స పొందుతూ వెంకటేశ్వర్లు రాత్రి మృతి చెందాడు. భార్య మూడేళ్ల క్రింత చనిపోయింది. రోగి ఆసుపత్రికి వచ్చిన తర్వాత వాంతులు, విరేచనాలు కాలేదని, అనారోగ్యంతో పాటు గుండెపోటు వల్లే అతడు మృతిచెందినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారిణి సుష్మ తెలిపారు. ఇదిలా ఉంటే.. గ్రామంలో సీసీ రోడ్లు ఉన్నా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ముగురు నీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. వెంకటేశ్వర్లు మృతితో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ సిబ్బంది స్పందించి డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పర్చాలని కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	113, 121, 132
చికెన్ విత్ స్కిన్	214
చికెన్ స్కిన్‌లెస్	224

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.55

నాగసాయిబాబా మందిరంలో ఏకాదశి పూజలు



గవర్నర్‌పేట: ఆషాఢ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీషిర్డి నాగసాయిబాబా, నాగమానసాదేవి మందిరంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు వివిధ రకాల పూలతో స్వామిని అలంకరించి తొలి ఏకాదశి పండుగను ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జాము నుంచే భక్తులు స్వామిని దర్శించుకునేందుకు మందిర వ్యవస్థాపకుడు సుధాస్వామి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. నాగసాయిబాబా, నాగమానసాదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

మర్యాదపూర్వక కలయిక

గవర్నర్‌పేట, జూలై 17: విజయవాడ పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్వీ రాజశేఖర్ బాబును బుధవారం 23వ డివిజన్ కార్పొరేటర్, ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి ఆధ్వర్యంలో టీడీపీ బృందం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి సత్కరించారు. జిల్లా సహాయ కార్యదర్శి కె. కోటి, మాజీ కార్పొరేటర్ సొంగా రవీంద్ర, శేఖర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాధరపురం: విజయవాడ పోలీసు కమిషనర్ రాజశేఖర్ బాబును ఆయన చాంబర్‌లో బుధవారం 40వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వీపీ చిన సుబ్బయ్య మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు టీడీపీ నాయకులు కూడా రాజశేఖర్ బాబుకు శుభాకాంక్షలు తెలిపారు.



సైకిల్ స్టాండ్ పక్కన రోడ్డు మీదే పండ్ల దుకాణాలు, రోడ్డవతల వ్యాపారాలు, రైతుబజార్ ఎదురుగా రోడ్డుమీద పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు

దర్జాగా వ్యాపారాలు

- పటమట రైతుబజార్ రోడ్డులో ఆక్రమణలు
- రోడ్డు మీదనే జోరుగా వ్యాపారాలు
- తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం

పటమట, జూలై 17 : పటమట రైతుబజార్ రోడ్డు ఆక్రమణల చెరలో కొట్టుమిట్టాడుతోంది. నిత్యం వేల మంది ఇక్కడ కూరగాయలు కొనుగోలు చేస్తూ ఉంటారు. పటమట రైతుబజార్ చుట్టు పక్కల ప్రాంతాలను పండ్ల వ్యాపారాలు, తినుబండారాలు, పూల వ్యాపారులు ఆక్రమించి దర్జాగా వ్యాపారాలు చేసుకుంటున్నారు.

రైతుబజార్ పక్కన సైకిల్, స్కూటర్ స్టాండ్‌కు కొంత స్థలాన్ని కేటాయించారు. రైతుబజార్ రోడ్డులో రోడ్డు మీదకు వచ్చి వ్యాపారాలను చేస్తున్నారు. రైతుబజార్ ఎదురు రోడ్డుఅవతల సైతం పండ్ల వ్యాపారులు దర్జాగా కబ్జా చేసి తమ పనికానిచ్చేస్తున్నారు. దీని వలన పటమట హైస్కూల్ రోడ్డులో వెళ్లే వారు ట్రాఫిక్ వల్ల తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

ఈ ఆక్రమణల పరంపర చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియం దాటి రోడ్డు చివరి వరకు వ్యాపారాలు విస్తరించాయి. రైతుబజార్ ఎదురుగా రోడ్డులో కేబీహెచ్ స్కూల్ దాటి ఆ రోడ్డు చివర వరకు దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారాలు చేస్తున్నారు. పండ్లు, పూలు, తినుబండారాలు కొనుగోలు చేసే వినియోగదారులు రోడ్డుమీద తమ వాహనాలను ఆపి కొనుగోలు చేయడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. సంబంధిత అధికారులు రోడ్డు పక్కన వ్యాపారాలు చేసే వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

యువకుడు ఆత్మహత్య

పాయకాపురం, జూలై 17 : పాతపాడు గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై బుధవారం నున్న రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం పాతపాడులో నివాసం ఉంటున్న నల్లమోతు సంపత్(22) పాలిటెక్నిక్ పూర్తి చేసి ఈ-సెట్ రాశాడు. ర్యాంకు రాకపోవడంతో అప్పటి నుంచి మానసిక ఒత్తిడికి గురయ్యాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇనుప రాడ్డుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న నున్న రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తీవ్రమైన మానసిక ఒత్తిడి వల్ల తలనొప్పితో యువకుడు బాధపడుతున్నాడని, ఆ కారణంగా ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.



ఘనంగా ఏకలవ్య జయంతి

పాయకాపురం, జూలై 17 : పాయకాపురంలోని మోడల్ చేపల మార్కెట్ ఆవరణలో బుధవారం ఘనంగా ఏకలవ్యుని జయంతి జరిగింది. చేపల మార్కెట్, ఎరుకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఏకలవ్యుని విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించిన బొండా ఉమా పలువురు మహిళలకు చీరలు పండ్లు, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాభారంతో తనకుంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుని గురువు కోసం తన బొటన వేలు త్యాగం చేసిన మహావీరుడు ఏకలవ్యుడని కొనియాడారు. పైడి శ్రీను, ఆరుమళ్ల గోపిరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

63వ డివిజన్‌లో బొండా ఉమా పర్యటన

పాయకాపురం, జూలై 17 : స్థానిక 63వ డివిజన్ న్యూ రాజీవ్‌నగర్‌లో బుధవారం సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పర్యటించారు. ముందుగా రాజీవ్‌నగర్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఆయన పలు చోట్ల పర్యటించి స్థానికులతో మాట్లాడారు. రాజీవ్‌నగర్‌లోని వృద్ధాశ్రమాన్ని సందర్శించిన ఆయన వృద్ధులకు సదుపాయాలు కల్పించి సమస్యలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తెలుగుతల్లి పార్కును అభివృద్ధి చేయాలని రాజీవ్‌నగర్ కరకట్ట పక్కనే ఉన్న అవుట్ ఫాల్ డ్రెయిన్ పూడికలు తీయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నేతలు లబ్బా దుర్గ, బత్తుల కొండ, పైడి తులసి, లబ్బా వైకుంఠం, పైడి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి

పాతరాజరాజేశ్వరి పేట, జూలై 17 : రాష్ట్రంలో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని భారత ఐక్య యువజన సమాఖ్య (యువైఎఫ్ఐ) రాష్ట్ర కన్వీనర్ కాసాని గణేష్ బాబు అన్నారు. స్థానిక వించిపేటలోని సమాఖ్య కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబరు 18, 19 తేదీల్లో విజయవాడ నగరంలో జరిగే యుఎస్ఎఫ్ఐ జాతీయ మహాసభలను విద్యార్థులు, యువత జయప్రదం చేయాలని కోరారు. సమాఖ్య నగర కన్వీనర్ అనకాపల్లి కనకరాజు పాల్గొన్నారు.



ఉచిత కళ్లజోళ్ల పంపిణీ

వన్‌టౌన్, జూలై 17: మొహర్రం సందర్భంగా విభిన్న ప్రతిభావంతులకు బుధవారం ఉచిత కళ్లజోళ్ల పంపిణీ జరిగిందని అబ్దుల్ కలాం విభిన్న ప్రతిభావంతుల అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ అయూబ్‌ఖాన్ తెలిపారు వన్‌టౌన్ రాయల్ ఆప్టికల్స్ ప్రాంగణంలో 100 మంది విభిన్న ప్రతిభావంతులకు కళ్లజోళ్లను అందచేసినట్లు తెలిపారు. సంఘం తరపున వారి సమస్యల పరిష్కారానికి కూడా కృషి జరుగుతున్నట్లు తెలిపారు. నేత్ర వైద్యుడు రావెళ్ల రాజకుమార్ మాట్లాడుతూ, సంఘం చేస్తున్న సేవలను అభినందించారు. షఫీ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ టాస్కులు ఆడి మోసపోయిన మహిళ

వన్‌టౌన్, జూలై 17: ఆన్‌లైన్ టాస్కులు ఆడి రూ.1.60 లక్షలు పోగొట్టుకున్న మహిళ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గవర్నరుపేట మ్యూజియం రోడ్డుకు చెందిన మహిళ ఎస్. జ్యోత్స్న అమెజాన్ యాప్‌లో టాస్కులు ఆడి రూ. 1.60 లక్షలు పోగొట్టుకున్నారు. ఈ సంఘటన ఈ ఏడాది మార్చిలో జరగగా బుధవారం గవర్నరుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆన్‌లైన్‌లో మోసం జరిగిందని, న్యాయం చేయాలని కోరారు.

ప్రత్యేక నిధులతో కాలనీ సమస్యలు పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, జూలై 17: తూర్పులోని అన్ని సమస్యలను పరిష్కరిస్తామని, అవసరమైతే ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా మూడో డివిజన్‌లోని కరెన్సీనగర్ కాలనీలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ బుధవారం పర్యటించి సైడు కాల్వలు, డ్రెయినేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కొద్దిపాటి వర్షానికే ఈ ప్రాంతంలో వర్షపు నీరు రోడ్లపై చేరి నిల్వ ఉంటున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎంపీ కేశినేని శివనాథ్ సహకారంతో కేంద్రం నుంచి స్ట్రామ్‌వాటర్ పథకంలో భాగంగా నిధులను తెప్పించి నగరంలో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామన్నారు. ఇక్కడ ప్రత్యేకంగా విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం చేశామని, అందులోనే ఈఆర్ఓ విభాగం కూడా ఉందన్నారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు తాడి బాబురావు, గద్దె రమేష్, గుత్తి కొండ కృష్ణమోహన్, రత్నం నాగేశ్వరరావు, పండు, గుణమాల రాజశేఖర్, ఈశ్వర్ పేరేపి పాల్గొన్నారు.



కరెన్సీనగర్ కాలనీలోని అంతర్గత రోడ్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

సీకే రెడ్డి రోడ్డులో అనధికార పార్కింగ్

- వాహనదారులు, పాదచారుల తిప్పలు
- పట్టించుకోని పోలీసులు

పాతరాజరాజేశ్వరి పేట, జూలై 17 : స్థానిక పెజ్జోనిపేట, పప్పుల మిల్లు సెంటర్ నుంచి బాప్టిస్ట్ పాలెం బాప్టిస్ట్ చర్చి వరకు ఉన్న సీకే రెడ్డి రోడ్డులో వాహనాలను అనధికారంగా పార్కింగ్ చేయడం వల్ల వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీకే రెడ్డి రోడ్డులోని రైవస్ కాలువ గట్టు వెంబడి ఉండే రోడ్డులో అనధికార పార్కింగ్‌లు చేస్తున్నారు. పాదచారుల కోసం ఏర్పాటు చేసిన లైన్‌లో కార్లు, వ్యాన్‌లను అనధికారంగా పార్కింగ్ చేస్తూ పాదచారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. నెలల తరబడి కొన్ని వాహనాలు ఇక్కడే తిష్ట వేసుకుని ఉన్నాయి. దారిలో కార్లు ఉండటంతో పాదచారులు రోడ్డు మీద నడవడంతో ప్రమాదాలకు గురై ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. నెలల తరబడి నెలకొన్న ఈ సమస్యకు మాత్రం పరిష్కారం దొరకడం లేదని పాదచారులు, వాహనదారులు మండిపడుతున్నారు. పోలీసులు పట్టించుకోకపోవడం వల్లే ఈ సమస్య తలెత్తుతోందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సీకే రెడ్డి రోడ్డులో పార్కింగ్ చేసిన కార్లు

రాష్ట్రస్థాయి చెస్‌కు షేక్ నబీహా



విజయవాడ స్పోర్ట్సు, జూలై 17 : నంద్యాలలో ఈ నెల 18 నుంచి జరిగే రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైన మొగల్రాజపురం వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని షేక్ నబీహా(8వ తరగతి)ను స్కూల్ ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య మంగళవారం స్కూల్లో అభినందించారు. నబీహా టైటిల్‌తో తిరిగి రావాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు. నబీహా గ్లోబల్ చెస్ అకాడమీలో చెస్ కోచింగ్ తీసుకుంటుందన్నారు.

కుమార్తె కనిపించడం లేదని తల్లి ఫిర్యాదు

పాయకాపురం, జూలై 17: తన కుమార్తె కనిపించడం లేదని ఓ మహిళ బుధవారం నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల ప్రకారం న్యూ రాజీవ్‌నగర్ ప్రాంతానికి చెందిన యువతి (19) ప్రకాష్‌నగర్‌లోని ఓ సెల్‌ఫోన్ రిపేరు షాపులో పని చేస్తుంది. మంగళవారం ఉదయం షాపునకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. రాత్రి తిరిగి రాకపోవడంతో యువతి కుటుంబ సభ్యులు షాపు యజమాని వద్ద ఆరా తీయగా మధ్యాహ్నం ఒంట్లో బాగోలేదని చెప్పి వెళ్లిందని బదులిచ్చాడు. చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా యువతి ఆచూకీ తెలీకపోవడంతో కుటుంబ సభ్యులు నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణరక్షణకు హెల్మెట్‌ధారణ తప్పనిసరి

అవగాహన ర్యాలీలో ఎమ్మెల్యే సుజనా చౌదరి

విద్యాధరపురం, జూలై 17: ప్రాణరక్షణకు హెల్మెట్ ధారణ తప్పనిసరి అని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. బుధవారం నియోజకవర్గ పర్యటనలో భాగంగా భవానీపురం శివాలయం సెంటర్ నుంచి స్వాతి సెంటర్ వరకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తూ సాగిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. ట్రాఫిక్ ఏసీపీ బి. జనార్ధన్, సీఐ ఉమామహేశ్వరరావు, జనసేన ప్రచార కమిటీ సమన్వయకర్త తిరుపతి సురేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు, జనసేన 42వ డివిజన్ అధ్యక్షురాలు తిరుపతి అనూష, 49వ డివిజన్ కార్పొరేటర్ బుల్లా విజయకుమార్, ఎన్‌డీఏ నాయకులు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సుజనా చౌదరి

42, 39 డివిజన్లలో ఎమ్మెల్యే పర్యటన

ఎమ్మెల్యే సుజనా చౌదరి బుధవారం సాయంత్రం 39, 42 డివిజన్లలో పర్యటించారు. 39వ డివిజన్‌లో కామకోటి నగర్ రవ్వావారివీధిలో సంబంధిత పార్కు ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడి ఎండిపోయిన చెట్టు తొలగింపచేశారు. కుమ్మరిపాలెం సెంటర్ వద్ద సుబ్బరామయ్య నగర పాలక సంస్థ హైస్కూల్ నిర్మాణపు పనులను పరిశీలించి పనులను త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకుని రావాలన్నారు. 42వ డివిజన్ హెచ్‌బీ కాలనీలో పర్యటించారు. స్థానికులు రైతుబజారు రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరారు. వెంటనే సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు

అర్బన్‌హెల్త్ సెంటర్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

భవానీపురం: 43వ డివిజన్ ఊర్మిళా నగర్ కామన్‌సైట్‌లో గతంలో శిలాఫలకం వేసి నిలుపుదల చేసిన ప్రాంతంలో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సుజనా చౌదరి అధికారులకు సూచించారు. ఈ డివిజన్‌లో బుధవారం పర్యటించారు.

మెయిన్ రోడ్డును ఆనుకుని నిలిచిన కల్వర్టును పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. రాష్ట్ర నాయకులు గన్నెప్రసాద్ అన్న, సీనియర్ నాయకుడు బొమ్మసాని సుబ్బారావు, మాజీ కార్పొరేటర్ అబ్దుల్ ఖాదర్, డివిజన్ టీడీపీ అధ్యక్షుడు కొనికి కొండయ్య, మల్లెబోయిన కొండ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్‌లు పాల్గొన్నారు.

34వ డివిజన్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్ అభియాన్



ఖుద్దూస్ నగర్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్ అభియాన్

పాతరాజరాజేశ్వరి పేట, జూలై 17 : స్వచ్ఛ సర్వేక్షణ్ అభియాన్‌లో భాగంగా సఫాయి అప్న - భీమరి భగావో కార్యక్రమాన్ని స్థానిక 34వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ ఆధ్వర్యంలో బుధవారం డివిజన్‌లో చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి ప్రచారాన్ని నిర్వహిస్తూ కరపత్రాలను పంచారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులైన మలేరియా, డయేరియా, కలరా, చికెన్ గునియా తదితర వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండేలా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వివరించారు. డ్రెయిన్లలో చెత్తాచెదారం, వ్యర్థాలు వేయకుండా దోమల నుంచి దూరంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా సాయంత్రం వీధుల్లో దోమల పొగను చల్లారు. మలేరియా ఇన్‌స్పెక్టర్ షేక్ రాజాబాబు, పారిశుధ్య, మలేరియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రొట్టెలు, షర్బత్ పంపిణీ

వన్‌టౌన్, జూలై 17: మొహర్రం త్యాగానికి, ధర్మపరిరక్షణకు ప్రతీక అని ముస్లిం పెద్దలు మహమూద్, వాజిద్ ఖాన్‌లు అన్నారు. మొహర్రం సందర్భంగా పంజా సెంటర్‌లో బుధవారం వారు రొట్టెలు, షర్బత్ పంచారు. మహమ్మద్ ప్రవక్త మనవడు హజ్రత్ ఇమామ్ హుసేన్ బలిదానాన్ని గుర్తు చేసుకుంటూ ప్రత్యేకంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇస్లాం క్యాలెండర్‌లో మొహర్రం నుంచి మొదటి మాసం ప్రారంభమవుతుందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో మత సామరస్యం సమైక్యతలు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

దిక్సూచి
DIKSUCHI

లా కోర్సులలో ప్రవేశానికి క్లాట్



దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ లా యూనివర్సిటీలలో ప్రవేశానికి ఉద్దేశించిన 'కామన్ లా అడ్మిషన్ టెస్ట్(క్లాట్) 2025' దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. దీని ద్వారా అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ లా ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. ఈ టెస్ట్‌ను 'కన్సార్షియం ఆఫ్ నేషనల్ లా యూనివర్సిటీస్' నిర్వహిస్తుంది. హైదరాబాద్ నల్సార్, విశాఖపట్నం డీఎస్ఎన్ఎల్‌యూ సహా బెంగళూరు ఎన్ఎల్ఎస్ఐయూ, భోపాల్ ఎన్ఎల్ఐయూ, కొచ్చి ఎన్‌యూఏఎల్ఎస్, జోధ్‌పూర్ ఎన్ఎల్‌యూ, ఒడిశా ఎన్ఎల్‌యూఓ తదితర లా కళాశాలలు ఇందులో పార్టిసిపేట్ చేస్తున్నాయి. క్లాట్ 2025లో సాధించిన స్కోర్ ఆధారంగా అభ్యర్థుల చాయిస్‌ను అనుసరించి సీట్లను అలాట్ చేస్తారు. ఈ ఎగ్జామ్‌ను ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

అండర్ గ్రాడ్యుయేట్: ఇది అయిదేళ్ల వ్యవధి గల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్. గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. 2025 మార్చి/ఏప్రిల్‌లో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అర్హులే.


యూజీ క్లాట్ 2025: ఇందులో మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఇంగ్లీష్‌లో 22 నుంచి 26 ప్రశ్నలు; కరెంట్ అఫైర్స్-జనరల్ నాలెడ్జ్‌లో 28 నుంచి 32 ప్రశ్నలు; లీగల్ రీజనింగ్‌లో 28 నుంచి 32 ప్రశ్నలు; లాజికల్ రీజనింగ్‌లో 22 నుంచి 26 ప్రశ్నలు; క్వాంటిటేటివ్ టెక్నిక్స్‌లో 10 నుంచి 14 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 120. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.

పోస్ట్ గ్రాడ్యుయేట్: ఇది ఏడాది వ్యవధి గల ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్. ద్వితీయ శ్రేణి మార్కులతో ఎల్ఎల్‌బీ/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. 2025 ఏప్రిల్/మేలో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ క్లాట్ 2025: ఇందులో మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. కాన్‌స్టిట్యూషనల్ లా, జ్యూరిస్‌ప్రుడెన్స్, అడ్మినిస్ట్రేటివ్ లా, లా ఆఫ్ కాంట్రాక్ట్, టార్ట్స్, ఫ్యామిలీ లా, క్రిమినల్ లా, ప్రాపర్టీ లా, కంపెనీ లా, పబ్లిక్ ఇంటర్నేషనల్ లా, ట్యాక్స్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా, లేబర్ అండ్ ఇండస్ట్రియల్ లా అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 120. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 15
- **క్లాట్ 2025 తేదీ:** డిసెంబరు 1
- **వెబ్‌సైట్:** www.consortiumofnlus.ac.in

ఓయూలో పార్ట్ టైమ్ పీజీ



హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తున్న యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (యూసీఈ)-పార్ట్ టైమ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. కంటిన్యూయింగ్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(సీఈఈపీ) కింద ఎంఈ/ఎంటెక్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నారు. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఉద్దేశించిన ఈ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ఎంట్రెన్స్ టెస్ట్, కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. సివిల్, కంప్యూటర్ సైన్స్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, బయో మెడికల్, మైనింగ్ విభాగాలు అందుబాటులో ఉన్నాయి. ప్రతి ఇంజనీరింగ్ విభాగంలో 85 శాతం సీట్లను స్థానికులకు ప్రత్యేకించారు.

అర్హతలు: స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్/ఏఎంఐఈ/ఏఎంఐఈటీఈ ఉత్తీర్ణులై ఉండాలి. జూన్ 30 నాటికి కనీసం ఏడాది అనుభవం ఉండాలి. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి ఏదేని ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులు; మాస్టర్స్ డిగ్రీ(ఫిజిక్స్/స్టాటిస్టిక్స్/మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్/అప్లయిడ్ స్టాటిస్టిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/జియో ఫిజిక్స్) పూర్తిచేసినవారు; ఎమ్మెస్సీ(కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్/కంప్యూటర్ అప్లికేషన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణులు; ఎంసీఏ పూర్తిచేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. బయో మెడికల్ ఇంజనీరింగ్ విభాగానికి(బీఈ/బీటెక్)(బయో మెడికల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ ఈఐఈ/ ఈసీఈ/బయోటెక్నాలజీ/ మెడికల్ ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణులు; ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/మెడికల్ ఎలక్ట్రానిక్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్/మెడికల్ ఫిజిక్స్/బయో ఫిజిక్స్/బయో ఇన్ఫర్మాటిక్స్/బయో మెడికల్ ఇన్ఫర్మాటిక్స్/బయోటెక్నాలజీ) పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. మైనింగ్ ఇంజనీరింగ్ విభాగానికి మైనింగ్ అండ్ మెషినరీ ఇంజనీరింగ్/మైనింగ్ ఇంజనీరింగ్ విభాగాల్లో డిగ్రీ పూర్తిచేసినవారు అర్హులు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 14
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** ఆగస్టు 25
- **వెబ్‌సైట్:** www.uceou.edu

డిప్లొమా ఇన్ రైల్వే ఇంజనీరింగ్

న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ పర్మనెంట్ వే ఇంజనీర్స్(ఇండియా)- డిప్లొమా ఇన్ రైల్వే ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. ఇది కరస్పాండెన్స్ కోర్సు. ఇందులో ఇండియన్ రైల్వేస్‌కు సంబంధించిన స్ట్రక్చర్, ఫంక్షనింగ్ అంశాలు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌నకు కోల్‌కతాలోని ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్(ఇండియా) గుర్తింపు ఉంది.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి సైన్స్/కామర్స్/ఇంజనీరింగ్ విభాగాల్లో బీఎస్సీ/బీకామ్/బీఈ ఉత్తీర్ణులు; ఏదేని ఇంజనీరింగ్ విభాగంలో మూడేళ్ల డిప్లొమా ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్/సైన్స్ ఒక సబ్జెక్టుగా చదివి బీఏ డిగ్రీ పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** ipweindia.org.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/1ZB524Mలో చదవండి.

ప్రేక్షకులు గుర్తుపెట్టుకునే సినిమా



ఇటీవలే 'ఓమ్ భీమ్ బుష్' చిత్రంతో ప్రేక్షకులను పలకరించారు ప్రియదర్శి. ఆయన, నభానటేశ్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'డార్లింగ్'. 'వై దిస్ కొలవెరి' అనేది ఉపశీర్షిక. అశ్విన్‌రామ్ దర్శకత్వంలో కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య నిర్మించారు. సినిమా రేపు విడుదలవుతోన్న సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు.

"దర్శకుడు ఈ కథ చెప్పినప్పుడు చాలా బాగా నచ్చింది. స్క్రిప్ట్‌పై పూర్తి నమ్మకం ఉంది. సినిమాకు ఈ టైటిల్‌ను చాలా ప్రేమతో పెట్టాం. కపుల్స్ మధ్య జరిగే సంఘటనలని వినోదాత్మకంగా చూపించే ఈ సినిమా.. రిలేషన్‌షిప్‌లో ఉన్న వారితో పాటు అన్ని వర్గాలనూ ఆకట్టుకుంటుంది. ఇందులో నా ప్రపంచం, నభా ప్రపంచం చాలా వేరుగా ఉంటాయి. భిన్న ధృవాలైన మా ఇద్దరి మధ్య సీరియస్‌గా జరిగే సంఘటనలతో సాగే సన్నివేశాలను ప్రేక్షకులు ఫుల్‌గా ఎంజాయ్ చేస్తారు. స్క్రీన్‌ప్లే చాలా వైవిధ్యంగా ఉంటుంది. 'డార్లింగ్' సినిమాను అందరూ చాలా కాలం గుర్తుపెట్టుకుంటారు" అని ప్రియదర్శి అన్నారు.

ఆగస్టులో భవనమ్ విడుదల



ప్రతిష్ఠాత్మక నిర్మాణసంస్థ సూపర్‌గుడ్ ఫిలిమ్స్ నిర్మిస్తున్న తాజా చిత్రం 'భవనమ్'. 'ది హాంటెడ్ హౌస్' అనేది ఉపశీర్షిక. ఆర్‌బీ చౌదరి, వాకాడ అంజన్‌కుమార్, వీరేంద్ర సిర్వీ నిర్మిస్తున్నారు. సప్తగిరి, ధన్‌రాజ్, షకలక శంకర్, అజయ్, మాళవిక సతీషన్, స్నేహ ఉల్లాల్ ప్రధాన తారాగణం. బాలాచారి కూరెళ్ల దర్శకత్వం వహిస్తున్నారు. బుధవారం మేకర్స్ 'భవనమ్' విడుదల తేదీని ప్రకటించారు. ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌ను ఆగస్టు 9న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. ప్రేక్షకుల్ని భయపెట్టడంతో పాటు మంచి హాస్యంతో అలరిస్తుందని చిత్ర బృందం తెలిపింది. సినిమాటోగ్రఫీ: మురళీమోహన్‌రెడ్డి, ఎడిటర్: ఎస్బీఆర్.

'ఏం చేద్దామంటావ్ మరి'... కల్లు కాంపౌండ్ పాటలో కేసీఆర్ ఊతపదం

- దర్శకుడు పూరి జగన్నాథ్‌పై కేసు నమోదు



రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ తెరకెక్కిస్తున్న 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం వివాదంలో చిక్కుకుంది. ఈ సినిమా నుంచి ఇటీవలే విడుదలైన 'మార్ ముంత చోడ్ చింత' అనే పాటలో మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్‌రావు వాయిస్‌ను ఉపయోగించడంపై బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు అభ్యంతరం తెలుపుతున్నారు. కల్లు కాంపౌండ్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ గీతంలో 'ఏం చేద్దామంటావ్ మరి' అనే కేసీఆర్ పాపులర్ డైలాగ్‌ను రెండుసార్లు ఉపయోగించారు. వెంటనే పాట నుంచి ఆ హుక్‌లైన్‌ను తొలగించేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు ఎం. రజితారెడ్డి, జీ. సతీష్‌కుమార్ బుధవారం ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. 'పదేళ్లు తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చేసిన కేసీఆర్ వాయిస్‌ను కల్లు కాంపౌండ్‌లో చిత్రీకరించిన ఐటమ్ సాంగ్‌లో ఉపయోగించడం తప్పు, ఇది కేసీఆర్‌ను అవమానించడమే కాక తెలంగాణ ప్రజల మనోభావాలనూ దెబ్బతీసేలా ఉంది' అని ఫిర్యాదులో పేర్కొన్నారు. 'మా ప్రాంత యాస, భాష, మా నాయకుడిని కించపరిచినా సహించేది లేదు, అవసరమైతే పూరి జగన్నాథ్ ఇంటిని ముట్టడిస్తామ'ని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. పాట రచయిత కాసర్ల శ్యామ్, సింగర్ రాహుల్ సిప్లిగంజ్‌పైనా సోషల్ మీడియాలో విమర్శలు వస్తున్నాయి. అయితే ఈ విమర్శలపై చిత్రబృందం ఇంతవరకూ స్పందించలేదు.

త్వరలోనే మీ ముందుకొస్తా



నటించిన అతికొద్ది చిత్రాలతోనే తన సూపర్ యాక్టింగ్‌తో.. మంచి టైమింగ్‌తో నటుడిగా స్పెషల్ ఇమేజ్ తెచ్చుకున్నారు నవీన్ పొలిశెట్టి. 2023లో విడుదలైన 'మిస్.శెట్టి, మిస్టర్ పొలిశెట్టి' చిత్రం తర్వాత ఆయన తెరపై కనిపించలేదు. ఈ విరామానికి గల కారణాన్ని ఆయన సోషల్ మీడియాలో షేర్ చేశారు.

"నేను మీ అందరితో ఓ వ్యక్తిగత విషయాన్ని పంచుకోవాలనుకుంటున్నాను. నేను చేస్తున్న సినిమాల గురించి అప్‌డేట్స్ లేవని అందరూ అడుగుతున్నారు. దానికి కారణం ఇటీవలే జరిగిన బైక్ ప్రమాదంలో నా చేతికి, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ గాయాల వల్లే నేను సినిమాలను అనుకున్న టైమ్‌కి మీ ముందుకు తీసుకురాలేకపోతున్నాను. ఈ విరామానికి నన్ను క్షమించండి. త్వరలోనే పూర్తిగా కోలుకుని మిమ్మల్ని తిరిగి ఎంటర్టైన్ చేస్తాను" అని పేర్కొన్నారు.

'సర్దార్-2' షూటింగులో స్టంట్‌మేన్ మృతి



తమిళ నటుడు కార్తీ హీరోగా నటిస్తున్న 'సర్దార్-2' చిత్రం షూటింగ్‌లో విషాదం చోటు చేసుకుంది. ఈ సినిమా కోసం ఒక ఫైట్ చిత్రీకరిస్తుండగా, 20 అడుగుల ఎత్తు నుంచి ఫైట్ ట్రైనర్ (స్టంట్‌మేన్) ఏళుమలై ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషయాన్ని ఆ చిత్ర నిర్మాణ సంస్థ ప్రిన్స్ పిక్చర్స్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. స్థానిక సాలిగ్రామంలోని ప్రసాద్ స్టూడియోలో మంగళవారం ఫైట్ మాస్టర్ సూపర్ సుబ్బరాయన్ పర్యవేక్షణలో ఫైట్ రిహార్సల్ చేస్తుండగా ఈ సంఘటన జరిగింది. ఏళుమలై కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని నిర్మాత లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

ఆరోగ్యంగానే ఉన్నా

ఆర్.నారాయణమూర్తి



ప్రజానటుడు ఆర్.నారాయణమూర్తి స్వల్ప అస్వస్థతతో బుధవారం నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. ఆయనను ప్రత్యేక విభాగంలో ఉంచి నిమ్స్ డైరెక్టర్ బీరప్ప ఆధ్వర్యంలో వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించారు. గతంలో ఆయనకు ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగి ఉండటంతో హృద్రోగ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ పరీక్షలను వైద్యులు చేసి, ప్రమాదం ఏమీ లేదని నిర్ధారించారు. గ్యాస్ట్రిక్ సమస్య అయి ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. నారాయణమూర్తికి ఏమైందంటూ సోషల్ మీడియాలో చర్చ జరుగుతుండడంతో 'నేను ఆరోగ్యంగా ఉన్నా.. అభిమానులూ ఆందోళన చెందకండి. దేవుడి దయ వల్ల బాగానే ఉన్నా. పూర్తిగా కోలుకున్న తర్వాత అన్ని వివరాలూ వెల్లడిస్తా' అని ఓ ప్రకటనలో తెలిపారు నారాయణమూర్తి.



తన భర్త నికోలై సచ్‌దేవ్‌తో కలసి వరలక్ష్మి బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో ముచ్చటించారు. 'హైదరాబాద్ నాకు సెకండ్ హోమ్.. మీరంతా నాకు చాలా సపోర్ట్ చేశారు. ఇక ముందు కూడా ఇలానే సహకరించాలి' అని కోరారు వరలక్ష్మి

'బడ్డీ' వచ్చేది ఎప్పుడంటే..!



అల్లు శిరీష్ హీరోగా నటిస్తున్న 'బడ్డీ' చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదల కోసం తుదిమెరుగులు దిద్దుకుంటోంది. అడ్వెంచరస్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో గాయత్రీ భరద్వాజ్, ప్రిషా రాజేశ్ సింగ్ హీరోయిన్లు. శామ్ ఆంటోనీ దర్శకుడు. ఈ చిత్రాన్ని ఆగస్టు 2న విడుదల చేయనున్నట్లు నిర్మాతలు జ్ఞానవేల్ రాజా, అధన చెప్పారు. ఈ చిత్ర నిర్మాణం ఇండియన్ సిల్వర్ స్క్రీన్ మీద కొత్త ప్రయత్నం అని వారు చెప్పారు. సంగీత దర్శకుడు హిప్ హాప్ తమిళ స్వరపరిచిన పాటలు మంచి ఆదరణ పొందాయని చెప్పారు.

టికెట్ రేట్లు తగ్గించాలి



వినోద్ కిషన్, అనూష కృష్ణ జంటగా రూపుదిద్దుకున్న 'పేకమేడలు' చిత్రం ఈ శుక్రవారం విడుదలవుతోంది. నీలగిరి మావిళ్ల దర్శకత్వంలో రాకేశ్ వర్రె నిర్మించారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో చిత్రాన్ని విడుదల చేస్తున్న నిర్మాత ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ 'పెద్ద సినిమాల టికెట్ రేట్లు ఎంత ఉన్నా ప్రేక్షకులు థియేటర్‌కు వస్తారు. ఇలాంటి చిన్న సినిమాలకు తక్కువ రేట్లు ఉండాలి. అందుకే టికెట్ రేటు వంద రూపాయలు పెట్టాం. ఇలాంటి మంచి సినిమాను ప్రేక్షకుల దగ్గరకు తీసుకెళ్లాలని పెయిడ్ ప్రీమియర్స్ కు రూ 50 పెట్టాం. సినిమా బాగుందని ప్రతి ఒక్కరూ చెప్పారు. ఈ సినిమా అందరికీ నచ్చుతుంది' అని చెప్పారు. చిత్ర నిర్మాత రాకేశ్ వర్రే మాట్లాడుతూ 'ఈ సినిమా విడుదల చేయడానికి ముందుకు వచ్చిన ధీరజ్‌కు ధన్యవాదాలు. అలాగే మా సినిమాకు సపోర్ట్ చేసిన రానా దగ్గుబాటి, అడవి శేష్, విష్వక్‌సేన్‌కు కృతజ్ఞతలు' అన్నారు. పెయిడ్ ప్రీమియర్స్‌కు వస్తున్న రెస్పాన్స్ చూసి చాలా ఆనందంగా ఉందని వినోద్ కిషన్ చెప్పారు.

సెలబ్ ఫిట్



నటి మాత్రమే కాదు... మోడల్, డ్యాన్సర్, సింగర్, ప్రొడ్యూసర్. వెండితెరపైనే కాదు... నిజ జీవితంలోనూ విభిన్న పాత్రల్లో ఒదిగిపోతున్న అందాల తార ఆమె. చూడచక్కని రూపం... అద్భుతమైన నాట్యం... ప్రత్యేక పాటలకు పెట్టింది పేరు... **నోరా ఫతేహి**. 'ఎప్పుడూ ఇంత ఉత్సాహంగా... ఉల్లాసంగా కనిపిస్తారు... కారణమేంట'ని ఆ మధ్య ఎవరో అడిగితే... 'క్రమబద్ధమైన జీవనశైలి' అంటూ బదులిచ్చింది ఈ కెనడియన్ 'మనోహరి'.

మనోహారి

రాజమౌళి 'బాహుబలి'లో 'మనోహరి' పాటతో తెలుగువారికే కాదు... ప్రత్యేక పాటల తారగా అభిమానులకు దగ్గరైంది నోరా. అంతకముందు జూనియర్ ఎన్టీఆర్ 'టెంపర్'లో 'ఇట్టాగే రెచ్చిపోదాం' అంటూ కుర్ర హృదయాలను 'టెంప్ట్' చేసింది. 2014లో 'రోర్' చిత్రంతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన నోరా... ఆ మరుసటి ఏడాది 'బిగ్‌బాస్' హౌస్‌లో కనిపించింది. అదే ఆమెను అందరికీ పరిచయం చేసింది. తరువాత డ్యాన్స్ రియాలిటీ షో 'ఝలక్ దిక్ లాజా'లో పోటీపడింది. తరువాత అదే రియాలిటీ షోకు న్యాయనిర్ణేతగా వ్యవహరించింది. 'సత్యమేవ జయతే' హిందీ చిత్రంలో 'దిల్‌బర్' పాట నోరాను మరో ఎత్తుకు తీసుకువెళ్లింది. నాడు యూట్యూబ్‌లో ఆ పాటెను సంచలనం. ఇరవై నాలుగు గంటల్లోనే ఇరవై మిలియన్లకు పైగా వీక్షించారు. భారత్‌లో అంతటి హిట్ అయిన తొలి హిందీ పాట అదే. 'దిల్‌బర్' అరబిక్ వెర్షన్ కోసం 'మొరాకన్ హిప్‌హాప్' బ్యాండ్‌తో జత కట్టింది నోరా. అంతర్జాతీయంగా పేరు తెచ్చుకోవాలన్న తపనతో 2019లో తన మొట్టమొదటి ఇంగ్లీష్ పాట 'పెపేట'ను విడుదల చేసింది. ఇందుకు టాంజానియా మ్యుజీషియన్, గీత రచయిత రేవానీతో కలిసి పని చేసింది. వీటన్నిటినీ మించిన అరుదైన అవకాశం 2022లో నోరాకు లభించింది. కతార్‌లో జరిగిన 'ఫిఫా' వరల్డ్ కప్ పాట 'లైట్ ద స్కై'లో మెరిసింది. ఇలా పాట... దానికి లయబద్ధమైన నాట్యం ఆమె ప్రయాణంలో కీలకమయ్యాయి. ఊహించని అవకాశాలెన్నో తెచ్చిపెట్టాయి.

నోరాది కెనడాలో స్థిరపడిన మొరాకో సంతతికి చెందిన కుటుంబం. కెనడాలో పుట్టి పెరిగిన ఆమె... టొరంటోలో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేసింది. 'యార్క్ యూనివర్సిటీ'లో పొలిటికల్ సైన్స్ చదివింది. తన నేపథ్యం ఏదైనా... తన హృదయం మాత్రం భారతీయమేనంటూ ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. పాతికకు పైగా సినిమాలు, పలు వెబ్‌సిరీస్‌ల్లో కూడా నటించిన నోరా... తాను ఈ స్థాయికి రావడానికి ఎంతో కష్టపడ్డానంటోంది.

'మాది దిగువ మధ్యతరగతి కుటుంబం. కెనడా నుంచి భారత్‌కు వచ్చినప్పుడు ఇక్కడ నాకు ఎవరూ తెలియదు. వచ్చిన ప్రతి అవకాశాన్నీ వినియోగించుకొంటూ... నన్ను నేను నిరూపించుకున్నాను. అయితే పరిశ్రమ, సామాజిక మాధ్యమాల నుంచి వచ్చే ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవడం అంత సులభం కాదు. ఇక్కడ ఎవరినీ నిందించడానికి లేదు. నా కెరీర్ నా చేతుల్లోనే ఉందని భావించాను. నటిగా, మోడల్‌గా, న్యాయనిర్ణేతగా... వచ్చిన ఏ అవకాశాన్నీ వదల్లేదు. మానసిక ఒత్తిడికి గురి కాకుండా, బాధతో కుంగిపోకుండా ఉండేందుకు ఇది నాకు ఎంతో ఉపయోగపడింది. నా స్నేహితుల్లో చాలామందిని చూశాను. తమ చిత్రాలు ఆడకపోవడంతో మనోవేదనకు లోనయ్యారు. అవకాశాలు రానప్పుడు ఏడ్చారు. అలాంటి పరిస్థితుల్లోకి వెళ్లకుండా నాకు నేను ధైర్యం చెప్పుకొంటూ సాగుతున్నాను' అంటున్న నోరా ఎంత పని ఒత్తిడి ఉన్నా వ్యాయామాలకు, ఆహార నియమాలకు విరామం ఇవ్వదు. ఎందుకంటే అవే తనను మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంచుతాయంటుంది.

వర్కవుట్ ఇలా...

'బాగా తినండి... బాగా కదలండి'... ఇది నోరా చెప్పే ఫిట్‌నెస్ పాఠం. ఫొటోషూట్స్ నుంచి రెడ్ కార్పెట్ వరకు... ఆరోగ్యం నుంచి అందం వరకు... తన దైనందిన జీవితానికి సంబంధించిన ఫొటోలు, రీల్స్‌ను ఎప్పటికప్పుడు ఆమె ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తుంటుంది. అక్కడ ఆమెకు దాదాపు 47 మిలియన్ల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ప్రతి పోస్ట్‌కూ కనీసం లక్షకు తగ్గని లైక్స్. ఝైమరిపించే ఆ రూపాన్ని కాపాడుకోవడానికి నోరా రోజూ వ్యాయామం చేస్తుంది. కానీ జిమ్‌కు వెళ్లేందుకు పెద్దగా ఆసక్తి చూపదు. సమయం, అవకాశాన్ని బట్టి కొన్నిసార్లు ఇంట్లోనే వర్కవుట్స్ పూర్తయిపోతాయి. ఆమె ఫిట్‌నెస్ మెనూలో నాట్యం కూడా ప్రధానమైనది.

నాట్యం: ఏ వయసువారికైనా దృఢంగా, ఆరోగ్యంగా, అందంగా ఉంచడంలో డ్యాన్స్‌కు మించిన ప్రత్యామ్నాయం లేనేది నోరా అభిప్రాయం. అరగంట నాట్యంవల్ల 130 నుంచి 250 కేలరీలు కరుగుతాయి. ఇది అరగంట జాగింగ్‌తో సమానం.

పిలెట్స్: ఉదయం డ్యాన్స్ తరువాత అరగంట పిలెట్స్ ఇందులో ఆరు వందల రకాలకు పైగా విభిన్నమైన ఎక్సర్‌సైజ్‌లు ఉన్నాయి. డ్యాన్స్‌లానే పిలెట్స్‌కు కూడా వయసుతో సంబంధంలేదు. ఎవరైనా సులువుగా చేసుకోవచ్చు. ఒత్తిడిని తగ్గించి, నాణ్యమైన జీవనప్రమాణాలను పెంచడంలో ఇవి ఎంతో దోహదపడతాయని పలు పరిశోధనల్లో తేలింది.

బెల్లీ డ్యాన్స్: నోరా వర్కవుట్స్‌లో బెల్లీ డ్యాన్స్‌ను కూడా చేర్చుకుంది. ఈ నాట్యాన్ని ఆమె ఎంతో ఆస్వాదిస్తుంది. దీని వల్ల సామర్థ్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. జీర్ణక్రియ మెరుగవుతుంది. •



ఇదీ మెనూ..

ఆహార విషయంలో ఇదే తినాలనే నియమాలేవీ తాను పెట్టుకోలేదని నోరా పలు సందర్భాల్లో చెప్పింది. అయితే తీసుకొనే ఆహారం సమతులంగా ఉండేలా చూసుకొంటుంది. వ్యక్తిగత డైట్ కోచ్‌గా యాస్మిన్ కరాచీవాలాను పెట్టుకున్నప్పటికీ... తను సూచించే మెనూను పెద్దగా పట్టించుకోదు. పోషకాలు ఉన్నాయా లేదా అన్నదే ఆమెకు ప్రధానం. తీపి పదార్థాలను దూరం పెట్టింది. తాజా కాయగూరలు, ఆకుకూరలు, పండ్లకు అధిక ప్రాధాన్యం ఇస్తుంది. అప్పుడప్పుడూ పిజ్జాలు, బర్గర్లు, డజర్ట్స్ లాగించేస్తుంటుంది. ఇవి ఆమెకు ఇష్టమైన ఫుడ్. శరీరం డీహైడ్రేట్ కాకుండా పుష్కలంగా నీళ్లు తాగుతుంది.

- ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో ప్రొటీన్ ఫుడ్. అరటిపండ్లు, ఓట్స్, తేనె, గుడ్లు, ఎగ్‌వైట్.
- మధ్యాహ్న భోజనంలో బౌల్ నిండా ఉడకబెట్టిన కాయగూరలు, చికెన్‌తో అన్నం.
- రాత్రి డిన్నర్‌కు ఏదో ఒక నాన్‌వెజ్ ఐటెమ్ తప్పనిసరి.

సంకల్పం



కొత్త జ్యోతిర్మయి... అమెరికాలో ఉచిత తెలుగు 'పాఠశాల'ను ప్రారంభించారు. తెలుగులో మాట్లాడటం రాని అక్కడి పిల్లలతో 'పెద్దబాల శిక్ష'ను కంఠస్తం చేయిస్తున్నారు. తెలుగులో రాయడం అసలే తెలియని చిన్నారులతో సొంతూరులో ఉంటున్న వాళ్ళ బామ్మ, తాతయ్యలకు ఉత్తరాలు రాయిస్తున్నారు. తెలుగునేల మీద మాతృభాషకు వన్నె తగ్గినా, పరాయి దేశంలో తెలుగు వెలుగులు పూయిస్తున్నారు. అగ్ర రాజ్యంలో పుట్టిన పిల్లలకు తెలుగు ఉగ్గు పడుతున్న జ్యోతిర్మయి పదిహేనేళ్ళ 'పాఠశాల' అనుభవాలను నవ్యతో పంచుకున్నారిలా...

అమెరికాలో తెలుగు పాఠశాల

పదిహేనేళ్ళ కిందట షార్లెట్ నగరంలో మేము నెలకొల్పిన 'పాఠశాల' ఇప్పుడు డెట్రాయిట్, కొలంబియా తదితర ప్రాంతాల్లో 32 తెలుగు బోధనా తరగతులు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు అమెరికాలో పుట్టి పెరిగిన ఆరువేల మందికిపైగా విద్యార్థులకు తెలుగులో మాట్లాడటం, రాయడం, చదవడం నేర్పించాం. కేవలం మాతృ భాష మీద మమకారంతో ఒక్క డాలరు కూడా ఫీజు తీసుకోకుండా, దీన్ని ఒక ఉద్యమంలా నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది 250 మందికిపైగా విద్యార్థులు మా పాఠశాలలో తర్ఫీదు పొందుతున్నారు. నాతో మొదలైన ఈ సంస్థలో ఇప్పుడు ఉపాధ్యాయులు, ఇతర అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది అంతా కలిపి డెబ్బైమందికిపైగా పని చేస్తున్నారు. వారంతా స్వచ్ఛందంగా సేవలందిస్తున్నారు. ఎన్నో కష్టాలు, మరెన్నో సవాళ్ళను దాటుకుంటూ... ఇన్నేళ్ళుగా పాఠశాల సేవలు అప్రతిహతంగా కొనసాగుతున్నాయంటే అదంతా వారందరి సమష్టి కృషి ఫలితమే!

ఆ సంఘటనే ప్రేరణ...

'పాఠశాల' ప్రారంభించడం వెనకున్న కారణం ఏమిటంటే, మాకు పొరుగునఉండే నా స్నేహితురాలి అమ్మానాన్న ఇండియా నుంచి వచ్చారని తెలిసి, ఒక రోజు వారింటికి వెళ్లాను. ఆరు నెలలు ఉందామని వచ్చిన ఆ పెద్దలు నెలరోజులకే తిరుగు ప్రయాణంకాడానికి సమాయత్తమవడం చూసి, అదేంటి అప్పుడే వెళుతున్నారు అని అనడిగాను. "మనవడు, మనవరాలితో గడపాలని గంపెడాశతో వచ్చాం. కానీ వాళ్ళ భాష మాకు రాదు, మా భాష వాళ్ళకు రాదు. పిల్లలను ముద్దుచేయబోతే కనీసం దగ్గరకు కూడా రావడంలేదు. మమ్మల్ని పరాయి వాళ్ళను చూసినట్టు చూస్తున్నారు" అంటూ బాధపడ్డారు. వారి ఆవేదన నా మనసును బాగా మెలిపెట్టింది. అమ్మమ్మ, నాయనమ్మల ప్రేమ మాధుర్యాన్ని ఆస్వాదించడంలోని ఆనందం మరెందులోనూ దొరకదు కదా.! అది ఈతరానికి అందకుండా పోవడం నిజంగా బాధాకరమే. మరీ ముఖ్యంగా అమెరికాలో స్థిరపడ్డ తెలుగు కుటుంబాల్లోని చాలామంది పిల్లలు భాష సమస్య వల్ల బామ్మ, తాతయ్యల అనురాగానికి నోచుకోలేకపోవడం గమనించాను. ఆ లోటు పూడ్చడానికి నా వంతుగా 2019లో మా ఇంటిలోనే 'పాఠశాల' తెలుగు బోధన ప్రారంభించాను. కొద్దిరోజులకు అది ఇతర ప్రాంతాలకు విస్తరించింది.

ఇంటిలోనే పాఠశాల...

పాఠశాల ఒకే చోట ఉంటే, దూరప్రాంతాల నుంచి పిల్లల రాక, పోకలకు ఇబ్బంది అవుతుందని, నైబర్‌హుడ్ స్కూలింగ్ విధానాన్ని ఆశ్రయించాం. విద్యార్థులకు సులువుగా ఉండేలా, వాళ్ళ కాలనీలోనే ఒకరి ఇంట్లో పాఠశాల తరగతులు బోధించడం మొదలుపెట్టాం. ఈ సంగతి తెలిసి చుట్టు పక్కల వారంతా చేరడం మొదలుపెట్టారు. దాంతో తక్కువ సమయంలోనే ఎక్కువ మందికి చేరువయ్యాం. తరగతి గదిలో ప్రతి ఆరుగురు విద్యార్థులకు ఒక టీచర్ ఉంటారు. తెలుగు అంటే అమితాభిమానం కలిగినవారిని గుర్తించి, శిక్షణ ఇచ్చాం. ఇప్పటికీ ప్రతి ఏటా ఉపాధ్యాయులకు బోధనా పద్ధతులమీద శిక్షణా శిబిరాలు నిర్వహిస్తుంటాం. వారంతా స్వచ్ఛందంగా సేవలందిస్తున్నారు.

సస్పెన్స్ థ్రిల్లర్ కథలు కావాలన్నారు...

పిల్లలకు తెలుగు నేర్పించడాన్ని బాధ్యతగా గాక, మన భాష పట్ల వారికి ఆసక్తి కలిగేలా శిక్షణ ఇస్తాం. అదే మా బోధనా పద్ధతి. పంచతంత్ర కథలు చెబుతున్నప్పుడు, మాకు అవి ఆసక్తిగాలేవని చాలా మంది పిల్లలు అన్నారు. పైగా హాస్య కథలు కావాలని అడిగారు. వారి అభిరుచికి అనుగుణంగా 'చిట్టి తల్లికథలు' రాశాను.

అదంతా ఉపాధ్యాయుల గొప్పతనం

ప్రతి ఆదివారం ఒక గంట పాటు విద్యార్థులకు తరగతులుంటాయి. ఆ సమయంలోనే విద్యార్థులకు వారంలో నాలుగురోజులకు సరిపడా హోంవర్క్‌ను కూడా ఇస్తాం. పాఠశాలలో చేర్పించడంతో సరికాదు, కచ్చితంగా పిల్లలతో హోమ్‌వర్క్ చేయించాలన్న షరతు మీద అడ్మిషన్ ఇస్తాం. హోమ్‌వర్క్ అంటే తెలుగు పదాలు రాయడం, చిన్న సంఘటన మీద ఇంట్లో సంభాషించడం లాంటివన్నమాట. ఏడాది మధ్యలో మానేయడం, సమయానికి తరగతులు నిర్వహించలేకపోవడం లాంటివి చేయకూడదని మా ఉపాధ్యాయులతో ముందే ఒప్పందం కుదుర్చుకుంటాం. పాఠశాల వార్షికోత్సవం సమయంలో మేమంతా ఒకచోట కలుస్తాం. అంతవరకు వారు పిల్లలు నేర్చుకున్న భాషానైపుణ్యాలను ఆ సమయంలో నాటకాలు, పాటలు లాంటి వివిధ కళారూపాల ద్వారా ప్రదర్శిస్తారు.



వారి మాటలతో ఆత్మసంతృప్తి...

మా సొంతూరు ఒంగోలు. మా నాన్న బాలకృష్ణారెడ్డి గారు కవి, రచయిత కూడా కావడంతో మొదటి నుంచి ఇంట్లో సాహిత్య వాతావరణం ఉండేది. ఆయన చదివిన ప్రతి పుస్తకంలో... తనకు నచ్చిన వాక్యాలను నాకు చదివి వినిపించేవారు. అలా గణిత శాస్త్ర విద్యార్థిని అయిన నాకు చిన్ననాటి నుంచి తెలుగు సాహిత్యంతోనూ పరిచయం ఏర్పడింది. నా భర్త రఘునాథ్ తెలుగు కథలన్నా, నవలలన్నా ఇష్టంగా చదువుతారు. ఆయనతో పాటు మరెంతోమంది స్నేహితుల సహకారంతో దీన్ని ఒక ఉద్యమంలా నిర్వహిస్తున్నాం. ఇండియాలోని బామ్మ, తాతయ్యలకు ఉత్తరాలు రాయడాన్ని సిలబస్‌లో భాగంచేశాం. వ్యవహారిక పదాలను నేర్పిండంలో భాగంగా వారితో ఫోన్‌లో సంభాషించడాన్ని ప్రోత్సహిస్తున్నాం. దాంతో వారిలో మంచి మార్పును చూడగలిగాం. ఇదివరకు ఊరు వెళితే పరాయి దేశానికి వెళ్లినట్టు ఉండేది, ఇప్పుడు సొంతూరుకు వెళ్లినట్టు ఉంటుందని పిల్లలు చెబుతున్నప్పుడు... వారి అమ్మమ్మ, నాయనమ్మలతో గడిపిన విషయాలను మాతో పంచుకుంటున్నప్పుడు ... అవి వింటుంటే కలిగే ఆత్మసంతృప్తి, ఆనందం మాటలకు అందనది.

• సాంత్వన్

తాతయ్య మాటలంటే ఇష్టం...

ఒకటి నుంచి నాల్గో తరగతి వరకు మా 'పాఠశాల'లో తెలుగు పాఠాలు బోధిస్తున్నాం. దానికి అవసరమైన పాఠ్య ప్రణాళికలను మేమే తయారు చేసుకుంటాం. ఏడాదికి నాలుగు పరీక్షలు నిర్వహిస్తాం. వార్షిక పరీక్షలో విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం ఆధారంగానే వాళ్ళను తర్వాత తరగతికి పంపిస్తాం. మా పాఠ్యాంశాలలో కుల, మత పరమైన ఆచారాలు, సంప్రదాయాలకు, విశ్వాసాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా మొదటి నుంచి జాగ్రత్తపడుతున్నాం. వాటి అనుబంధ సంస్థలు వేటితోనూ సంబంధం లేకుండా 'పాఠశాల'ను స్వతంత్రంగా నిర్వహిస్తున్నాం. మేము రూపొందించిన సిలబస్‌ను కేతు విశ్వనాథరెడ్డి గారిలాంటి విద్యావేత్తలు కొనియాడటం మరిచిపోలేని విషయం. గత వారం బాలల వ్యక్తిత్వ వికాస నిపుణుడు సీఏ ప్రసాద్ గారితో రెండు రోజులు తెలుగు బోధనా వర్క్‌షాప్ నిర్వహించాం. ఆ ముగింపు కార్యక్రమంలో ఓ ఆరేళ్ళ చిన్నారి అచ్చ తెలుగులో "నాకు ఇడ్లీ ఇష్టం, అంతకన్నా దోసె ఇష్టం, వాటికన్నా బర్గర్ ఇష్టం... వాటన్నింటికన్నా నాకు ఈ తాతయ్య మాటలంటే ఇంకా ఇష్టం" అంటూ ఆయన్ను హత్తుకుంది. అది చూసి మేమంతా నిర్ఘాంత పోయాం. అమెరికాలో పుట్టిన పిల్లలకు తెలుగుపట్ల ఉన్న మమకారానికి ఈ సంఘటన ఒక నిదర్శనం.

ఒలింపిక్స్



మన డిజైన్లు.. ప్యారిస్‌కు..!

ఫ్యాషన్, ఆర్ట్‌కు స్వర్గధామం ప్యారిస్. ఈ మహానగరం ఇపుడు ఒలింపిక్స్ క్రీడలకు వేదికైంది. అయితే ఏంటీ అంటారా? ఒలింపిక్స్ క్రీడాకారులు వాడే టవల్స్, కర్చీఫ్‌లు, బీచ్ టవల్స్, మెత్తటి దిండ్లు.. మనోళ్లు చేసినవే. పశ్చిమ గోదావరి జిల్లాలోని సీతారాంపురం గ్రామానికి చెందిన 'జెజె లక్ష్మి అండ్ కంపెనీ'లోని మహిళలు చేసిన ఈ ఉత్పత్తులే ఇప్పుడు హాట్ టాపిక్. ఈ నేపథ్యంలో ఈ సంస్థ ప్రతినిధులతో పాటు ఉద్యోగులనూ 'నవ్య' పలకరించింది...

నైపుణ్యానికి విలువ ఎక్కడైనా ఉంటుంది. సాధారణంగా ఒలింపిక్స్ క్రీడలు నిర్వహించే దేశాలు.. క్రీడాకారులకు కావాల్సిన అన్ని వనరులను కల్పించటం మామూలే. అయితే వారు ఉపయోగించే ఉత్పత్తులను అందించేందుకు కొందరు స్పాన్సర్లు ముందుకొస్తారు. ఆ స్పాన్సర్లు క్వాలిటీకే ప్రాధాన్యం ఇస్తారు. ఎక్కడా రాజీపడరు. ఈసారి పశ్చిమగోదావరి జిల్లాలోని సీతారాంపురం అనే ఓ గ్రామం.. పారిస్‌కే కొన్ని ఉత్పత్తులు ఎగుమతి చేసేంత స్థాయిలో ఎదిగింది.

ఎంతో పోటీని తట్టుకుని...

నాలుగేళ్లకోసారి జరిగే ఒలింపిక్స్ మార్కెట్‌ను క్యాష్ చేసుకునేందుకు ఎన్నో వ్యాపార సంస్థలు పోటీపడతాయి. ముఖ్యంగా ప్రపంచం నలుమూలలనుంచి క్రీడాకారులే కాదు.. వారిని స్పాన్సర్ చేసే సంస్థలు, క్రీడావిభాగంలో పని చేసే అధికారులు, మీడియా.. అన్నింటికి మించి క్రీడాభిమానుల కోలాహలం అంతా ఇంతా కాదు. ఇట్లాంటి ప్రదేశాల్లో సహజంగానే పోటీ ఎక్కువగా ఉంటుంది. పశ్చిమ గోదావరి జిల్లాలోని నరసాపురం మండలంలోని సీతారాంపురంలోని జె.జె.లక్ష్మి అండ్ కో కంపెనీ ఒకటి. ఇందులో అధికంగా మహిళలే ఉద్యోగులు. ఒలింపిక్స్‌కు మన ఉత్పత్తులు ఎగుమతి చేయాలనే లక్ష్యంతో ఈ సంస్థ పని చేసింది. క్వాలిటీ విషయంలో రాజీపడలేదు. ముఖ్యంగా ప్యారిస్‌లో ఓ డిజైనర్‌ను నియమించుకుంది. ఢిల్లీలోని ఈపీసీహెచ్ సహకారంతో పారిస్ ఎక్స్‌పోర్టు లైసెన్స్ తీసుకుని చేతితో తయారు చేసిన అల్లికలను (వంద డిజైన్లను) స్పాన్సర్స్‌కు పంపారు. వారు బీచ్ టవల్స్, టవల్స్, పిల్లోస్, పిల్లో కుషన్లను ఎంపిక చేశారు. అలా వందలాది సంస్థల పోటీ తట్టుకుని మరీ ఈ భారీ ఆర్డర్‌ను సంపాదించింది సంస్థ. దీంతో అక్కడ పని చేసే మహిళల ఆనందానికి అవధుల్లేవు.

గతాన్ని ఘనంగా...

నరసాపురం పేరు చెప్పగానే.. చేతితో తయారు చేసిన అల్లికలు గుర్తొస్తాయి. 1860 ప్రాంతంలో డచ్, బ్రిటీష్‌వాళ్లు వ్యాపారం కోసం మనదేశానికి వచ్చారు. వీళ్ల వల్లనే ఇక్కడి మహిళలకు లేసు అల్లికలు(చేతితో చేసినవి)పై అవగాహన కలిగింది. అప్పట్లో ఇక్కడి మహిళలు చేసిన లేసు అల్లికలను యూరప్ దేశాలకు ఎగుమతి చేసేవారు. అలా అల్లికలు నాంది పలికింది ఈ జిల్లానే. ఆ ప్రాంతానికి చెందిన కలవకొలను రామచంద్రుడు, పితాని వెంకన్న, సాంబమూర్తి లాంటి వ్యాపారస్తులు ఈ అల్లికలను విదేశాలకు ఎగుమతి చేసేవారు. ఒక్క సీతారాంపురం గ్రామంలోనే ఇరవై మందికి పైగా క్లాత్ ఉత్పత్తులు ఎక్స్‌పోర్ట్ చేసే వ్యాపారులు ఉన్నారు. వీరంతా దాదాపు కేంద్రప్రభుత్వం నుంచి ఉత్తమ అవార్డులు అందుకున్నవాళ్లే. ఏటా 150 కోట్లనుంచి 200 కోట్లు దాకా వ్యాపారం చేసేవారు. వేల మంది మహిళలకు ఉపాధి దొరికేదిక్కడ. అయితే కొవిడ్ సమయంలో ఈ పరిశ్రమ సంక్షోభంలో పడింది. ఆర్డర్లు లేకపోవటంతో చాలా సంస్థలు మూతపడ్డాయి. అయితే జెజె లక్ష్మి అండ్ కంపెనీ సంస్థ మాత్రం ఏమాత్రం బలహీనపడకుండా కొత్త ఉత్పత్తులపై దృష్టి మళ్లించింది. ఈపీడీసీహెచ్ సహకారంతో ఏకంగా పారిస్ వెళ్లి తమ సంస్థ ఉత్పత్తులను చూపించి అక్కడి స్పాన్సర్లను మెప్పించారు. దీంతో మూడేళ్ల నుంచీ ఈ పనిలోనే ఎక్కువ సమయం నిమగ్నమయ్యారు ఈ సంస్థ ఉద్యోగులు. కుషన్ పిల్లోస్, బీచ్ టవల్స్ నాప్కిన్లు, టవల్స్‌ను తయారు చేసి గడువుకు ముందే పంపారు. అక్కడ ఈ ఉత్పత్తులను చూసి ఈ సంస్థకు పారిస్, బ్రిటన్ వ్యాపారులు ప్రత్యేకంగా మరికొన్ని ఆర్డర్లు ఇచ్చారు. దీంతో ఈ మహిళలకు మంచి ఉపాధి దొరికినట్లయింది. దీంతో సీతారాంపురం అనే గ్రామం గతం కంటే ఘనకీర్తిని సంపాదించింది.

• **మద్దాల మురళీధర్**, నరసాపురం
ఫొటోలు: **జీవన్‌కుమార్**

శిక్షణ వల్లే మాకు ఉపాధి



లేసు మహిళలకు ఈపీసీహెచ్ ఇస్తున్న శిక్షణ వల్ల మాలాంటి మహిళలు ఎక్స్‌పోర్టు కంపెనీల్లో ఉద్యోగాలు దొరుకుతున్నాయి. గతంలో ఇంటి వద్ద కూర్చొని అల్లికలు చేసేవాళ్లం. దీని వల్ల నెలకు రెండు వేలు కూడా వచ్చేవి కాదు. శిక్షణ తీసుకోవడం వల్ల మా ఆదాయం వేలల్లో వెళ్లింది. అయితే ఆర్డర్లు ఉంటేనే మాకు పని దొరుకుతుంది. ప్రస్తుతానికి ఢోకా లేదు.

- దొంగ రేవతి, సీతారాంపురం

సంతోషంగా ఉంది



మేము తయారు చేసిన చేతి వృత్తులు ఒలింపిక్స్ జరిగే పారిస్‌కు వెళ్ళడం చాలా సంతోషంగా ఉంది. ఈ ఆర్డర్ వల్ల మాకు ఓవర్ టైం పని లభించింది. విదేశాలకు వెళ్లే వస్తువుల తయారీలో మెలకువలు కూడా గుర్తించాం. 15 ఏళ్లుగా లేసు అల్లికల్లో ఉన్నా. రెండేళ్లుగా ఇక్కడ పనిచేయడం వల్ల కుట్టుల్లో నైపుణ్యం సంపాదించాం. అనుభవం పెరిగింది. రానున్న రోజుల్లో ఇలాంటి ఆర్డర్లు వస్తే మాలాంటి వారికి మంచి రోజులు లభిస్తాయి.

- ముస్కోడి పార్వతి, సీతారాంపురం

రెండేళ్లు ఉపాధి దొరికింది



కొవిడ్ తరువాత ఉపాధి లేక చాలా ఇబ్బందులు పడ్డాం. ఆ సమయంలో జేజే కంపెనీలో పని దొరికింది. పారిస్ ఆర్డర్ రావడంతో రెండేళ్లపాటు ప్రతి రోజు పని దొరికింది. నెలకు రూ.15 వేలు సంపాదిస్తున్నాం. ఇలాంటి ఆర్డర్ స్థానిక కంపెనీలకు వస్తే మాకు ఉపాధికి కరువుండదు.

- అరవ బేబి
సీతారాంపురం

కౌన్సెలింగ్

క్యాల్షియం తగ్గకుండా...

డాక్టర్... నాకు ఇటీవలే ప్రసవం అయింది. బిడ్డకు ఐదో నెల. ఇప్పటికీ పాలిస్తూనే ఉన్నాను. చనుపాలివ్వడం ద్వారా తల్లి ఎముకలు బలహీనపడతాయని విన్నాను. ఇది ఎంతవరకూ నిజం? మున్ముందు నా ఎముకలు దృఢంగా ఉండాలంటే ఏం చేయాలి?

- ఓ సోదరి, హైదరాబాద్



మీరు విన్నది నిజమే! చనుపాలతో తల్లి శరీరంలోని క్యాల్షియం పిల్లలకు వెళ్లిపోతూ ఉంటుంది. కాబట్టి తల్లుల ఎముకలు దృఢంగా ఉండాలంటే తీసుకునే ఆహారంలో క్యాల్షియం సరిపడేలా ఉండేలా చూసుకోవాలి. ఇందుకోసం పాలు, పెరుగు పుష్కలంగా తీసుకోవాలి. పిల్లలకు పాలిచ్చే తల్లులు పెరుగు తింటే పసికందుకు జలుబు చేస్తుందనేది అపోహ! బాలింతలు నిర్భయంగా పెరుగు తినొచ్చు. అలాగే నువ్వుల లడ్లు, ఆకుకూరలు, గుడ్లు, మాంసం, చికెన్, చేపలు లాంటి బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలి. ఇలాంటి ఆహారంతో ప్రసవం ద్వారా కోల్పోయిన రక్తం భర్తీ అవుతుంది. నీరసం, నిస్సత్తువలు ఆవరించకుండా ఉంటాయి. జీడిపప్పు, బాదం, పిస్తాలు కూడా తింటూ ఉండాలి. గర్భిణిగా ఉన్నప్పుడు మహిళలు బరువు పెరగడం సహజం. సాధారణ శరీర బరువుకు మించి 15 నుంచి 20 కిలోల బరువు పెరగడం అవసరం కూడా! ఈ బరువు చూసుకుని కంగారు పడవలసిన అవసరం లేదు. ప్రసవం తర్వాత బిడ్డకు పాలిస్తున్నంత కాలం తల్లుల బరువు క్రమేపీ తగ్గిపోతూ ఉంటుంది. కాబట్టి అదనంగా డైటింగ్ లాంటివి పాటించవలసిన అవసరం లేదు. ఆరు నెలలొచ్చాక బిడ్డకు పాలివ్వడం మానేయకూడదు. బిడ్డ తాగుతున్నంత కాలం పాలిస్తూనే ఉండాలి. అయితే అదే సమయంలో తల్లి తన ఆరోగ్యం మీద కూడా దృష్టి పెట్టాలి. తాజా పండ్లు, కూరగాయలు తీసుకోవాలి. ఎముకలను బలపరిచే వ్యాయామాలు డాక్టర్ల సూచన మేరకే చేయాలి.

- **డాక్టర్ మృదుల**
స్త్రీల వైద్యులు, హైదరాబాద్

భారత సైన్యం 117

ఒలింపిక్ బృందాన్ని ప్రకటించిన క్రీడాశాఖ

బరిలో ఎనిమిది మంది తెలుగోళ్లు

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనే భారత క్రీడాకారుల బృందాన్ని కేంద్ర క్రీడా శాఖ ప్రకటించింది. ఇందులో 117 మంది అథ్లెట్లు, 140 మంది సహాయ సిబ్బంది ఉన్నారు. ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన దేశీయ అథ్లెట్లలో షాట్ పుటర్ అభా ఖతువా మినహా మిగిలిన వారందరూ పారిస్‌కు వెళ్తున్నారు. అభా గైర్హాజరుకు గల కారణాలు తెలియరాలేదు. పారిస్ ఒలింపిక్స్ ఈనెల 26 నుంచి వచ్చే నెల 11వ తేదీ వరకు జరగనున్నాయి. ఆరంభ వేడుకలను 26న నిర్వహించనున్నారు. 140 మంది సహాయ సిబ్బందికి అయ్యే ఖర్చులో ప్రభుత్వం 72 మందికి మాత్రమే భరిస్తోంది. మిగిలిన వారు సొంత ఖర్చులతో పారిస్ ప్రయాణించనున్నారు. అత్యధికంగా అథ్లెటిక్స్ నుంచి 29 మంది (18 పురుష, 11 మహిళ అథ్లెట్లు), షూటింగ్ 21 (11 మహిళ, 10 పురుష), హాకీ 19, టేబుల్ టెన్నిస్ 8, బ్యాడ్మింటన్ 7, రెజ్లింగ్ 6, ఆర్చరీ 6, బాక్సింగ్ 6, గోల్ఫ్ 4, టెన్నిస్ 3, స్విమ్మింగ్ 2, సెయిలింగ్ 2, ఈక్వెస్ట్రియన్, జూడో, రోయింగ్, వెయిట్ లిఫ్టింగ్ నుంచి ఒక్కరు చొప్పున భారత బృందంలో చోటు దక్కించుకున్నారు. టోక్యో ఒలింపిక్స్ బృందం (119)తో పోలిస్తే ఈసారి ఇద్దరు తగ్గారు. మాజీ షూటర్ గగన్ నారంగ్ ఈ బృందానికి చెఫ్ డి మిషన్‌గా వ్యవహరిస్తాడు. తెలుగు రాష్ట్రాల నుంచి షట్లర్లు సింధు, సాత్విక్, బాక్సర్ నిఖత్, షూటర్ ఇషా సింగ్, టీటీ ప్లేయర్ శ్రీజ, అథ్లెట్లు జ్యోతి యర్రాజి, జ్యోతికశ్రీ, ఆర్చర్ ధీరజ్ పారిస్ క్రీడల బరిలో ఉన్నారు.

పారిస్ ఒలింపిక్స్ **8** రోజుల్లో

సాత్విక్ జోడీ కొట్టాలి పసిడి!


● డార్క్‌హార్స్‌గా లక్ష్యసేన్

● హ్యాట్రిక్ పతక వేటలో సింధు

గత మూడు ఒలింపిక్స్‌లో భారత్‌కు పతకాలను అందిస్తున్న విభాగం బ్యాడ్మింటన్. లండన్ క్రీడల్లో సైనా నెహ్వాల్ కాంస్యం అందుకోగా.. 'రియో'లో రజతంతో మెరిసిన పీవీ సింధు.. టోక్యోలో కంచు మోత మోగించింది. ఈసారి పారిస్ క్రీడల్లో డబుల్స్ టాప్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టిపై భారీ అంచనాలున్నాయి. ఇక, సింధు హ్యాట్రిక్ పతకంతో మెరవాలనుకుంటోంది.











ఒలింపిక్స్ బ్యాడ్మింటన్‌లో భారత్ ఇప్పటి వరకు మూడు పతకాలు సాధించింది. గత రెండు ఈవెంట్లలో సింధు రజతకాంస్యాలు దక్కించుకోగా.. 2012లో సైనా ఈ విభాగంలో తొలి పతకం అందించి చరిత్ర సృష్టించింది. ఈ క్రమంలో గత మూడు మెగా ఈవెంట్లలో పతకాలనందిస్తున్న మన షటర్లు.. ఇదే ఒరవడిని కొనసాగించాలని అభిమానులు కోరుకొంటున్నారు. పారిస్ క్రీడల్లో సింధు, హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్ సింగిల్స్‌లో బరిలోకి దిగనుండగా.. డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్, అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జోడీలు ఆడనున్నాయి.

అద్భుతాలు జరిగితేనే..

కామన్వెల్త్ క్రీడల్లో గాయపడిన సింధు.. ఆ తర్వాత రీఎంట్రీ ఇచ్చినా ఫామ్‌ను అందిపుచ్చుకోలేక పోయింది. ఒలింపిక్స్‌కు అర్హత సాధించినా.. గత కొంత కాలంగా ఆడుతున్న ప్రముఖ ఈవెంట్లలో ఒక్కటి కూడా నెగ్గలేదు. ఇక, పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్ బరిలో ఉన్నారు. ఇటీవలి కాలంలో వీరి ప్రదర్శన కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో లేదు. అయితే, తమదైన రోజు ఎంతటి గొప్ప ఆటగాడికైనా ఓటమి రుచిచూపగల సత్తా వీరికి ఉంది. వీరిలో లక్ష్యసేన్‌ను డార్క్‌హార్స్‌గా నిపుణులు పరిగణిస్తున్నారు. మహిళల డబుల్స్‌లో అశ్విని జంట చివరి నిమిషంలో ఒలింపిక్ బెర్త్‌ను ఖరారు చేసుకొంది. క్రాస్టోతో కలసి అశ్విని ఈ మధ్య కాలంలోనే ఆడడం ఆరంభించగా.. ఒక్క మేజర్ టోర్నీ కూడా గెలిచిన సందర్భాలు లేవు.

ఎంతో తేడా...

బ్యాడ్మింటన్‌లో ఏదైనా పతక ఆశలు ఉన్నాయంటే.. అది పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్-చిరాగ్ నుంచే. టోక్యో ఒలింపిక్స్‌లో సాత్విక్ ద్వయం గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. అయితే, ఆ తర్వాతి నుంచి వారి కెరీర్ టాప్ గేర్‌లో దూసుకుపోయింది. 2022లో భారత్ తొలిసారి ప్రతిష్ఠాత్మక థామస్ కప్ గెలవడంలో సాయిరాజ్ జోడీ కీలకపాత్ర పోషించింది. కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణం, ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో సాత్విక్, చిరాగ్ ప్రకంపనలు సృష్టించారు. ఫ్రెంచ్ ఓపెన్‌తో తొలి సూపర్-750 సిరీస్ టైటిల్‌ను సొంతం చేసుకొన్న సాత్విక్ జంట.. స్విస్ ఓపెన్, ఆసియా చాంపియన్‌సిషిప్‌లో కూడా సత్తాచాటింది. ఈ క్రమంలో ప్రతిష్ఠాత్మకమైన ఇండోనేసియా ఓపెన్ సూపర్-1000 సిరీస్ నెగ్గిన సాయిరాజ్-షెట్టి ద్వయం.. వరల్డ్ నెంబర్‌వన్ ర్యాంక్‌ను దక్కించుకొన్న భారత తొలి డబుల్స్ జోడీగా రికార్డులకెక్కింది. ఈ ఏడాది కూడా అదే జోరును కొనసాగిస్తూ నాలుగు టోర్నీల్లో ఫైనల్ చేరింది. మిగతా ఆటగాళ్లపై అంతంతమాత్రమే అంచనాలున్న నేపథ్యంలో.. పతక భారం మొత్తం సాత్విక్-చిరాగ్ జోడీపైనే.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

అమ్మ అండతో సాగి..
పారిస్‌వైపు అడుగేసి!

ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యంగా జ్యోతి


జ్యోతి యర్రాజి


తల్లితో జ్యోతి

జ్యోతి యర్రాజి.. దేశ అథ్లెటిక్స్‌లో ఓ సంచలనం. 100 మీటర్ల హర్డిల్స్‌లో రికార్డులు తిరగ రాయడం ఆమెకు మంచినీళ్ల ప్రాయం. బరిలోకి దిగిందంటే రికార్డు నెలకొల్పాల్సిందే అన్నట్టు ఉంటుంది ఆమె పరుగు. అనతికాలంలోనే తన ఈవెంట్‌లో భారత టాప్ అథ్లెట్‌గా పేరుపొందిన ఈ తెలుగమ్మాయి.. కొద్ది కాలంలోనే ఒలింపిక్స్‌కు సైతం క్వాలిఫై అయింది. వరల్డ్ ర్యాంకింగ్స్ కోటాలో పారిస్ బెర్త్ దక్కించుకున్న జ్యోతి ..విశ్వ క్రీడల 100 మీ. హర్డిల్స్‌లో తలపడనున్న తొలి భారత అథ్లెట్‌గా రికార్డు అందుకోనుంది. తాను ఎంచుకున్న రంగంలో ఇంతటి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవడం వెనుక జ్యోతి స్వయంకృషితోపాటు ఆమె తల్లి కుమారి పడ్డ కష్టం ఎంతో ఉంది. అందుకే..పోటీలకోసం 'స్టార్టింగ్ లేన్'లో నిలుచున్నపుడు తల్లి శ్రమ జ్యోతి మదిలో మెదులుతుంది. దాంతో ఆ పోటీలో గెలిచి తీరాలన్న కాంక్ష ఆమెలో రెండింతలవుతుంది. ఆ క్రమంలోనే జ్యోతి పరుగుకు పలు జాతీయ రికార్డులు దాసోహమయ్యాయి. విశాఖపట్నానికి చెందిన జ్యోతిది పేద కుటుంబం. క్రీడా రంగంపై ఆమెకు ఎంతో ఆసక్తి ఉన్నా..ఆ దిశగా అడుగులు వేసేందుకు కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించని దుస్థితి. దాంతో కూతురు భవిష్యత్‌కోసం తాను మరింత శ్రమించాలని జ్యోతి తల్లి నిర్ణయించుకుంది. ఇళ్లలో పని చేయడంతోపాటు స్థానికంగా ఓ ఆసుపత్రిలో క్లీనర్‌గా డబుల్ షిప్ట్ చేసేది. తల్లి కష్టం..తన శ్రమ..వెరసి జ్యోతి ప్రయాణం ఇప్పుడు ఒలింపిక్స్ దాకా చేరింది. 'నా కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. అయినా, పరిస్థితులను తట్టుకొని ముందుకు సాగాల న్నది అమ్మ మాట. పతకం గెలవాలని పోటీలకు ముందు అమ్మ ఎప్పుడూ చెప్పేది కాదు. నీ పనిని నువ్వు చెయ్! ఫలితం ఎలా ఉన్నా స్వీకరించు' అని అమ్మ వెన్ను తట్టేదని జ్యోతి తెలిపింది. తన ఉన్నతిలో కోచ్ జేమ్స్ హిలీయర్ పాత్ర కూడా ఎనలేనిదని 100 మీ. హర్డిల్స్‌లో 12.78 సెకన్లతో జాతీయ రికార్డు నెలకొల్పిన జ్యోతి వెల్లడించింది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

నాన్న కోసం..


జ్యోతికశ్రీ

మరో తెలుగు అథ్లెట్ 23 ఏళ్ల జ్యోతిక శ్రీ దండి కూడా ఒలింపిక్స్‌లో పోటీపడుతోంది. మహిళల 4-400 మీ. రిలే జట్టులో బరిలో దిగుతున్న జ్యోతిక శ్రీ చదువులో టాపర్. తణుకులో పదో తరగతి చదివిన ఆమె..97 శాతం మార్కులు సాధించింది. డాక్టర్ కావాలన్నది ఆమె చిన్ననాటి కల. కానీ జ్యోతిక శ్రీ తండ్రి శ్రీనివాసరావు బాడీ బిల్డర్. కుమార్తెను క్రీడాకారిణిని చేయాలని..ఆమె ఒలింపిక్స్‌లో ఆడితే చూడాలన్నది అతడి స్వప్నం. దాంతో తండ్రి ఆకాంక్షకు అనుగుణంగా అథ్లెటిక్స్ ఎంచుకున్న ఆమె..అతడి కలను నిజం చేస్తూ విశ్వక్రీడలకూ ఎంపికైంది. దాంతో శ్రీనివాసరావు ఆనందం అంతా ఇంతా..కాదు!

హాకీ సౌత్‌జోన్ విజేత ఆంధ్ర

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): సౌత్‌జోన్ జూనియర్ హాకీ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ అమ్మాయిల జట్టు విజేతగా నిలిచింది. కాగా ఏపీ బాలుర జట్టు మూడో స్థానం దక్కించుకుంది. బుధవారం పులివెందులలో జరిగిన అమ్మాయిల ఫైనల్లో ఏపీ 5-0తో కర్ణాటకను ఓడించింది. బాలుర మూడో స్థానం పోరులో ఏపీ 5-0తో తెలంగాణపై నెగ్గింది.



జైస్వాల్ @ 6

దుబాయ్: జింబాబ్వేతో సిరీస్‌లో అదరగొట్టిన యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ కెరీర్ బెస్ట్ ఆరో ర్యాంక్‌ను సొంతం చేసుకొన్నాడు. బుధవారం విడుదల చేసిన ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ జాబితాలో జైస్వాల్ 4 స్థానాలు ఎగబాకి ఆరో ర్యాంక్‌లో నిలిచాడు. గిల్ 36 స్థానాలు మెరుగుపరచుకొని 37వ ర్యాంక్ దక్కించుకొన్నాడు. సూర్యకుమార్ 2వ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. రుతురాజ్ 6 నుంచి 8వ ర్యాంక్‌కు పడిపోయాడు. బౌలింగ్ విభాగంలో అక్షర్ పటేల్ 13వ, ముకేష్ 46వ, వాషింగ్టన్ 73వ స్థానాల్లో ఉన్నారు. ఆల్‌రౌండర్లలో హార్దిక్ పాండ్యా 6వ ర్యాంక్‌లో నిలిచాడు.



హైదరాబాద్ జీసీసీ సెంటర్ విస్తరణ కోసం
రూ.3,600 కోట్ల పెట్టుబడులు
సనోఫీ హెల్త్‌కేర్ ఇండియా వెల్లడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సనోఫీ హెల్త్‌కేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్‌లోని తమ గ్లోబల్ కెపాసిటీ సెంటర్ (జీసీసీ) విస్తరణ కోసం వచ్చే ఆరు సంవత్సరాల్లో 40 కోట్ల యూరోల (రూ.3,600 కోట్లు) పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. బుధవారం నాడిక్కడ సనోఫీ హైదరాబాద్ హబ్‌ను తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డీ శ్రీధర్ బాబు, సనోఫీ బిజినెస్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ మెడెలిన్ రోష్ ప్రారంభించారు. అనంతరం మెడెలిన్ రోష్ విలేకరులతో మాట్లాడుతూ.. వచ్చే రెండేళ్ల కాలంలో జీసీసీని 2,600 మంది ఉద్యోగులు పని చేసేందుకు సౌకర్యవంతంగా ఉండేలా విస్తరించనున్నట్టు చెప్పారు. సనోఫీకి గల నాలుగు గ్లోబల్ హబ్‌లలో ఇదే అతి పెద్ద కేంద్రం అవుతుందని ఆమె అన్నారు. ప్రస్తుతం ఈ కేంద్రంలో 1,000 మంది పని చేస్తున్నట్టు ఆమె చెప్పారు. ఈ స్థాయి కేంద్రాన్ని నిర్వహించేందుకు వీలుగా ప్రతిభావంతులను నియమించుకోవడం, కొత్త సామర్థ్యాలు సమకూర్చుకోవడం, ఇతరత్రా అంశాలపై పెట్టుబడులు పెట్టనున్నట్లు చెప్పారు. 2019లో ప్రారంభమైన హైదరాబాద్ కేంద్రం ఒక మెడికల్ హబ్ స్థాయి నుంచి అత్యుత్తమ సేవలందించే ప్రపంచ కేంద్రంగా మారిందని చెప్పారు. ఈ కేంద్రంలో పని చేస్తున్న వారిలో 50 శాతం మంది ఫార్మా సైన్సెస్‌లో డాక్టరేట్లు, మాస్టర్స్ డిగ్రీ హోల్డర్లేనని, 20 శాతం మంది టెక్నాలజీ నిపుణులని చెప్పారు. ఈ కేంద్రంలో రోగ నిర్ధారణ నుంచి చికిత్స వరకు అన్నీ కృత్రిమ మేధ(ఏఐ) సహాయంతో చేస్తున్నట్టు కంపెనీ చీఫ్ డిజిటల్ ఆఫీసర్ ఎస్టాబ్ ఇమ్మాన్యుయేల్ ఫ్రైనెహార్డ్ తెలిపారు.

తెలంగాణ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం పెంపు

విభోర్ స్టీల్ ట్యూబ్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విభోర్ స్టీల్ ట్యూబ్స్ లిమిటెడ్ (వీఎస్‌టీఎల్).. తెలంగాణలోని తన ప్లాంట్ తయారీ సామర్థ్యాన్ని రెట్టింపు చేసింది. మహబూబ్ నగర్ జిల్లా బాలానగర్‌లో ఉన్న ఈ ప్లాంట్ తయారీ సామర్థ్యం ప్రస్తుతం 24,000 టన్నులుండగా దాన్ని 48,000 టన్నులకు పెంచినట్టు తెలిపింది. క్రాష్ బారియర్స్ ఉత్పత్తిని పెంచడం కోసం ఈ ప్లాంట్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన గాల్వనైజింగ్ ఐరన్ (జీఐ) యూనిట్‌ను కంపెనీ ప్రారంభించింది. ఈ ప్లాంట్ ఏర్పాటుకు రూ.2 కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు కంపెనీ తెలిపింది. హరియాణా కేంద్రంగా ఉన్న వీఎస్‌టీఎల్‌కు తెలంగాణతో పాటు మహారాష్ట్రలోని రాయగఢ్‌లో మరో ప్లాంట్ కూడా ఉంది.

చిన్న షేరు.. భారీ లాభం



ఈ ఏడాదిలో బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 30% అప్

27 శాతం పెరిగిన స్మాల్‌క్యాప్ ఇండెక్స్

న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్లో బడా కంపెనీలతో పోలిస్తే చిన్న, మధ్య స్థాయి షేర్లే మదుపరులకు అధిక ప్రతిఫలాలు అందించాయి. దేశీయంగా ఆశాజనక ఆర్థికాంశాలతో పాటు ద్రవ్య ప్రవాహం పెరగడం ఇందుకు దోహదపడ్డాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు (జూలై 16 నాటికి) బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 10,984.72 పాయింట్లు లేదా 29.81 శాతం వృద్ధి చెందగా.. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 11,628.13 పాయింట్లు లేదా 27.24 శాతం పుంజుకుంది. ఇదే సమయంలో బీఎస్ఈ ప్రామాణిక సూచీ సెన్సెక్స్ 30 మాత్రం 8,476.29 పాయింట్లు లేదా 11.73 శాతం పెరిగింది. "సెన్సెక్స్ లిస్టెడ్ కంపెనీలతో పోలిస్తే మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ స్టాక్స్ మెరుగైన పనితీరు కనబర్చడానికి వీటిలోకి దేశీయంగా ద్రవ్య ప్రవాహం పెరగడమే ప్రధాన కారణం. మ్యూచువల్ ఫండ్స్, పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (పీఎంఎస్)తో పాటు ప్రత్యక్ష పెట్టుబడుల ద్వారా దేశీయ మదుపరుల సొమ్ము భారీగా వీటిలోకి వచ్చి చేరుతోంద"ని స్వస్తిక ఇన్వెస్ట్‌మార్ట్ లిమిటెడ్ ఎండీ సునీల్ న్యాతి అన్నారు.

ప్రస్తుతం మార్కెట్లో దీర్ఘకాలిక బుల్ ర్యాలీ కొనసాగుతోందని, ఈ సమయంలో చిన్న, మధ్య స్థాయి కంపెనీలు బ్లూచిప్‌లకు మించిన పనితీరు కనబరుస్తుంటాయని పేర్కొన్నారు. లార్జ్‌క్యాప్ షేర్లూ మంచి పనితీరు కనబర్చినప్పటికీ, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఎఫ్ఐఐ) అమ్మకాల కారణంగా స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్‌ల కంటే వెనకబడ్డాయన్నారు. మార్కెట్లో చాలావరకు కంపెనీలు, ముఖ్యంగా చిన్న, మధ్య స్థాయి విభాగ షేర్లు ఇప్పటికే అధిక ధరల వద్ద ట్రేడవుతున్నాయన్న ఆందోళనలున్నాయి. అయినప్పటికీ లార్జ్‌క్యాప్ షేర్లు మరింత పుంజుకునే అవకాశాలున్నాయి. ఈ ఏడాది ప్రథమార్థంలో భారీగా అమ్మకాలకు పాల్పడిన ఎఫ్ఐఐలు కూడా మళ్లీ కొనుగోళ్లు పెంచారని న్యాతి పేర్కొన్నారు.

దిద్దుబాటుకు చాన్స్

ఈ నెల 16న బీఎస్ఈ సెన్సెక్స్ 80,898.3 పాయింట్ల వద్ద, మిడ్‌క్యాప్ సూచీ 48,175.21 పాయింట్ల వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని నమోదు చేశాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ ఈ నెల 8న 54,617.75 వద్ద ఆల్‌టైం గరిష్ఠాన్ని రికార్డు చేసింది. దేశీయ ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతున్నందున చిన్న, మధ్య స్థాయి కంపెనీలు భవిష్యత్‌లో మరింత వృద్ధి చెందడానికి అవకాశాలుండటంతో ఈ విభాగ షేర్లకు గిరాకీ పెరిగిందని మాస్టర్ క్యాపిటల్ సర్వీసెస్ లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అర్విందర్ సింగ్ నంద అన్నారు. సాధారణంగా మిడ్‌క్యాప్ సూచీలోని కంపెనీల షేర్ల మార్కెట్ విలువ బ్లూచిప్‌ల మార్కెట్ క్యాప్‌లో ఐదో వంతు ఉంటుంది. పదో వంతు విలువైన కంపెనీల షేర్లు స్మాల్‌క్యాప్ సూచీలో ఉంటాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగంలో కొంత బుడగ ఏర్పడిందని, దిద్దుబాటుకు అవకాశాలున్నాయని అభిప్రాయపడ్డారు. అయితే, మార్కెట్లోకి ద్రవ్య ప్రవాహం నిరాటంకంగా కొనసాగుతున్న నేపథ్యంలో కరెక్షన్ ఎప్పుడు చోటు చేసుకోవచ్చన్నది చెప్పడం సవాలేనని అన్నారు. విధానపరమైన మార్పులు లేదా కంపెనీల పనితీరు నిరాశాజనకంగా ఉంటే తప్ప దిద్దుబాటుకు తక్షణ ప్రేరేపణలేమీ లేవన్నారు.

ఎల్ఐసీ, ఎస్‌బీఐకి కలిసొచ్చిన 'ఇన్‌ఫ్రా'

గడిచిన ఏడాది కాలంలో ప్రభుత్వ రంగ దిగ్గజాలైన ఎల్ఐసీ, ఎస్‌బీఐ షేర్లు తమ ప్రత్యర్థి కంపెనీల కంటే మెరుగైన పనితీరు కనబర్చాయి. మౌలిక సదుపాయాలు సహా భారత భవిష్యత్ వృద్ధికి దోహదపడే రంగాలపై దృష్టి సారించడం ఈ రెండు కంపెనీలకు కలిసివచ్చింది. ఎల్ఐసీ ఇన్‌ఫ్రా సహా ఇతర వృద్ధి కారక రంగాల్లో పెట్టుబడులు పెట్టగా.. ప్రైవేట్ రంగానికి చెందిన హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ మాత్రం టెక్నాలజీ, కన్స్యూమర్, బీఎఫ్ఎస్ఐ రంగాలపై దృష్టిసారించాయి. 2023 జూలై 18న రూ.620 స్థాయిలో ఉన్న ఎల్ఐసీ షేరు గడిచిన ఏడాది కాలంలో 79 శాతం వృద్ధి చెంది 2024 జూలై 16న రూ.1,109.15 వద్ద ముగిసింది. కాగా, ఇదే కాలానికి హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ షేరు రుణాత్మక వృద్ధిని నమోదు చేయగా.. ఐసీఐసీఐ ప్రు లైఫ్ 12 శాతం వృద్ధిని కనబర్చింది. ఎస్‌బీఐ లైఫ్ షేరు 23 శాతం పెరిగింది. ఇక ఎస్‌బీఐ విషయానికొస్తే, గడిచిన ఏడాది కాలంలో బ్యాంక్ షేరు రూ.592 నుంచి రూ.880.95కు చేరుకుంది. అంటే, 48 శాతం వృద్ధిని కనబరిచింది. ఇదే సమయంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు మైనస్ 3 శాతం నుంచి 24 శాతం శ్రేణిలో వృద్ధి చెందాయి.

బిజినెస్

కోల్డ్ ఫ్యూజన్ టెక్నాలజీతో
స్వచ్ఛ ఇంధనం ఉత్పత్తి
హైదరాబాద్ స్టార్టప్ హైలెనర్ ఆవిష్కరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ హైలెనర్.. కోల్డ్ ఫ్యూజన్ టెక్నాలజీ ఉపయోగించి స్వచ్ఛ ఇంధనం ఉత్పత్తి చేసే ప్రక్రియను బుధవారం ప్రదర్శించింది. టీ హబ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ టెక్నాలజీ ద్వారా 100 వాట్స్ విద్యుత్‌ను డివైస్‌లోకి పంపడం ద్వారా 150 వాట్స్‌తో సమానమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేసింది. దీన్ని సమర్థవంతంగా వినియోగంలోకి తెచ్చినట్టయితే శిలాజ ఇంధనాలపై ఆధారనీయత తగ్గించుకోవచ్చని హైలెనర్ సీఈఓ సిద్ధార్థ దొరైరాజన్ తెలిపారు. ఈ టెక్నాలజీని మరింత మెరుగుపరచడం ద్వారా అదనంగా ఉత్పత్తి అయ్యే వేడిని రెండున్నర రెట్ల మేరకు పెంచవచ్చని దొరైరాజన్ చెప్పారు. అధిక వేడి అవసరం అయ్యే విభిన్న రంగాల్లో ఈ టెక్నాలజీని వినియోగించి తక్కువ విద్యుత్‌తో గరిష్ఠ వేడిని పొందవచ్చన్నారు. తమ లో ఎనర్జీ అణు రియాక్టర్ (లెనర్) టెక్నాలజీకి కేంద్రం నుంచి పేటెంట్ కూడా లభించినట్టు ఆయన తెలిపారు.

● ఈ-కామర్స్ పోర్టల్ ఫ్లిప్‌కార్ట్‌లో శుక్రవారం నుంచి లండన్‌కి చెందిన నథింగ్ సబ్ బ్రాండ్ సీఎంఎఫ్ ఫోన్ 1 విక్రయాలు ప్రారంభం కానున్నాయి. 6జీబీ రామ్ ప్లస్ 128 జీబీ మెమొరీ, 8జీబీ రామ్ ప్లస్ 128 జీబీ మెమొరీతో అందుబాటులో ఉండనున్న ఈ ఫోన్ ధరలు వరుసగా రూ.15,999, రూ.17,999గా ఉన్నాయి.

● ఏజీ అండ్ పీ ప్రథమ్.. వచ్చే మూడేళ్లలో తిరుపతిలో 50 వేల గృహాలకు పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) కనెక్షన్లను అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కాగా పీఎన్‌జీ వాణిజ్య కనెక్షన్స్‌ను కూడా కంపెనీ అందుబాటులోకి తెచ్చింది. ఇందులో భాగంగా తొలి వాణిజ్య కనెక్షన్‌ను ఎడిఫై స్కూల్‌కు ఇచ్చింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	75,000 ▲	68,750 ▲	100,500 ▲
ముంబై	73,339 ▲	67,179 ▲	92,014 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

18వ తేదీ

హైదరాబాద్	540	విజయవాడ	555
వరంగల్	542	గోదావరి	555
చిత్తూరు	573	విశాఖపట్నం	575

డజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	105	విజయవాడ	112
వరంగల్	105	గుంటూరు	113
కరీంనగర్	105	ఒంగోలు	113
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	119
కర్నూలు	105	నెల్లూరు	119
విశాఖపట్నం	104	అనంతపురం	112
గోదావరి	112		

ఆర్థిక సేవల రంగంలో 18 లక్షల ఉద్యోగాలు ఖాళీ

అహ్మదాబాద్: దేశీయ ఆర్థిక సేవల రంగం ఉద్యోగుల కొరత సమస్యను ఎదుర్కొంటోందని ఫైనాన్షియల్ ప్లానింగ్ స్టాండర్డ్స్ బోర్డ్ (ఎఫ్‌పీఎస్‌బీ) ఇండియా సీఈఓ క్రిషన్ మిశ్రా అన్నారు. సరైన అభ్యర్థులు లభించక గత ఏడాది దాదాపు 18 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. "కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్ డేటా ప్రకారం.. గత ఏడాది ఆర్థిక సేవల రంగంలో కొత్తగా 46.86 లక్షల ఉద్యోగాలు సృష్టించబడగా.. అందులో 27.5 లక్షల ఉద్యోగాలు మాత్రమే భర్తీ అయ్యాయి. దీన్ని బట్టి చూస్తే, 18 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఈ ఉద్యోగాలు చేపట్టేందుకు సరైన అర్హత కలిగిన వారు లభించకపోవడమే ఇందుకు కారణ"మని పేర్కొన్నారు.

రియల్టీలోకి పీఈ పెట్టుబడులు
రూ. 25,000 కోట్లు

నైట్‌ఫ్రాంక్ ఇండియా వెల్లడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఈ ఏడాది ప్రథమార్థంలో రియల్ ఎస్టేట్ రంగంలోకి ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) పెట్టుబడులు 15 శాతం వృద్ధి చెంది 300 కోట్ల డాలర్లుగా (రూ.25,200 కోట్లు) నమోదయ్యాయి. ప్రధానంగా వేర్‌హౌసింగ్ రంగంలోకి పెట్టుబడులు వెల్లువెత్తడం ఈ వృద్ధికి దోహదపడింది. ప్రాపర్టీ కన్సల్టెన్సీ నైట్ ఫ్రాంక్ ఇండియా తాజా నివేదికలో ఈ విషయం వెల్లడించింది. మొత్తం పీఈ పెట్టుబడుల్లో 52 శాతం వాటాతో వేర్‌హౌసింగ్ రంగం అగ్రగామిగా ఉండగా రెసిడెన్షియల్ విభాగం 29 శాతం, ఆఫీస్ విభాగం 20 శాతం వాటా సాధించాయి. 2018 నుంచి పీఈ పెట్టుబడుల ఆకర్షణలో వేర్‌హౌసింగ్ రంగం అగ్రస్థానంలో నిలుస్తూ వస్తోంది. ఆఫీస్, రిటైల్, రెసిడెన్షియల్ రంగాలు మూడూ ఉమ్మడిగా ఆకర్షించిన పెట్టుబడులకు సమానంగా పెట్టుబడులు ఆకర్షించింది.

హైదరాబాద్ రియల్టీలోకి రూ.3,000 కోట్లు: ఇదిలా ఉండగా హైదరాబాద్ రియల్టీ రంగంలోకి పీఈ పెట్టుబడులు ఈ ఏడాది ప్రథమార్థంలో 12 శాతం పెరిగి 35.7 కోట్ల డాలర్లకు (రూ.2,998 కోట్లు) చేరాయి. అందులో కూడా 74 శాతం పెట్టుబడులు అంటే 26.5 కోట్ల డాలర్లు (రూ2,226 కోట్లు) ఆఫీస్ విభాగంలోకి రాగా మిగతా 9.2 కోట్ల డాలర్లు (రూ.772 కోట్లు) రెసిడెన్షియల్ రంగంలోకి వచ్చాయి.

ఎల్‌టీఐమైండ్‌ట్రీ లాభం రూ.1,135 కోట్లు

ముంబై: ఐటీ సర్వీసెస్ సంస్థ ఎల్‌టీఐమైండ్‌ట్రీ.. జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలో రూ.1,135 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంతో లాభం 1.5 శాతం తగ్గింది. కాగా త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం మాత్రం 5.1 శాతం వృద్ధి చెంది రూ.9,142.60 కోట్లకు చేరుకుందని కంపెనీ ఎండీ, సీఈఓ దేబాశిష్ ఛటర్జీ తెలిపారు. ఈ కాలంలో వీసా చార్జీలు, రవాణా వ్యయాలు ఎక్కువగా ఉండటం పనితీరును దెబ్బతీసిందని పేర్కొన్నారు. అయితే రానున్న త్రైమాసికాల్లో నిర్వహణాపరంగా పనితీరును మెరుగుపరుచుకోవటంపై ప్రధానంగా దృష్టి పెట్టనున్నట్లు ఆయన తెలిపారు. జూన్ త్రైమాసికంలో కొత్తగా 140 కోట్ల డాలర్ల డీల్స్‌ను కుదుర్చుకున్నట్లు ఛటర్జీ వెల్లడించారు.

1.400 మంది ఫ్రెషర్ల నియామకం: జూన్ త్రైమాసికంలో 1,400 మంది ఫ్రెషర్లను చేర్చుకున్నట్లు దేబాశిష్ ఛటర్జీ తెలిపారు. ఫ్రెషర్స్‌కు ఇచ్చిన మాటకు కట్టుబడి ఈ నియామకాలు చేసినట్లు ఆయన తెలిపారు. కాగా గడచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన త్రైమాసికంతో పోల్చితే మొత్తం ఉద్యోగుల సంఖ్య 81,650 నుంచి 81,934కు పెరిగిందని, అయితే గత ఏడాది ఇదే కాలం (82,738)తో పోలిస్తే మాత్రం తగ్గిందని చెప్పారు.



గత వైసీపీ ప్రభుత్వం నిర్మించిన గోడను కూల్చివేయడంతో తెరుచుకున్న అసెంబ్లీ గేట్-2 ద్వారాలు

స్పీకర్ ఆదేశాలతో తెరుచుకున్న అసెంబ్లీ గేట్

అమరావతి, జూలై 17(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం అడ్డుగోడ కట్టి మూసేసిన అసెంబ్లీ గేట్ 2 స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఆదేశాలతో తెరుచుకుంది. వైసీపీ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి రైతులు తమకి జరిగిన అన్యాయానికి ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు, ఆందోళనలు చేస్తున్న సమయంలో జగన్ సర్కార్ గేట్ 2ని మూసి గోడ కట్టించింది.

నరకయాతన అనుభవించా..!

- మళ్లీ ఇంటికి చేరతాననుకోలేదు
- స్వగ్రామానికి కువైత్ బాధితుడు శివ
- లోకేశ్, పవన్, నల్లారి కిశోర్‌కు కృతజ్ఞతలు



బెంగళూరు విమానాశ్రయంలో శివను హత్తుకుని కంటతడి పెడుతున్న భార్య, కుమార్తెలు

వాల్మీకిపురం, జూలై 17: కుటుంబ జీవనం కోసం కువైత్ వెళ్లి నరకయాతన అనుభవించిన తెలుగు కార్మికుడు శివ బుధవారం స్వగ్రామానికి చేరుకున్నారు. తెల్లవారుజామున 4 గంటలకు బెంగళూరు ఎయిర్‌పోర్టుకు చేరుకున్న శివను చూసి భార్య శంకరమ్మ, కుమార్తెలు వెన్నెల, వనిత కన్నీటిపర్యంతమయ్యారు. అనంతరం స్వగ్రామం అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలం చింతపర్తి బీసీ కాలనీకి చేరుకున్న ఆయన్ను టీడీపీ, జనసేన నాయకులు పరామర్శించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ కువైత్‌లో ఒకటిన్నర నెలకే నరకం చూశానని వాపోయారు. అప్పు చేసి మరీ కువైత్ వెళ్లానని, అక్కడికి చేరిన తరువాత తనతో చేయించిన పనులతో ఆత్మహత్య చేసుకోవాలన్న విరక్తి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. 'గొర్రెలు, మేకలు, బాతులు, పావురాలు, కుక్కలకు కాపలాగా పెట్టారు. రోజూ 2 కిలోమీటర్ల దూరం వెళ్లి చెట్లకు నీళ్లు పోసి రావాల్సి వచ్చేది. ఇసుక తుపాన్లు, ఎడారిలో పాములు, తేళ్లతో ప్రాణభయంతో రాత్రిళ్లు బిక్కుబిక్కుమని గడపాల్సి వచ్చింది. మళ్లీ ఇంటికి చేరుకుని భార్య, పిల్లలను చూస్తాననుకోలేదు. బాధలు భరించలేక ఆత్మహత్య చేసుకుందామనుకున్న సమయంలో ఎడారి నుంచి పోస్టు చేసిన వీడియో ద్వారా ఎంతోమంది సాయం అందించడం జీవితంలో మరచిపోలేను' అంటూ శివ కన్నీటిపర్యంతమయ్యారు. మంత్రి నారా లోకేశ్ తక్షణం స్పందించి తాను స్వగ్రామానికి వచ్చేందుకు సహాయపడ్డారని తెలిపారు. ఈ సందర్భంగా లోకేశ్, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, భారతీయ ఎంబసీ అధికారులకు శివ కృతజ్ఞతలు తెలిపారు. కాగా, కువైత్‌లో వేధింపులకు గురై స్వగ్రామానికి చేరుకున్న శివను చింతపర్తి గ్రామ పంచాయతీలో కార్మికుడిగా చేర్చుకుని జీవనోపాధి కల్పిస్తున్నట్లు సర్పంచ్ మహిత శేషాద్రిరెడ్డి చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ పీలేరు తెలుగు యువత ఉపాధ్యక్షుడు లంకిపల్లె మధు, నాయకులు పాల్గొన్నారు.

మన కష్టం ప్రజలకు తెలియాలి!

"కొత్త ప్రభుత్వం రాగానే కొన్ని సమస్యలు పరిష్కారం కావాలని ప్రజలు ఆత్రుత పడతారు. మనం ఎన్ని సమస్యల్లో కూరుకుపోయి ఉన్నామో వారికి తెలిస్తే మన కష్టం విలువ తెలుస్తుంది. అవసరం అయిన చోట మనం ఉన్న పరిస్థితిని ప్రజలకు వివరించండి. దానిని మార్చడానికి ఎంత ప్రయత్నిస్తున్నామో కూడా చెప్పండి"
- టీడీపీ ఎంపీలతో చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

పైసా కూడా నిధులు లేవు. వైసీపీ దిగిపోతూ ప్రభుత్వాన్ని దివాలా తీయించింది. అత్యవసర ఖర్చుల కోసం శాఖల వద్ద అంతర్గతంగా ఉంచుకొనే డబ్బును కూడా ఊడ్చేశారు. పదోతరగతి పిల్లల నుంచి పరీక్షల కోసం చెల్లించే ఫీజులను విద్యా శాఖ వద్ద ఉంచి పరీక్షల ఖర్చుల కోసం వాడతాం. చివరకు ఆ డబ్బులు కూడా ఉంచకుండా వేరే పనుల కోసం వాడేశారు. చిన్న చిన్న పనులకు కూడా డబ్బులు లేవు. అయినా ఏదో రకంగా నెట్టుకువస్తున్నాం. ఏదీ ఆగకుండా చూసుకొంటున్నాం" అని ఆయన వారికి వివరించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పిలుపు మేరకే తాను ఢిల్లీ వచ్చినట్లు ఆయన తెలిపారు. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు మిత్రపక్షాలతో ఒకసారి మాట్లాడే నిమిత్తం పిలిచారని, మన అవసరాలు చెప్పామని ఆయన వారికి వివరించారు. "బడ్జెట్‌లో కేంద్రం మన రాష్ట్రానికి భారీగా నిధులు ఇస్తుందని ఆశలు పెట్టుకోవద్దు. అలా చేయలేరు. ఒక రాష్ట్రానికి ఇస్తే అన్ని రాష్ట్రాలు వాళ్ల మీద పడతాయి. మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రం పరిస్థితి ఎంత దిగజారిపోయిఉందో చెప్పాను. వాళ్లకూ అర్థం అయింది. కానీ కొన్ని పరిమితులు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ పథకాల నుంచి ఎంతవరకూ తీసుకోగలమో చూసుకొని వాటిని రాబట్టుకోవాలి. గతంలో మన ప్రభుత్వం ఉన్నప్పుడు ఉపాధి హామీ పథకం నిధులు కేంద్రం నుంచి బాగా తీసుకోగలిగాం. ఇప్పుడు కూడా కేంద్ర పథకాల్లో అలా వాడుకోగలిగినవి వాడుకోవాలని చెబుతున్నారు. కేంద్ర పథకాల్లో కొన్నింటిని వాడుకోవడానికి మనం నలభై శాతం వాటా భరించాలి. అప్పుడు కేంద్రం వాటా కింద అరవై శాతం వస్తాయి. ఆ నలభై శాతం భరించాలన్నా మన ఆర్థిక పరిస్థితి భారంగానే ఉంది. అయినా ఏం చేయగలమో చూద్దాం. బడ్జెట్‌లో పోలవరం, అమరావతికి కొంత మేర కేటాయింపులు ఉండే అవకాశం ఉంది. ఏ పథకం కింద నిధులు అడిగినా గతంలో (వైసీపీ ప్రభుత్వం) ఇచ్చిన నిధుల ఖర్చు వివరాలను



ఢిల్లీలోని 1 జన్‌పథ్‌లోని నివాసంలో సీఎం చంద్రబాబుకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేంద్రంలోని వివిధ శాఖల్లో పెండింగులో ఉన్న ఏపీ అంశాలను వివరిస్తున్న ఏపీ భవన్ రెసిడెంట్ అధికారి లవ్ అగర్వాల్

కేంద్రంలోని అధికారులు అడుగుతున్నారు. వైసీపీ ప్రభుత్వం కేంద్రం ఇచ్చిన నిధులను ఇష్టానుసారం దారి మళ్లించి ఖర్చు చేసింది. దారి మళ్లింపునకు కేంద్రం నిబంధనలు అంగీకరించవు. దీనివల్ల అనేక పథకాలకు కొత్తగా నిధులు వచ్చే అవకాశం లేకుండా పోయింది. రుణాలు తీసుకోవడానికి అవకాశం ఉన్నంత మేరా నాడు వైసీపీ ప్రభుత్వం చేసేసింది. వాటిని ఏం చేశారో కూడా అర్థం కావడం లేదు. కొత్తగా రుణాలు తీసుకోవడానికి నిబంధనలు సడలించాలని కోరాం. సడలింపు లభిస్తుందని ఆశిస్తున్నాం" అని ఆయన వారికి చెప్పారు. ఏ కేంద్ర మంత్రిత్వ శాఖలోని పథకాల నుంచి రాష్ట్రానికి అధిక నిధులు రాబట్టవచ్చో ఎంపీలు కొంత కసరత్తు చేయాలని చంద్రబాబు సూచించారు. కొద్దిరోజుల్లో రాష్ట్రంలో మంత్రులు, శాఖల ముఖ్య కార్యదర్శులు, ఎంపీలతో ఒక సంయుక్త సమావేశాన్ని నిర్వహిస్తానని, కేంద్రంలో ఉన్న పథకాల పరిధిలో నిధులు రాబట్టుకోవడానికి ఎక్కడ అవకాశం ఉందో విపులంగా చర్చిస్తామని వారికి చెప్పారు. బిహార్‌కు ప్రత్యేక ప్యాకేజిని కేంద్రం ఇవ్వబోతోందన్న ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చారు. 'అటువంటి అవకాశాలు లేవు. ఏ రాష్ట్రానికీ ప్రత్యేకంగా ప్యాకేజిని ఇవ్వరు. గతంలో కొన్ని ఈశాన్య రాష్ట్రాలకు ఇచ్చేవారు. ఇప్పుడు అది కూడా నిలిపివేశారు. విభజన చట్టం కింద ఇచ్చిన హామీల పరిధిలో మనకు కొంత అదనంగా రావడానికి అవకాశం ఉంది. దానికోసమే ప్రయత్నం చేస్తున్నాం" అని వారితో చంద్రబాబు అన్నారు.

కష్టాల్లో ఉన్న ప్రజలకు ఆపన్నహస్తం

మంత్రి లోకేశ్‌కు నెటిజన్ల ప్రశంసలు

అమరావతి, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఏజెంట్ల చేతిలో మోసపోయి గల్ఫ్‌లో చిక్కుకున్న తెలుగు కార్మికుడు శివ చివరకు మంత్రి లోకేశ్ చొరవతో స్వస్థలానికి చేరుకున్నారు. సోషల్ మీడియాలో వచ్చిన వీడియోను చూసి స్పందించిన లోకేశ్‌పై ఈ సందర్భంగా నెటిజన్లు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. లోకేశ్ పనితీరును నేటి తరం నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని ఓ నెటిజన్ అభిప్రాయపడ్డారు. 'కష్టాల్లో ఉన్న ప్రజల కోసం ఎంతవరకైనా వెళ్లి ఆపన్నహస్తం అందించే మీ కమిట్‌మెంట్‌కు హ్యాట్సాఫ్' అంటూ బాలాజీ గుప్తా అనే నెటిజన్ లోకేశ్‌ను అభినందించారు.

1-జన్‌పథ్‌లోకి చంద్రబాబు

అధికార నివాసంలో ప్రత్యేక పూజలు

ముగిసిన సీఎం ఢిల్లీ పర్యటన

న్యూఢిల్లీ, జూలై 17(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఢిల్లీలోని తన అధికారిక నివాసం వన్ జనపథ్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలి ఏకాదశి కావడంతో బుధవారం ఉదయం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అధికారిక నివాసంలోని తన చాంబర్‌లో ఆసీనులయ్యారు. ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్, కేంద్రంలో వివిధ మంత్రిత్వ శాఖల వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా చంద్రబాబుకు వివరించారు. కార్యక్రమంలో కేంద్ర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీపీ నేత లావు కృష్ణదేవరాయులు, పార్టీ ఎంపీలు డీ ప్రసాద రావు, కేశినేని శివనాథ్ (చిన్ని)తో పాటు అధికారులు పాల్గొన్నారు. మధ్యాహ్నం సీఎం చంద్రబాబు ఢిల్లీ నుంచి విజయవాడకు బయలుదేరారు. మంగళవారం సాయంత్రం ఢిల్లీకి వచ్చిన చంద్రబాబు అదే రోజు రాత్రి కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ అయిన విషయం తెలిసిందే.



ఢిల్లీలోని 1 జన్‌పథ్‌లో కేటాయించిన నివాసంలో సీఎం చంద్రబాబు పూజలు



భీమిలిలోని ఎర్రమట్టి దిబ్బల ప్రాంతంలో పర్యటిస్తున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఇతర అధికారులు

ఎర్రమట్టి దిబ్బల్లో తవ్వకాలకు బ్రేక్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): భీమిలి బీచ్‌రోడ్డులోని భౌగోళిక వారసత్వ సంపదైన ఎర్రమట్టి దిబ్బలను తవ్వేయడంపై 'ఎర్రమట్టి దిబ్బలకు ఎసరు'శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంపై ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించింది. తక్షణమే ఆ ప్రాంతాన్ని సందర్శించి, పర్యావరణానికి విఘాతం కలిగించే పనులు ఆపించాలని అధికారులను ఆదేశించింది. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి నివేదిక పంపాలని కోరింది. దీంతో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ భీమిలి వెళ్లి ఎర్రమట్టి దిబ్బలలో తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించారు. పనులు ఆపించారు. ఇద్దరికి నోటీసులు ఇచ్చి, ఒకరి సస్పెన్షన్‌కు అక్కడికక్కడే ఆదేశాలు జారీచేశారు. అక్కడికి వచ్చిన భీమిలి తహసీల్దార్, జీవీఎంసీ జోనల్ కమిషనర్లపై మయూర్ అశోక్ ప్రశ్నల వర్షం కురిపించారు. వంద ఎకరాలకుపైగా విస్తీర్ణంలో మట్టి కొండలను తవ్వేస్తుంటే ఎందుకు సమాచారం ఇవ్వలేదని నిలదీశారు. ఈ భూమి తమదిగా చెప్పుకొంటున్న భీమిలి కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి మట్టి తవ్వకాల కోసం ఎవరు అనుమతులు ఇచ్చారని జేసీ ప్రశ్నించారు. దానికి సమాధానం చెప్పలేక అటు రెవెన్యూ, ఇటు జీవీఎంసీ అధికారులు తలలు దించుకున్నారు. అసలు లేఅవుట్‌కు దరఖాస్తు చేశారా? మట్టి తవ్వుతామని చెప్పారా?...అని కూడా జేసీ ప్రశ్నించారు. ఏ ప్రశ్నకూ స్థానిక అధికారుల నుంచి సమాధానం రాకపోవడంతో ఆయన అసహనం వ్యక్తంచేశారు. ప్రభుత్వం నుంచి తదుపరి ఆదేశాలు వచ్చేంతవరకు ఆ ప్రాంతంలోకి పొక్లెయినర్లు, లారీలు ప్రవేశిస్తే సీజ్ చేయాలని, పనులు జరిపించే వారిపై కేసులు పెట్టాలని ఆదేశించారు. సంజాయిషీ ఇవ్వాలంటూ నేరెళ్లవలస వీఆర్‌వోకు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు భీమిలి ఆర్‌డీఓ ద్వారా నోటీసు ఇప్పించారు. తవ్వకాలపై నిర్లక్ష్యం వహించినట్టు తేలడంతో తోటవీధి సచివాలయం ప్లానింగ్ సెక్రటరీని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

సొంత జిల్లాలకు తహసీల్దార్లు

సీఎం చంద్రబాబు ఆమోదం.. నేడు ఉత్తర్వులు

అమరావతి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వివిధ జిల్లాలకు బదిలీ అయిన తహసీల్దార్లను తిరిగి సొంత జిల్లాలకు పంపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. ఎన్నికల ప్రక్రియ పూర్తయి 45 రోజులు అవుతోంది. తహసీల్దార్లు సొంత జిల్లాలకు వెళ్లిపోతామన్న ఉద్దేశంతో క్షేత్రస్థాయిలో పనులు నిలిపివేశారు. కొత్త తహసీల్దారులు వచ్చి చూసుకుంటారులే అన్న ధోరణిలో వ్యవహరిస్తున్నారు. దీంతో ఫైల్స్ స్తంభించిపోతున్నాయి. ఈ విషయాన్ని రెవెన్యూ ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించడంతో తహసీల్దార్లను సొంత జిల్లాలకు పంపించేందుకు బుధవారం ఆమోదం తెలిపారు. గురువారం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా విడుదల చేయనున్నారు. అనంతరం బదిలీ ప్రక్రియ ప్రారంభమవుతుంది.



ఆలయంలో పారిశుధ్య కార్మికులను దూరంగా ఉండాలంటూ చేయిచూపుతున్న రోజా

దూరం.. దూరం!

- పారిశుధ్య కార్మికుల పట్ల రోజా అనుచిత ప్రవర్తన
- సెల్ఫీ కోసం వచ్చినవారిని వారించిన మాజీ మంత్రి
- దూరంగా నిలబెట్టి వారితో సెల్ఫీ దిగిన వైనం
- తమిళనాట ఘటన.. ఎండగట్టిన తమిళ మీడియా

చెన్నై, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో 'మా ఎస్టీలు, మా ఎస్సీలు..' అంటూ ఊకదంపుడు ప్రచారం చేసిన వైసీపీ నేతల నిజస్వరూపం బయటపడింది. ఆయన సామాజికవర్గాన్ని తప్ప మరే కులం వారిని తాడేపల్లి ప్యాలెస్‌లోకి రానీయబోరని జగన్ గురించి సన్నిహితులే చెబుతుంటారు. ఇప్పుడు ఆయన బాటలోనే వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి రోజా నడిచారు. రోజా ఇటీవల కుటుంబసమేతంగా తమిళనాడు రాష్ట్రంలోని తూత్తుకుడి జిల్లా తిరుచ్చెందూర్‌లో ఉన్న సుబ్రమణ్యస్వామి ఆలయానికి వెళ్లారు. అక్కడ అనేకమంది ఆమెతో సెల్ఫీలు దిగారు. అదే సమయంలో సెల్ఫీ కోసం రోజా వద్దకు ఇద్దరు మహిళా పారిశుధ్య కార్మికులు యూనిఫారంలో వచ్చారు. అయితే, ఆమె వారిని తన దగ్గరకు రానీయలేదు. 'దూరంగా ఉండండి' అంటూ చేతితో వారిని వారించారు. దీంతో వారు బిక్కుబిక్కుమంటూ దూరంగా నిలబడే ఆమెతో సెల్ఫీ దిగి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. ఈ వ్యవహారాన్ని చూపిస్తూ, తమిళ చానళ్లు... రోజా తీరును ఎండగడుతున్నాయి.

విమానంలో ప్రయాణికుడికి అస్వస్థత

- భువనేశ్వరి చొరవతో సీఎంవోకు సమాచారం
- రన్‌వే పైనే అందిన అత్యవసర వైద్యం



విమానాశ్రయంలో అత్యవసర చికిత్స పొందుతున్న శశిధర్

రేణిగుంట, జూలై 17: విమానంలో అస్వస్థతకు గురైన ఓ ప్రయాణికుడికి అత్యవసర వైద్యం సకాలంలో అందడంతో కోలుకున్నాడు. తిరుపతి విమానాశ్రయ సిబ్బంది కథనం మేరకు... హైదరాబాద్‌కు చెందిన శశిధర్ కుటుంబ సభ్యులతో శ్రీవారిని దర్శించుకునేందుకు ఇండిగో విమానంలో బుధవారం మధ్యాహ్నం తిరుమలకు బయలుదేరారు. మార్గం మధ్యలో శ్వాస తీసుకోవడానికి ఇబ్బందిగా వుందంటూ ఛాతీ పట్టుకోవడంతో విమానంలో ఉన్న కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. అదే విమానంలో ప్రయాణిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి విషయాన్ని గమనించి వెంటనే సీఎంవో కార్యాలయానికి సమాచారం అందించాలని విమాన సిబ్బందికి సూచించారు. సీఎంవో సమాచారంతో విమానాశ్రయ అధికారులు హుటాహుటిన వైద్యులతో పాటు 108 అంబులెన్స్‌ను అందుబాటులో వుంచారు. విమానం దిగిన శశిధర్‌ను రన్‌వేపైనే వైద్యులు పరీక్షించారు. ఆయన కుదుటపడిన తరువాత 108లో స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు.

చంద్రబాబూ ఇప్పటికైనా కళ్లు తెరవండి

- బీజేపీ పెద్దలకు సలాంలెందుకు చేస్తున్నారు?: వైఎస్ షర్మిల

అమరావతి, జూలై 17(ఆంధ్రజ్యోతి): 'ఒడ్డు దాటేదాకా ఓడ మల్లన్న... దాటాక బోడి మల్లన్న. ఇదే బీజేపీ సిద్ధాంతం. చంద్రబాబూ ఇప్పటికైనా కళ్లు తెరవడం మంచిది. మరోసారి రాష్ట్ర ప్రజల మనోభావాలతో బీజేపీ ఆటలు ఆడుకుంటోంది అని గుర్తిస్తే మంచింది' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హెచ్చరించారు. బుధవారం ఆమె ఎక్స్‌లో స్పందించారు. 'అయిననూ పోయి రావలె హస్తినకు అన్నట్లుంది ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనలు. ఎన్‌డీఏ కూటమిలో పెద్దన్న పాత్రగా, ఢిల్లీలో చక్రం తిప్పాల్సిన మీరు హస్తిన చుట్టూ ఎందుకు చక్కర్లు కొడుతున్నట్లు? ముక్కుపిండి విభజన సమస్యలపై పట్టుబట్టాల్సింది పోయి బీజేపీ పెద్దలకు జీ హుజూర్ అంటూ సలాంలు ఎందుకు కొడుతున్నట్లు? కూటమి సర్కారు ఏర్పడి నెలరోజులు దాటినా... మోడీతో గాని, ఇతర మంత్రులతో గాని ఒక్క హామీ మీద ఎందుకు ప్రకటన చేయించలేకపోయారు?' అని షర్మిల ప్రశ్నించారు.

టైట్లింగ్ రద్దును స్వాగతిస్తున్నాం: రామకృష్ణ

గుంటూరు(తూర్పు), జూలై 17: ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్(2022)ని రద్దు చేస్తూ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడాన్ని సీపీఐ స్వాగతిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ తెలిపారు. బుధవారం, గుంటూరులో విలేకర్ల సమావేశంలో సీపీఐ నేతలు మాట్లాడారు. డిసెంబరు 26తో సీపీఐ ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూరైన సందర్భంగా నిర్వహించే శత వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు కోరారు. సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నాయకులు కోటా మాల్యాద్రి, మేడా హనుమంతురావు పాల్గొన్నారు.

నేటి నుంచి జనసేన పార్టీ సభ్యత్వ నమోదు

- 10 లక్షల క్రియాశీలక సభ్యత్వాలు టార్గెట్

అమరావతి, జూలై 17(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం కాబోతుంది. ఈ నెల 18 నుంచి క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించాలని అధినేత పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు పార్టీ ప్రధాన కార్యాలయం నుంచి అన్ని జిల్లాలకు సమాచారం అందించారు. ఇప్పటికే జిల్లాల నియోజకవర్గాల ఇన్‌చార్జులు, వలంటీర్లకు సభ్యత్వ నమోదు కార్యక్రమానికి సంబంధించిన లాగిన్‌లు అందించారు. నేటి నుంచి గ్రామ, వార్డు, మండల స్థాయిల్లో సభ్యత్వ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసుకోనున్నారు. గత ఏడాది దాదాపు ఆరున్నర లక్షల మంది జనసేన పార్టీ క్రియాశీలక సభ్యులుగా చేరారు. ఈ ఏడాది పది లక్షల మందికి పార్టీ సభ్యత్వం కల్పించాలని పార్టీ నిర్ణయించింది.

కాంట్రాక్టర్‌దే నిర్ణయం!

- ఆరోగ్య శాఖ అధికారులు ఆమోదించారు
- సీసీ కెమెరాల టెండర్ల ప్రక్రియే స్కామ్
- గత సీఎంవో కీలక అధికారిపై ఆరోపణలు
- ఎన్‌హెచ్‌ఎం నిధులపై విచారణకు డిమాండ్లు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఏరియా, జిల్లా ఆస్పత్రులకు సీసీ కెమెరాల టెండర్ ప్రక్రియలో ఒక పద్ధతి లేకుండా చేసేశారు. కాంట్రాక్టర్ ఎంత ధర చెబితే అంతకు ఆర్డర్లు ఇచ్చేశారు. మార్కెట్‌లో సదరు సీసీ కెమెరాల ధర ఎంత..? కాంట్రాక్టర్ ఎంత కోట్ చేశారు..? అన్నది చూడలేదు. కాంట్రాక్టర్ ఎంత కోట్ చేస్తే అంత ధరకే బిడ్ ఖరారు చేసేశారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ టెండర్ ప్రక్రియ మొత్తాన్ని స్కామ్‌గా మార్చేశారు. మొత్తం టెండర్ ప్రక్రియ జరిగిన విధానం, కంపెనీ కోట్ చేసిన ధరలు చూస్తే కళ్లు బయర్లుకమ్ముతాయి. కెమెరాలు, కంప్యూటర్, అవసరమైన వస్తువులన్నీ రెండు, మూడింతల అధిక ధరలకు కొనుగోలు చేశారు. కేవలం రూ.వెయ్యి నుంచి రెండు వేలు ఉండే సీసీ కెమెరాకు దాదాపు పది వేలు ఖర్చు చేసి కొనుగోలు చేశారు. అలాగే రూ.7 వేలు ధర ఉన్నవాటిని అత్యధికంగా రూ.25 వేలకు కొనుగోలు చేసేశారు. ఈ టెండర్ ప్రక్రియలో ఎల్1 ఎంపిక సమయంలో, బిడ్ ఖరారు చేసిన సమయంలో, పీవోలు ఇచ్చినప్పుడు అధికారులు కళ్లు మూసుకుని సంతకాలు చేశారని చెప్పవచ్చు. టెండర్ ప్రక్రియలో గత ప్రభుత్వంలో ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో పాటు సీఎంవోలోని కీలక అధికారి పాత్ర కూడా ఉన్నట్లు తెలుస్తోంది. సీఎంవోలో వసూల్‌రాజా వద్ద విధులు నిర్వహించిన ఓఎస్‌డీకి చెందిన ఒక కన్సల్టెంట్‌ను ఎన్‌హెచ్‌ఎంలో నియమించుకున్నారు. ఆయన ద్వారా అర్హత లేని కంపెనీకి టెండర్ దక్కేలా చక్రం తిప్పారు. గత ప్రభుత్వంలో సీఎంవో అధికారులు చెప్పడంతో ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ముందు వెనుకా ఆలోచించకుండా టెండర్ కట్టబెట్టారు. ఇప్పటికీ సదరు కన్సల్టెంట్ నేషనల్ హెల్త్ మిషన్‌లో కీలక విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే సదరు కంపెనీకి ఆరోగ్య శాఖ నుంచి రూ.8 కోట్లు చెల్లింపులు జరిగాయి. మరో రూ.4 కోట్ల వరకూ బిల్లులు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. గత ప్రభుత్వంలో సీఎంవో అధికారులతో టచ్‌లో ఉన్న కొందరు అధికారులు ఈ విధంగా పాత బిల్లులు మొత్తం విడుదల చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

డీఎంఈ, ఏపీవీవీపీ కోరకపోయినా..

నిబంధనల ప్రకారం ఆరోగ్య శాఖ ఏదైనా టెండర్ పిలవాలన్నా, ఏదైనా వస్తువు కొనుగోలు చేయాలన్నా ఏపీఎంఎస్ఐడీసీ ద్వారానే జరగాలి. సంబంధిత హెచ్‌వోడీలు అడగకుండా చిన్న సూది కూడా ఏపీఎంఎస్ఐడీసీ కొనుగోలు చేసే అధికారం లేదు. కానీ సీసీ కెమెరాల విషయంలో ఇటు డీఎంఈ కానీ అటు ఏపీవీవీపీ అధికారులు కానీ ఏపీఎంఎస్ఐడీసీని అడగలేదు. అసలు ఏపీవీవీపీ, డీఎంఈ ఆస్పత్రులకు ఎన్‌హెచ్‌ఎం నిధులు ఖర్చు చేయడానికి వీల్లేదు. ముందుగా పీఐపీలో అనుమతి తీసుకున్న తర్వాతనే నిధులు ఖర్చు చేయాలి. కానీ ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, ఎన్‌హెచ్‌ఎం అధికారులే నిర్ణయించుకుని బోధనాస్పత్రులకు, ఏరియా ఆస్పత్రులకు సీసీ కెమెరాలు కొనుగోలు చేసేశారు. కాంట్రాక్టర్లకు మేలు చేసి తద్వారా అధికారులు జేబులు నింపుకొనేందుకు ఇలా అవసరం లేని ఎన్నో వస్తువులు కొనుగోలు చేశారు. అసలు ఎన్‌హెచ్‌ఎం ద్వారా ఐదేళ్లలో ఎంత ఖర్చు చేశారన్న వివరాలు సేకరిస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వస్తాయి.

పొంతన లేని వివరణ...

బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'సీసీ సొమ్ములు నొక్కేసి' శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఆరోగ్య శాఖ కమిషనర్ పేరిట అధికారులు వివరణ ఇచ్చారు. ఇప్పటి వరకూ సదరు కంపెనీకి ఎంత మేర బిల్లులు చెల్లించారో వివరణలో పేర్కొనలేదు. సీసీ కెమెరాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకుండానే రూ.8 కోట్లు బిల్లులు ఇచ్చేశారని 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. దీనికి అధికారులు ఎక్కడా సమాధానం చెప్పలేదు. ఇతర అంశాలపైనా 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనానికి, అధికారులు చెప్పిన వివరణకు పొంతన లేకుండా పోయింది.

వీరు మారరా?

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు కోరుకుంటున్నారు.

ఇంకా వాళ్లే....

వైసీపీ హయాంలో కొందరు కీలక నేతలు, మంత్రులు తమ నియోజకవర్గాల్లో తమ సొంత మనుషులను ఎస్ఐలు, సీఐలుగా నియమించుకున్నారు. మరికొందరు అధికారులు... 'మాకు మంచి పోస్టింగ్ ఇస్తే చాలు. మీరు చెప్పినట్లు వింటాం' అంటూ వైసీపీ విధేయులుగా మారిపోయారు. ఇలాంటి అధికారులకు ఐదేళ్లపాటు చట్టం పట్టలేదు. పొలిటికల్ బాస్‌లు చెప్పినట్టల్లా నడుచుకున్నారు. ఈ క్రమంలో బాధితులపైనే కేసులు పెట్టారు. టీడీపీ సానుభూతిపరులు ఇచ్చిన ఫిర్యాదులను బుట్టదాఖలు చేస్తూ వచ్చారు. ఫిర్యాదు చేసేందుకు వెళితే.. కొట్టడం, బూతులు తిట్టడం షరామామూలే! ఇప్పుడు ప్రభుత్వం మారి నెలరోజులు దాటినా పోలీసు స్టేషన్లలో అదే అధికారులు కొనసాగుతున్నారు. వీళ్లుండగా తమకు ఎలా న్యాయం జరుగుతుందని గత సర్కారు బాధితులు వాపోతున్నారు.

లూప్‌లైన్ తప్పదని...

గత సర్కారులో అడ్డగోలు పనులు చేసిన పలువురు స్టేషన్ హౌస్ ఆఫీసర్లు ఇప్పుడు విధి నిర్వహణను గాలికి వదిలేశారు. 'ఎలాగూ మాకు లూప్‌లైన్ తప్పదు. తర్వాత వచ్చేవాళ్లు చూసుకుంటారులే' అంటూ శాంతిభద్రతలను పట్టించుకోవడం మానేశారు. ఫలితంగా రాష్ట్రంలో నేరాలు తగ్గుముఖం పట్టడం లేదు. ఇలాంటి అధికారుల్లో పలువురు ఇప్పటికే తమను ప్రాధాన్యంలేని (లూప్‌లైన్) పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. లూప్‌లైన్‌కు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న పోలీసుల వినతుల్ని పర్సనల్ విభాగం ఐజీ కనీసం పట్టించుకోవట్లేదని తెలుస్తోంది.

మళ్లీ వాళ్లకేనా...

క్షేత్రస్థాయి పోలీసు అధికారుల పోస్టింగుల్లో కొత్త ప్రభుత్వం ఎటూ తేల్చకపోవడంతో... పైరవీలూ జోరందుకున్నాయి. పోస్టింగ్‌ల కోసం ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండగా... ఎక్కువ మంది శాసన సభ్యులు సిఫారసు కోసం డబ్బులు అడుగుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి.ఐదేళ్లు లూప్‌లైన్లో ఉండి, సరిగా జీతాల్లేక ఇబ్బందులు పడ్డ తాము ఎక్కడి నుంచి డబ్బులు తేవాలని ఈ అధికారులు వాపోతున్నారు. అదే సమయంలో... గత ప్రభుత్వంలో ఇసుక, మైనింగ్, బెట్టింగ్, గుట్కా, మట్కా, గంజాయి, భూ కబ్జాల్లాంటి అక్రమాలకు సహకరించి కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదించిన వైసీపీ ఖాకీలు ఏదో మార్గంలో కూటమి ఎమ్మెల్యేల వద్దకు నోట్ల కట్టలతో వస్తున్నారు. 'పాత సంగతులు వదిలేయండి. ఈ సొమ్ములు పుచ్చుకుని మమ్మల్ని మీరు చూసుకోండి. మీరు చెప్పినట్లు వింటాం' అని బేరం పెడుతున్నారు. ఇటీవల రాజధాని ప్రాంతంలోని తుళ్లూరు పోలీసు స్టేషన్లో సీఐగా పోస్టింగ్ దక్కించుకున్న శ్రీనివాస్‌పై తీవ్రస్థాయిలో ఆరోపణలు రావడంతో పోలీసు ఉన్నతాధికారులు ఆయనను మార్చాల్సి వచ్చింది. ఐదేళ్లుగా వీఆర్‌లో ఉన్న ఒక అధికారికి నల్లపాడు పోలీసు స్టేషన్లో పోస్టింగ్ వస్తుందని ప్రచారం జరగ్గా అందుకు పూర్తి భిన్నంగా వచ్చింది. గుంటూరులో సీఐలు సమావేశమై 'నీకు ఆ స్టేషన్, నాకు ఈ స్టేషన్' అని చర్చించుకుంటూ కొట్టుకునేదాకా వెళ్లారు.

అధికార పార్టీకే జై.. తెలివి మీరిన వైసీపీ ఖాకీలు ఈ ప్రభుత్వంలో ఎలా పని జరుగుతుందో తెలుసుకుని... గత ప్రభుత్వంలో తాను వేధింపులకు గురయ్యానని, పనిష్మెంట్లు ఇచ్చారని తప్పుడు ఆర్డర్లు సృష్టించి మరీ పోస్టింగ్‌లు దక్కించుకొంటున్నారు. అనంతపురం జిల్లాలో ఒక విజిలెన్స్ అధికారి అవినీతి భరించలేక గత ప్రభుత్వంలో ఒక ఉన్నతాధికారి పోలీసు శాఖకు తిరిగి పంపించే ప్రయత్నం చేశారు. ఇందులో నాటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి జోక్యం చేసుకున్నారు. "మా ఊరు వ్యక్తి. నాకు నమ్మకస్తుడు. నాకు రేపు ఎన్నికల్లో డబ్బులు పంచేందుకు కావాల్సిందే" అంటూ సీఎంవో నుంచి విజిలెన్స్ ఉన్నతాధికారిపై ఒత్తిడి పెంచి రద్దు చేయించారు. ప్రభుత్వం మారగానే ఆ అధికారి అధికార పార్టీ నేత ఒకరిని ప్రసన్నం చేసుకున్నారు. ధర్మవరం ఎమ్మెల్యేపై వచ్చిన ఫిర్యాదుపై స్పందించినందుకే తనను ఉన్నతాధికారులు వేధించారంటూ డ్రామాకు తెరలేపారు. ఇంకేముంది!! ఈ ప్రభుత్వంలోనూ ఆయనకు అదే విజిలెన్స్‌లో పోస్టింగ్ దక్కింది. తిరుమల తిరుపతి కొండపైన నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేరు ఉన్న ఒక పోలీసు అధికారి ఎమ్మెల్యేలు, ఐపీఎస్‌లను సైతం లెక్కచేయకుండా అరాచకాలకు పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి.

ఐపీఎస్‌ల బదిలీలతో సరిపెడితే చాలా?

పాలనాదక్షుడిగా పేరున్న చంద్రబాబు బ్యూరోక్రాట్ల బదిలీల్లో బాగా జాప్యం చేశారు. ఐపీఎస్‌లకు పోస్టింగ్స్ ఇచ్చేందుకు నెలన్నర పట్టింది. కానీ, ప్రజలతో నేరుగా సంబంధాలు నెరిపి వారి సమస్యలు విని న్యాయం చేసే పోలీసు స్టేషన్ల అధికారులను మార్చక పోవడం పట్ల బాధితుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. గురువారం సీఎం చంద్రబాబు శాంతి భద్రతలపై శ్వేతపత్రం విడుదల చేస్తున్నారు.



బుధవారం శ్రీకాకుళం పట్టణంలో కురుస్తున్న వర్షం

నేడు, రేపు కోస్తాలో భారీ వర్షాలు

▸▸ బంగాళాఖాతంలో రేపు అల్పపీడనం

అమరావతి, విశాఖపట్నం, జూలై 17(ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ పరిసరాల్లో ఉన్న అల్పపీడనం బుధవారం బలహీనపడింది. మరోవైపు ఈనెల 19న పశ్చిమ మధ్య, దానికి ఆనుకుని వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. రుతుపవన ద్రోణి తూర్పుభాగం ఒడిశా నుంచి కళింగపట్నం మీదుగా మధ్య బంగాళాఖాతం వరకు విస్తరించింది. ఒడిశా మీదుగా తూర్పు, పడమరకు ఒక ఉపరితల ద్రోణి, అరేబియా సముద్రం తీరం వెంబడి కేరళ నుంచి గుజరాత్ వరకు మరో ద్రోణి కొనసాగుతున్నాయి. వీటన్నింటి ప్రభావంతో కోస్తాలో రుతుపవనాలు చురుగ్గా మారడంతో బుధవారం పలుచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తాలో విస్తారంగా, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈనెల 21 వరకూ కోస్తాలో వర్షాలు కొనసాగుతాయని పేర్కొంది. గురువారం ఉత్తర కోస్తాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు, దక్షిణ కోస్తాలో భారీ వర్షాలు, శుక్రవారం ఉత్తర కోస్తాలో భారీ వర్షాలు, దక్షిణ కోస్తాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఈనెల 20, 21 తేదీల్లో కోస్తాలో అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని వివరించింది. గురువారం నుంచి మూడు రోజుల పాటు మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. కాగా, గురువారం శ్రీకాకుళం నుంచి ప్రకాశం జిల్లా వరకు, అలాగే, నంద్యాల జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు, నెల్లూరు, రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అత్యవసర సాయంకోసం టోల్‌ఫ్రీ నంబర్లు 1070, 112, 18004250101లో సంప్రదించాలని సంస్థ ఎండీ కూర్మనాథ్ కోరారు.

నందికొట్కూరు సీఐ, ఎస్‌ఐలపై సస్పెన్షన్ వేటు

▸▸ బాలిక మిస్సింగ్ కేసులో డీఐజీ చర్యలు



సీఐ విజయభాస్కర్   ఎస్‌ఐ జయశేఖర్

నందికొట్కూరు, జూలై 17: నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ముచ్చుమర్రిలో అదృశ్యమైన బాలిక కేసులో ఇద్దరు పోలీసు అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. కేసును ఛేదించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్, ముచ్చుమర్రి ఎస్‌ఐ జయశేఖర్‌లను సస్పెండ్ చేస్తూ కర్నూలు డీఐజీ విజయరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 7న తన కూతురు కనిపించకుండా పోయిందని బాలిక తండ్రి ముచ్చుమర్రి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే కేసు విచారణలో అలసత్వం వహించారని సీఐ, ఎస్‌ఐలను డీఐజీ సస్పెండ్ చేశారు. ఇదిలాఉండగా పోలీసు బృందాలు ఇప్పటికీ ముచ్చుమర్రి గ్రామంలోనే ఉన్నా బుధవారం ఎలాంటి గాలింపు చర్యలు చేపట్టలేదు.

నాపై కేసు పెట్టిన ఇద్దరు పోలీస్ అధికారులను సస్పెండ్ చేయాలి


▸▸ వారిపై కేసు నమోదు చేసి విచారించాలి: రఘురామ



భీమవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ప్రభుత్వ హయాంలో నాపై తప్పుడు కేసు బనాయించి హత్యకు కుట్ర పన్నారనేందుకు ఎన్నో ఉదంతాలున్నాయి. కేసు నమోదు చేసిన ఇద్దరు పోలీస్ అధికారులను సస్పెండ్ చేయాలి' అని పశ్చిమ గోదావరి జిల్లా ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు విజ్ఞప్తి చేశారు. భీమవరంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'ఎఫ్‌ఐఆర్‌లో సెక్షన్ 307 ఉంటే ముందుగా పోలీస్ అధికారులను సస్పెండ్ చేయాలి. ఆ తర్వాత శాఖాపరమైన విచారణ నిర్వహించాలి. సీబీసీఐడీలో కీలకంగా వ్యవహరించి నాపై తప్పుడు కేసులకు పాల్పడిన పోలీస్ అధికారులు సీతారామాంజనేయులు, సునీల్ కుమార్‌లను సస్పెండ్ చేయకుండా ఎందుకు తాత్సారం చేస్తున్నారు? కేసు నమోదు చేయడం వెనుక అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఉన్నారనేది సుస్పష్టం. తప్పుడు కేసులు బనాయించి, చిత్రహింసలు పెట్టిన అధికారులపై కేసుపెడితే తప్పేంటి..? వీరిపై శాఖాపరమైన విచారణ చేపట్టాల'ని ఎమ్మెల్యే రఘురామ డిమాండ్ చేశారు.

పోలవరంపై నెలాఖరుకు నివేదిక!

▸▸ ప్రాజెక్టు అథారిటీకి తెలిపిన అంతర్జాతీయ నిపుణుల కమిటీ



అమరావతి, జూలై 17(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో దెబ్బతిన్న కీలక హెడ్‌వర్క్స్ నిర్మాణాలపై ఈ నెలాఖరు నాటికి నివేదికను అందిస్తామని అంతర్జాతీయ నిపుణుల కమిటీ సభ్యులు వెల్లడించారు. తొలుత ఈ నెల రెండో వారానికే ప్రాథమిక నివేదికను అందజేస్తామని పోలవరం ప్రాజెక్టు క్షేత్ర పర్యటన సమయంలో కేంద్ర జల సంఘానికి వారే తెలిపారు. ఈ నెల రెండోవారంలో ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల సీపేజీ నివారణ, జియోలాజికల్ పటుత్వ పరీక్షలపై ప్రాథమికంగా సలహాలను పీపీఏ(పోలవరం ప్రాజెక్టు అథారిటీ) ద్వారా పోలవరం ఇంజనీర్లకు వివరించారు. ఈ నేపథ్యంలో బుధవారానికి కూడా ప్రాథమిక నివేదికను అందజేయకపోవడంపై అంతర్జాతీయ నిపుణులను పీపీఏ సంప్రదించింది. దీంతో నివేదిక సిద్ధం కాలేదని, ఈ నెలాఖరునాటికి అందిస్తామని పీపీఏకు అంతర్జాతీయ నిపుణులు తెలియజేశారు. నివేదిక వస్తే.. కొత్తగా డయా ఫ్రమ్‌వాల్ నిర్మాణం.. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్ సీపేజీ నిర్మూలన.. ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ డిజైన్లు సిద్ధం చేసుకోవాలని పోలవరం ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు భావిస్తున్నారు. కేంద్ర జలశక్తి శాఖ, జలసంఘం కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నాయి. నిపుణుల నివేదిక ఆధారంగా డిజైన్లను సిద్ధం చేసుకుని ఈ ఏడాది నవంబరు నాటికల్లా పనులు ప్రారంభించాలన్న యోచనలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఉంది. ఈ నివేదికల ఆధారంగా డిజైన్లు రూపొందించి పనుల తుది అంచనా వ్యయాలను ఖరారు చేసుకోవచ్చని రాష్ట్ర జల వనరుల శాఖ భావిస్తోంది.

కుమ్మేయ్... అమ్మేయ్!

జగన్ మార్కు కొత్త దందా

▸▸ ఇండోసోల్ కంపెనీ విక్రయానికి సన్నాహాలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

జగన్ జమానాలో ఆయన అస్మదీయులు భారీగా 'మేళ్లు' పొందారు. అతి తక్కువ పెట్టుబడితో వందల కోట్ల విలువైన ప్రాజెక్టు ప్రతిపాదనలు చేసి.. వేల ఎకరాల భూములు కొట్టేశారు. ముఖ్యంగా ఇంధన రంగంలో కారుచౌకగా భూములు సొంతం చేసుకున్నారు. ఎన్నికల్లో జగన్ ప్రభుత్వం ఓడిపోయి కూటమి సర్కారు వచ్చింది. దీంతో అప్పట్లో మేళ్లు పొందిన కంపెనీలు ఇప్పుడు గుట్టుచప్పుడు కాకుండా పాపాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నాలు మొదలెట్టేశాయి. భూములను భారీ ధరకు అమ్ముకుని క్యాష్ చేసుకోవాలని చూస్తున్నాయి. జగన్ అస్మదీయులకు చెందిన ఇండోసోల్ సరిగ్గా ఇదే ప్రయత్నం చేస్తోందని తెలుస్తోంది. ఎన్నికలకు ముందు పంప్డ్ స్టోరేజీలు, సోలార్ విద్యుదుత్పత్తి ప్లాంట్లు, పవన విద్యుత్ కంపెనీల పేరిట ఇండోసోల్‌కు భారీ ఎత్తున నజరానాలు దక్కాయి. చీకటి ఒప్పందాలు వెలుగులోకి రాకముందే కంపెనీని చేతులు మార్చేయాలని పావులు కదుపుతున్నట్టు ఇంధన రంగ నిపుణులు ఆరోపిస్తున్నారు. ఇందులో భాగంగా ఇండోసోల్.. బ్రూక్‌ఫీల్డ్ కంపెనీకి 5వేల ఎకరాల భూములను విక్రయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసిందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. తద్వారా వేలకోట్ల రూపాయలను వైట్‌మనీగా మార్చుకునేందుకు ఇండోసోల్ ప్రయత్నిస్తోందని చెబుతున్నారు. ఎన్నికలకు ముందు ఇండోసోల్ దరఖాస్తులు చేసుకున్న కొద్ది గంటల్లోనే కోరిందంతా కట్టబెట్టేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన పెట్టుబడుల కమిటీ, ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్ర పెట్టుబడుల మండలి సమావేశాల్లోనూ అధికారికంగా భారీగా భూసంతర్పణ చేశారు. ఇప్పుడు వాస్తవాలు బయటకు వస్తుండటంతో కంపెనీని బ్రూక్‌ఫీల్డ్‌కు అమ్మేందుకు రంగం సిద్ధం చేసిందని తెలుస్తోంది. రెండు రోజులుగా గుట్టు చప్పుడు కాకుండా కార్యకలాపాలు జరుగుతున్నాయని, వేల కోట్ల రూపాయలు చేతులు మారబోతున్నాయని చెబుతున్నారు.

నాటి ముఖ్యమంత్రి జగన్‌కు సన్నిహితుడైన పులివెందులవాసి నర్రెడ్డి విశ్వేశ్వరరెడ్డితో పాటు కొల్లా శరత్‌చంద్రారెడ్డి 2022 ఫిబ్రవరి 3న ఇండోసోల్‌ను స్థాపించారు. ఇందులోకి 2022 మార్చి 21న కటారు రవికుమార్‌రెడ్డి చేరారు. ఈ కంపెనీ 2200 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్కేంద్రాన్ని, 3500 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను, 1500 మెగావాట్ల పవన విద్యుత్ ప్లాంట్‌ను కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల్లో, ఇంటిగ్రేటెడ్ సోలార్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను నెల్లూరు జిల్లాలో ఏర్పాటు చేసేందుకు 2024 జనవరి 23న అప్పటి జగన్ సర్కారుకు దరఖాస్తు చేసుకుంది. హైదరాబాద్‌లో రిజిస్టర్ అయిన ఈ కంపెనీ దరఖాస్తు చేసుకున్న వెంటనే.. అదే రోజున ప్రభుత్వం స్పందించింది. 24 గంటలు గడవక ముందే జనవరి 24న ఇండోసోల్ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించాలంటూ ఎన్‌ఆర్‌ఈడీసీ ప్రతిపాదించింది. జనవరి 30న నాటి సీఎం జగన్ అధ్యక్షతన రాష్ట్ర స్థాయి పెట్టుబడులు మౌలిక సదుపాయాల కల్పనా మండలి (ఎస్‌ఐపీబీ) సమావేశం జరిగింది. ఇండోసోల్ కోరిందంతా ఇచ్చేయాలంటూ ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు ఫిబ్రవరి 6న ఇంధన శాఖ ఉత్తర్వును కూడా విడుదల చేసింది. అదే రోజున మంత్రివర్గ సమావేశంలోనూ ఇండోసోల్‌కు ప్రోత్సాహకాలు ఇస్తూ ఆమోదముద్ర వేశారు.

ఇండోసోల్‌కు వరాలు

పంప్డ్ స్టోరేజీ ప్లాంట్ ఏర్పాటుకు తగిన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ సోలార్ ప్లాంట్‌కు మెగావాట్‌కు ఆరు ఎకరాలకు తగ్గకుండా ఇండోసోల్‌కు 21,000 ఎకరాలు కేటాయించాలని నాటి జగన్ ప్రభుత్వం నిర్ణయించింది. 1500 మెగావాట్ల పవన విద్యుత్‌కు మెగావాట్‌కు రెండున్నర ఎకరాల భూమి చొప్పున 3,750 ఎకరాలు కేటాయించాలని ఆదేశించింది. ఈ మేరకు అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం ఊరిచింతల, కర్నూలు జిల్లా కొలిమిగుండ్ల, కడప జిల్లా మైలవరం మండలంలోని కంబాలదిన్నె, చిన్నవెంతుర్ల, బి.వెంకటాపురం, బేస్తవేముల. నేలనూతల, కల్లుట్లలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటు కోసం ఇండోసోల్‌కు భూములు కేటాయించారు. నంద్యాల జిల్లాలో డోన్ పశ్చిమాన, హేబట్టం, హోళగుండ మండలంలో సోలార్ ప్లాంట్‌కు భూములు కేటాయించారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎకరా ఐదు లక్షల రూపాయల చొప్పున ఏకమొత్తం ధరకు దాదాపు 25 వేల ఎకరాల భూములు కేటాయించారు.

5000 ఎకరాలు బేరం!

జగన్ ప్రభుత్వంలో వేల ఎకరాలను చేజిక్కించుకున్న ఇండోసోల్ ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టకుండానే ఇప్పుడు గంపగుత్తగా కంపెనీని చేతులు మార్చేసేందుకు సిద్ధమవుతోందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. తాజాగా కొలిమిగుండ్ల మండలం బోయలుప్పలూరులోని 5000 ఎకరాలను బ్రూక్‌ఫీల్డ్‌కు అప్పగించేందుకు చేస్తున్న ప్రయత్నాలు చివరకు దశకు చేరుకున్నాయని చెబుతున్నాయి. గత ప్రభుత్వ నిర్ణయాలపై కూటమి సర్కారు పునఃసమీక్ష జరిపితే ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవచ్చని అంటున్నారు.

ఇతర రాష్ట్రాలకు, ఏపీకి ఎంత తేడా!

జగన్ ఇంధన రంగంలో చేసిన విధాన నిర్ణయాలు అస్మదీయులకు మేలు చేకూర్చేందుకేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పంప్డ్ స్టోరేజీ, సోలార్ విద్యుత్, పవన విద్యుత్ ఉత్పత్తిలో ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్న విధానాలకూ, జగన్ ప్రభుత్వం మార్గదర్శకాలకు చాలా తేడా ఉందంటున్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌తో సహా ఇతర రాష్ట్రాలో సంప్రదాయేతర ఇంధన విద్యుత్ ఉత్పత్తి కోసం మౌలిక సదుపాయాలు అందించినందుకుగాను నిర్దీత కాలవ్యవధిలో భూములు లీజుకు ఇస్తారు. సంప్రదాయేతర ఇంధన విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసిన సంస్థలు లీజు గడువు ముగిశాక.. ప్లాంట్లను ఉన్నవి ఉన్నట్లుగా యథాతథంగా మిషనరీతో సహా అంతా వదిలేసి పోవాలి. కానీ జగన్ ప్రభుత్వం తక్కువ ధరకు వేలాది ఎకరాల భూములు అమ్మేసింది. ఇక మధ్యప్రదేశ్ సహా ఇతర రాష్ట్రాల్లో సంస్థలు ఉత్పత్తి చేసిన విద్యుత్‌లో 20శాతం ఆ రాష్ట్రాలకు ఇవ్వాలి. ఏపీలో ఇది అమల్లోలేదు.



అంగన్వాడీ టీచర్ ఇంటి చుట్టూ పరదాలు కట్టిన దృశ్యం

అంగన్వాడీ టీచర్ ఇంటి చుట్టూ కంచె!

▸▸ సాంఘిక బహిష్కరణకూ హెచ్చరికలు

▸▸ వైసీపీకి అనుకూలంగా లేరని వేధింపులు

▸▸ చర్యలు తీసుకోవాలంటూ బాధిత కుటుంబం వేడుకోలు

నూజివీడు టౌన్, జూలై 17: డిమాండ్ల సాధన కోసం గత వైసీపీ ప్రభుత్వంలో ఆందోళన బాట పట్టిన అంగన్వాడీ కార్యకర్తలకు ఆనాటి నుంచి కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. టీడీపీకి అనుకూలంగా వ్యవహరించారంటూ ఏలూరు జిల్లా నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో అంగన్వాడీ టీచర్ కుటుంబాన్ని తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నారు. సాంఘికంగా బహిష్కరించేలా ఇంటి చుట్టూ కంచె వేసి 'మీ కుటుంబానికి దారి లేదు' అని గ్రామస్థులు పేర్కొనడం చర్చనీయాంశమైంది. గ్రామంలోని ఎస్సీ మాలపల్లిలో నివశిస్తున్న అంగన్వాడీ టీచర్ ఊస వసుంధర వైసీపీ ప్రభుత్వంలో అంగన్వాడీల డిమాండ్ల సాధన ఉద్యమంలో పాల్గొన్నారు. దీంతో పల్లె వాసులు ఆమె కుటుంబ సభ్యులను మానసికంగా వేధిస్తున్నారు. ఇటీవల ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడంతో 'మీరు టీడీపీకే అనుకూలంగా వ్యవహరించారు' అంటూ అంగన్‌వాడీ టీచర్ కుటుంబానికి వేధింపులు మరింత పెరిగాయి. గ్రామ పెద్దల దృష్టికి విషయం వెళ్లినా వేధింపులు ఆగకపోగా మూడు తరాలుగా నివాసం ఉంటున్న ఇంటికి దారి లేదంటూ ఈ నెల 9న ఇంటికి ఇరువైపులా మాలపల్లికి చెందిన కుమార్, శ్రీనివాసరావు, దుర్గారావు తదితరులు దౌర్జన్యంగా కంచె వేశారని బాధితులు వాపోతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా కంచెను తొలగించలేదన్నారు. వెలి వేస్తామని హెచ్చరిస్తున్నారని ఆమె భర్త రాజు ఆరోపించారు. తాను ఆటో నడుపుకొని జీవిస్తున్నానని, తన సోదరులకూ వేధింపులు తప్పడం లేదని రాజు పేర్కొన్నారు. వైసీపీకి అనుకూలంగా వ్యవహించలేదని అక్కసుతో వేధింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబం కోరుతోంది.



ఇలా అయితే నిధులు ఎలా?

ఢిల్లీ మీటింగ్‌లకు ఉన్నతాధికారి అడ్డు

▸▸ కీలక అధికారులకు అనుమతి నిరాకరణ

▸▸ ఇదేం ధోరణి.. అధికారుల ఆశ్చర్యం

▸▸ కేంద్రం అధ్యక్షతన రేపు ఇంటింటికీ కొళాయిపై ఉన్నతస్థాయి సమావేశం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పెట్టుబడుల కోసం, కేంద్ర సాయం కోసం ఏ అవకాశాన్నీ వదులుకోవడం లేదు. ఢిల్లీకి వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర మంత్రులతో మంతనాలు జరిపి రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం ఆరా తీస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కొందరు ఉన్నతాధికారులు సీఎం ప్రయత్నాలకు గండికొడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. కేంద్రం నుంచి వచ్చే ప్రతి పైసా రాష్ట్ర ప్రభుత్వానికి అత్యవసరం. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పలు సమావేశాలకు ఉన్నతాధికారులు హాజరై రాష్ట్ర అవసరాలను ప్రస్తావించడంతో పాటు నివేదికలు కూడా ఇవ్వాలి. అయితే, ఓ ఉన్నతాధికారి మాత్రం కేంద్రం నిర్వహించే సమావేశాలకు హాజరయ్యేందుకు అధికారులకు అనుమతి ఇవ్వడం లేదని తెలిసింది. దీంతో ఆ శాఖకు చెందిన అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కేంద్రం అమృత్ ప్రాజెక్టు కింద ప్రతి ఇంటికీ కొళాయి నీరు అందించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ఈ నెల 19న ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో సమావేశం నిర్వహిస్తోంది. దీనికి ప్రతి రాష్ట్రం నుంచి ఐదు నగరాలకు చెందిన అధికారులతో పాటు ఇద్దరు నుంచి ముగ్గురు కాంట్రాక్టర్లను కూడా నామినేట్ చేసి పంపించాలి. ఈ మేరకు కేంద్ర హౌసింగ్, పట్టణ వ్యవహారాల శాఖ అసిస్టెంట్ సెక్రటరీ అన్నీ రాష్ట్రాలకు లేఖలు రాశారు. గతంలో ఇలాంటి లేఖలు వచ్చినప్పుడు ఉన్నతాధికారులు ఏ అధికారి హాజరు కావాలో నిర్ణయించి వారికి సమాచారం ఇచ్చేవారు. దీంతో సంబంధిత అధికారులు హాజరయ్యేవారు. అయితే, ప్రస్తుతం ఓ ఉన్నతాధికారి మాత్రం కేంద్రం పంపిన సమాచారాన్ని సంబంధిత అధికారులకు అందించకపోగా, ఫలానా సమావేశం ఉందని అధికారులు గుర్తు చేసినా పట్టించుకోలేదు. మీటింగ్‌కు హాజరయ్యేందుకు అనుమతి ఇవ్వాలని కోరిన అధికారులకు సైతం చుక్కెదురైంది. ఢిల్లీ మీటింగ్‌లకు వెళ్లడం తమకేమీ సరదా కాదని, ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిస్థితుల దృష్ట్యా కేంద్ర శాఖలు నిర్వహించే వర్క్‌షాపులకు హాజరు కాకుంటే నిధులు ఎలా వస్తాయని ఉన్నతాధికారిని.. సంబంధిత అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. పైగా ప్రతి ఇంటికీ కొళాయి అనేది కూటమి ప్రభుత్వం ప్రధాన అజెండాగా ఉందని కూడా వెల్లడించినట్టు సమాచారం. ఇలాంటి సమయంలో ఆ మీటింగ్‌లకు ఎందుకు వద్దంటున్నారో తమకు అర్థం కావడం లేదని అధికారులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వంలోని కొంతమంది ఉన్నతాధికారుల వైఖరితో కేంద్రం నుంచి అందే సాయం నిలిచిపోయే ప్రమాదం ఉందని కూడా వ్యాఖ్యానిస్తున్నారు.

అవే కుట్రలు!

(మొదటి పేజీ తరువాయి)

మాత్రం జూన్ 12 అని ఉంది. అది ముఖ్యమంత్రిగా చంద్రబాబు, మంత్రివర్గం ప్రమాణస్వీకారం చేసిన రోజు. ఆ రోజునే చంద్రబాబు.... ఉద్యోగులను మోసం చేశారన్న భావాన్ని బలంగా తీసుకెళ్లాలని ముహూర్తం పెట్టుకున్నారు. కుట్రను అమలు చేశారు. అయితే, వైసీపీ వీరభక్త ఉద్యోగులకు ఇది కొత్తకాదు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పనితీరు ఆధారంగా ఉద్యోగులను వీఆర్ఎస్ ఇచ్చే ప్రతిపాదనపై అభిప్రాయం తెలపాలని కేంద్రం అన్ని రాష్ట్రాలను కోరింది. అన్ని రాష్ట్రాలతోపాటు ఈ ప్రతిపాదన ఏపీలోని న్యాయశాఖకు వచ్చింది. అక్కడ నుంచి ఆ శాఖ వారు అప్పటి సీఎం చంద్రబాబుకు అభిప్రాయం కోసం పంపారు. అలా పంపి, ఇలా జగన్ రోతపత్రికకు లీక్ ఇచ్చారు. ఉద్యోగుల్లో బాబుపై వ్యతిరేకత పెంచేందుకు ఆ ప్రతిపాదనను వాడుకున్నారు. ఇటీవల ముగిసిన ఎన్నికల్లో ఉద్యోగులు టీడీపీకి భారీగా ఓట్లేశారు. దీంతో మళ్లీ ఉద్యోగవర్గాలను చంద్రబాబు నుంచి దూరం చేసేందుకు పాత టెక్నిక్‌ను వాడారు. అందుకే జూన్ 13 వరకు ఫైలు రన్నింగ్‌లోనే ఉన్నప్పటికీ కుట్రలో భాగంగా ప్రమాణస్వీకారం తేదీ అయిన 12తో జీవో ఇచ్చారు. జీవోఐఆర్ సైటును వైసీపీ ప్రభుత్వం మూసేసింది. అందుకే ఆ జీవో వచ్చినా ఎవరికీ తెలియలేదు. దీంతో, అందరికీ తెలిసేలా ఆ జీవోను నెల తర్వాత గెజిట్‌లో ప్రచురించారు. గెజిట్ వెబ్‌సైట్ పబ్లిక్ డొమైన్‌లో ఉంటుంది. దీంతో జీవో విషయం బయటకు వచ్చింది. వైసీపీ వీరభక్త ఉద్యోగులు అనుకున్నట్టుగానే ఒకట్రెండు ఉద్యోగ సంఘాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు ప్రకటించాయి. ఈలోపునే సీఎం చంద్రబాబు ఆ వివాదాస్పద జీవోను నిలిపివేశారు. ఈ వివాదంపై విచారణకు ఆదేశించారు. శాఖాపరమైన అంతర్గత విచారణలో న్యాయశాఖలోని ఎస్‌వో హరిప్రసాద్ రెడ్డి, ఆర్థిక శాఖలోని జాయింట్ సెక్రటరీ శాంతి కుమారి ఈ కుట్ర వెనుక ఉన్నట్టు తెలిసింది. ఆర్థిక శాఖ ఉన్నతాధికారి దీనిపై శాంతి కుమారిని మందలించారు. న్యాయశాఖలో సెక్షన్ ఆఫీసర్ హరిప్రసాద్ రెడ్డి ఈ కుట్రకు మార్గదర్శి కాగా, ఆర్థికశాఖలో ఉన్న శాంతికుమారి ఈ ఫైలు కదిపి జీవో ఇప్పించారు. జూన్ 12 సాయంత్రం కదిలిన ఈ ఫైలు జూన్ 13 వరకు రన్నింగ్‌లోనే ఉంది. అయినప్పటికీ ప్రమాణ స్వీకారం చేసిన తేదీతోనే జీవో రావడం, సరిగ్గా నెలకి అంటే జూలై 12న గెజిట్‌లో ప్రచురితం కావడం ఈ కుట్రను తేటతెల్లం చేస్తోంది. కేవలం కొత్త ప్రభుత్వాన్ని అప్రదిష్టపాలు చేయడం కోసమే అన్ని నిబంధనలను పక్కకు తోసి అనుకున్న కుట్రను అమలు చేశారు.

వైసీపీ హయాంలో హరిప్రసాద్ రెడ్డి హవా

న్యాయశాఖలో ఉన్న హరిప్రసాద్ రెడ్డికు గత ప్రభుత్వం హయాంలో ఎస్‌వోగా ప్రమోషన్ వచ్చింది. న్యాయంగా ఏఎస్‌వోగా ఉన్న నారాయణ స్వామికి ఆ ప్రమోషన్ రావాలి. కానీ, వెంకట్రామిరెడ్డి ప్రభావంతో డీపీసీ రికార్డులు తారుమారు చేసి అక్రమంగా హరిప్రసాద్ రెడ్డికి ప్రమోషన్ ఇప్పించుకున్నారు. హరిప్రసాద్ రెడ్డి సతీమణి అసెంబ్లీలో ఉద్యోగి. నిబంధనలకు విరుద్ధంగా ఆమెను సచివాలయంలోని సింగిల్ యూనిట్‌లోకి తీసుకొచ్చి ఏఎస్‌వోగా పోస్టింగ్ ఇచ్చారు. అలాగే, శాంతకుమారి వైసీపీకి వీరభక్తురాలు. ఎన్నికల ఫలితాల తర్వాత ఈవీఎంల వల్లే జగన్ ఓడిపోయారంటూ సహచర ఉద్యోగుల వద్ద వాపోయారు. సచివాలయ అధ్యక్ష ఎన్నికల్లోనూ వెంకట్రామిరెడ్డికి ఓటేయాల్సిందిగా ఆమె ప్రచారం చేశారు. ఆమెకు అడిషనల్ సెక్రటరీగా ప్రమోషన్ ఇచ్చేందుకు ఫైలు నడుస్తోంది.

నడిరోడ్డుపై నరికేశాడు

▸▸ ముందు చేయి నరికి... ఆపై వేటు వెంట వేటు

▸▸ ఇద్దరూ మిత్రులే... వైసీపీకి చెందిన వారే

వినుకొండటౌన్, జూలై 17: ఇద్దరూ మిత్రులే.. మరో పేరుమోసిన రౌడీకి ప్రధాన అనుచరులే. రాజకీయ పార్టీ వైసీపీతో అంటకాగిన వారే. ఎన్నికల ముందు ఇద్దరి మధ్య తీవ్ర అభిప్రాయభేదాలు పొడసూపాయి. ఆ గొడవలు చివరికి బుధవారం రాత్రి నడిరోడ్డుపై, అందరూ చూస్తుండగా కత్తులతో నరుక్కునే వరకూ వెళ్లాయి. దాడిని అడ్డుకోవడానికి ఒక్కరంటే ఒక్కరుకూడా ముందుకురాలేదు. చేయి తెగి, రక్తం మడుగులో పడిపోయిన తరువాత దాడికి తెగబడిన వ్యక్తి అక్కడ నుంచి వెళ్లిపోయాడు. ఆ వెంటనే స్థానికుల్లో కదలిక వచ్చింది. హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆ యువకుడు మృతి చెందాడు. బుధవారం రాత్రి పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలోని ముండ్లమూరు బస్టాండ్ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... హతుడు షేక్ రషీద్(25) ముండ్లమూరు బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి బయటకు వస్తున్నాడు. అదే సమయంలో హతుని మాజీ మిత్రుడు, పట్టణానికి చెందిన షేక్ జిలానీ కత్తితో రషీద్‌పై విచక్షణారహితంగా దాడి చేశాడు. చేతలు, తల, మెడపై కత్తితో కొట్టాడు. రషీద్ చెయ్యి తెగి రోడ్డుపై పడిపోయింది. తీవ్రంగా గాయపడిన రషీద్‌ను స్థానికులు ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నిందితుడు పోలీసులు అదుపులో ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనలో హతుడు రషీద్, హత్యకు పాల్పడిన జిలానీ.. ఇరువురూ వైసీపీకి చెందిన వారే. రెండేళ్ల క్రితం విభేదాలతో విడిపోయారు. వీరిద్దరూ వినుకొండలో రౌడీగా చెలామణి అవుతున్న పీఎస్ ఖాన్‌కు ప్రధాన అనుచరులని పోలీసులు తెలిపారు. ఎన్నికలకు ముందు జిలానీ ఇంటికి వెళ్లిన రషీద్ అతడి ద్విచక్ర వాహనాన్ని తగలబెట్టాడు. దీంతో కక్ష కట్టిన జిలానీ, రషీద్‌ను దారుణంగా హతమార్చాడు.



షేక్ రషీద్‌ను నడిరోడ్డుపై నరుకుతున్న జిలానీ

వైసీపీ మూకల విధ్వంసం

దుర్గి, జూలై 17: వైసీపీ మూకలు మారణాయుధాలతో చెలరేగిపోయాయి. టీడీపీ నేతపై దాడికి యత్నించాయి. టీడీపీ నేతకు చెందిన వాటర్‌ప్లాంట్‌ను ధ్వంసం చేశాయి. పల్నాడు జిల్లా దుర్గి మండలం ముటుకూరు గ్రామంలో జరిగిందీ దారుణం. ఆత్మకూరు గ్రామానికి చెందిన టీడీపీ నేత మాచర్ల మదార్‌పైకి ఆత్మకూరు గ్రామానికి చెందిన 10 మంది వైసీపీ మూకలు మంగళవారం రాత్రి మారణాయుధాలతో దాడికి వచ్చారు. మదార్ పారిపోవడంతో వాటర్ ప్లాంట్‌ను ధ్వంసం చేశారు.

వెంటాడి నరికారు!

▸▸ టీడీపీ నాయకుడిపై వైసీపీ మూకల దాడి

మోపిదేవి(కృష్ణాజిల్లా), జూలై 17: పట్టపగలు టీడీపీ నేతను వైసీపీ మూకలు కత్తి, గొడ్డలితో వెంటపడి నరికారు. కృష్ణాజిల్లా అవనిగడ్డలోని బండికోళ్లలంక వద్ద జరిగిందీ దారుణం. మోపిదేవి మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు చందన రంగారావు మోపిదేవి మండలం కె.కొత్తపాలెం గ్రామానికి చెందినవారు. ఆయన అవనిగడ్డలోని పార్టీ ఆఫీస్‌కి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి తిరిగి వస్తుండగా.. బండికోళ్లలంక వద్ద కృష్ణానది కరకట్టపై అదే గ్రామానికి చెందిన మత్తి రాంప్రసాద్, అతని కుమారుడు శ్రీనివాసరావు దారి కాచి దాడిచేశారు. బైక్‌పై వస్తున్న రంగారావును అడ్డగించి, కత్తి, గొడ్డలితో వెంటాడి నరికారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



దుర్గమ్మకు సారె సమర్పించిన అనంతరం ఈవో రామరావుతో కేశినేని జానకీలక్ష్మి బృందం

దుర్గమ్మకు కేశినేని జానకీ లక్ష్మి బృందం ఆషాఢ సారె సమర్పణ

వన్‌టౌన్, జూలై 17: ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సతీమణి జానకీలక్ష్మి, స్పృహస్తి చారిటబుల్ ట్రస్ట్ మహిళా బృందం బుధవారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు ఆషాఢమాస సారె సమర్పించారు. అమ్మవారికి పూలు, పండ్లు, కుంకుమ, పసుపు, పట్టు వస్త్రాలు, గాజులు, తీపి పదార్థాలు తీసుకొచ్చారు. సారె సమర్పణ అనంతరం పూజలు చేశారు. అమ్మవారికి ప్రత్యేకంగా జానకీలక్ష్మి పూలజడ సమర్పించారు. అనంతరం ఆమె భక్తబృందానికి చలివిడి ప్రసాదాన్ని పంచారు. అమ్మవారికి పట్టుచీరను కౌంటర్‌లో ఇచ్చి క్యూఆర్ కోడ్ రసీదు తీసుకున్నారు. తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, ఎంవీ సుధాకర్, స్పృహస్తి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు లక్ష్మీ ప్రసన్న భారతి, కే పద్మ, ఆర్ రాధ, ఏ అశ్విని, ఆర్ వాణి, యూ శ్రీకీర్తి పాల్గొన్నారు. తొలుత ఈవో రామారావు వారికి సాదర స్వాగతం పలికారు. పూజలనంతరం జానకీలక్ష్మికి ఆలయ మర్యాదలు అందజేయగా, పండితులు ఆశీర్వచనం ఇచ్చారు.

చాంబర్ ఆఫ్ కామర్స్‌తో జీఎస్టీ అధికారుల సమావేశం వాయిదా

- మంత్రి పయ్యావులకు డూండీ రాకేష్ ధన్యవాదాలు



వన్‌టౌన్, జూలై 17: వ్యాపారస్థులకు అభద్రతాభావం లేకుండా వారి వ్యాపారాలు సజావుగా చేసుకునేలా టీడీపీ నిరంతరం అండగా ఉంటుందని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు డూండీ రాకేష్ అన్నారు. జీఎస్టీ అధికారులు-చాంబర్ ఆఫ్ కామర్స్ మధ్య చర్చలను వాయిదా వేయించేందుకు చొరవ తీసుకున్న ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్‌ను బుధవారం కలిసిన ఆయన ధన్యవాదాలు తెలిపారు. జీఎస్టీ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా పన్ను చెల్లింపుదారుల సౌకర్యం పేరిట పన్ను వసూళ్లు, వ్యాపార వివరాలు సేకరించేందుకు సిద్ధమవడాన్ని వ్యాపారస్థులు విముఖత వ్యక్తం చేశారు ఈ అంశాన్ని ఆర్థికమంత్రి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన చొరవ తీసుకుని సమాచార సేకరణ, అలాగే చాంబర్‌తో సమావేశాన్ని వాయిదా వేయించారు. దీంతో వ్యాపార వాణిజ్యవర్గాలు హర్షం వ్యక్తం చేశాయని తెలిపారు. రాకేష్‌కు కూడా వ్యాపారస్థులు ధన్యవాదాలు తెలిపారు.

4న సీనియర్ నేషనల్స్ స్విమ్మింగ్ ఎంపికలు

విజయవాడ స్పోర్ట్సు, జూలై 17: నగరంలోని గాంధీనగర్ సర్ విజ్జీ వీఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో ఆగస్టు 4న ఉదయం 9గంటలకు సీనియర్ నేషనల్స్‌లో పాల్గొనే జిల్లా స్విమ్మర్ల ఎంపికలను చేపట్టినట్టు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ సెక్రటరీ ఐ.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 17 నుంచి 20 ఏళ్లలోపు స్విమ్మర్లు ఎంపికలకు అర్హులని, పాల్గొనేవారు తమ ఎంట్రీలను ఈ నెలాఖరులోగా గాంధీనగర్ స్విమ్మింగ్ పూల్ కార్యాలయంలోని ఎస్ఎఫ్ఐ యూఐడితో పంపుకోవాలన్నారు. వివరాలకు 7989534719 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.



చెస్ విజేతలతో ముఖ్య అతిథులు

అండర్-7 జిల్లా చెస్ విజేతలు వీరే!

విజయవాడ స్పోర్ట్సు, జూలై 17: గుణదల అరుణ ఎలక్ట్రికల్స్ కార్యాలయంలో బుధవారం జరిగిన అండర్-7 జిల్లా బాలబాలికల చాంపియన్‌షిప్‌లో 30మంది చిన్నారులు బరిలో దిగారు. 4 రౌండ్ల పోటీల్లో బాలుర విభాగంలో ఎం.శ్రీరామ్ 4 పాయింట్లతో ప్రథమస్థానం, వై. రేశ్వంత్ 3 పాయింట్లతో ద్వితీయస్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో జై.ఆయుక్త స్కంద 3 పాయింట్లతో ప్రథమ స్థానం, కె.ఆలనా 2.5 పాయింట్లతో ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలు ఆగస్టు 3 నుంచి విజయనగరంలో జరిగే అండర్-7 రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని జిల్లా అసోసియేషన్ సెక్రటరీ ఎం.రాజీవ్ తెలిపారు. విజేతలకు బహుమతుల ప్రదానోత్సవంలో జిల్లా అధ్యక్షుడు ఎండీ అక్బర్ బాషా, జిల్లా మేనేజర్ ఆదూరి సురేష్‌బాబు, ఆర్బిటర్లు సీహెచ్. గోపాల్, ఎస్ఎస్.రవి, పి.జ్యోతి కిరణ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హీరో వరుణ్ సందేశ్

విరాజీ చిత్రాన్ని ఆదరించండి: హీరో వరుణ్

లబ్బీపేట, జూలై 17: ప్రముఖ హీరో వరణ్ సందేశ్ నటించిన విరాజి చిత్రబృందం నగరంలో సందడి చేసింది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం సినిమా యూనిట్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో హీరో వరుణ్ సందేశ్ మాట్లాడుతూ ఇప్పటి వరకు చేయని ఒక డిఫరెంట్ మూవీ విరాజి చిత్రమని ప్రేక్షకులు విజయవంతం చేయాలని కోరారు. డిఫరెంట్ కథతో డిఫరెంట్ లుక్కుతో ఈ సినిమా అగస్టు 2న విడుదల కానుందని, దర్శకుడు అధ్యంత్ హర్ష చెప్పిన కథ విన్న వెంటనే హీరోగా నటించడానికి అంగీకరించినట్టు తెలిపారు. నగరంలో ఏ హీరో చేయని విధంగా విరాజిలో నటించిన క్యారెక్టర్‌ను ప్రేక్షకులకు తెలియజేసేందుకు అదే గెటప్పుతో ప్రమోషన్‌లో పాల్గొంటున్నట్టు తెలిపారు. సినిమాలో అన్ని రకాల అంశాలుంటాయని కుటుంబ సమేతంగా చూడవచ్చని, దర్శకుడికి మొదటి సినిమా అయినా ఒక సీనియర్ దర్శకుడిగానే చిత్రాన్ని అద్భుతంగా తీశారన్నారు. చిత్రంలో హీరోయిన్ ఉండదని కేవలం నటినటులు మాత్రమే ఉంటారని తెలుగు రాష్ట్రాల ప్రజలు తమ చిత్రాన్ని వీక్షించి విజయవతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నటీనటులు అపర్ణాదేవి, కుషాలిని, నిర్మాత మహేంద్రనాథ్ పాల్గొన్నారు.

వైభవంగా గురు పౌర్ణమి మహోత్సవాలు



పట్టు వస్త్రాలు తీసుకెళుతున్న కిషోర్

గొల్లపూడి, జూలై 17: సాయిపురం కాలనీలోని షిరిడి సాయిబాబా గురుపౌర్ణమి మహోత్సవాలు బుధవారం కన్నుల పండువగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు సాయి సేవాసమితి అధ్యక్షుడు రావూరి కిషోర్ పతాకావిష్కరణచేసి మహోత్సవాలను ప్రారంభించారు. ఈనెల 21 వరకు మహో త్సవాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 21న జరిగే విశేష పూజ ల్లో, అన్నదానంలో భక్తులు పాల్గొనాలని కోరారు. సభ్యులు చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, నంబూరి లక్ష్మీనారాయణ, మన్నే నాగేశ్వరరావు, దేవినేని రామయ్య, మన్యం నరసింహారావు, లక్ష్మోజి వల్లభనేని పాల్గొన్నారు.





ఆషాఢ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని నగరంలో పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే భక్తులు ఆలయాలకు విచ్చేసి స్వామివారిని పుష్పాలతో అలంకరించి పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. హిందూ

తొలి పండుగకు పోటెత్తిన భక్తులు

సంప్రదాయంలో అత్యంత ప్రాముఖ్యత ఉన్న పండుగ తొలి ఏకాదశి కావడంతో ఆలయాల నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తెలుగు సంవత్సరంలో పండుగలన్నింటినీ వెంట పెట్టుకొచ్చే పండుగ తొలిఏకాదశి కావడంతో భక్తులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.







మంత్రి లోకేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగ సంఘ నేతలు

ఉద్యోగులపై కేసులను కొట్టివేయించండి

- మంత్రి లోకేష్‌కు ఉద్యోగ సంఘ నేతల వినతిపత్రం

కృష్ణలంక, జూలై 17: సీపీఎస్ రద్దుకోరుతూ గత ప్రభుత్వ హయాంలో డిసెంబరు 2018లో ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్వర్యంలో జరిగిన చలో అసెంబ్లీ నిరసన ప్రదర్శనలో పాల్గొన్న సీపీఎస్ ఉద్యోగులపై కేసులు నమోదయ్యాయి. ఈ విషయాన్ని గత సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లగా అధికారంలోకి రాగానే తీసివేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక సీపీఎస్ ఉద్యోగులపై నమోదైన కేసులను కొట్టివేస్తూ ఉత్తర్వులిచ్చారు. అయితే అందులో నగరంలోని వన్‌టౌన్, సత్యనారాయణపురం పోలీసు స్టేషన్లలో నమోదైన కేసులను మాత్రమే ఉదహరించడంతో మిగిలిన ప్రాంతాల్లోని పోలీసు స్టేషన్లలో నమోదైన కేసులు నేటికీ కొనసాగుతూ కోర్టులో విచారణ జరుగుతున్నాయి. వీటితో పాటు 2022 సెప్టెంబరు 1న సీపీఎస్ ఉద్యోగుల చలో విజయవాడ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సీపీఎస్ ఉద్యోగులపై చాలా స్టేషన్లలో కేసులు నమోదు చేశారు. వాటిని కూడా అప్పటి ప్రభుత్వం త్వరలోనే కేసుల నుంచి విముక్తుల్ని చేస్తామని ప్రకటించిందని ఉద్యోగులు తెలిపారు. అయితే గత ప్రభుత్వం ఇచ్చిన జీవోలో ఆయా కేసుల వివరాలు లేనందున సీపీఎస్ ఉద్యోగులు నేటివరకు కోర్టుల చుట్టూ తిరుతున్నారని, ఈ విషయాన్ని పరిశీలించి అన్ని పోలీసు స్టేషన్లలో సీపీఎస్ ఉద్యోగులపై నమోదైన కేసులను గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో పరిధిలోకి తెచ్చి సీపీఎస్ ఉద్యోగులను కేసుల నుంచి విముక్తుల్ని చేయాలంటూ ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బాజీ పఠాన్, కరిమి రాజేశ్వరరావు బుధవారం మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఖాతాదారుల సేవలకు ప్రాధాన్యత ఇవ్వండి

- కలెక్టర్ డాక్టర్ సృజన

విద్యాధరపురం, జూలై 17: ఖాతాదారులకు మెరుగైన సేవలందించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. బుధవారం విద్యాధరపురం ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డులో కొత్త ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంక్ శాఖను జాయింట్ కలెక్టర్‌తో సంపత్‌కుమార్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. యూనియన్ బ్యాంక్‌కు జిల్లాలో 73 శాఖలుండగా, ఒక్క నగరంలోనే 40 శాఖలతో సేవలందిస్తోందన్నారు. ఖాతాదారులకు నమ్మకంగా స్నేహపూరిత వాతావరణంలో సేవలందించినపుడే బ్యాంకింగ్ రంగంలోని పోటీని ఎదుర్కొనగలరన్నారు. వ్యాపార రంగానికి నగరం కీలకమని, పరిశ్రమలు స్థాపనకు ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని, రైతులకు సకాలంలో మైన పంట రుణాలివ్వాలని బ్యాంక్ అధికారులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడంలో ముద్ర రుణాలివ్వడంలో బ్యాంకు అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు మరింతగా చేర్చేందుకు బ్యాంకులు సహకరించాలని, జన్‌ధన్ ఖాతాలను విరివిగా ప్రారంభించి డిపాజిట్లు సేకరించాలన్నారు. బ్యాంక్ జోనల్‌హెడ్ భాస్కరరావు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి బ్యాంకు దోహదం చేస్తుందన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, విదేశీ చదువులకు వెళ్లే విద్యార్థులకు రుణాలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. ఖాతాదారుల అభిమానాన్ని పొందడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు తెలిపారు స్వయం సహాయక సంఘాలకు గృహ నిర్మాణ లబ్ధిదారులకు రుణాలు అందజేసేందుకు కృషి చేస్తామన్నారు. బ్యాంక్ రీజియనల్ హెడ్ మువ్వల శ్రీధర్, డిప్యూటీ రీజినల్ హెడ్‌లు బేతా హరీష్, ఐఎస్ఎస్ మూర్తి, బ్యాంకు అధికారులు, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కారు లోన్ పొందిన లబ్ధిదారు నాగసునీతకు కలెక్టర్ సృజన తాళం చెవి అందజేశారు.



కారు లోన్ పొందిన లబ్ధిదారు నాగసునీతకు తాళం అందజేస్తున్న కలెక్టర్ సృజన



వైతాళికుల చిత్రపటాల ఆవిష్కరణ పోస్టర్ ఆవిష్కరిస్తున్నవివిధ సంఘాల నేతలు

21న వైతాళికుల చిత్రపటాల ఆవిష్కరణ

గవర్నర్‌పేట, జూలై 17: సమాజాన్ని పురోగమనం వైపు నడిపించేందుకు కృషి చేసిన తెలుగు రాష్ట్రాల్లోని వైతాళికుల చిత్రపటాల ఆవిష్కరణ ఈనెల 21న ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో నిర్వహిస్తున్నట్టు మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.మురళీకృష్ణ తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ బుధవారం బాలోత్సవ్ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ తెలుగునాట 1650, 1700 మధ్యకాలంలోనే అభ్యుదయ భావాలు పూరించిన పోతులూరి వీరబ్రహ్మం, ప్రజాకవి వేమన, కందుకూరి వీరేశలింగం, తెలుగు భాషను పామరుల వద్దకు చేర్చిన గిడుగు రామ్మూర్తి, గుడిపాటి వెంకటాచలం, కుసుమ ధర్మన్న, మగ్ధూం మోహిద్దీన్, శ్రీశ్రీ, బండారు అచ్చమాంబ, దాశరథి కృష్ణమాచార్య మొదలైన 32మంది మహోన్నతుల చిత్రపటాలను ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. ప్రారంభోత్సవంలో ప్రముఖ రచయిత డాక్టర్ కేఎన్ మల్లేశ్వరి, సాహితీ విమర్శకులు తెలకపల్లి రవి, క్రియా పిల్లల పండుగ నిర్వాహకుడు ఎస్ఎస్ఆర్ జగన్నాథరావు, సాహితీవేత్తలు బాలాంత్రపు ప్రసూన, అనిల్ డాని, సత్యాజీ, ఎస్ అనిల్ హాజరుకానున్నట్టు తెలిపారు. జూలై 21న ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి సాహితీవేత్తలు, రచయితలు, కవులు, కళాకారులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. రచయిత హైమావతి, సంఘాల నేతలు అరసవిల్లి గిరిధర్, క్రాంతి కిరణ్, గుండు నారాయణ, జె.చక్రవర్తి, కె.జయరాజు, పిళ్లా నటరాజు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం

- ఆర్ఎంయూ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ రవీందర్

రైల్వేస్టేషన్, జూలై 17: కార్మికులకు ఎలాంటి కష్టం వచ్చినా మజ్దూర్ యూనియన్ అండగా నిలుస్తుందని రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ రవీందర్ అన్నారు. చిల్లా రవికుమార్ మజ్దూర్ యూనియన్ పరిధిలోని మధిరలో యువ ఇంజనీరింగ్ కార్మికుడిగా పనిచేసేవాడు. యూనియన్‌లో రూ.100 సభ్యత్వం ఉంది. ఈ సభ్యత్వం ఉన్నవారికి రూ.2లక్షల బీమా కవరేజ్ లభిస్తుంది. ఈనేపథ్యంలో రవికుమార్ కొద్ది రోజుల క్రితం మరణించాడు. ఆయన మరణవార్త తెలిసిన తరువాత అతడి కుటుంబ సభ్యులకు రూ.50వేలు అందజేశారు. తాజాగా బుధవారం నగరంలోని రవికుమార్ నివాసానికి వెళ్లి మిగతా బీమా సొమ్ము రూ.1.50 లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు యూనియన్ నేత లీల ద్వారా రవీందర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల కష్టసుఖాల్లో వారి సంక్షేమం విషయంలో యూనియన్ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. యూనియన్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ సీసీయాస్ అధ్యక్షుడు చిలుకు స్వామి, సీసీయాస్ డైరెక్టర్ అంజి యాదవ్, బ్రాంచి సెక్రటరీలు సంపత్‌రావు, రాజేందర్, చైర్మన్లు వెంకట్, రవిరాజు, కోశాధికారి కిరణ్, సీపీయాస్ డెలిగేట్ జీ కిషోర్ పాల్గొన్నారు.



మరణించిన కార్మికుడి కుటుంబ సభ్యులకు సభ్యత్వ బీమా మొత్తాన్ని అందచేసిన రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు



బృందగానంలో పాల్గొన్న మోదుమూడి సుధాకర్, మల్లాది బ్రదర్స్ తదితరులు

సారంగ రాగాలకు ప్రేక్షకుల తన్మయత్వం

విజయవాడ కల్చరల్, జూలై 17: గోవర్ధన గిరిధర గోవిందా... గోకుల పాలక పరమానంద అంటూ సంగీత విద్వాంసులు శుద్ధ సారంగ రాగంలో తీయగా తరంగాలు ఆలపించి ప్రేక్షకులను తన్మయత్వంలో ముంచెత్తారు. తొలి ఏకాదశిని పురస్కరించుకొని సామగాన లహరి కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ కంచి కామకోటి పీఠస్థ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం సౌజన్యంతో సద్గురు శ్రీ నారాయణ తీర్థుల వారి 349వ జయంత్యుత్సవాలు బుధవారం లబ్బీపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. పి.లక్ష్మీ జయతి, పి.నాగలక్ష్మి, మహతి బృందం, మోదుమూడి సుధాకర్ శిష్య బృందం సాత్విక భవన నీరజరంజని శ్రీ రంజనీల బృందంల గాత్రకచేరీ, హంసిని, ధూళిపాల సాయి దీక్షిత్, మల్లాది ఇన్‌స్టిట్యూట్ శిష్య బృందం మౌనిక, చిన్మయి, వైష్ణవి, రేణుక, శివతేల బృందం, ధూళిపాల వాసవి కచేరీలు అలరించాయి. సింధు భైరవి రాగంలో దేవదానం, నీలాంబరి రాగంలో 'మాధవ మానవ', దేశ రాగంలో 'శ్రీ నిలయం సఖి శ్రీ నిలయం', వీరి గాత్ర కచేరీలకు వయోలిన్‌పై పెరవలి నందకుమార్, కె.సుబ్రమణ్య రాజు, సింధు రాగేశ్వరి, లక్ష్మీ జయతి, మృదంగంపై కె.అనిల్‌కుమార్, అరవిండ్ కార్తీక్, శివానంద యశస్వి, మంగళగిరి శ్రీధర్ సహకరించారు.



కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్ వద్ద నిలిచిపోతున్న వాహనాలు

దారేదీ..?

- కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్.. నున్నకు వెళ్లేదెప్పుడు
- తీవ్ర ట్రాఫిక్‌జామ్‌తో అల్లాడిపోతున్న నగరవాసులు, వాహనదారులు

పాతరాజరాజేశ్వరి పేట: స్థానిక కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్ వద్ద నెలకొంటున్న ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సీకే రెడ్డి రోడ్డులోని పండ్ల మార్కెట్, రైతుబజార్ ఎదురెదురుగా ఉండటంతో ఉదయం నుంచి రాత్రి వరకు ఈ దారి బాగా బిజీగా ఉంటుంది. తెల్లవారుజాము నుంచి అటు పండ్ల మార్కెట్‌కు, ఇటు రైతుబజార్‌కు చేరుకునే ఎగుమతి, దిగుమతి వాహనాలతో ట్రాఫిక్ రద్దీ నిరంతరాయంగా నెలకొంటోంది. రైతుబజార్‌కు కొంతమేర వాహనాలు వస్తే, పండ్ల మార్కెట్‌కు మాత్రం నిరంతరంగా వాహనాలు చేరుకుని సమస్యను సృష్టిస్తున్నాయి. ఉదయం వేళలో అటుగా వెళ్లాలంటేనే వాహనదారులకు నరకం కనిపిస్తోంది. ఎగుమతి, దిగుమతుల పేరుతో వాహనాలను దారికడ్డుగా ఉంచుతూ వ్యాపారస్థులు తమ కార్యకలాపాలను చేపడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. గతంలో ఈ సమస్య తీవ్రత అధికంగా ఉండటంతో అప్పటి అధికారులు, నేతలు కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్‌ను నున్న మార్కెట్‌కు తరలించాలని అనుకున్నారు. కానీ రాజకీయ ఒత్తిడి కారణంగా ఆ ప్రణాళికలు మాటలతో నిలిచిపోయాయి. కానీ ఇప్పుడు అప్పటికన్నా మరింత ట్రాఫిక్ సమస్య నెలకొంటూ వాహనదారులు తీవ్రస్థాయిలో ఇబ్బందులకు గురవుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నేతలు, అధికారులయినా పండ్లమార్కెట్‌ను నగరానికి బయట ఉన్న నున్న మార్కెట్‌కు తరలించాలని నగరవాసులు, వాహనదారులు కోరుతున్నారు.

సమాజానికి అర్థమయ్యేలా రచనలు చేయడం భమిడిపాటి ప్రత్యేకత

- ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

విజయవాడ కల్చరల్, జూలై 17: నేటి సమాజానికి అనుగుణంగా, అర్థమయ్యే రీతిలో ఆధ్యాత్మిక రచనలు రచయిత్రిగా భమిడిపాటి బాలా త్రిపురసుందరీ అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గాంధీనగర్‌లోని హోటల్ ఐలాపురంలో బుధవారం సాయంత్రం రచయిత్రి భమిడిపాటి బాలా త్రిపుర సుందరీ గ్రంథాల ఆవిష్కరణ సభలో ఆయన మాట్లాడారు. కృష్ణాజిల్లా రచయితల సంఘంలో కార్యకర్తగా ఉంటూ మరోవైపు సాహిత్య రచనలో తనకంటూ ప్రత్యేకతను నిరూపించుకొంటున్నారన్నారు. గుడి కథలు రచనలో ప్రస్తుతం ఆలయాల్లో జరుగుతున్న రాజకీయ రగడలను ఆమె రచన ద్వారా బట్ట బయలు చేశారన్నారు. తొలుత గోపబాల శతకం గ్రంథాన్ని డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ ఆవిష్కరించగా డాక్టర్ రవి శారద తొలిప్రతిని స్వీకరించారు. డాక్టర్ బి.రమాదేవి గ్రంథాన్ని పరిచయం చేశారు. ఆదిపరాశక్తి అవతారాల తత్వం పుస్తకాన్ని టి.శోభనాద్రి అందుకోగా కె.రామకృష్ణ గ్రంథ పరిచయం చేశారు. నాయనమ్మ కథలు పుస్తకాన్ని డాక్టర్ జీవీ పూర్ణచంద్ ఆవిష్కరించగా గోళ్ల నారాయణరావు తొలి ప్రతి స్వీకరించగా సవరం వెంకటేశ్వరరావు గ్రంథ పరిచయం చేశారు. వజ్రాయుధాలు పుస్తకాన్ని డాక్టర్ నల్లాన్ చక్రవర్తులు ఆవిష్కరించగా డాక్టర్ వెన్నా వల్లభరావు తొలి ప్రతి స్వీకారం, డాక్టర్ గుమ్మా సాంబశివరావు గ్రంథం పరిచయం చేశారు. గుడి కథలు పుస్తకాన్ని ఆచార్య అద్దంకి శ్రీనివాస్ ఆవిష్కరించగా తొలి ప్రతి స్వీకారం చలపాక ప్రకాష్ గ్రంథ పరిచయం పిళ్లా వెంకటరమణమూర్తి చేశారు.



కేంద్ర మంత్రి నడ్డాతో భేటీ అయిన సత్యకుమార్

ఎన్‌హెచ్‌ఎం కింద వెయ్యి కోట్లు అదనంగా ఇవ్వాలి

▸▸ కేంద్ర మంత్రి నడ్డాకు మంత్రి సత్యకుమార్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జూలై 17(ఆంధ్రజ్యోతి): నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) కింద ఏపీకి మరో రూ.1,000 కోట్లు అందనంగా ఇవ్వాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ కోరారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను ఆయన కలిశారు. ఏపీలో గత ఐదేళ్లలో జరిగిన విధ్వంసం, పరిస్థితులను చక్కదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలు, కేంద్రం నుంచి అందాల్సిన సాయం, రాజకీయ పరిణామాలు తదితర అంశాలపై చర్చించారు. ప్రత్యేకించి రాష్ట్రంలో ఆరోగ్య విభాగాన్ని భ్రష్టుపట్టించిన విధానాన్ని వివరించారు. ఆదుకోవాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో సత్యకుమార్ మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఢిల్లీ వచ్చిన ప్రతిసారీ రాష్ట్రానికి ఏదో ఒకటి సాధించుకుని వెళుతున్నారంటూ అమరావతి రింగ్ రోడ్డు ప్రాజెక్టు సామాన్య విషయం కాదన్నారు. భారత్ పెట్రో రిఫైనరీ, విశాఖ మెట్రోరైల్‌తో పాటు అనేక విభజన హామీలను సాధించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని వివరించారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ జింక్ ట్యాబ్లెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్నామని సత్యకుమార్ తెలిపారు.

గుండెపోటుతో 'మార్షల్' మృతి

అమరావతి, జూలై 17(ఆంధ్రజ్యోతి): గుండెనొప్పితో మరణించిన అసెంబ్లీ మార్షల్ కూచిపూడి లదియారావు కుటుంబాన్ని ఆదుకుంటామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు భరోసా ఇచ్చారు. బుధవారం ఉదయం అసెంబ్లీ ఆవరణలో డ్యూటీ చేస్తుండగా లదియారావు గుండెపోటుకు గురయ్యారు. హుటాహుటిన ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రికి తరలించారు. అక్కడకు వెళ్లిన తరువాత ఆయన మరణించారు. విషయం తెలుసుకున్న స్పీకర్ అయ్యన్న పాత్రుడు వారి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి పరామర్శించారు. ప్రభుత్వం నుంచి ఆ కుటుంబానికి రావాల్సిన ప్రయోజనాలను త్వరితగతిన అందేలా చర్యలు చేపడతామని, కుటుంబ సభ్యులకు అండగా నిలబడతామని హామీ ఇచ్చారు.

జగన్ సీఎం అయ్యేది కల్ల: బుద్దా వెంకన్న



విజయవాడ(వన్‌టౌన్), జూలై 17: భవిష్యత్‌లో వైఎస్ జగన్ సీఎం అయ్యేది కల్ల అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుద్దా వెంకన్న అన్నారు. వన్‌టౌన్‌లోని తన కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ప్రజలు వాతలు పెట్టి ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేసి, పక్కన కూర్చోబెట్టినా జగన్‌కు, వైసీపీ నాయకులకు ఇంకా బుద్ధి రాలేదు. సీఎం చంద్రబాబు పోలవరం వెళ్లడం, శ్వేతపత్రాలు విడుదల చేయడాన్ని వైసీపీ నాయకులు తప్పు పడుతున్నారు. వైసీపీ నేతల నిర్వాకం ప్రజలకు తెలిపేందుకే శ్వేతపత్రాలు విడుదల చేస్తున్నాం. మాజీ మంత్రి పేర్ని నానికి శ్వేతపత్రం అంటే ఏంటో తెలుసా? వైసీపీ నేతల దొంగతనాలు ఎక్కడ బయటపడతాయోనని భయపడి మీడియా సమావేశాలు పెట్టి శ్వేత పత్రాలపై అవాకులు, చవాకులు పేలుతున్నారు. జగన్ ఎప్పుడూ రాష్ట్రం కోసం ఢిల్లీ వెళ్లలేదు. చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధి కోసం ఢిల్లీ వెళ్లడం తప్పా? జగన్ ఇప్పుడు దోచుకున్న రూ.లక్షల కోట్లతో సోషల్ మీడియాను నడిపిస్తున్నారు. జగన్‌కు 11 సీట్లు ఎందుకు ఇచ్చామా అని ప్రజలు బాధపడుతున్నారు. చంద్రబాబుకు మరోసారి అవకాశం వచ్చిందని, తమకూ మరలా అధికారం వస్తుందని జగన్‌రెడ్డి, వైసీపీ నాయకులు కలలు కంటున్నారు. ఇది ఎప్పటికీ నెరవేరదు. టిడ్కో ఇళ్లను ఎందుకు పూర్తి చేయలేదో జగన్ చెప్పాలి. కర్రు కాల్చి వాత పెట్టేంతవరకు తెచ్చుకోవద్దు' అని వైసీపీ నేతలకు ఆయన హితవు పలికారు.

దేవదాయ కమిషనర్‌కు విజయసాయిరెడ్డి క్షమాపణ చెప్పాలి: కోగంటి

విజయవాడ (ధర్నాచౌక్), జూలై 17: రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణపై వైసీపీ నేత, ఎంపీ విజయసాయిరెడ్డి అసభ్యకరంగా చేసిన వ్యాఖ్యలను ఏపీ దేవదాయ, ధర్మదాయ టెంపుల్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోగంటి రవికుమార్ తప్పుబట్టారు. తక్షణమే ఎంపీ, కమిషనర్‌కు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే అన్ని సంఘాలను కలుపుకుని జేఏసీగా ఏర్పాటై ఉద్యమిస్తామని హెచ్చరించారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. మీడియా యాజమానులను, జర్నలిస్టులను దూషించడాన్ని తీవ్రంగా ఖండించారు. వారిని బెదిరించే ధోరణి సరైందికాదన్నారు.

అణ్వస్త్రాలున్న పూర్తి ఇస్లామిక్ దేశం యూకే

▸▸ అమెరికా రిపబ్లికన్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థి జేడీ వాన్స్ వివాదాస్పద, సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, జూలై 17: "లేబర్ పార్టీ అధికారంలోకి రావడంతో యునైటెడ్ కింగ్‌డమ్ అణ్వస్త్రాలు కలిగిన మొట్టమొదటి 'పూర్తి ఇస్లామిక్ దేశం'గా మారింది" అంటూ అమెరికా రిపబ్లికన్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థి జేడీ వాన్స్ వివాదాస్పద, సంచలన వ్యాఖ్యలు చేశారు. గతవారం యూకేలోని కన్జర్వేటివ్ పార్టీ నేతల సదస్సులో వాన్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "అణ్వస్త్రాలు కలిగిన పూర్తి ఇస్లామిక్ దేశం ఏదని నాకు, నా మిత్రుడికి మధ్య చర్చ జరిగింది. మొదట ఇరాన్, పాకిస్థాన్ అని అనుకున్నాం. కానీ, లేబర్ పార్టీ అధికారంలోకి రావడంతో యూకే అణ్వస్త్రాలు కలిగిన 'పూర్తి ఇస్లామిక్ దేశం'గా మారిందని నిర్ణయానికి వచ్చాం" అని వ్యాఖ్యానించారు.

2,600 ఉద్యోగాలకు 25 వేల మంది!

▸▸ ముంబయి విమానాశ్రయం వద్ద తొక్కిసలాట

ముంబయి, జూలై 17: విమానాశ్రయ లోడర్ల కోసం ఎయిర్ ఇండియా ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్ ముంబయి విమానాశ్రయం వద్ద చేపట్టిన ఉద్యోగాల భర్తీ కార్యక్రమం దాదాపు తొక్కిసలాట వంటి పరిస్థితికి దారితీసింది. దీంతో దరఖాస్తులు ఇచ్చి వెళ్లిపోవాలని నిర్వాహకులు అభ్యర్థులను కోరాల్సి వచ్చింది. 2,600 ఉద్యోగాల కోసం ఏకంగా 25,000 మందికి పైగా రావడంతో ఈ పరిస్థితి నెలకొంది. చివరికి 200 మందిని నిర్వాహకులు ఇంటర్వ్యూలకు ఎంపిక చేశారు. అక్కడ ఎటువంటి దుర్ఘటన చోటు చేసుకోలేదని, పరిస్థితిని కాసేపటికి అదుపులోకి తెచ్చామని పోలీసులు చెప్పారు.

రత్నభాండాగారంలో పురాతన విగ్రహాలు: జస్టిస్ రథ్

భువనేశ్వర్, జూలై 17: పూరీ జగన్నాథ ఆలయంలోని రత్నభాండాగారం లోపలి గదిలో విలువైన లోహాలతో రూపొందించిన పురాతన విగ్రహాలను అధికారుల బృందం గుర్తించింది. 'పురాతనమైన చిన్న విగ్రహాలు.. బహుశా 5 నుంచి 7 వరకూ ఉండొచ్చు. గత నాలుగు దశాబ్దాలుగా ఎవరూ పట్టించుకోకపోవడంతో దాదాపు నల్లగా మారిపోయాయి. మేం వాటిని తాకలేదు. ఒక దీపం వెలిగించి వాటికి పూజలు చేశాం. గురువారం వాటిని కూడా తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తాం. వాటి బరువు, తయారీకి సంబంధించిన వివరాలు తర్వాత తెలుస్తాయి' అని ఒడిశా ప్రభుత్వం నియమించిన 11 మంది సభ్యుల కమిటీ చైర్మన్ జస్టిస్ బిశ్వనాథ్ రథ్ చెప్పారు.

చెలరేగుతున్న వియత్నామీ హ్యాకర్లు

బెంగళూరు, జూలై 17: భారతీయ వాట్సాప్ వినియోగదారులను లక్ష్యంగా చేసుకొని వియత్నామీ హ్యాకర్లు చెలరేగిపోతున్నారు. నకిలీ ట్రాఫిక్ చలానాలను వాట్సాప్‌కు పంపుతున్నారు. దానిని క్లిక్ చేయగానే 'వ్రాంబా' రకానికి చెందిన మాల్‌వేర్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ అవుతుంది. ఏపీకే ఫైల్ ద్వారా ఓ యాప్ ఫోన్‌లో లోడ్ అవుతుంది. దానిద్వారా ఫోన్ యజమాని ఆర్థిక లావాదేవీలపై హ్యాకర్లు పట్టుసాధిస్తున్నారు. ఇప్పటివరకూ 4,400 ఆండ్రాయిడ్ ఫోన్లు హ్యాకర్ల బారినపడ్డాయి. సుమారు రూ.16లక్షలకు పైచిలుకు కోల్పోయారు. కర్ణాటక, గుజరాత్ వాసులను వీరు టార్గెట్ చేశారని సైబర్ సెక్యూరిటీ సంస్థ క్లౌడ్‌ఎస్ఈకే సంస్థకు చెందిన పరిశోధకుడు వికాస్ కుంద తెలిపారు. ఫోన్ సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసుకోవడం, గూగుల్ ప్లే స్టోర్ వంటి వాటి నుంచి యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా రక్షణ పొందవచ్చని సూచించారు.

పంచెకట్టుతో వచ్చాడని రైతుకు నో ఎంట్రీ..!

▸▸ బెంగళూరులో అన్నదాతకు అవమానం

▸▸ జీటీ మాల్ యాజమాన్యంపై సర్వత్రా ఆగ్రహం

బెంగళూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలోని జీటీ వరల్డ్ మాల్‌లో సినిమా చూసేందుకు వచ్చిన రైతుకు అవమానం జరిగింది. పంచె కట్టుతో వచ్చాడని ఆ రైతుని సిబ్బంది లోనికి వెళ్లకుండా అడ్డుకోవడం వివాదానికి దారితీసింది. కర్ణాటకలోని హావేరి జిల్లాకు చెందిన నాగరాజు అనే వ్యక్తి తన తల్లిదండ్రులతో కలిసి మంగళవారం మాగడి రోడ్డులోని జీటీ మాల్‌కు సినిమాకు వెళ్లారు. పంచెకట్టుతో ఉన్న నాగరాజు తండ్రిని చూసి ప్రవేశద్వారం వద్ద సిబ్బంది అడ్డుకున్నారు. నాగరాజు జీటీ మాల్ సిబ్బందితో అరగంటకుపైగా వాదించినా అంగీకరించ లేదు. జీటీ మాల్‌లో నిబంధనలు అలా ఉన్నాయని తేల్చిచెప్పారు. వివాదం జరుగుతున్న సమయంలో కొందరు వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అవి వైరల్‌గా మారడంతో సెక్యూరిటీ సిబ్బందిని సస్పెండ్ చేసినట్లు మాల్ యాజమాన్యం ప్రకటించింది.

ఈ వివాదం నేపథ్యంలో రైతు సంఘాలు, కన్నడ సంఘాల సభ్యులు బుధవారం పంచెకట్టుతో వెళ్లి జీటీ మాల్ ముందు నిరసన తెలిపారు. తామంతా పంచెలతోనే వచ్చామని, మాల్‌లోకి ఎందుకు అనుమతించరో చూస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది రైతులకు జరిగిన అవమానమని, వెంటనే మాల్ యజమానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ స్పందించి నోటీసులు జారీ చేసేందుకు సిద్ధమైంది. దీనిపై జీటీ మాల్ యజమాన్యం క్షమాపణలు చెప్పింది.

పంచెకట్టుకు మంత్రులు సైతం మద్దతు..

సీఎం సిద్దరామయ్య దశాబ్దాల కాలంగా పంచె ధరిస్తారని, మాజీ ప్రధాని దేవెగౌడ పంచె మినహా మరో డ్రెస్ వేయరని, వారినీ అడ్డుకుంటారా అని మంత్రులు మండిపడ్డారు. జీటీ మాల్ సంఘటనపై కార్మిక మంత్రి సంతోశ్ లాడ్ స్పందించారు. పోలీసుశాఖ ద్వారా నోటీసులు జారీ చేయిస్తామని అన్నారు. జీటీమాల్ యాజమాన్యంపై వ్యవసాయ శాఖ మంత్రి చలువరాయస్వామి తీవ్రంగా మండిపడ్డారు. పంచకట్టు మన సంప్రదాయమని, గతంలో శాసనసభలోనూ దీనిపై చర్చించామని అన్నారు. పంచెకట్టుతో వెళ్లిన రైతును అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు.



తమకు జరిగిన అవమానం గురించి వివరిస్తున్న రైతు కుమారుడు నాగరాజు

'ఇంటి' దొంగలపై చర్యలేవీ?

▸▸ మంత్రి ఆదేశించినా కదలని హౌసింగ్ ఉన్నతాధికారులు

▸▸ విచారణలో తమ పాపాలు కూడా బయటపడతాయనే భయం!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పేరుతో గత జగన్ ప్రభుత్వం అట్టహాసంగా చేపట్టిన పథకం అడుగడుగునా అవినీతిమయమైన సంగతి జగమెరిగిన సత్యం. జగనన్న కాలనీలకు స్థలాల సేకరణ దగ్గరి నుంచి.. మెరక పనుల వరకూ వైసీపీ నేతలు వేల కోట్ల రూపాయలు దోచేశారు. మరోవైపు పేదల ఇళ్ల నిర్మాణం పేరుతో కాంట్రాక్టర్లు కూడా రూ.వేల కోట్లు కొట్టేసి పత్తా లేకుండా పోయారు. 'మేం మాత్రం తక్కువ తిన్నామా..!' అన్నట్టు హౌసింగ్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కూడా బరితెగించి ఈ దోపిడీలో భాగస్వాములయ్యారు. పేదల ఇళ్ల నిర్మాణంలో అవినీతి, అక్రమాల గురించి పత్రికలు, టీవీ చానెళ్లు, సోషల్ మీడియాలో వరుస కథనాలు వెలువడినా జగన్ సర్కారు కనీసం పట్టించుకోలేదు. దీంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోయి ప్రజాధనాన్ని లూటీ చేశారు. రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలోని ఉన్నతాధికారులు మొదలుకొని జిల్లాల్లోని అధికారులు, ఉద్యోగులు, సాధారణ సిబ్బంది వరకూ అందరూ అవినీతికి పాల్పడి పేదలకు తీరని అన్యాయం చేశారు. పేదల ఇళ్ల నిర్మాణం ముసుగులో అడ్డూఅపు లేకుండా సాగిన ఈ అవినీతి, అక్రమాలపై నిజాలు నిగ్గు తేలుస్తూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, క్వాలిటీ కంట్రోల్ విభాగాలు ఇచ్చిన నివేదికలను గత వైసీపీ ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. అయితే ఇటీవల ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం పోయి.. రాష్ట్రంలో కొత్తగా కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. అన్ని ప్రభుత్వ శాఖలపై శ్వేతపత్రాలు విడుదల చేస్తూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన దోపిడీని బయటపెడుతోంది. దీంతో గృహనిర్మాణ శాఖలో జరిగిన భారీ అవినీతి, కుంభకోణాలపై కూడా లోతుగా విచారణ చేసి.. 'ఇంటి' దొంగల భరతం పట్టాలనే డిమాండ్లు అధికమయ్యాయి.

మంత్రి ఆదేశించినా కదలని యంత్రాంగం

గత ప్రభుత్వం ఆప్షన్-3 కింద పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చింది. దాంతో దాదాపు 3.5 లక్షల మంది ఆప్షన్-3 ఎంచుకున్నారు. లబ్ధిదారుల తరఫున ఇళ్ల నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్లు హౌసింగ్ కార్పొరేషన్ నుంచి దాదాపు రూ.2 వేల కోట్లకు పైగా అడ్వాన్సులు తీసుకున్నారు. ఆ ఇళ్లకు సంబంధించిన సిమెంట్, ఇసుక, స్టీలు, ఇతర మెటీరియల్‌ను కూడా వాడేసుకున్నారు. కానీ చాలామంది కాంట్రాక్టర్లు లాభదాయకంగా ఉన్న బేస్‌మెంట్ లెవెల్ వరకు మాత్రమే పూర్తిచేసి.. తర్వాత నుంచి పనులు చేయకుండా బిచాణా ఎత్తేశారు. ఈ అంశాలన్నీ ఇటీవల అన్ని జిల్లాల హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించినప్పుడు రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి వచ్చాయి. దాంతో మంత్రి సీరియస్‌గా స్పందించారు. కాంట్రాక్టర్లు తీసుకెళ్లిన మెటీరియల్‌ను ఉపయోగించారా..? దుర్వినియోగమయ్యాయా..? అనేది పరిశీలన చేసి కచ్చితమైన సమాచారంతో ఈ నెలాఖరుకల్లా నివేదిక ఇవ్వాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. పనులు చేయకుండా పోయిన కాంట్రాక్టు సంస్థలను బ్లాక్ లిస్టులో పెట్టి.. దోపిడీ చేసిందంతా రికవరీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. హౌసింగ్ ఉన్నతాధికారులు మాత్రం దీన్ని అంత సీరియస్‌గా తీసుకున్నట్టు కనిపించడం లేదు. మంత్రి సమీక్ష ముగిసి 15 రోజులు గడిచినా అధికారులు వేగంగా కదలడం లేదు. ఈ అవినీతి భాగోతంలో భాగస్వాములైన అధికారులే ఈ ప్రభుత్వంలోనూ కొనసాగడమే దీనికి కారణమని హౌసింగ్ వర్గాలే చెబుతున్నాయి. విచారణ చేపడితే తమ పాపాలు కూడా బయటపడతాయనే భయంతోనే తాత్సారం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

బిల్డింగ్ మెటీరియల్ కొనుగోళ్లలో ఇష్టారాజ్యం

తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షలకు పైగా ఇళ్లు నిర్మించి పేద అక్కచెల్లెమ్మలకు ఆస్తిగా అందజేస్తాని అధికారంలో ఉండగా జగన్ ఊదరగొట్టారు. కానీ, కేంద్రం వాటా కింద ఇచ్చిన 22 లక్షల ఇళ్లనే మంజూరు చేశారు. వాటిలో కూడా.. ఐదేళ్లలో 5 లక్షల ఇళ్లను మాత్రమే పూర్తి చేయగలిగారు. వీటిలో ఎక్కువ ఇళ్లు లబ్ధిదారులు తమ సొంత డబ్బుతో నిర్మించుకున్నవే. ఇక మిగిలిన 17 లక్షల ఇళ్లు వివిధ దశల్లో ఆగిపోయాయి. అయితే సొంతంగా ఇళ్లు నిర్మించుకోలేని వారికి ఆప్షన్-3 కింద ప్రభుత్వమే నిర్మించి ఇస్తుందని జగన్ గొప్పలు చెప్పడంతో రాష్ట్రవ్యాప్తంగా 3.5 లక్షల మందికి పైగా ఆప్షన్-3ని ఎంచుకున్నారు. ఆ ఇళ్ల నిర్మాణ బాధ్యతలను జిల్లాల వారీగా కాంట్రాక్టర్లకు అప్పగించి.. ఒక్కో ఇంటికి రూ.70 వేలు చొప్పున అడ్వాన్సులు చెల్లించారు. అలాగే ఆ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్, స్టీలును హౌసింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు ముందే సరఫరా చేసేశారు. అడ్వాన్సు డబ్బులు, సిమెంటు, స్టీలు ముందుగానే తీసేసుకున్న కాంట్రాక్టర్లు చాలా మంది పునాదులు కూడా పూర్తి చేయకుండానే ముఖం చాటేశారు. ఇళ్ల నిర్మాణం పూర్తికాకుండానే హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు కమీషన్లకు కక్కుర్తిపడి.. దాదాపు 22 లక్షల ఇళ్ల కోసమంటూ 13 రకాల నిర్మాణ సామాగ్రిని రాష్ట్రస్థాయిలోనే కొనుగోలు చేసి.. లబ్ధిదారులకు సరఫరా చేయాలంటూ జిల్లాలవారీగా హౌసింగ్ గోడౌన్లకు బలవంతంగా తరలించారు. ఇలా ఒక్కో ఇంటికి రూ.1,12,117 విలువైన సామగ్రిని ముందుగానే కొనుగోలు చేసేశారు. అంటే 22 లక్షల ఇళ్ల కోసమని ఏకంగా దాదాపు రూ.25 వేల కోట్లకు పైగా విలువైన నిర్మాణ సామగ్రిని ముందుగానే కొనుగోలు చేయడం వెనుక భారీ కుంభకోణమే దాగి ఉంది. ఈ సామగ్రిని కొనుగోలు చేయడానికి టెండర్లు పిలవడానికి ముందే ఆయా కంపెనీలతో కమీషన్లు, పర్సంటేజీలు మాట్లాడుకుని రూ.వందల కోట్లు విఎంగేసినట్టు ఆరోపణలు ఉన్నాయి.

తుప్పు పట్టిపోతున్న సామగ్రి

నాసిరకం నిర్మాణ సామగ్రిని ఎక్కువ ధరలకు అంటగడుతుండటంతో లబ్ధిదారులతో పాటు కాంట్రాక్టర్లు వాటిని తీసుకోవడానికి ముందుకు రావడం లేదు. దాంతో రాష్ట్రవ్యాప్తంగా గోడౌన్లలో నిల్వ చేసిన మెటీరియల్ తుప్పుపట్టి పాడైపోతోంది. దాదాపు మూడొంతులకు పైగా సామగ్రి జిల్లాల్లోని గోడౌన్లలోనే అలాగే ఉండిపోయింది. వెంటనే ఆ సామగ్రిని లబ్ధిదారులకు సరఫరా చేయాలంటూ జిల్లా అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో.. వాటిని లబ్ధిదారులకు ఇవ్వకుండానే ఇచ్చేసినట్లుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసేశారు. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం మారితే మొదటికే మోసం వస్తుందన్న భయంతో మే నెలాఖరుకల్లా గోడౌన్లలో ఉన్న మొత్తం స్టాక్‌ను లబ్ధిదారులకు సరఫరా చేసేయాలంటూ హౌసింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. జిల్లాల్లోని ఏఈలు, డీఈలు, ఈఈలు, జిల్లా హెడ్స్ అందరూ అలెర్ట్ అయిపోయి.. పది రోజుల్లోనే ఏకంగా 5,11,629 పరికరాలను లబ్ధిదారులకు ఇచ్చేసినట్లుగా ఆన్‌లైన్‌లో తప్పుడు లెక్కలు నమోదు చేసేశారు. దాదాపు 90శాతం వరకు లబ్ధిదారులకు ఇచ్చేసినట్లు నమోదు చేసేశారు. ఈ మెటీరియల్స్ విలువ రూ.154 కోట్ల పైమాటే. ఈ మెటీరియల్ సరఫరాపై లబ్ధిదారులను కలిసి విచారణ చేస్తే మొత్తం అవినీతి బాగోతం బయటపడుతుంది. ఇదే కాకుండా పూర్తయిన ఇళ్లకు అతికించేందుకు పీఎంఏవై లోగోతో కూడిన బోర్డులు, డిజిటల్ వర్లీ ఆర్ట్ స్టిక్కర్లు వంటివి కూడా కమీషన్ల కోసం ముందే కొనుగోలు చేసేసి రూ. వందల కోట్ల నిధులను దుర్వినియోగం చేశారు. ఈ అవినీతి, అక్రమాలన్నింటిపై మంత్రి దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

టీడీఆర్ బాండ్ల స్కామ్ కంచికేనా?



▸▸ గుంటూరు కార్పొరేషన్‌లో రూ.300 కోట్ల కుంభకోణం

▸▸ వైసీపీ నేతలు, అధికారుల దందా

గుంటూరు(కార్పొరేషన్): అక్రమాలకు అడ్డాగా మారిన గుంటూరు కార్పొరేషన్‌లో రూ.300 కోట్ల టీడీఆర్ బాండ్ల కుంభకోణం జరిగి ఏళ్లు గడుస్తున్నా చర్యలు లేవు. గుంటూరు నగరానికి చెందిన కొందరు వైసీపీ నాయకులు టీడీఆర్ బాండ్ల కుంభకోణానికి పాల్పడ్డారు. గుంటూరు కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగంలోని అప్పటి అధికారులు ఈ కుంభకోణానికి సాయం చేశారు. దీనిపై అప్పట్లోనే 'ఆంధ్రజ్యోతి'లో అనేక కథనాలు ప్రచురితమయ్యాయి. ఆ అక్రమాలపై నాటి ప్రభుత్వం విచారణ అంటూ సాగదీయడం మినహా ఏమీ తేల్చలేదు. ఏ ఒక్కరిపైనా చర్యలు తీసుకోలేదు. అప్పట్లో గుంటూరు నగరానికి చెందిన వైసీపీ ముఖ్య నేత, ఆయనతో అత్యంత సన్నిహితంగా ఉండే టౌన్ ప్లానింగ్ అధికారిణి కలిసి కుంభకోణానికి పాల్పడ్డట్టు ఆరోపణలు వచ్చాయి. ఆ అక్రమాలపై విచారణ అధికారులను ప్రభుత్వం నియమించింది. అయితే, ఇంతవరకు ఆ అధికారులు విచారించింది లేదు. అక్రమాల గురించి పట్టించుకున్నదీ లేదు.

ధర రెండు రెట్లు పెంచేసి..

గుంటూరులో రోడ్ల విస్తరణ బాండ్ల జారీలో మాయాజాలం జరిగింది. గుంటూరు-పెదకాకాని రోడ్డులోని బెస్ట్ ప్రైస్ కంపెనీ నుంచి జాతీయ రహదారి వరకు వయా పందుల కాలనీ రెండున్నర కిలోమీటర్ల మేరకు రోడ్డు విస్తరణ పనులను చేపట్టారు. ఇందులో రోడ్డుకు ఇరువైపులా పది మీటర్లు చొప్పున స్థలాన్ని సేకరించారు. వారందరికీ నిబంధనల ప్రకారం కార్పొరేషన్ నుంచి నోటీసులు జారీ చేశారు. దీంతో వారంతా ఒప్పుకొని కార్పొరేషన్‌కు వారి స్థలాలను అప్పగిస్తున్నట్లుగా గిఫ్ట్ డీడ్ చేశారు. ఆ గిఫ్ట్ డీడ్‌లోనే పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయి. అక్కడ గజం స్థలం మార్కెట్ విలువ ప్రకారం రూ.9,500 ఉండగా, రూ.22,000 ఉన్నట్లుగా సమీపంలోని కమర్షియల్ కాంప్లెక్స్(బెస్ట్ ప్రైస్) డోర్ నెంబర్‌ను అధికారులు నిర్ధారించి, ఆ విధంగా కార్పొరేషన్‌కు లబ్ధిదారుల నుంచి గిఫ్ట్ డీడ్ చేయించారు. అంటే ప్రభుత్వం మార్కెట్ ధర కంటే రెండు రెట్లు అధికంగా రేట్లు పెంచి జీఎంసీకి గిఫ్ట్ డీడ్ చేయించడంలో వైసీపీ నాయకులు, అప్పటి టౌన్ ప్లానింగ్ అధికారులు సక్సెస్ అయ్యారు. ఈ వ్యవహారంలో రిటైర్డ్ ఆర్అండ్‌బీ ఇంజనీర్ ఒకరిని మధ్యవర్తిగా పెట్టి తతంగం నడిపించారు. సుమారు 200 మంది లబ్ధిదారులతో ఈ విధంగా గిఫ్ట్ డీడ్ చేయించి, వారి వద్ద నుంచి టీడీఆర్ బాండ్లను కొన్నట్లుగా తిరిగి రాయించుకున్నారు. ఇందులో రూ.300 కోట్ల అవినీతి జరిగినట్లు వెలుగులోకి వచ్చింది. గుంటూరు నగరానికి చెందిన వైసీపీ ముఖ్య నేత, తూర్పు నియోజకవర్గానికి చెందిన మరో నేత, అక్కడ స్థానికంగా ఉన్న మరో ప్రజా ప్రతినిధి అప్పటి టౌన్ ప్లానింగ్ అధికారులతో చేతులు కలిపి దీనికి పథక రచన చేసినట్టు ఆ పార్టీలోనే మరో వర్గం చెబుతున్నది. దీనిపై అప్పట్లో అనేక ఆరోపణలు వచ్చినా అప్పటి ప్రభుత్వం ఏ మాత్రం స్పందించలేదు. కంటితుడుపు చర్యగా విచారణ అధికారులను నియవింంచారే తప్ప ఏ ఒక్కరితోనూ సమగ్రంగా విచారణ జరపలేదు. దీంతో రూ.300 కోట్ల టీడీఆర్ బాండ్ల కథ ముగిసినట్లేనని ప్రజలు భావిస్తున్నారు.

బాబాజీ ఆలయాన్ని ప్రారంభించిన గడ్కరీ



ఆదినాథ్ శ్రీగురు మహావతార్ బాబాజీ ఆలయంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

మదనపల్లె, జూలై 17: కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ బుధవారం అన్నమయ్య జిల్లా మదనపల్లెకు విచ్చేశారు. పట్టణ శివారులోని సత్సంగ్ ఫౌండేషన్ అధినేత ఎస్.ముంతాజ్‌అలీ (శ్రీఎం)తో కలసి ఆశ్రమంలో నూతనంగా నిర్మించిన ఆదినాథ్ శ్రీగురు మహావతార్ బాబాజీ ఆలయాన్ని ప్రారంభించారు. అలాగే ఆలయంలో ప్రతిష్ఠించిన బాబాజీ విగ్రహాన్ని ఆవిష్కరించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి ప్రముఖులు, అధికారులు, శ్రీఎం శిష్యులు పెద్దఎత్తున హాజరయ్యారు.

వైసీపీ సేఫ్టీ ఆడిట్‌ను సమీక్షిస్తాం: మంత్రి సుభాశ్

అమరావతి, జూలై 17(ఆంధ్రజ్యోతి): 'ఫ్యాక్టరీల్లో ప్రమాద ఘటనలు విషాదకరం. వైసీపీ నేతలు, అధికారుల అవినీతితో నేడు ఫ్యాక్టరీల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి' అని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్ అన్నారు. బుధవారం టీడీపీ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. 'సేఫ్టీ ఆడిట్‌ను థర్డ్‌పార్టీకి ఇచ్చి వైసీపీ సర్కార్‌లో లంచాలు దోచుకున్నారు. నాటి సేఫ్టీ ఆడిట్‌పై సాంకేతిక నిపుణులతో సమీక్ష చేస్తాం. అన్ని ఫ్యాక్టరీలు, బాయిలర్స్ పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించాం. బూడిద తినడానికి పెద్దిరెడ్డి, ఆయన టీం చేసిన దందా వల్లనే ఈ విషాద ఘటనలు జరిగాయి. రూ.3 వేల కోట్ల భవన నిర్మాణ కార్మికుల నిధులను మళ్లించారు. ఈఎస్ఐ ఆసుపత్రుల నిధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఇకపై ఎక్కడ రూల్స్ అతిక్రమించినా కఠిన చర్యలు తీసుకుంటాం. వైసీపీ పాలనలో అక్రమాలకు అలవాటుపడిన అధికారులు ఇకనైనా మారాలి. ఉచిత ఇసుకపై వైసీపీ నేతల మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయి. రూ.కోట్లు కొట్టేసి అబద్ధాలతో ప్రెస్‌మీట్‌లు పెడితే ప్రజలు నమ్మరు' అని మంత్రి సుభాశ్ అన్నారు.

సిలికాన్ బాల్స్ రూపంలో 267 కేజీల బంగారం స్మగ్లింగ్

▸▸ రెండు నెలల్లో 167 కోట్ల సరుకు తరలించిన యూట్యూబర్

చెన్నై, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఎయిర్ పోర్టులో ఒక షాపును లీజుకు తీసుకుని.. విదేశాల నుంచి అక్రమంగా వచ్చే బంగారాన్ని సిలికాన్ బాల్స్ రూపంలోకి మార్చి ఆ తర్వాత వాటిని ప్లాన్ ప్రకారం ఎయిర్‌పోర్టు దాటించిన ఓ యూట్యూబర్ రెండు నెలల్లోనే ఏకంగా రూ.2.5 కోట్లు ఆర్జించినట్టు పోలీసుల విచారణలో తేలింది. ఈ రెండు నెలల్లో రూ.167 కోట్ల విలువ చేసే 267 కేజీల బంగారాన్ని స్మగ్లింగ్ చేసినట్టు గుర్తించిన పోలీసులు విస్తుపోయారు. చెన్నై విమానాశ్రయంలోని ఎయిర్‌హబ్ కేంద్రంగా ఈ దందా సాగగా, ఈ స్మగ్లింగ్ సూత్రధారి, చెన్నై నగరానికి చెందిన యూట్యూబర్ షబ్బీర్ అలీని గత నెలలో అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. చెన్నై విమానాశ్రయంలో ఎయిర్‌హబ్ పేరుతో ఒక షాపును లీజుకు తీసుకున్న అలీ... మలద్వారంలో బంగారాన్ని దాచిపెట్టి కస్టమ్స్ అధికారుల కంటపడకుండా కొంతమంది యువకులతో స్మగ్లింగ్ చేయించినట్లు వెల్లడించాడు. 'షాపింగ్ బాయ్స్' పేరుతో ఒక యూట్యూబ్ చానెల్‌ను నడిపిన అలీ.. ఎయిర్‌హబ్ రిటైల్ పేరుతో విమానాశ్రయంలో షాపును రూ.70 లక్షలు కట్టి లీజుకు తీసుకున్నాడు. విదేశాల నుంచి అక్రమంగా వచ్చే బంగారాన్ని సిలికాన్ బాల్స్ రూపంలో తరలించేందుకు ఏడుగురు ఉద్యోగులను నియమించుకున్నాడు. ఏక కాలంలో ఒకటి నుంచి మూడు సిలికాన్ బాల్స్‌ను మలద్వారంలో పెట్టుకుని గంటసేపు కూర్చున్నా ఎలాంటి నొప్పి రాకుండా ఉండేలా వారికి కఠిన శిక్షణ కూడా ఇప్పించాడు. అలా కస్టమ్స్ అధికారుల కళ్లుగప్పి బంగారంతో కూడిన సిలికాన్ బాల్స్‌ను ఎయిర్‌పోర్టు దాటించే వారికి అందనంగా రూ.5 వేలు బహుమతిగా ఇచ్చాడు. స్మగ్లింగ్ చేయాల్సిన ప్రతిసారీ పది రోజుల ముందు నుంచి దుకాణంలో సిబ్బందితో ప్రాక్టీస్ చేయించేవాడు. విదేశాల నుంచి విమానంలో అక్రమంగా బంగారం తీసుకొచ్చిన క్యారియర్ల నుంచి ఈ ఉద్యోగుల్లో ఒకరు ఆ బంగారాన్ని తీసుకుని, దాన్ని సిలికాన్ బాల్స్‌గా మార్చి మలద్వారంలో పెట్టుకుని కస్టమ్స్ అధికారులకు చిక్కకుండా విమానాశ్రయం నుంచి బయటకు వచ్చేవారు. తర్వాత ఆ బాల్స్‌ను చేరాల్సిన చోటుకు ముఠాలోని ఇతర సభ్యులు చేర్చేవారు. ఈ అక్రమ రవాణా ద్వారా రెండు నెలల్లో యూట్యూబర్ ఏకంగా రూ.2.5 కోట్లు ఆర్జించినట్టు విచారణలో వెలుగు చూసింది. కాగా... ఈ వ్యవహారంలో మరి కొంతమంది హస్తం కూడా ఉన్నట్లు తేలింది. వారి కోసం కూడా పోలీసులు గాలిస్తున్నారు.

ఇద్దరు పసికందులపై అత్యాచారం కేసులో 15 మందికి 40 ఏళ్ల జైలు శిక్ష

▸▸ విల్లుపురం పోక్సో న్యాయస్థానం సంచలన తీర్పు

చెన్నై, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో దిండివనం జిల్లాలో ఇద్దరు బాలికలను బెదిరించి అత్యాచారం చేసిన 15 మందికి తలా 40 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ విల్లుపురం పోక్సో న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. పుదుచ్చేరిలోని కదిర్‌గామ్‌కు చెందిన దంపతులు 2016లో విభేదాల కారణంగా విడిపోయారు. అనంతరం ఆ మహిళ తన ఇద్దరు కుమార్తెలను దిండివనం సమీపంలోని ఓ గ్రామంలో ఉన్న తన తల్లి ఇంట్లో వదలి, వేరే వ్యక్తిని వివాహం చేసుకుంది. 2018లో ఆ పిల్లలిద్దరూ ఇంటి ముందు ఆడుకుంటుండగా, వారిలో ఆరేళ్ల బాలికను మామ వరుస అయిన ప్రసాద్ (21) తన ఇంటికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. కొద్దిరోజుల తర్వాత రెండో బాలిక (5)ను కూడా ప్రసాద్ ఇంటికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. కొద్దిరోజుల అనంతరం బాలికల శరీరంలో మార్పులు చోటుచేసుకోవడాన్ని గమనించిన పాఠశాల ఉపాధ్యాయులు, బాలికల తల్లి, అమ్మమ్మను పిలిపించి వారిని ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో, బాలికలను పుదుచ్చేరి జిప్మర్ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అక్కడ బాలికలను పరీక్షించిన వైద్యులు.. ఇద్దరు బాలికలు పలుమార్లు అత్యాచారానికి గురైనట్లు నిర్ధారించారు. దీంతో, దిగ్భ్రాంతి చెందిన తల్లి.. 2019 జూలై 18న బ్రహ్మదేశం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విచారణలో, మామ వరుసైన ప్రసాద్‌తో పాటు వరుసకు తాత అయ్యే దురైస్వామి (55), దురైరాజ్ (47), బంధువులు ప్రభాకరన్ (23), అజిత్‌కుమార్ (22), దీనదయాళన్ (24), సెల్వం (37), సెల్వశేఖర్ (30), కమల్‌కన్నన్ (30), రవికుమార్ (22), తమిళరసన్ (24), మహేష్ (37), రమేష్ (30), చంద్రమోహన్ (23), మురుగన్ (40) తదితర 15 మంది ఏడాది కాలంగా ఒకరికి తెలియకుండా మరొకరు ఇద్దరు బాలికలపై అత్యాచారానికి పాల్పడ్డారని తేలింది. ఈ కేసు విల్లుపురం పోక్సో న్యాయస్థానంలో విచారణ జరుగుతుండగానే.. ఐదేళ్ల బాలిక అనారోగ్యంతో మృతి చెందింది. ఈ కేసులో వాదనలు పూర్తికావడంతో న్యాయమూర్తి వినోద మంగళవారం తీర్పు వెలువరించారు.




ఇన్‌స్టాగ్రామ్ రీల్ తీస్తూ బస్సు నడుపుతున్న డ్రైవర్

రీల్స్ చేస్తూ బస్సు నడిపిన ఆర్టీసీ డ్రైవర్

ఎడ్లబండిని ఢీ కొనడంతో కాడెద్దుల మృతి

బెంగళూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో వైరల్ అయ్యేందుకు రీల్స్ చేస్తూ ఓ ఆర్టీసీ డ్రైవరు కాడెద్దుల ప్రాణాలు తీశాడు. కర్ణాటక రాష్ట్రం హుబ్బళ్లి నుంచి బాగల్కోటెకు కేఎస్ ఆర్టీసీ బస్సును నడుపుతున్న డ్రైవర్.. రీల్స్‌ను పోస్ట్ చేసే ప్రయత్నంలో ముందు వెళుతున్న ఎడ్లబండిని బుధవారం ఢీ కొట్టాడు. దీంతో రెండు ఎద్దులు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాయి. బండిలో ఉన్న ఇద్దరు రైతులకు తీవ్ర గాయాలయ్యాయి. బస్సులోని ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. ఆర్టీసీ డ్రైవర్‌పై స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హుబ్బళ్లి గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు.

లా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి క్లాట్



దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ లా యూనివర్సిటీలలో ప్రవేశానికి ఉద్దేశించిన 'కామన్ లా అడ్మిషన్ టెస్ట్(క్లాట్) 2025' దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. దీని ద్వారా అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ లా ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. ఈ టెస్ట్‌ను 'కన్సార్షియం ఆఫ్ నేషనల్ లా యూనివర్సిటీస్' నిర్వహిస్తుంది. హైదరాబాద్ నల్సార్, విశాఖపట్నం డీఎస్ఎన్ఎల్‌యూ సహా బెంగళూరు ఎన్ఎల్ఎస్ఐయూ, భోపాల్ ఎన్ఎల్ఐయూ, కొచ్చి ఎన్‌యూఏఎల్ఎస్, జోధ్‌పూర్ ఎన్ఎల్‌యూ, ఒడిశా ఎన్ఎల్‌యూఓ తదితర లా కళాశాలలు ఇందులో పార్టిసిపేట్ చేస్తున్నాయి. క్లాట్ 2025లో సాధించిన స్కోర్ ఆధారంగా అభ్యర్థుల ఛాయిస్‌ను అనుసరించి సీట్లను అలాట్ చేస్తారు. ఈ ఎగ్జామ్‌ను ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్: ఇది అయిదేళ్ల వ్యవధి గల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్. గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. 2025 మార్చి/ఏప్రిల్‌లో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అర్హులే.

యూజీ క్లాట్ 2025 వివరాలు: ఇందులో మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఇంగ్లీష్‌లో 22 నుంచి 26 ప్రశ్నలు; కరెంట్ అఫైర్స్-జనరల్ నాలెడ్జ్‌లో 28 నుంచి 32 ప్రశ్నలు; లీగల్ రీజనింగ్‌లో 28 నుంచి 32 ప్రశ్నలు; లాజికల్ రీజనింగ్‌లో 22 నుంచి 26 ప్రశ్నలు; క్వాంటిటేటివ్ టెక్నిక్స్‌లో 10 నుంచి 14 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 120. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.


పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్: ఇది ఏడాది వ్యవధి గల ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్. ద్వితీయ శ్రేణి మార్కులతో ఎల్ఎల్‌బీ/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. 2025 ఏప్రిల్/మేలో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ క్లాట్ 2025 వివరాలు: ఇందులో మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. కాన్‌స్టిట్యూషనల్ లా, జ్యూరిస్ప్రుడెన్స్, అడ్మినిస్ట్రేటివ్ లా, లా ఆఫ్ కాంట్రాక్ట్, టార్ట్స్, ఫ్యామిలీ లా, క్రిమినల్ లా, ప్రాపర్టీ లా, కంపెనీ లా, పబ్లిక్ ఇంటర్నేషనల్ లా, ట్యాక్స్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా, లేబర్ అండ్ ఇండస్ట్రియల్ లా అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 120. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.4,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ అభ్యర్థులకు రూ.3,500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 15
- **క్లాట్ 2025 తేదీ:** డిసెంబరు 1
- **వెబ్‌సైట్:** www.consortiumofnlus.ac.in

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● గురువారం 18 జూలై 2024
diksuchi@andhrajyothy.com

ఓయూలో పార్ట్ టైమ్ పీజీ



హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తున్న యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (యూసీఈ)-పార్ట్ టైమ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. కంటిన్యూయింగ్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(సీఈఈపీ) కింద ఎంఈ/ఎంటెక్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నారు. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఉద్దేశించిన ఈ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ఎంట్రెన్స్ టెస్ట్, కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. సివిల్, కంప్యూటర్ సైన్స్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, బయో మెడికల్, మైనింగ్ విభాగాలు అందుబాటులో ఉన్నాయి. ప్రతి ఇంజనీరింగ్ విభాగంలో 85 శాతం సీట్లను స్థానికులకు ప్రత్యేకించారు. మిగిలిన సీట్లకు ఆసక్తిగలవారందరూ (లోకల్, నాన్ లోకల్ అభ్యర్థులు) పోటీ పడవచ్చు.

విభాగాలు-స్పెషలైజేషన్‌లు-సీట్లు

- **సివిల్ ఇంజనీరింగ్:** స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ 20, జియో టెక్నికల్ ఇంజనీరింగ్ 15, వాటర్ రిసోర్స్ ఇంజనీరింగ్ 15, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్ 15 సీట్లు ఉన్నాయి.
- **కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 30, సైబర్ సెక్యూరిటీ 15, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ 15 సీట్లు ఉన్నాయి.
- **మెకానికల్ ఇంజనీరింగ్:** ప్రొడక్షన్ ఇంజనీరింగ్, ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్, టర్బో మెషినరీ స్పెషలైజేషన్‌లలో ఒక్కోదానిలో 15 సీట్లు ఉన్నాయి.
- **ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్:** ఇండస్ట్రియల్ డ్రైవ్స్ అండ్ కంట్రోల్, పవర్ సిస్టమ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్ సిస్టమ్స్ స్పెషలైజేషన్‌లలో ఒక్కోదానిలో 15 సీట్లు ఉన్నాయి.
- **ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్:** డిజిటల్ సిస్టమ్స్ ఇంజనీరింగ్, సిస్టమ్స్ అండ్ సిగ్నల్ ప్రాసెసింగ్, మైక్రోవేవ్ అండ్ రాడార్ ఇంజనీరింగ్, వీఎల్ఎస్ఐ అండ్ ఎంబెడెడ్ సిస్టమ్స్ స్పెషలైజేషన్‌లలో ఒక్కోదానిలో 15 సీట్లు ఉన్నాయి.
- బయో మెడికల్ ఎలక్ట్రానిక్స్, మైనింగ్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌లలో ఒక్కోదానిలో 15 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు

- స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్/ఏఎంఐఈ/ఏఎంఐఈటీఈ ఉత్తీర్ణులై ఉండాలి. జూన్ 30 నాటికి కనీసం ఏడాది అనుభవం ఉండాలి.
- కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి ఏదేని ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులు; మాస్టర్స్ డిగ్రీ(ఫిజిక్స్/స్టాటిస్టిక్స్/మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్/అప్లయిడ్ స్టాటిస్టిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/జియో ఫిజిక్స్) పూర్తిచేసిన వారు; ఎమ్మెస్సీ(కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్/కంప్యూటర్ అప్లికేషన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణులు; ఎంసీఏ పూర్తిచేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- బయో మెడికల్ ఇంజనీరింగ్ విభాగానికి(బీఈ/బీటెక్)(బయో మెడికల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ ఈఐఈ/ ఈసీఈ/బయోటెక్నాలజీ/మెడికల్ ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణులు; ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/మెడికల్ ఎలక్ట్రానిక్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్/మెడికల్ ఫిజిక్స్/బయో ఫిజిక్స్/బయో ఇన్ఫర్మాటిక్స్/బయో మెడికల్ ఇన్ఫర్మాటిక్స్/బయోటెక్నాలజీ) పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.
- మైనింగ్ ఇంజనీరింగ్ విభాగానికి మైనింగ్ అండ్ మెషినరీ ఇంజనీరింగ్/మైనింగ్ ఇంజనీరింగ్ విభాగాల్లో డిగ్రీ పూర్తిచేసినవారు అర్హులు.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: ప్రవేశ పరీక్షలో మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. సంబంధిత విభాగానికి నిర్దేశించిన సిలబస్ ప్రకారం ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ టెస్ట్‌లో అర్హత పొందాలంటే జనరల్, బీసీ అభ్యర్థులకు కనీసం 36 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 15 శాతం మార్కులు రావాలి. ఇంజనీరింగ్ విభాగాలకు ప్రత్యేకించిన సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 14
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** ఆగస్టు 22 నుంచి
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** ఆగస్టు 25
- **ఎంట్రెన్స్ టెస్ట్ ఫలితాలు విడుదల:** ఆగస్టు 31
- **కౌన్సెలింగ్ తేదీలు:** సెప్టెంబరు 6న ఫేజ్-1, సెప్టెంబరు 13న ఫేజ్-2
- **వెబ్‌సైట్:** www.uceou.edu

డిప్లొమా ఇన్ రైల్వే ఇంజనీరింగ్

న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ పర్మనెంట్ వే ఇంజనీర్స్(ఇండియా)- డిప్లొమా ఇన్ రైల్వే ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. ఇది కరస్పాండెన్స్ కోర్సు. ఇందులో ఇండియన్ రైల్వేస్‌కు సంబంధించిన స్ట్రక్చర్, ఫంక్షనింగ్ అంశాలు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌నకు కోల్‌కతాలోని ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్(ఇండియా) గుర్తింపు ఉంది. ఈ ప్రోగ్రామ్ పూర్తి చేసినవారికి ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్(ఇండియా)లో సీనియర్ టెక్నీషియన్ మెంబర్ అర్హతతోపాటు హయ్యర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కోర్సులు చేసే అవకాశం లభిస్తుంది. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని పూర్తిగానింపి కింది చిరునామాకు పంపాలి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి సైన్స్/కామర్స్/ఇంజనీరింగ్ విభాగాల్లో బీఎస్సీ/బీకామ్/బీఈ ఉత్తీర్ణులు; ఏదేని ఇంజనీరింగ్ విభాగంలో మూడేళ్ల డిప్లొమా ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్/సైన్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి బీఏ డిగ్రీ పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

- **ప్రోగ్రామ్ ఫీజు:** మొదటి సెమిస్టర్‌కు రూ.3500+జీఎస్‌టీ రూ.630; రెండో సెమిస్టర్‌కు రూ.4,000+జీఎస్‌టీ రూ.720
- **దరఖాస్తు ఫీజు:** రూ.4330
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **చిరునామా:** ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ పర్మనెంట్ వే ఇంజనీర్స్(ఇండియా), రూమ్ నెం.109, ఎన్‌సీఆర్‌పీయూ బిల్డింగ్, శంకర్ మార్కెట్ పక్కన, న్యూఢిల్లీ-110001.
- **వెబ్‌సైట్:** ipweindia.org.in

శాట్ ప్రిపరేషన్ ఇలా

విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు రాయాల్సిన ప్రామాణిక పరీక్ష శాట్(స్కాలాస్టిక్ అసెస్‌మెంట్ టెస్ట్). ఇది వరకు దీనిని స్కాలాస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌గా వ్యవహరించేవారు. వెర్బల్, మేథమెటికల్, రిటెన్ స్కిల్స్‌లో అభ్యర్థుల పరిజ్ఞానాన్ని పరీక్షించేందుకు ఈ పరీక్షను నిర్వహిస్తారు. ఒక రకంగా ఈ పరీక్ష విదేశాల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చేరాలనుకునే అభ్యర్థులకు పునాది రాయి వంటిదని చెప్పవచ్చు. ఇందులో అర్హత సాధించిన వారికి ప్రఖ్యాత యూనివర్సిటీల్లో కోరుకున్న కోర్సులో చేరే అవకాశం కలుగుతుంది. మెరిట్ స్కాలర్‌షిప్‌లతో ప్రపంచస్థాయి ఉన్నత విద్యను అభ్యసించవచ్చు.

*శాట్ రిజిస్ట్రేషన్లు ఏడాది పొడుగునా కొనసాగుతాయి. **2024 ఆగస్టు 24న** శాట్‌ను నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షకు హాజరు కావాలనుకునే వారు ఆగస్టు 9వ తేదీలోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.*

వెబ్‌సైట్: https://satsuite.collegeboard.org/sat

శాట్ పరీక్షకు ఏటా వేలాది మంది అభ్యర్థులు హాజరవుతున్నారు. దాంతో పోటీ ఎక్కువగా ఉంటోంది. కాబట్టి అభ్యర్థులు సరైన ప్రణాళికతో చదివితే మెరుగైన స్కోరు సాధించడం ఏమంత కష్టమేమీ కాదు. అందుకోసం నిపుణులు ఏమి చెబుతున్నారో చూద్దాం..!



స్కోరు ఎంత ఉండాలి?

ప్రధానంగా శాట్ స్కేల్‌పై ప్రతి విభాగపు(రీడింగ్ అండ్ రైటింగ్, మేథ్స్) స్కోరు 200 నుంచి 800 వరకు ఉంటుంది. మొత్తం స్కోరు 1600. మినిమమ్ స్కోరు 400 ఉండాలి. 2023లో యావరేజ్ స్కోరు 1010. కాబట్టి అభ్యరులు 400కి మించి స్కోరు సాధిస్తేనే ఏదైనా వర్సిటీకి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. పెనాల్టీ విధానం లేదు. కాబట్టి మెరుగైన స్కోరు రావాలంటే అభ్యర్థులు ప్రతీ ప్రశ్నను అటెంప్ట్ చేయాలి. ప్రతి యూనివర్సిటీ తమ సొంత స్కోరును నిర్దేశించుకుంటాయి. అందువల్ల అభ్యర్థులు ముందుగానే ఆయా వర్సిటీల టార్గెట్ స్కోరును తెలుసుకోవడం ముఖ్యం.

ఎవరు అర్హులు?

- ఉన్నత విద్యను పూర్తి చేసి యూఎస్ఏ, కెనడా, యూకే, సింగపూర్, నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో అండ్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చేరాలనుకునే వారు దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఎలాంటి గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేనప్పటికీ ఎక్కువ సంఖ్యలో 17 నుంచి 19 సంవత్సరాల మధ్య ఉన్నవారే పరీక్షకు హాజరవుతున్నారు.
- పరీక్షకు ఎన్ని సార్లయినా హాజరు కావచ్చు. ప్రస్తుతం ఇండియాలో ఈ పరీక్షను ఏటా ఐదు సార్లు నిర్వహిస్తున్నారు.

శాట్‌ని ఎవరు నిర్వహిస్తారు?

- కాలేజీ బోర్డ్ శాట్ పరీక్షను ఇండియాలో నిర్వహిస్తుంది. ఈ ఏడాది 44 పట్టణాల్లో 73 కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు.



రెఫరెన్స్ బుక్స్

1. ప్రిన్స్‌టన్ రివ్యూ: రీడింగ్ అండ్ రైటింగ్ వర్క్‌అవుట్ ఫర్ ద శాట్
2. ద అల్టిమేట్ గైడ్ టు శాట్ గ్రామర్, ఫిఫ్త్ ఎడిషన్
3. బారన్స్ శాట్ రీడింగ్ బుక్
4. కప్లాన్స్ శాట్ టోటల్ ప్రిపరేషన్

శాట్ పరీక్ష ఎలా ఉంటుంది?

శాట్‌లో ప్రధానంగా రెండు విభాగాలుంటాయి. అవి.. రీడింగ్ అండ్ రైటింగ్, మేథ్స్. ఈ రెండింటికి కలిపి 2 గంటల 14నిమిషాల సమయాన్ని నిర్దేశించారు. 64 నిమిషాల్లో రీడింగ్ అండ్ రైటింగ్, 70 నిమిషాల్లో మేథ్స్ విభాగాన్ని పూర్తి చేయాలి. అయితే రెండు విభాగాల మధ్య 10 నిమిషాల బ్రేక్ సమయం ఉంటుంది. ఈ సమయాన్ని అభ్యర్థులు తాము ప్రారంభించబోయే తదుపరి విభాగం సన్నద్ధతకు ఉపయోగించుకోవచ్చు. ప్రశ్నపత్రాన్ని పరిశీలించినట్లయితే ప్రతి విభాగంలో ప్రశ్నల సరళి సులభం, ఓ మోస్తరు, కఠినంతో కూడి ఉంటాయి.

సెక్షన్	ప్రశ్నల సంఖ్య	సమయం
రీడింగ్	54	32 నిమిషాలు
రైటింగ్ అండ్ లాంగ్వేజ్		32 నిమిషాలు
మేథ్స్	44	35 నిమిషాలు
ప్రాబ్లమ్ సాల్వింగ్ అండ్ డేటా అనాలసిస్		35 నిమిషాలు

- అభ్యర్థుల్లో విమర్శనాత్మక విశ్లేషణ సామర్థ్యం, విభిన్న రచనా శైలి, తార్కికత, ఆలోచన ధోరణులను పరీక్షించేలా రీడింగ్ అండ్ రైటింగ్ విభాగం ఉంటుంది. అదేవిధంగా గ్రామర్, వొకాబులరీ, రైటింగ్ ఎబిలిటీస్‌పై అభ్యర్థుల సామర్థ్యాన్ని అంచనా వేసే మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు కూడా ఉంటాయి.
- ఇక మేథ్స్ విభాగం పూర్తిగా అభ్యర్థుల మేథమెటికల్ స్కిల్స్‌కి సంబంధించినది. ఆల్జీబ్రా, అడ్వాన్స్‌డ్ మేథ్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్ అండ్ డేటా అనాలిసిస్, జామెట్రీ అండ్ ట్రిగొనామెట్రీ నుంచి ప్రశ్నలు ఉంటాయి. అన్ని మాడ్యుల్స్‌లో ప్రశ్నలు మల్టిపుల్ చాయిస్ విధానంలోనూ, ఓపెన్ రెస్పాన్స్ ఫార్మెట్స్ విధానంలోనూ ఉంటాయి.

వీటిపై దృష్టి సారించండి

- అభ్యర్థులు తొలుత శాట్ స్ట్రక్చర్‌ని పూర్తిగా అవగాహన చేసుకోవాలి. సిలబస్‌ని పరిశీలించాలి. ప్రశ్నల సరళిని తెలుసుకోవాలి. ఆ తర్వాత పూర్తి స్థాయి అధ్యయనాన్ని ప్రారంభించాలి.
- ఏదైనా ప్రిపరేషన్ ప్లాన్‌ని అమలు చేసే ముందు అభ్యర్థులు ముందుగా బేసిక్ సెక్షన్‌లో తమకున్న నైపుణ్యాలను పరీక్షించుకోవాలి. ఎందుకంటే రీడింగ్ కాంప్రహెన్షన్‌లో సవాళ్లతో కూడిన ప్యాసేజీలు ఉంటాయి. రచయిత ఏం చెప్పడానికి ప్రయత్నిస్తున్నాడు, ఆయన ఆలోచన ధోరణి ఏమిటి, ముగింపు విధానం తదితరాలను ప్యాసేజీ చదివి అభ్యర్థులు గ్రహించగలగాలి. కాబట్టి అభ్యర్థులు ప్యాసేజీ చదివి ముఖ్యమైన పాయింట్లను సంగ్రహించగలిగితేనే రచయిత ఉద్దేశాన్ని అర్థం చేసుకున్నవారు అవుతారు. కఠినమైన ప్యాసేజీలకు చెందిన ప్రశ్నలను సాధించాలంటే వొకాబులరీపై మంచి పట్టు ఉండాలి. కాబట్టి అభ్యర్థులు ప్రతి రోజూ కొత్త పదాలను నేర్చుకోవడానికి ప్రత్యేకంగా కొంత సమయం కేటాయించుకోవాలి. ఆ పదాలు గుర్తుండాలంటే మాట్లాడేటప్పుడు, రాసేటప్పుడు నేర్చుకున్న వాటిని విరివిగా ఉపయోగించాలి. వాక్యనిర్మాణాలు, గ్రామర్‌పై అవగాహన పెరిగితే కేవలం రైటింగ్ స్కిల్స్ మెరుగుపడటమే కాదు, రీడింగ్ అండ్ రైటింగ్ విభాగంలో తప్పులను సులభంగా గుర్తించగలుగుతారు.
- అభ్యర్థులకున్న మేథమెటికల్ ఎబిలిటీస్‌లో పరిజ్ఞానాన్ని రెండు విభాగాల ద్వారా పరీక్షిస్తారు. అవి.. ఆల్జీబ్రా, జామెట్రీ. కాబట్టి అభ్యర్థులు ఎక్స్‌ప్రెషన్స్, ఈక్వేషన్స్, ఇనిక్వాలిటీస్(లీనియర్, క్వాడ్రాటిక్ సహా)పై దృష్టి కేంద్రీకరించాలి. జామెట్రీకి సంబంధించి లైన్స్, యాంగిల్స్, షేప్స్, పైథాగరస్ సిద్ధాంతం వంటి వాటిని ప్రాక్టీస్ చేయాలి. అదేవిధంగా ఇంటర్‌ప్రెటింగ్ గ్రాఫ్స్, టేబుల్స్, స్టాటిస్టికల్ ఇన్ఫర్మేషన్, పర్సంటైల్స్ వంటి వాటిని వీలైనంత సులభంగా సాధించేలా అవగాహన పెంచుకోవాలి. ముఖ్యంగా బేసిక్ మేథ్స్ అయిన రేషియోస్, పర్సంటైల్స్‌పై పట్టుసాధిస్తే ఈ విభాగానికి చెందిన ప్రశ్నలను సులువుగా సాధించవచ్చు.
- పైన పేర్కొన్న విధంగా అధ్యయనం చేయడంతో టైం మేనేజ్‌మెంట్, విమర్శనాత్మక విశ్లేషణ, ఒత్తిడిని జయించడం వంటి అంశాలు కూడా శాట్ విజయానికి సోపానాలు అవుతాయి.


లిటిల్స్

అంతరిక్షంలో ప్రతిధ్వనించే భారతీయ స్వరం



1977లో అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా సౌర వ్యవస్థ మరియు అంతరిక్షం గురించి పరిశోధనలు చేయడానికి పంపిన వ్యోమనౌక వోయేజర్-1 లో ప్రపంచ ప్రఖ్యాత కళాకారులైన బీథోవెన్, మొజార్ట్‌ల స్వరాలతో పాటు మన దేశంనుండి పంపబడిన స్వరం కేసర్ బాయి కేర్కర్ ది. కేసర్‌బాయి కేర్కర్ భైరవి రాగంలో ఆలపించిన 'జాత్ కహా హో' అనే గీతం బంగారు పూతతో ఉన్న 12 అంగుళాల డిస్క్‌లో రికార్డ్ చేయబడి అంతరిక్షానికి పంపబడింది. 1977లో ఆవిడ మరణించిన సంవత్సరం లోనే ఆమె ఆలపించిన గీతం వోయేజర్ చేత పంపబడింది. అది నలభై సంవత్సరాలుగా అంతరిక్షంలో భారతీయ హిందుస్తానీ సంగీతాన్ని వినిపిస్తూనే ఉంది. పద్మ భూషణ్ కేసర్‌బాయి కేర్కర్ గీతం అంతరిక్షంలోకి ఎలా పంపబడిందనే కథను నేహా సింగ్ 'ఏ సాంగ్ ఇన్ స్పేస్' అనే పుస్తకంగా రాశారు.

దాగివున్న 10 వస్తువులు గుర్తించండి?



కుక్కలు ఎన్ని



ఏ వాహనం ముందుగా చేరుతుంది



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 361

		4		5	
5				6	4
				3	
	5				
6	4				3
	3		1		

సుడోకు - 360 సమాధానం

9	2	3	7	1	8	4	6	5
1	6	5	4	9	2	8	7	3
7	8	4	3	6	5	9	2	1
8	9	6	1	7	3	5	4	2
4	7	1	2	5	6	3	9	8
3	5	2	9	8	4	7	1	6
2	3	9	8	4	1	6	5	7
5	1	7	6	3	9	2	8	4
6	4	8	5	2	7	1	3	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.